
'ప్రజాసేవలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా చిరునవ్వుతో ఎదుర్కొంటా'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹5.00

సంపుటి: 10 సంచిక: 315

సోమవారం 5-2-2018



ఇంటి రుణం తీర్చడం ఈజీ

ఏటా వేతనం పెరిగితే దానికి తగ్గట్టే రుణ చెల్లింపు - 14లో



సఫారీని తిప్పేశారు...

రెండో వన్డేలో భారత్ ఘనవిజయం.. చాహెల్‌కు ఐదు వికెట్లు - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

లీకుల్లో యుద్ధం.. మైకుల్లో స్నేహం



బీజేపీతో పొత్తుపై తీవ్ర నిర్ణయం తప్పదంటూ అనుకూల మీడియాలో టీడీపీ లీకులు

- టీడీపీ లొంగుబాటుపై ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు నాటకం
- నిరసనలు, విమర్శలు వద్దని టీడీపీపీ సమావేశంలో నిర్ణయం
- బీజేపీతో పొత్తు వదులుకోలేమని చంద్రబాబు స్పష్టీకరణ
- ఢిల్లీ పెద్దలు ఫోన్ చేసి, శాంతించాలని కోరారని ప్రచారం
- అమిత్ షా ఫోన్ చేయలేదన్న సుజనా

ఇవీ లీకులు..

- బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సహించం.
- తీవ్ర నిర్ణయం తీసుకుంటాం.. విడిపోయేందుకు సమయం ఆసన్నమైంది.
- ఎన్డీఏ సర్కారు నుంచి బయటకు వచ్చేస్తాం. ఇక బీజేపీతో తెగతెంపులే.
- కేంద్ర ప్రభుత్వానికి మా తడాఖా చూపిస్తాం. ఇక యుద్ధానికి సన్నద్ధం.
- పార్లమెంట్‌లో సస్పెండయ్యే వరకూ పోరాటం చేస్తాం, తాడోపేడో తేల్చేస్తాం.
- రాజీనామాలకు రంగం సిద్ధం చేసుకున్న తెలుగుదేశం పార్టీ ఎంపీలు.

మీడియా సాక్షిగా మైకు ముందు..

- రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం.
- ఎలాగైనా ఒత్తిడి తీసుకొచ్చి నిధులు సాధించుకోవడం తప్ప మరో మార్గం లేదు.
- ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీతో పొత్తును వదులుకోవడం సాధ్యం కాదు. ఆ పార్టీతో ఘర్షణ వద్దు.
- కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం నుంచి బయటకు రాలేం.
- ఓవరాక్షన్ చేస్తే ఇబ్బందుల్లో పడతాం. రాజీనామాలు, నిరసనలు వద్దు. బీజేపీకి వ్యతిరేకంగా ఎలాంటి ప్రకటనలు చేయొద్దు.

2లో



బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రంతో మాట్లాడాలని నిర్ణయించాం. చంద్రబాబుకు అమిత్ షా ఫోన్ చేయలేదు. శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరేతోనూ చంద్రబాబు మాట్లాడలేదు. బీజేపీ నుంచి విడిపోయే పరిస్థితి లేదు. ఎప్పుడైనా విడాకుల గురించి ఆలోచించకూడదు, ఎలా కలిసుండాలో ఆలోచించాలి. ఇప్పటికిప్పుడు కఠిన నిర్ణయాలు వద్దని ముఖ్యమంత్రి నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఎలా సమన్వయం చేసుకోవాలో సర్వం తెలిసిన నాయకుడు చంద్రబాబు

- మీడియాతో సుజనా చౌదరి

కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్!

- కర్ణాటకలో ఆ పార్టీ ప్రభుత్వం ఇప్పుడు ఎగ్జిట్ గేట్ వద్ద ఉంది
- ప్రభుత్వం హత్యా రాజకీయాలు చేస్తోంది
- అవినీతిలో సిద్దరామయ్య సర్కారు కొత్త రికార్డులు
- బీజేపీ ర్యాలీలో ప్రధాని మోదీ



5లో

"ఆంధ్రుల రాజధాని అమరావతిని సింగపూర్ ప్రభుత్వం నిర్మిస్తుందని సినిమా చూపించారు. జీ టూ జీ (ప్రభుత్వానికి, ప్రభుత్వానికీ మధ్య) ఒప్పందం అన్నారు. క్రమంగా సింగపూర్ ప్రభుత్వం అదృశ్యమై మూడు ప్రైవేట్ కంపెనీల కన్సార్టియం ముందుకొచ్చింది. స్విస్ చాలెంజ్ పేరుతో ప్రతిపాదనలు ఇచ్చింది. 1,691 ఎకరాలను వారికి ధారాదత్తం చేసింది మన ప్రభుత్వం. సింగపూర్ వారి షరతులన్నింటికీ తల ఊపింది. రాయితీ, అభివృద్ధి ఒప్పందం, షేర్ హోల్డింగ్ అగ్రిమెంట్లపై ఆ కన్సార్టియం సంతకం చేయాల్సి ఉంది. కానీ, స్క్రీన్ ప్లే మళ్లీ మారింది. కేవలం తొమ్మిది మంది ఉద్యోగులు పనిచేసే ఒక చోటా కంపెనీని కన్సార్టియం ముందుకు తెచ్చింది. ఒప్పంద సంతకాలు ఆ చోటా కంపెనీయే చేస్తుందట. ముసుగు తొలగడంలేదూ?.. వేల మంది రైతులూ, కూలీల చెమట చుక్కలతో తడిసి పునీతమైన బంగారు భూమి బేహారుల క్రీడా స్థలంగా మారబోతోంది. ప్రభుత్వ పెద్దల ధనాశ ఐదు కోట్ల మంది మధుర స్వప్నాన్ని పీడ కలగా మార్చబోతోంది."

ప్రైవేట్ రాజధాని!

ఒక్కొక్కటిగా పుట్టుకొస్తున్న సింగపూర్ కంపెనీలు

ఒప్పందాలపై సంతకాల కోసం కొత్త సంస్థను సృష్టించిన 'కన్సార్టియం'

- తొమ్మిదిమంది ఉద్యోగులు ఉన్న చోటా సంస్థ సింగపూర్‌లో రిజిస్ట్రేషన్
- ఆ సంస్థతో రాయితీ, అభివృద్ధి ఒప్పందం, షేర్ హోల్డింగ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం
- కొత్త కంపెనీతో ఒప్పందాలు కుదరదన్న న్యాయ, ఆర్థిక శాఖలు
- అయినా ముందుకు వెళ్లేందుకే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- స్పెషల్ పర్పస్ వెహికల్‌గా ఏడీపీ ఉండకూడదన్న కన్సార్టియం
- సింగపూర్ కంపెనీల డిమాండ్లన్నింటికీ తలూపుతున్న సర్కార్



సాక్షి, అమరావతి


రాజధాని అమరావతి అభివృద్ధికి సింగపూర్ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకుంటున్న ఒప్పందాల్లో ఊహకందని విచిత్రం బహిర్గతమైంది. రాయితీ, అభివృద్ధి ఒప్పందం, షేర్ హోల్డింగ్ అగ్రిమెంట్‌పై సంతకాల కోసం ఓ సంస్థ పుట్టుకొచ్చింది. ఆ సంస్థను సింగపూర్ కన్సార్టియం సృష్టించింది. తొలి నుంచి సింగపూర్ కంపెనీలకు దాసోహమైన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు పుట్టుకొచ్చిన సంస్థతో ఒప్పందంపై సంతకాలు చేయించుకునేందుకు సిద్ధమైంది. రాజధాని అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో సింగపూర్ ప్రభుత్వంతో జీ టు జీ ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత సింగపూర్ ప్రభుత్వం మాస్టర్ డెవలపర్స్‌గా ప్రైవేట్ కంపెనీలైన అసెండాస్, సెమ్‌బ్రిడ్జి, సెమ్బ్‌కార్ప్‌లను నామినేట్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. మూడు కంపెనీలతో కూడిన కన్సార్టియంను ఒరిజనల్ ప్రాజెక్టు ప్రాంపెనెట్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తర్వాత ఆ కన్సార్టియంకు స్విస్ చాలెంజ్ పేరుతో స్టార్టప్ ఏరియా 1,691 ఎకరాలను కట్టబెట్టారు. షేర్ హోల్డర్స్ అగ్రిమెంట్ ప్రకారం స్టార్టప్ ఏరియా ప్రాజెక్టులో సింగపూర్ కన్సార్టియంకు 58 శాతం వాటా, కేపిటల్ సిటీ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీకి 42 శాతం

మిగతా 2వ పేజీలో ▶

ల్యాండింగ్‌లో రికార్డ్

24 గంటలు 980 విమానాలు

- దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం గత జనవరి 20వ తేదీన అరుదైన ఘనత సాధించింది. 24 గంటల్లో 980 విమానాల ల్యాండింగ్‌తో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే సింగిల్ రన్‌వే విమానాశ్రయంగా రెండో ఏడాది కూడా రికార్డుల్లోకెక్కింది.



- 5లో



రెండెకరాల రైతు లక్షల కోట్లు ఎలా సంపాదించారు?

సీఎం చంద్రబాబుపై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ధ్వజం

- సీఎం నియోజకవర్గంలో రూ.10 కోట్ల అవినీతి జరిగింది
- రాష్ట్రంలో రూలింగ్ లేదు.. అంతా ట్రేడింగే జరుగుతోంది
- టీడీపీ నేతలు అవినీతికి వారసులుగా మారారు

2లో

భారత్ నుంచి సంపన్నుల వలస

2017లో విదేశాలకు వెళ్లిన మిలియనీర్ల సంఖ్య

7,000

- దేశం నుంచి పొట్టకూటి కోసం పేదలు వలసపోతుండటం మనం వింటుంటాం. అయితే సంపన్నులు కూడా తమ అవసరాల కోసం విదేశాలకు తమ గమ్యస్థానాన్ని మార్చుకుంటున్నారు. 2017లో 7,000 మంది మిలియనీర్లు విదేశాలకు వలసపోయారని న్యూవరల్డ్ వెల్త్ రిపోర్ట్ చెబుతోంది.



- 16లో

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దేవరపాలెంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



కశ్మీర్లో పాక్ దురాగతం

- కాల్పుల్లో ఓ అధికారి, ముగ్గురు జవాన్ల మృతి
- ఆటోమేటిక్ ఆయుధాలు, మోర్టార్లతో దాడి

5లో

- నియంత్రణ రేఖ వద్ద పాకిస్తాన్ సైన్యం మరోసారి దురాగతానికి తెగబడింది. భారత సైనికులపైకి విచక్షణా రహితంగా కాల్పులు జరిపి నలుగురిని బలిగొంది. కాల్పుల్లో మరో ముగ్గురు గాయపడ్డారు. చనిపోయిన వారిలో ఒకరు ఆర్మీ లెఫ్టినెంట్ అధికారి కాగా, మిగిలిన ముగ్గురు జవాన్లు.





ఇంతవరకూ పైసా ఆదాయం లేదట! ఇంకేం రెట్టింపు అంటున్నాడ్సార్!!

ఆర్య వైశ్యులకు అండగా ఉంటాం

మనందరి ప్రభుత్వం రాగానే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు

ఆత్మీయ సమ్మేళనంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పునరుద్ఘాటన

పొట్టి శ్రీరాములు త్యాగానికి ప్రత్యేక గుర్తింపునిస్తాం

చంద్రబాబు పాలనలో పెరిగిపోయిన దాడులు

అడుగడుగునా వేధింపులు.. అవమానాలు

మీ గౌరవం పెరిగేలా మాస్తాం.. పేదవారికి అండగా నిలుస్తాం

ప్రత్యేక హోదా కోసం పోరు కొనసాగిస్తాం

ప్రజా సంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్య వైశ్యుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇది వరకే చెప్పాను.. ఇప్పటికీ ఇదే మాటకు కట్టుబడి ఉన్నాను. ఆర్య వైశ్యులందరికీ అండగా ఉంటాం. పేదరికం ఏ కులానికో, మతానికో పరిమితం కాదు. ఆర్యవైశ్యుల్లోనూ పేదవాళ్లున్నారు. వాళ్లందరినీ అదుకుంటాం' అని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. ప్రజా సంకల్ప యాత్రలో

మిగతా 6వ పేజీలో ▶



మీ బీమాకు నామినీ ఉన్నారా?

ఏ పాలసీకైనా నామినీ తప్పనిసరి

- ఆ వివరాలు లేకుంటే క్లెయిమ్‌లు ఇబ్బందే
- చట్టబద్ధ వారసులకు దక్కినా... సమయం పడుతుంది.. ఒకరికన్నా ఎక్కువ వారసులున్నపుడు మరింత కష్టం

- వివరాలు 14లో



'ఫేక్' బుక్ ఖాతాల్లో భారత్ టాప్!

- సామాజిక మాధ్యమ దిగ్గజం ఫేస్‌బుక్‌లో దాదాపు 20 కోట్ల నకిలీ ఖాతాలున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది 2017 డిసెంబర్ నాటి వార్షిక నివేదికలో వెల్లడించింది. ఈ నకిలీ ఖాతాలు అధికంగా భారత్‌లోనే ఉన్నట్లు పేర్కొంది.

- వివరాలు 5లో

లీకుల్లో యుద్ధం... మైకుల్లో స్నేహం

బీజేపీతో పొత్తుపై తీవ్ర నిర్ణయం తప్పదంటూ అనుకూల మీడియాలో టీడీపీ లీకులు

- ఎన్డీఏ నుంచి బయటకు వచ్చేస్తామని నేతల బుసలు
- కేంద్రానికి తమ తడాఖా చూపిస్తామని ప్రకటనలు
- టీడీపీ లొంగుబాటుపై ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు నాటకం
- విమర్శలు వద్దని టీడీపీపీ సమావేశంలో నిర్ణయం
- బీజేపీతో పొత్తు వదులుకోలేమని చంద్రబాబు స్పష్టీకరణ
- అన్యాయంపై కేంద్రంతో మాట్లాడాలని సూచన
- కొద్ది రోజులు మీడియాలో హడావుడి చేయాలని ఆదేశం
- ఢిల్లీ పెద్దలు ఫోన్ చేసి, శాంతించాలని కోరారని ప్రచారం
- అమిత్ షా ఫోన్ చేయలేదని సుజనా చౌదరి వెల్లడి

సాక్షి, అమరావతి:

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగింది, ఇక తీవ్రమైన నిర్ణయాలు తప్పవంటూ నాలుగు రోజులుగా హంగామా చేసి, ఏదో జరిగిపోతోందంటూ భారీగా బిల్డప్ ఇచ్చిన అధికార తెలుగుదేశం పార్టీ చివరకు అలాంటిది ఏమీ లేదని తేల్చేసింది. అసంతృప్తిని తొలుత కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని, మరీ అవసరమైతే పార్లమెంట్‌లో ప్రస్తావించాలని నిర్ణయించింది. కేంద్రంలో, రాష్ట్రంలో మిత్రపక్షాలుగా ఉన్న తెలుగుదేశం, బీజేపీ నాయకులు బడ్జెట్ అంశంపై నాలుగు రోజులుగా పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అరకొర కేటాయింపులపై ప్రజలు అసంతృప్తి చెందుతుండడంతో టీడీపీలో కలవరం మొదలైంది. బీజేపీతో పొత్తుపై తీవ్ర నిర్ణయం తీసుకుంటామని అనుకూల మీడియా ద్వారా లీకులు ఇప్పించింది. ఆదివారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగిన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ(టీడీపీపీ) సమావేశం సందర్భంగా ఇదే పరంపర కొనసాగింది. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయం కంటే ప్రస్తుతం విమర్శల నుంచి ఎలా తప్పించుకోవాలన్న అంశంపైనే ఎక్కువ సమయం చర్చించినట్లు సమాచారం.

అసంతృప్తికే పరిమితం

బడ్జెట్‌లో అన్యాయం జరిగిన నేపథ్యంలో టీడీపీపీ సమావేశంలో తీవ్ర నిర్ణయం తీసుకుంటారని ఆ పార్టీ నేతలు చెబుతూ వచ్చారు. ఒకటో తేదీన బడ్జెట్ ముగిసిన తర్వాత ఎంపీలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తర్వాత మంత్రులు, ముఖ్య నేతలతో మంతనాలు జరిపారు. మరుసటి రోజు పార్టీ సమన్వయ కమిటీ సమావేశం, మంత్రివర్గ సమావేశంలోనూ అసంతృప్తి వ్యక్తం చేయడానికే పరిమితమయ్యారు. పలువురు నేతలు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చేద్దామని చెప్పినా అది సాధ్యం కాదని, ఒత్తిడి తేవడమే మార్గమని బదులిచ్చారు. దీనిపై ఎంపీల సమావేశంలో నిర్ణయం తీసుకుందామని చెప్పారు. ఈలోగా ఒక వ్యూహం ప్రకారం పలువురు ఎంపీలతో రాజీనామాలకు సిద్ధమని, విడిపోయే సమయం ఆసన్నమైందని ప్రకటనలు చేయించారు. అయినా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. దీంతో పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ముందు మరింత హడావుడి చేశారు. కీలక నిర్ణయం తీసుకుంటామని సమావేశానికి వెళ్లే ముందు పలువురు ఎంపీలు ఆవేశంగా చెప్పారు.

బీజేపీని బద్నాం చేద్దాం..

బయట జరిగిన ప్రచారం, మీడియాకు ఇచ్చిన లీకులకు విరుద్ధంగా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బీజేపీతో పొత్తును వదులుకునే పరిస్థితి లేదని, ఏదోలా ఒత్తిడి తెచ్చి కొంతవరకైనా నిధులు సాధించుకోవడం తప్ప వేరే మార్గం లేదని చంద్రబాబు కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. ఉత్తరాంధ్రకు చెందిన ఒక ఎంపీ 'సాక్షి'తో మాట్లాడుతూ.. పొత్తు వీడి బయటకు వచ్చేద్దామని ఎక్కువ మంది ఎంపీలు చెప్పారని, కానీ తమ నాయకుడు 'ముందు ఘర్షణ పడండి. ఆ తర్వాత చూద్దాం. ఎన్నికల ముందు ఆరు నెలల వరకూ వేచిచూద్దాం. ఈలోగా బీజేపీని బద్నాం చేద్దాం' అని చెప్పారని వెల్లడించారు. మనంఇప్పుడు వాళ్లతో(బీజేపీ) ఘర్షణ పడలేం అని చంద్రబాబు చెప్పినట్లు కోస్తాంధ్రకు చెందిన ఒక ఎంపీ తెలిపారు. ఎన్డీఏతో తెగతెంపులు చేసుకుందామని రాయలసీమకు చెందిన మరో ఎంపీ చెప్పగా, ఇప్పుడు బయటకు రాలేమని, కొద్దిరోజులు మీడియాలో హడావుడి చేస్తే బీజేపీ స్పందిస్తుందని, అప్పటివరకూ అదే ప్రయత్నం చేద్దామని ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. రాయలసీమకు చెందిన ఓ సీనియర్ ఎంపీ మాట్లాడుతూ.. అధినేత చంద్రబాబు తమకు కళ్లెం వేస్తున్నారని, లేదంటే తమ తడాఖా చూపేవాళ్లమని అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో గట్టిగా నిరసన తెలుపుదామని కొందరు ఎంపీలు ప్రతిపాదించగా చంద్రబాబు అంగీకరించలేదు. ఓవరాక్షన్ చేస్తే ఇబ్బందుల్లో పడతామని, రాజీనామాలు, నిరసనల వంటివి మరిచిపోవాలని తేల్చిచెప్పారు. బీజేపీకి వ్యతిరేకంగా టీడీపీ నేతలు ఎలాంటి ప్రకటనలు చేయొద్దని హెచ్చరించారు.

కేంద్రంతో మాట్లాడుతాం: సుజనా

టీడీపీపీ సమావేశంలో చర్చించిన అంశాలను కేంద్ర మంత్రి సుజనాచౌదరి మీడియాకు వివరించారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రంతో మాట్లాడాలని నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్రానికి కేటాయింపులు సరిగా లేకపోవడం పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉందని, ఆ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. కేంద్రం న్యాయం చేస్తుందని ఆశిస్తున్నామని, అప్పటికీ చేయకపోతే ఎలా ముందుకెళ్లాలో మళ్లీ చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ప్రస్తుతానికి కేంద్రంతో మాట్లాడుతామని, అవసరమైతే పార్లమెంట్‌లో నిరసన తెలుపుతామని అన్నారు. చంద్రబాబుకు అమిత్ షా ఫోన్ చేయలేదని, శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరేతోనూ చంద్రబాబు మాట్లాడలేదని, అవన్నీ మీడియాలో వస్తున్న పుకార్లేనని స్పష్టం చేశారు. బీజేపీ నేత సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీతో విడిపోయే పరిస్థితి లేదని, ఎప్పుడైనా విడాకుల గురించి ఆలోచించకూడదని, ఎలా కలిసుండాలో ఆలోచించాలని సుజనా చౌదరి వ్యాఖ్యానించారు. ఇప్పటికిప్పుడు కఠిన నిర్ణయాలు వద్దని తమ అధ్యక్షుడు నిర్ణయించారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఎలా సమన్వయం చేసుకోవాలో సర్వం తెలిసిన నేత చంద్రబాబు, ఆయన చెప్పినట్లు తామంతా నడుచుకుంటామని స్పష్టం చేశారు.

ఢిల్లీ నుంచి ఫోన్లే రాలేదు


బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఢిల్లీ నుంచి చంద్రబాబుకు ఫోన్ చేశారని, తీవ్ర నిర్ణయం తీసుకోవద్దని కోరారని అనుకూల మీడియా ద్వారా లీకులిచ్చారు. అమిత్ షా ఫోన్‌తో చంద్రబాబు మెత్తబడి తీవ్ర నిర్ణయం తీసుకోకుండా కేంద్రంతో మాట్లాడేందుకు ఒప్పుకున్నారని ప్రచారం చేశారు. అయితే, అమిత్ షా ఫోన్ చేయలేదని మధ్యాహ్నానికి తేలిపోయింది. దీంతో వ్యూహం మార్చారు. చంద్రబాబుతో కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారని, మూడుసార్లు ఫోన్‌చేసి బుజ్జగించారని అధికార పార్టీ అనుకూల మీడియా హోరెత్తించింది. కానీ, రాజ్‌నాథ్‌సింగ్ కూడా ఫోన్ చేయలేదని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

ప్రజలను ఏమార్చే యత్నం

కేవలం కేంద్రంతో మాట్లాడాలని మాత్రమే సమావేశంలో నిర్ణయించగా, పలువురు ఎంపీలు తాము పార్లమెంట్‌లో సస్పెండయ్యే వరకూ పోరాటం చేస్తామని, తాడోపేడో తేల్చేస్తామని మీడియా ముందు బుసలు కొట్టారు. నాలుగేళ్లుగా ప్రతి బడ్జెట్‌లోనూ అన్యాయం జరుగుతున్నా తెలుగుదేశం ప్రభుత్వం నోరుమెదపకుండా కేంద్రానికి సాగిలపడిపోయిందని, ఇదేమిటని ప్రశ్నించలేని పరిస్థితిలో ఉందని ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతుండడంతో వారిని ఏమార్చేందుకు అనుకూల మీడియా, పలువురు ఎంపీల ద్వారా ఇలాంటి ప్రచారానికి తెరలేపారు. ఏదో చేసేస్తామని ప్రచారం చేసుకున్న నేపథ్యంలో అలాంటిదేమీ లేకుండా పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని ముగిస్తే ప్రజలకు సమాధానం చెప్పుకోలేమని భావించి, ఢిల్లీ పెద్దల నుంచి ఫోన్లు వచ్చాయంటూ కలరింగ్ ఇచ్చినట్లు సమాచారం. శాంతించాలని ఢిల్లీ పెద్దలు కోరారు కాబట్టి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, లేకపోతే దుమ్ములేపేసే వాళ్లమని చెప్పుకునేందుకు పాట్లు పడినట్లు తేటతెల్లమవుతోంది.

చెన్నంపల్లి కోటలో రాతి గుండ్లు లభ్యం

ఆయుధ భాండాగారం ఉందని ప్రచారం



చెన్నంపల్లి (తుగ్గలి): కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెన్నంపల్లి కోటలో 36 రోజుల విరామం అనంతరం చేపట్టిన తవ్వకాల్లో ఆదివారం రాతి గుండ్లు బయటపడ్డాయి. గుప్త నిధులు, నిక్షేపాలంటూ ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 13న కోటలో తవ్వకాలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రారంభంలో ఇటుకలు, ఎముకలు, ఇనుప ముక్కలు బయటపడ్డాయి. తరువాత జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) అధికారుల సూచన మేరకు.. ఈనెల 3న తవ్వకాలు పునఃప్రారంభించారు. ఆదివారం ఎనిమిది గుండ్రటి రాతి గుండ్లు బయట పడ్డాయి. వీటిని ఫిరంగి గుండ్లుగా భావిస్తున్నారు. గదుల ఆకారంలో రెండు గుంతలు ఉండడం, రాతి గుండ్లు బయటపడడంతో ఇక్కడ ఆయుధ భాండాగారం ఉండవచ్చని అధికా రులు భావిస్తున్నారు. జీఎస్ఐ అధికారులు మూడు చోట్ల తవ్వకాలు జరపాలని సూచించినట్లు సమాచారం. ఆ మేరకు అధికారులు తవ్వకాలు జరుపనున్నట్లు తెలుస్తోంది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బారెడ్డి, ఆదోని ఆర్డీ ఓబులేసు, తహసీల్దార్ గోపాలరావు, పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

విద్యుత్ సబ్సిడీ ఎంతిస్తారో చెప్పండి: సీపీఎం

సాక్షి, అమరావతి: వచ్చే ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ సబ్సిడీ ఎంత చెల్లిస్తారో చెప్పాలని సీపీఎం రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సోమవారం నుంచి బహిరంగ విచారణ జరపనున్న నేపథ్యంలో ఈ అంశాన్ని తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు ముఖ్యమంత్రికి ఆదివారం లేఖ రాశారు. వ్యవసాయానికి కనీసం 9 గంటల పాటు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మిగులు విద్యుత్ ఉంటుందని, చార్జీలు పెంచబోమని అధికారులు చెబుతున్నారని, అయితే డిస్కంలు తమ నివేదికల్లో వచ్చే ఏడాది రూ.7,982 కోట్ల లోటు ఉండొచ్చని పేర్కొన్న విషయాన్ని మధు గుర్తు చేశారు. ఈ లోటును ఎలా భర్తీ చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.



విశాఖలో పార్టీ కో ఆర్డినేటర్ల భేటీలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

రాజ్యసభ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం

రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి

సాక్షి, విశాఖపట్నం: త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చే అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ఏపీ నుంచి మూడు స్థానాలు ఖాళీ అయ్యాయని, ఏప్రిల్ 2న ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయన్నారు. విశాఖలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం పార్టీ కో ఆర్డినేటర్లతో జరిగిన భేటీలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన 22 మంది ఎమ్మెల్యేలపై ఫిరాయింపుల చట్టం కింద స్పీకర్ కోడెల చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో లబ్ధిపొందే ఉద్దేశంతోనే వీరిపై చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాగా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజాసంకల్పయాత్రకు సంఘీభావంగా విశాఖ సిటీలో పార్టీ కో ఆర్డినేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ నేతలు, శ్రేణులతో కలిసి 18 నుంచి పాదయాత్ర చేపడుతున్నట్టు విజయసాయిరెడ్డి వెల్లడించారు. రోజుకు 18 కిలోమీటర్ల చొప్పున కనీసం రెండురోజులపాటు ఈ పాదయాత్ర సాగనుందన్నారు. సమావేశంలో పార్టీ సిటీ అధ్యక్షుడు మళ్ల విజయప్రసాద్, విశాఖ, అనకాపల్లి పార్లమెంట్ జిల్లాల అధ్యక్షులు తైనాల విజయకుమార్, గుడివాడ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలోనూ అధికారంలోకి వస్తామనిపిస్తోంది: మంత్రి లోకేశ్



సాక్షి, అమరావతి: అమెరికాలోనూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందనిపిస్తోందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న లోకేష్ న్యూజెర్సీలో జరిగిన ఎన్నారై టీడీపీ సమావేశంలో పార్టీ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. మంత్రి అమెరికా పర్యటన వివరాలను ఆయన కార్యాలయం ఆదివారం మీడియాకు విడుదల చేసింది. కార్యకర్తల సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ 'మీ ఉత్సాహం చూస్తుంటే అమెరికాలో కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందనిపిస్తోంది' అన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడటానికే ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. 67 ఏళ్ల వయస్సులో 24 ఏళ్ల కుర్రాడిలా ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారు. అందుకే ప్రపంచంలోని ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయని తెలిపారు. ఎన్నారైలు ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గురించి ప్రచారం చెయ్యాలని కోరారు. ఎన్నారైల తలసరి ఆదాయం కూడా పెంచాలని లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

రెండెకరాల రైతు లక్షల కోట్లు ఎలా సంపాదించారు?

సీఎం చంద్రబాబుపై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ధ్వజం

కర్నూలు (టౌన్)

రెండెకరాల రైతును అని చెప్పుకునే వారు లక్షల కోట్ల రూపాయలు ఎలా సంపాదిచారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రశ్నించారు. ఆదివారం కర్నూలులో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ బూత్‌స్థాయి కమిటీ నాయకుల మహా సమ్మేళనంలో సీఎం చంద్రబాబునాయుడును ఉద్దేశించి సోము వీర్రాజు సంచలన ఆరోపణలు చేశారు. సీఎం చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో రూ. 10 కోట్ల అవినీతి జరిగిందని విమర్శించారు. అసలు రాష్ట్రంలో రూలింగ్ లేదని, అంతా ట్రేడింగ్ (వ్యాపారం) నడుస్తోందని, అవినీతి రాజ్యమేలుతోందోని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో టీడీపీ నేతలు అవినీతికి వారసులుగా మారారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు రాష్ట్రంలో దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. ప్రత్యేక ప్యాకేజీ కింద ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి రూ. వేల కోట్లు ఇస్తే.. ఏనాడైనా మోదీ ఫొటోగాని, ఆయన గురించి కాని ఒక్క మాటా అయినా మాట్లాడారా అని ప్రశ్నించారు. 2016 నుంచి ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన రూ. వేల కోట్లు ఖర్చు పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు మాటమారుస్తోందన్నారు. సీఎం చంద్రబాబు, టీడీపీ ఎంపీలు పోలవరం ప్రాజెక్టును కేంద్రమే తీసుకోవాలనడం ఎంత వరకు సమంజసం నిలదీశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి లక్షలాది ఎల్ఈడీ బల్బులు వస్తే.. బల్బుల పంపిణీ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఫొటో కనిపించదన్నారు. కేంద్రం సాయాన్ని రాష్ట్రంలో ఎక్కడా చంద్రబాబు చెప్పడం లేదన్నారు.

బడ్జెట్‌పై చంద్రబాబు విమర్శలు తగవు

కేంద్ర బడ్జెట్‌పై ముఖ్యమంత్రి, టీడీపీ ఎంపీ, నాయకులు విమర్శలు చేయడం తగదన్నారు. కేంద్ర సాయాన్ని రాష్ట్రంలో చంద్రబాబు ఎక్కడా చెప్పడం లేదన్నారు. అసలు ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో పెట్టుకోవాలంటేనే చంద్రబాబు భయపడుతున్నట్లు కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను తానే అభివృద్ధి చేశానని చెప్పుకునే చంద్రబాబు, ఇప్పుడు అమరావతి, విజయవాడ అంటూ అభివృద్ధి అంతా ఒకే చోట చేస్తున్నారని, ఇలా అయితే రాయలసీమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మోదీని టార్గెట్ చేసుకొని ఓ పత్రిక బడ్జెట్‌పై తప్పుడు వార్తలు రాస్తోందని విమర్శించారు. అనవసరమైన అవాకులు, చెవాకులు, కారుకూతలు చేస్తోందని, అసలు ఓపెన్ హార్ట్ నీకు ఉందా అంటూ పరోక్షంగా ఆంధ్రజ్యోతి ఎండీపై విమర్శలు చేశారు.

ప్రైవేట్ రాజధాని!

▶ మొదటి పేజీ తరువాయి

వాటా ఉంది. షేర్ హోల్డింగ్ అగ్రిమెంట్‌పైన, రాయితీ, అభివృద్ధి ఒప్పందంపైన సింగపూర్ కన్సార్టియం సంతకం చేయాల్సి ఉంది. ఇప్పుడు ఆ కంపెనీలు సంతకాలు చేయబోమని స్పష్టం చేశాయి. ఆ కంపెనీల తరఫున ఒప్పందాలపై సంతకాలు చేయడానికి కొత్తగా సింగపూర్ అమరావతి ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ పీఈటీ లిమిటెడ్ (ఎస్ఏఐహెచ్)ను సృష్టించాయి. తమ తరఫున ఆ కొత్త కంపెనీ సంతకం చేస్తుందని గతేడాది సెప్టెంబర్ 25న ప్రభుత్వానికి లేఖ రాశాయి. సింగపూర్ కంపెనీలు కోరినట్లే ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది.

తప్పులను హైకోర్టు ఎత్తి చూపినా..

స్విస్ చాలెంజ్ విధానం పేరుతో నామినేషన్‌పై సింగపూర్ కన్సార్టియంకు భూములు కట్టబెట్టడంలో తప్పులను హైకోర్టు ఎత్తి చూపినా ప్రభుత్వం తీరు మారలేదు. స్విస్ చాలెంజ్ విధానంలో తప్పులను సరిచేయకపోగా ఆ తప్పులకు సమర్థించుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఎనేబ్లింగ్ యాక్ట్ (ఏపీఐడీఈఏ)–2001కి చట్ట సవరణ చేశారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అథారిటీ పరిశీలన అవసరం లేదని చట్టాన్ని సవరించారు. ఇప్పుడూ సింగపూర్ కంపెనీలు కోరినట్లు కీలకమైన రాయితీ అభివృద్ధి ఒప్పందం, షేర్ హోల్డింగ్ అగ్రిమెంట్‌లో మార్పులు, సంతకందారుల మార్పునకు నిబంధనలను మార్చేయడం గమనార్హం.

జీవోకు విరుద్ధంగా సంతకాలకు సిద్ధం

ఏదైనా పనిచేయడానికి టెండర్లో కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థతోనే సంబంధిత ప్రభుత్వ శాఖ ఒప్పందం చేసుకుంటుంది. అలాగే ఒక సంస్థ నుంచి అప్పు తీసుకుంటే ఆ సంస్థతోనే ఒప్పందం జరుగుతుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. రాజధాని స్టార్టప్ ఏరియా అభివృద్ధికి ఒరిజనల్ ప్రాజెక్టు ప్రొపెనెంట్‌గా సింగపూర్ కన్సార్టియం స్విస్ చాలెంజ్ విధానంలో ప్రతిపాదనలను సమర్పించింది. ఆ ప్రతిపాదనల్లోనే రాయితీ, అభివృద్ధి, షేర్ హోల్డింగ్ డాక్యుమెంట్లను కూడా సమర్పించింది. వీటిపై ఆర్థిక శాఖ మంత్రి యనమల నేతృత్వంలోని హైపవర్ కమిటీ సింగపూర్ కంపెనీలతో నేరుగా సంప్రదింపులు జరిపింది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ అంశాలపై నేరుగా టెలిఫోన్‌లో బేరసారాలు సాగించారు. అనంతరం సింగపూర్ కన్సార్టియంకు స్టార్టప్ ఏరియా అప్పగిస్తూ గత ఏడాది మే 8న జీవో 179 జారీ చేశారు. అదే జీవోలో ఒరిజనల్ ప్రాజెక్టు ప్రొపనెంట్.. అంటే సింగపూర్ కన్సార్టియం సంస్థలతో రాయితీ అభివృద్ధి, షేర్ హోల్డింగ్ అగ్రిమెంట్లు చేసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పుడు ఆ జీవోకు విరుద్ధంగా సింగపూర్ కన్సార్టియం కేవలం తొమ్మిది మంది ఉద్యోగులతో కొత్తగా ఏర్పాటు చేసిన ఎస్ఏఐహెచ్‌తో ఒప్పందాలు చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధం కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆదినుంచీ దాసోహమే..

రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ), సింగపూర్ కంపెనీలు సంయుక్తంగా అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్ (ఏడీపీ) పేరుతో స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ఏర్పాటు చేశాయి. అయితే సింగపూర్ కంపెనీలు ఇప్పుడు ఏడీపీ స్పెషల్ పర్పస్ వెహికల్‌గా ఉండరాదని, కేవలం సాధారణ ఏడీపీగానే ఉండాలని స్పష్టం చేశాయి. అందుకు కూడా అంగీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీని ప్రకారం రాయితీ, అభివృద్ధి ఒప్పందం సింగపూర్ కంపెనీలకు బదులు ఎస్ఏఐహెచ్, సీఆర్‌డీఏ మధ్య జరగనుంది. అలాగే షేర్ హోల్డర్స్ అగ్రిమెంట్ కూడా ఎస్ఏఐహెచ్, ఏడీపీ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్)ల మధ్య జరగనుంది. అయితే ఒరిజనల్ ప్రాజెక్టు ప్రొపనెంట్ కంపెనీలతో ఒప్పందం చేసుకోకుండా ఆ కంపెనీలు సూచించిన మరో కంపెనీతో ఒప్పందం చేసుకోవడం నిబంధనలకు విరుద్ధమని న్యాయ, ఆర్థిక శాఖలు స్పష్టంగా చెప్పాయి. గతంలో జారీ చేసిన జీవో–179కు వ్యతిరేకమని పేర్కొన్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడంలేదు.

రాయితీ, అభివృద్ధి ఒప్పందం అంటే...

రాయితీ, అభివృద్ధి ఒప్పందం అంటే స్టార్టప్ ఏరియా ప్రాజెక్టులో సింగపూర్ కన్సార్టియంకు ఇవ్వాల్సిన 1,691 ఎకరాలతో పాటు ఆ కన్సార్టియంకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీలు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన నిబంధనలు, చెల్లించాల్సిన పెనాల్టీలు, అలాగే సింగపూర్ కన్సార్టియం రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వనున్న రెవెన్యూ తదితర అంశాలు ఉంటాయి. స్టార్టప్ ఏరియా ద్వారా మూడు దశల్లో సింగపూర్ కన్సార్టియం రూ. 5,768.60 కోట్లు పొందుతుంది. అవే మూడు దశల్లో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.446 కోట్లు మాత్రమే రెవెన్యూ కింద వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం, సింగపూర్ కన్సార్టియం ఏమేమి చేయాలో ఈ ఒప్పందంలో ఉంటుంది.

కంపెనీ ఎలా మారుస్తారు?


తొలుత సింగపూర్ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య జీటూజీ ఒప్పందం చేసుకున్న తరువాత సింగపూర్ ప్రైవేట్ కంపెనీలను రంగంలోకి దించడమే తప్పు. ఇప్పుడు రాయితీ, అభివృద్ధి, షేర్ హోల్డింగ్ అగ్రిమెంట్‌లపై సింగపూర్ కన్సార్టియం సంతకం చేయకుండా మరో ప్రైవేట్ కంపెనీని ఏర్పాటుచేసి ఆ కంపెనీతో ఒప్పందంపై సంతకాలు చేయిస్తామనడం వెనుక పెద్ద కుంభకోణం దాగి ఉంది. ఈ విధంగా సింగపూర్ ప్రైవేట్ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వ్యాపారాలపై కేంద్రం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. సింగపూర్ కంపెనీలు పెట్టిన షరతులకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందే తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి షరతులు పెట్టలేదు. దీనివల్ల భవిష్యత్‌లో సింగపూర్ కంపెనీలపై ఎటువంటి చర్యలు తీసుకునే అవకాశం లేదు. ఇది రాష్ట్రానికి నష్టం. స్విస్‌చాలెంజ్ పేరుకు మాత్రమే. ఇప్పటికే నామినేషన్‌పై సింగపూర్ కన్సార్టియంకు 1,691 ఎకరాలను అప్పగించారు. సింగపూర్ కంపెనీల పేరుతో రైతుల భూముల, వారి శ్రమను దోచుకోవడం తప్ప భూములిచ్చిన రైతులకు ఇప్పటివరకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయలేదు.

ఆళ్ల రామకృష్ణారెడ్డి, మంగళగిరి ఎమ్మెల్యే

12-11-2014 :	సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత చంద్రబాబు తొలుత సింగపూర్ పర్యటన
08-12-2014 :	సింగపూర్ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య జీ టూ జీ ఒప్పందం
30-04-2015 :	సింగపూర్ ప్రభుత్వం మాస్టర్ డెవలపర్స్‌గా ప్రైవేట్ కంపెనీలైన అసెండాస్, సెమ్‌బ్రిడ్జి, సెమ్బ్‌కార్ప్‌లను నామినేట్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ
04-05-2015 :	అసెండాస్, సెమ్‌బ్రిడ్జి, సెమ్బ్‌కార్ప్‌లతో కూడిన సింగపూర్ కన్సార్టియం ఒరిజనల్ ప్రాజెక్టు ప్రొంపెనెట్‌గా ప్రభుత్వ ప్రకటన
30-10-2015 :	స్విస్ చాలెంజ్ విధానంలో సింగపూర్ కన్సార్టియం ప్రతిపాదనల సమర్పణ
24-01-2016 :	ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన. ప్రతిపాదనలను సవరించి పంపాలన్న సీఎం
21-03-2016 :	సవరించిన ప్రతిపాదనలను సింగపూర్ కన్సార్టియం సమర్పణ
24-04-2017 :	సింగపూర్ కంపెనీల ప్రతినిధులతో ఆర్థికమంత్రి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ సంప్రదింపులు
08-05-2017 :	సింగపూర్ కన్సార్టియంకు స్టార్ట్ అప్ ఏరియా 1,691 ఎకరాలు అప్పగిస్తూ జీవో 179 జారీ
25-09-2017 :	సింగపూర్ కన్సార్టియం ఒప్పందాలపై (ఎస్ఏఐహెచ్) సంతకం చేస్తుందని రాష్ట్ర సర్కారుకు లేఖ
30-05-2017 :	సింగపూర్–అమరావతి ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ పీఈటీ లిమిటెడ్ రిజిస్టర్ చేశారు. ఇది కన్సార్టియంకు చెందిన జాయింట్ ప్రైవేట్ కంపెనీగా పేర్కొన్నారు. ఇందులో తొమ్మిదిమంది ఉద్యోగులు మాత్రమే పనిచేయడం గమనార్హం.


టీడీపీపీ భేటీకి కేంద్ర మంత్రి అశోక్ డుమ్మా

సీఎం చంద్రబాబుతో గజపతికి పొసగట్లేదని ప్రచారం



సాక్షి, అమరావతి: అత్యంత కీలకమైన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ (టీడీపీపీ) సమావేశానికి ఆ పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు గైర్హాజరవడం చర్చనీయాంశమైంది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సరైన కేటాయింపులు లేవంటూ సీఎం చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్న నేపథ్యంలో జరిగిన సమావేశానికి కేంద్ర మంత్రి అశోక్ రాకపోవడం వెనుక బలమైన కారణాలేమైనా ఉన్నాయేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత కొద్దికాలంగా సీఎం చంద్రబాబుతో ఆయనకు పొసగడం లేదనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అశోక్ పార్టీతో, చంద్రబాబుతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే కీలకమైన టీడీపీపీ సమావేశానికి ఆయన గైర్హాజరవడం గమనార్హం. కాగా, చైనా పర్యటనకు వెళ్లిన అశోక్ శనివారం రాత్రే రావడంతో సమావేశానికి హాజరుకాలేకపోయారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

సోము వీర్రాజు నోరు అదుపులో పెట్టుకోవాలి




మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: బీజేపీ నాయకులు సోము వీర్రాజు నోరు అదుపులో పెట్టుకోవాలని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు హెచ్చరించారు. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంలోని మార్కెట్‌యార్డులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని విమర్శించే స్థాయి వీర్రాజుకు లేదన్నారు. కేంద్రం ఇచ్చిన నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వం అవినీతికి పాల్పుడిందని మాట్లాడటం సరికాదన్నారు. పదే పదే ఆరోపణలు చేయటం మానుకోని ఆధారాలు ఉంటే చూపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చమని అడుగుతున్నామే తప్ప కొత్త ఏమీ అడగలేదన్నారు. ఎన్నికల సమయంలో తిరుపతి బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఏపీని తన సొంత రాష్ట్రంలా అభివృద్ధి చేస్తానని ప్రకటించిన విషయం వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. నాలుగైదు పార్టీలను మార్చిన పురందేశ్వరికి టీడీపీని విమర్శించే అర్హత లేదన్నారు.

2019 ఎన్నికల్లో టీడీపీతో కలిసే పోటీ

టీడీపీ–బీజేపీ పొత్తు కొనసాగుతుంది: అరుణ్‌జైట్లీ వెల్లడి



సాక్షి, అమరావతి: 2019 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో కలిసే పోటీ చేస్తామని బీజేపీ జాతీయ నేత, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ స్పష్టం చేశారు. ఆదివారం ఓ ఆంగ్ల టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు ఆయన వెల్లడించారు. టీడీపీ–బీజేపీ బంధం విడదీయరానిదని, వచ్చే ఎన్నికల్లోనూ తమ పొత్తు కొనసాగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఏపీకి ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. విభజన హామీలకు, ప్యాకేజీకి, బడ్జెట్‌కు సంబంధం లేదని తెలిపారు. రాష్ట్రానికిచ్చిన హామీలు నెరవేర్చడం లేదని, 2018 బడ్జెట్‌లో ఏపీపై చిన్నచూపు చూశారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి లీకుల నేపథ్యంలో జైట్లీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్డీయేగా టీడీపీతో కలిసే ఉంటామని స్పష్టీకరించారు. ఏపీ ఇచ్చిన హామీలన్నీ తప్పక నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రానికి ఏం చేయాలో తమకు తెలుసన్నారు. 2019 ఎన్నికల్లో పొత్తుల విషయం తన పరిధిలో లేకపోయినా టీడీపీ–బీజేపీ విషయంలో ఇదే జరుగుతుందని జోస్యం చెప్పారు.

సొంతూరు పీలేరు.. ఓటున్నది మార్టేరు

- మాజీ సీఎం నియోజకవర్గమే మారిపోయింది
- వైఎస్సార్‌సీపీ నేత బొత్స నియోజకవర్గం కూడా
- ఓటర్ల జాబితాలో వింతలు



మార్టేరు ఓటర్ల జాబితాలో కనిపిస్తున్న కిరణ్ కుమార్‌రెడ్డి, బొత్స సత్యనారాయణ ఫొటోలు

పెనుమంట్ర: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఓటే మారిపోయింది. ఆయనది చిత్తూరు జిల్లా పీలేరు నియోజకవర్గం.. అయితే పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం మార్టేరులో ఓటు ఉన్నట్టు నమోదైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఓటు కూడా మార్టేరులో ప్రత్యక్షమైంది. ఆదివారం ఇక్కడ నిర్వహించిన ఓటర్ల నమోదు, సవరణ కార్యక్రమంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానికులు అధికారులను ప్రశ్నించారు. వీఆర్వో జి.దుర్గాప్రసాద్ వివరణ ఇస్తూ.. రెండు నెలల క్రితమే ఈ విషయాన్ని గుర్తించామని, వెబ్‌సైట్ పనిచేయకపోవడం వల్లే బొత్స, కిరణ్‌కుమార్ పేర్లను జాబితాలో నుంచి తొలగించలేకపోయామని తెలిపారు. కాగా, ఓటర్ల జాబితాలో ఇటీవల వింతలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో ఉన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆయన భార్య, ఇద్దరి కుమార్తెల ఓటును జాబితా నుంచి తొలగించారు.

సీపీఎస్ రద్దు చేసే పార్టీలకే మా మద్దతు

- ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం స్పష్టీకరణ
- విశాఖలో భారీ ర్యాలీ

సాక్షి, విశాఖపట్నం

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసే రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేతలు స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 1.87 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలతోపాటు 4 లక్షల పాత పెన్షన్ ఉద్యోగుల కుటుంబాల మద్దతు కూడా ఉంటుందని తెలిపారు. సీపీఎస్‌ను వ్యతిరేకిస్తూ ఆదివారం విశాఖపట్నంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్ వరకు సాగిన ఈ ర్యాలీలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 10 వేల మందికిపైగా ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలేల రామాంజనేయులు యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు 35 ఏళ్ల పాటు కష్టపడి దాచుకున్న సొమ్మును షేర్ మార్కెట్‌లో పెట్టి కార్పొరేట్ వ్యాపారులకు దోచిపెడుతుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఐదేళ్లు పరిపాలించే వారికి పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్న ప్రభుత్వం 35 ఏళ్ల పాటు ప్రజలకు సేవలందించిన ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. సీపీఎస్ స్థానంలో పాత



విశాఖలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

పెన్షన్ విధానం అమలుచేసే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి పఠాన్ బాజీ మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు అంశం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోదని కేంద్ర ఆర్థిక శాఖ రాసిన లేఖలో స్పష్టం చేసిందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి రొంగలి అప్పలరాజు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం రద్దు చేయడం ద్వారా రూ.800 కోట్లకు పైగా ఆదా అవుతుందని, ఎన్ఎస్‌డీఎల్ వద్ద రూ.5 వేల కోట్లు పీఎఫ్ ఖాతాలో జమ చేసుకొని వాటిని ప్రభుత్వ పథకాలకు వినియోగించుకోవచ్చని చెప్పారు. ఏపీ జేఏసీ (అమరావతి) అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రెండు రకాల పెన్షన్ విధానాలతో ఉద్యోగులను విభజించేందుకే సీపీఎస్‌ను తీసుకొచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.సతీష్, ప్రధాన కార్యదర్శి ఎం.ఉమామహేశ్వరావు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

నెల్లూరు (అర్బన్): సీపీఎస్‌ను రద్దు చేస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సాబ్జి డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్‌ల వద్ద భారీ ధర్నా చేయనున్నట్టు తెలిపారు. 2004 సెప్టెంబర్ తర్వాత నియమితులైన 1.84 లక్షల మంది ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను సర్వేలు, ఇతర కార్యక్రమాలకు ప్రభుత్వం వినియోగించుకోవడం మానుకోవాలన్నారు. లేదంటే ఉపాధ్యాయులే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మీ అవినీతికి అంతులేకుండా పోతోంది

- మీలాంటి వారి వల్ల తీవ్రనష్టం
- నారావారిపల్లిలో టీడీపీ నేతలను నిలదీసిన సీఎం బంధువులు

తిరుపతి రూరల్: రైతురథం పథకం కింద అర్హులను కాదని టీడీపీ నేతలే రాయితీ ట్రాక్టర్లను దక్కించుకున్న వైనంపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై సీఎం చంద్రబాబు బంధువులు టీడీపీ నేతలను అందరి ముందు నిలదీశారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలంలో సీఎం స్వగ్రామం నారావారిపల్లిలో ఆదివారం స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చంద్రగిరి మండల టీడీపీ నేతలపై సీఎం అన్న వరసైన నారా పట్టాభినాయుడు, ఇతర బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడికి, సర్పంచ్ భర్తకి, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు బినామీకి, టీడీపీ రాష్ట్ర నాయకుడిని అని చెప్పుకుంటున్న ఒక వ్యక్తికి ట్రాక్టర్లను మంజూరు చేయడంపై మండిపడ్డారు. అర్హత ఉన్నా పంచాయతీలో ఇతరులకు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. 'మీ అవినీతికి అంతులేకుండాపోతోంది.. సామాన్యులకు అందాల్సిన ట్రాక్టర్లను మీ ఇష్టం వచ్చినట్లు పంచుకున్నారు. అన్నీ మీరే పంచుకుంటే అర్హులకు ఎప్పుడు అందుతాయి? మీలాంటి వారివల్లే తీరని నష్టం జరుగుతోంది' అని చివాట్లు పెట్టారు.

సీఎం బంధువులు అయితే ఇవ్వాలా?

'ముఖ్యమంత్రి బంధువులు అయితే మాత్రం ట్రాక్టర్లు ఇవ్వాలా? మా ఇష్టం వచ్చిన వారికి ట్రాక్టర్లను ఇస్తాం.. మీరు ఎవ్వరు అడగడానికి' అంటూ కొందరు టీడీపీ నాయకులు సీఎం బంధువులపై తిరగబడ్డారు. తెలుగు యువత మాజీ అధ్యక్షుడు కుమార్ ఓ దశలో వారిపై దాడికి యత్నించాడు. ఇదంతా వైద్య శిబిరం ముందే జరగడం విశేషం. దీంతో డాక్టర్లు, పరీక్షల కోసం వచ్చిన రోగులు భయాందోళనలకు గురయ్యారు.

నిట్ ర్యాగింగ్‌పై విచారణ

తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లిలోని ఏపీ నిట్ తాత్కాలిక ప్రాంగణంలో జరిగిన ర్యాగింగ్ ఘటనపై ఆదివారం వరంగల్ నిట్ డైరెక్టర్ ఎన్.వి.రమణారావు, ఏపీ నిట్ రెసిడెంట్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, యాంటి ర్యాగింగ్ కమిటీ సభ్యులు సంయుక్తంగా విచారణ నిర్వహించారు. ఇరువర్గాలను పిలిచి విచారించి వారి వద్ద నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. పూర్తి స్థాయిలో విచారించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు ఎన్.వి.రమణారావు తెలిపారు.



తిరుమల ఆలయం వద్ద జస్టిస్ ఉమాదేవి తదితరులు



శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ చల్లా కోదండరామ్

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

సాక్షి, తిరుమల: ఏపీ, తెలంగాణ ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఉమాదేవి, జస్టిస్ చల్లా కోదండరామ్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో వారు వేర్వేరుగా ఆలయానికి వచ్చారు. ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ వారికి ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

రైల్లో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్ల వీరంగం

మహిళా ప్రయాణికుల పట్ల అసభ్య ప్రవర్తన

ఒంగోలు క్రైం: కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు ఆదివారం వీరంగం సృష్టించారు. హౌరా నుంచి చెన్నై వెళ్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలులో కేరళకు చెందిన ఇద్దరు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు శ్యామ్ కుమార్, వి.బినులు విశాఖలో ఎక్కారు. మద్యం తాగిన వీరిద్దరు రైలు చీరాల దాటిన తర్వాత ఎస్–4 బోగీలో బీభత్సం సృష్టించారు. మహిళా ప్రయాణికుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. దీన్ని గమనించిన రంగనాథ్ నందకుమార్, ఆర్.రాధాకృష్ణ అనే టీసీలు వారిని అడ్డుకున్నారు. దీంతో రెచ్చిపోయిన కానిస్టేబుళ్లు టీసీలపై దాడి చేశారు. వెంటనే ప్రయాణికులు చైన్ లాగడంతో ఒంగోలు రైల్వేస్టేషన్ దాటిన తర్వాత అగ్రహారం గేటు సమీపంలో రైలు ఆగింది. ఆదివారం మధ్యాహ్నం 1.15 నుంచి 2 గంటల వరకు 45 నిమిషాలపాటు రైలును ఆపేశారు. ఒంగోలు రైల్వే జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించడంతో జీఆర్‌పీ ఎస్‌ఐ రహీంరెడ్డి తమ సిబ్బందితో రైలు వద్దకు చేరుకుని సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లను అదుపులోకి తీసుకున్నారు.

సాక్షి
సాహిత్యం
విజయవాడ | సోమవారం | ఫిబ్రవరి | 5 | 2018
అభిప్రాయాలకు: sakshisahityam@gmail.com



గ్రేట్ రైటర్

ఎఫ్. స్కాట్ ఫిట్జ్‌గెరాల్డ్




తప్పిపోయిన తరంగా పిలవబడే, మొదటి ప్రపంచయుద్ధ కాలంలో బతికిన ఫ్రాన్సిస్ స్కాట్ కీ ఫిట్జ్‌గెరాల్డ్ (1896–1940) ఇరవయ్యో శతాబ్దపు గొప్ప అమెరికన్ రచయితగా పేరొందారు. 1920లలో ప్రారంభమైన జాజ్ మ్యూజిక్ యుగం ఆయన రచనల్లో గొప్పగా వర్ణితమైంది. 'దిస్ సైడ్ ఆఫ్ పేరడైజ్', 'ద బ్యూటిఫుల్ అండ్ డేమ్డ్', 'ద గ్రేట్ గాట్స్‌బీ', 'టెండర్ ఈజ్ ద నైట్' ఆయన నవలలు. ఇవి కాకుండా 'ద క్యూరియస్ కేస్ ఆఫ్ బెంజమిన్ బటన్' లాంటి ఎన్నో ప్రజాదరణ పొందిన కథలు రాశారు. హాలీవుడ్‌లో స్క్రిప్ట్ రైటర్‌గా పనిచేశారు. గ్రేట్ గాట్స్‌బీ, బెంజమిన్ బటన్ సినిమాలుగా కూడా వచ్చాయి. ఇప్పుడు క్లాసిక్‌గా పేరొందిన 'ద గ్రేట్ గాట్స్‌బీ' ఆయన జీవితకాలంలో పెద్ద మన్నన పొందలేదు. డబ్బుల కోసం కూడా చాలా కథలు రాశారు. ఈ విషయం మీదే ఆయన స్నేహితుడైన మరో ప్రసిద్ధ రచయిత ఎర్నెస్ట్ హెమింగ్వేతో ఆయనకు భేదాభిప్రాయాలు వచ్చేవి. తాను ముందు మనఃపూర్వకమైన కథే రాస్తాననీ, దాన్ని మేగజైన్లకు అమ్మడానికి వీలుగా మాత్రం అవసరమైన మలుపులు చేరుస్తాననీ ఫిట్జ్‌గెరాల్డ్ చెప్పేవారు. అతిమద్యపానం, ఆరోగ్యాన్ని లెక్కచేయనితనం వల్ల 44 ఏళ్లకే మరణించారు.

సాహిత్య మరమరాలు

చనిపోయాకా నిర్వాహకుడే

నడిమింటి సర్వమంగళేశ్వర శాస్త్రి– తెలుగు, సంస్కృతాల్లో పండితుడు. ఆయన రాసిన 'శబ్దమంజరి' సంస్కృతం నేర్చుకునే విద్యార్థులకు ప్రాథమిక గ్రంథం. ఆయన ఎవరినీ మన్నన చేయడని పేరు. ఆయనోసారి పూసపాటి ఆనంద గజపతి కొలువుకు వెళ్లారు. శాస్త్రి ఇంటిపేరును దృష్టిలో పెట్టుకుని, 'గురువుగారూ, అటు ముందరి ఇల్లూ కాకుండా, ఇటు వెనక ఇల్లూ కాకుండా నడిమిల్లు ఏమిటండీ చిత్రంగా' అన్నారు ఆనంద గజపతి వ్యంగ్యంగా.



'మహారాజా, ఎంత నడిమిల్లు అయినా పూస పాటి చేయదా?' అని అదే ఇంటి పేరుతో తిప్పికొట్టారు శాస్త్రి.

ఇక, ఈయన సభలూ శాస్త్రాలూ అంటూ ఊళ్లు తిరుగుతూవుంటే ఆయన కొడుకే ఇంటి నిర్వహణ భారాన్ని వహించేవాడు. అట్లాంటి కుమారుడు హఠాత్తుగా చనిపోయాడు. శవాన్ని మోయడానికి బంధువులు రావాలికదా! ఈయన తేలుకొండి స్వభావం వలన వాళ్లందరూ విరోధులై ఉన్నారు. అందుకే ఎవరూ ముందుకు రాలేదు. అంత బాధలోనూ– 'మావాడు బతికివున్నప్పుడూ నిర్వాహకుడే; చనిపోయాకా నిర్వాహకుడే' అన్నారట శ్లేషతో శాస్త్రి. ఇంకంతే, బంధువులు వచ్చి అనంతర కార్యక్రమాల్లో పాల్గొన్నారట.

ప్రతిధ్వనించే పుస్తకం



ఎలాంటివారు కాలాతీత వ్యక్తులు? డాక్టర్ పి.శ్రీదేవి రాసిన ఈ నవలలో ప్రధానంగా ఉన్నవి నాలుగు పాత్రలు. మేనమామ అదుపాజ్ఞల్లో బతికే వైద్యవిద్యార్థి ప్రకాశం, మంచివాడే కానీ పిరికివాడు. అవసరమైన సందర్భంలో కూడా తగిన తెగువ చూపకపోవడం వల్ల అటు కళ్యాణినీ ఇటు ఇందిరనూ ఇద్దరినీ నష్టపోతాడు. ఒద్దికగా ఉండే సున్నిత మనస్కురాలు కళ్యాణి. మంచివాళ్లకు మంచే జరుగుతుందన్న రకం. చదవడానికి చప్పగా కనిపించినా సాధారణంగా అందరికీ ఇట్టే నచ్చేపాత్ర. విలాస జీవితాన్ని గడిపినా సందర్భం వచ్చినప్పుడు అండగా నిలబడి తన వ్యక్తిత్వం చాటుకోగలిగే వ్యక్తి కృష్ణమూర్తి.



డా॥ పి.శ్రీదేవి

ఇక నాలుగోదీ, ఎక్కువ చర్చకు గురయ్యే పాత్ర, ఇందిర. ఒక విధంగా ఇందిరకు అనుగుణంగానే, లేదా ఇందిర పూనుకోవడం వల్లనే ఈ పాత్రల జీవితాలన్నీ మలుపు తిరుగుతాయి. చిన్నప్పుడే మరణించిన తల్లి, బాధ్యత లేకపోవడమే కాకుండా దురలవాట్లు కూడా గల తండ్రివల్ల చిన్న ఆఫీసులో టైపిస్టుగా పనిచేస్తూ జీవితంలో చాలా త్వరగా రాటుదేలిన పాత్ర ఈమెది. అంత కష్టాల్లోనూ తన షికార్లు వదులుకోదు. మనకు నచ్చింది చెయ్యగలగాలి, సంఘానికి వెరవకూడదంటుంది. పూర్తి నలుపు తెలుపుగా కాకుండా సహజమైన ఆలోచనాధోరణితో నడిచే రక్తమాంసాలున్న పాత్ర. ఆత్మవిశ్వాసం, స్వార్థం, ఈర్ష్య, జిత్తు అన్నీ కనబడతాయి. 'నా ఇల్లు నేను కట్టుకుంటే పక్కనుంచి వెళ్లేవారి నెత్తిమీద ఇటుకలు పడ్డాయంటే నేనేం చేయను? ఎవరి మటుకు వారు చూసి నడిచి వెళ్లాలి' అంటుంది. చాలామంది మనుషులు ఇందిరల్లాగే ఉంటారు; కానీ బయటికి ఒప్పుకోరు. రచయిత్రి అంతరంగం ఏమిటి? ఇలాంటివాళ్లే బతుకుతారనా? ఇలా బతికితేతప్ప ఈ సమాజంలో నెగ్గుకురాలేమనా? అలాగని ఇందిర తన అంతరంగానికి ముసుగు వేసుకునే రకం కాదు. 'ఏ పని చేసినా నేను కళ్లు తెరిచి చేస్తాను. ఏడుస్తూ ఏదీ చేయను. ఏది జరిగినా ఏడవను. నాకూ తక్కినవాళ్లకూ అదే తేడా' అంటుంది. అదే సమయంలో 'నేను బలపడి ఇంకొకరికి బలమివ్వాలనే తత్వం' తనదని చెబుతుంది.

ఇద్దరు పరస్పర భిన్న వ్యక్తిత్వాలు గల ఇందిర, కళ్యాణి పాత్రల ప్రయాణాన్ని ఈ నవల ఆవిష్కరిస్తుంది. ఆధునిక స్త్రీ తాను స్వతంత్రురాలినన్న పేరుతో మోయాల్సివస్తున్న బరువును దింపుకునే పరిస్థితి లేకపోవడమూ కూడా ఇందిర పాత్ర ద్వారా రచయిత్రి చూపారేమో అనిపిస్తుంది. 1957–58 మధ్య ధారావాహికగా వచ్చిన ఈ నవల ఆధారంగా 'చదువుకున్న అమ్మాయిలు' సినిమా వచ్చింది. రాయడంలో గొప్ప ప్రతిభ కనబరిచి, మూడు పదుల వయసులోనే మరణించిన ఈ నవలా రచయిత్రి పి.శ్రీదేవి (1929–61) కూడా కాలాతీత వ్యక్తే.

తప్పు కేక

కథాసారం

తప్పెవరిది? ఒప్పెవరిది? ఎలా తేల్చాలి? దానికంటే ముందు తేల్చాల్సింది ఇంకోటుంది. బలవంతుడెవరు? బలహీనుడెవరు?

ఉన్నట్టుండి కంటి మూల మీదుగా గమనించాడు న్యాయవాది వెయ్. బండి నడుపుతున్నతను గాల్లోకి ఎగిరి దబ్బుమని శబ్దం చేస్తూ కింద పడ్డాడు. ఆగే ముందు రెండు సార్లు పూర్తి గుండ్రంగా తిరిగింది శరీరం. వెయ్ మెదడు స్తంభించింది. వెంటనే కారు ఆపాడు.

రాత్రి కావస్తోంది. ప్రమాది రోడ్డు మీద నిశ్చలంగా పడివున్నాడు. అతడి హెల్మెట్ కిందుగా రక్తం కారుతోంది. మే నెలలో పూర్తిగా విచ్చుకున్న రుగోసా గులాబీ వర్ణంలో ఉందది.

వెయ్‌కు ఏం చేయాలో పాలుపోలేదు. 'దయచేసి చచ్చిపోవద్దు మిత్రమా. తాగి నడపడం కొంప ముంచుతుందనుకోలేదు. నువ్వు చచ్చిపోయావంటే నేనూ చచ్చిపోయినట్టే' అనుకున్నాడు. కొన్ని క్షణాల తర్వాత, కారు దిగి అతడి వద్దకు నడిచాడు. అతడు ఉన్నట్టుండి లేచి కూర్చుని, 'కండ్లు దొబ్బినయా? ఏం నడపడం అది?' అని తిట్టడం మొదలుపెట్టాడు.

ఎంత తియ్యటి తిట్టు! 37 ఏళ్ల వెయ్ జీవితంలో ఎన్నో తిట్లు అతడి వైపు గురి చూసి విసరబడినప్పటికీ, ఈ తిట్టంత వినసొంపుగా మరేదీ అతడి చెవులకు సోకలేదు. స్వర్గంలోంచి వచ్చిన పిడుగులా ఉంది. బతకడమే కాదు, తిట్టగలుగుతున్నాడు కూడా అంటే... బాగుంది!

రోడ్డు మీద ముల్లంగి, ఆకుకూరలు పరిచినట్టుగా పడివున్నాయి. నగరానికి కూరగాయలు మోసుకెళ్తున్న పేద రైతు అయివుండాలి. కొన్ని అడుగులు వేయడానికి ఆయనకు సాయపడ్డాడు. రైతు పూర్తి నిటారుగా నిలబడ్డాడు. కానీ నోట్లోంచి ఇంకా నెత్తురు కారుతూనే వుంది. తాను ఎంతమాత్రమూ బలహీనత చూపకూడదని అప్పటికే ఒక నిర్ణయానికొచ్చాడు వెయ్. కొద్దిగా మెత్తబడినా రైతు అడ్వాంటేజీ తీసుకోవచ్చు. ఏం పరిహారం అడుగుతాడో!

రైతు నెమ్మదిగా హెల్మెట్ తీశాడు. ఇదే అదునుగా గట్టిగా అడిగాడు వెయ్. 'నీ లైసెన్స్ ఏదీ? చూపించు'. ప్రమాదం చేసినవాడే ఇలా అడగటానికి సాధారణంగా సాహసించడు. కానీ అతణ్ని లొంగదీయాలంటే ఇదే దారి.

రైతు కంగారుపడ్డాడు. తల మీద రక్తం తుడుచుకున్నాడు. వణుకుతున్న చేతుల వంక చూసుకున్నాడు. అతడికి యాభై ఏళ్లుంటాయి. బట్టలు జిడ్డు కారుతున్నాయి. వాటిల్లోంచి పురుగుమందుల వాసన వస్తోంది. పసుపురంగు రబ్బరు బూట్లు తొడుక్కున్నాడు. చూడ్డానికి పెద్ద తెలిసినవాడిలా అనిపించడు.

'ఏం చేస్తుంటావు నువ్వు? నీ డ్రైవింగ్ లైసెన్స్ ఏది?' మళ్లీ అడిగాడు వెయ్, భయపెడుతున్నట్టుగా.

రైతు కొన్ని యుగాల పాటు జేబుల్ని వెతికి, సిగ్గుగా నవ్వుతూ 'అయ్యా, నేను తేవడం మర్చిపోయాను' అన్నాడు.

ఇదీ! అతడి ఛాతీని నెడుతూ, 'అయితే లైసెన్స్ లేదా? సరే. దొబ్బెయ్'. రైతు తిట్టును తిరిగి అప్పగించాడు వెయ్. 'నా వెనకాతలే వస్తావు, పైగా నన్నే తిడతావా?'

రైతు తల వాలిపోయింది. ఆత్మరక్షణలో పడిపోయాడు. 'నువ్వు... నువ్వు కూడా లైట్స్ వేసుకోలేదు, నాకెట్లా తెలుస్తుంది'.

అప్పటికే కొంతమంది పోగవడం మొదలైంది. కుందేళ్లు కూడా ఒక్కోసారి జనాన్ని కరవొచ్చు. ఎందుకొచ్చిన గొడవ! ఎంతోకొంత ముట్టజెప్పి వదిలించుకుంటే మంచిది. రైతు బండిని నిలబెట్టడానికి వెయ్ సాయపడ్డాడు. ముసలాయన తల వంచుకుని వణుకుతూనే కొన్ని అడుగులు వేశాడు. ఉన్నట్టుండి మళ్లీ భూమ్మీద పడ్డాడు. ఎంత కుదిపినా లాభం లేదు.

వెనుక కార్ల బారు పెరిగిపోతూవుంది. పోలీస్ సైరెన్లు వినబడుతున్నాయి. ఇది బాలేదు. వెంటనే హు కోక్సింగ్‌కు ఫోన్ చేశాడు వెయ్. హు పక్కా బిజినెస్‌మాన్. ప్రమాదం ఎక్కడ జరిగిందీ, ఇప్పుడు పరిస్థితి ఎలావుందీ లాంటి కొన్ని ప్రశ్నలు అడిగాడు. వెయ్ ఫోన్ కట్ చేసేలోపల పోలీసులు వచ్చారు. అందులో ఒకతను, డాక్యుమెంట్లు బయటికి తీయమని వెయ్‌ను ఆదేశించాడు. గొంతు తగ్గించి, 'మీ హెడ్ నాకు తెలుసు' అన్నాడు వెయ్. ఒకసారి దీర్ఘంగా చూసి, 'నోర్ముయ్, ముందు నీ డాక్యుమెంట్లు బయటికి తియ్' అన్నాడు పోలీసు.

రైతు దీర్ఘంగా శ్వాస తీసుకుంటున్నాడు. వెయ్‌లో ఆందోళన పెరుగుతోంది. ఇంతలో పోలీసు రేడియో బర్రున ప్రాణం సంతరించుకుంది. హు కోక్సింగ్ అయివుండాలి! పోలీస్ అందులో విని, వెయ్ వంక ఒక చూపు చూసి, సంభాషణను కొనసాగించడానికి వీలుగా జనానికి దూరంగా నడిచాడు. రెండు నిమిషాల్లో తిరిగొచ్చాడు, పూర్తి భిన్న వైఖరితో.

రైతును ఉద్దేశించి, 'నువ్వే ఈయన కారును ఢీకొట్టినట్టున్నావ్. ఏదీ చూపించు... నీ ఐడీ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్' అన్నాడు పోలీసు. రైతు ముఖం పాలిపోయింది. ఏం జరుగుతుందో అతడికి అర్థం కాలేదు. కంపిస్తున్న శరీరాన్ని తమాయించుకోవడానికి బైక్‌ను ఆసరా చేసుకుని నిలబడ్డాడు.

'లాయర్ వెయ్, ఈయనకు బాగా దెబ్బలు తగిలినయ్. ఎందుకైనా మంచిది ముందు హాస్పిటల్‌కు తీసుకెళ్దాం' అన్నాడు పోలీసు.

రైతు మూర్ఖుడు అయ్యుండాలి. అప్పుడే గంప తీసుకుని కింద పడిన కూరగాయలను ఏరడం మొదలుపెట్టాడు. ఒంటి మీది రక్తపు చుక్కలు ఆకుల మీద పడ్డాయి. లాయరూ పోలీసూ చిర్నవ్వుతో చూపులు మార్చుకున్నారు.

'ఇప్పుడు బానేవుందా?' అడిగాడు పోలీసు. ఛాతీ రుద్దుకుని, 'నొప్పిగా ఉంది' అన్నాడు రైతు.

మరో బక్కపలుచని పోలీసు ముందుకు వచ్చి, 'దీన్నిక్కడే ఏదో పరిష్కారం చేసుకో. నీకు లైసెన్స్ లేదు. చూస్తుంటే నువ్వే కారును గుద్దినట్టు ఉంది. నువ్వు నష్టపరిహారం కట్టాలి తెలుసా?' రైతుతో అని, వెయ్ వైపు తిరిగాడు: 'మీది కూడా తప్పుంది. మీ లైట్స్ లేవు'. అవునన్నట్టుగా చిన్నగా తలూపాడు వెయ్.

రైతు క్షమించమని ప్రాధేయపడ్డాడు. వెయ్ లోపల నవ్వుకున్నాడు. హమ్మయ్య! దెబ్బ తగిలిన కారు భాగం వైపు చూస్తూ, 'అది ఫర్లేదా?' వెయ్‌ను అడిగాడు పోలీసు.

'గరాజ్‌కు వెళ్లకుండా ఇప్పుడే చెప్పలేను. కానీ పెయింట్ పోయింది, ట్రిమ్మింగ్ చేయించాలి. మూడు నాలుగు వేలకు తక్కువ కావు' అంచనా వేశాడు వెయ్.

రైతు ముఖంలోకి ఒక్కసారిగా భయం ప్రవేశించింది. జేబులోంచి ముడతలు పడిన నోట్లు బయటికి తీశాడు. రెండు యువాన్ల నోటు, ఒక యువాన్ నోటు, బోల్డన్ని మావో నాణేలు. అన్నీ కలిపినా 100 యువాన్లు కావు (1 యువాన్ సుమారు పది రూపాయలు). అతడి కళ్లలోంచి నీళ్లు కారుతున్నాయి. 'నా దగ్గర ఇంతే వుంది, లేదంటే నా బండి తీసుకో'.



'నేనేం చేసుకోవాలి? ఇనుప సామాన్లకు అమ్మడానికి తప్ప పనికిరాదు' అన్నాడు వెయ్. పోలీసు నెమ్మదిగా రైతు చెవిలో ఏదో చెప్పాడు. రైతు బెంబేలు పడిపోయి, జాకెట్‌లోంచి ఒక ప్లాస్టిక్ బ్యాగ్ బయటికి తీశాడు. 330 యువాన్లు ఉన్నాయందులో. ఒక వంద నోటు, నాలుగు యాభైలు, 3 పదులు. తీసి ఇచ్చాడు. 'ఇవి ఎరువు కొనడానికి. నా దగ్గరున్నది ఇంతే'. వెయ్ వాటిని తీసుకున్నాడు. రైతు బైక్ నెట్టుకుంటూ ముందుకు వెళ్లిపోయాడు.

మరో బక్కపలుచని పోలీసు ముందుకు వచ్చి అన్నాడు: 'దీన్నిక్కడే ఏదో పరిష్కారం చేసుకో. నీకు లైసెన్స్ లేదు. చూస్తుంటే నువ్వే కారును గుద్దినట్టు ఉంది. నువ్వు నష్టపరిహారం కట్టాలి తెలుసా?' రైతు ముఖంలోకి ఒక్కసారిగా భయం ప్రవేశించింది. జేబులోంచి ముడతలు పడిన నోట్లు బయటికి తీశాడు.

గుంపు పలుచబడింది. 'ఒక పెగ్‌కు ఎక్కడైనా కలుద్దాం' అన్నాడు పోలీసు. 'మీకో పార్టీ బాకీ' చెప్పాడు వెయ్. విజిల్ ఊదుకుంటూ పోలీసు వెళ్లిపోయాడు.

వెయ్ కారులోకి ఎక్కి, కొంచెం ముందుకు పోనిచ్చాడు. అక్కడ రైతు ఒక చిన్న చెట్టు కింద కడుపుకు చేతిని అడ్డం పెట్టుకుని దగ్గుతున్నాడు. ఇద్దరి చూపులూ ఒక్కసారి కలుసుకున్నాయి. ఏమీ జరగనట్టుగా ఫెంగ్ షాన్ పట్టణం వైపు సాగిపోయాడు వెయ్. దిగితే మళ్లీ ఏం మీద పడుతుందో! పైగా వెయ్ ప్రియురాలు జియావో లీ ఈపాటికే ఏమైందోనని కంగారు పడుతూ ఉంటుంది!

మురాంగ్ స్యీకెన్ రాసిన చైనీస్ కథ 'ది ఏక్సిడెంట్' సారాంశం ఇది. దీన్ని ఇంగ్లిష్‌లోకి హార్వే థామ్లిన్‌సన్ అనువదించారు. 2012లో 'ద గార్డియన్' పత్రిక ప్రచురించింది. మురాంగ్ స్యీకెన్ కలంపేరుతో రాసే హావో చీన్ 1974లో జన్మించారు. తొలి నవల 'లీవ్ మి ఎలోన్: ఎ నావెల్ ఆఫ్ చంగ్డూ'తో విశేష గుర్తింపు తెచ్చుకున్నారు. చైనా ప్రభుత్వ సెన్సార్‌షిప్‌ను వ్యతిరేకిస్తారు.




మురాంగ్ స్యీకెన్

కొత్త బంగారం

ఉత్తరం వెళ్లే రైలు

'తనకి 16 సంవత్సరాలో, పదిహేడో కోరాకి తెలియదు' అంటూ కాల్సన్ వైట్హెడ్ ప్రారంభించిన ఈ నవల్లో, ప్రధాన పాత్రయిన కోరా– జోర్జా రాష్ట్రపు, రాండాల్ ప్లాంటేషన్లో ఉండే మూడవ తరపు(1812) బానిస. బానిసల హింస, ఉరితీతలు, మానభంగాలు సామాన్యం అయిన చోటు అది.

కోరా చిన్నపిల్లగా ఉన్నప్పుడు ప్లాంటేషన్ నుండి తప్పించుకు పారిపోయి, పట్టుబడని ఒకే ఒక బానిస–ఆమె తల్లి. కోరా అమ్మమ్మ చరిత్ర కూడా ఉంటుంది నవల్లో.



కోరా యజమానిది వక్ర బుద్ధి. కోరా స్వతంత్ర భావాలున్నది. కొత్త బానిస సీసర్ సలహాతో, అతనితోపాటు ఒక రాత్రి పారిపోయి, ఒక తెల్ల 'స్టేషన్ ఏజెంట్' సహాయంతో నేలమాళిగ రెయిలెక్కుతుంది. స్వేచ్ఛ వెతుక్కుంటూ పారిపోయే బానిసలకి సహాయపడేందుకు అభివృద్ధి చేయబడిన అండర్‌గ్రౌండ్ రెయిల్ రోడ్ యొక్క అనేకమైన సొరంగాల ద్వారా ప్రయాణిస్తూ– ప్రమాదాలనీ, ప్రతిఘటనలనీ ఎదుర్కొంటుంది. చదువూ,స్వేచ్ఛా గురించిన తన కలలను నిజం చేసుకునేటందుకు వాటన్నిటినీ తట్టుకుంటూ, అణిచివేత గురించి నిర్దిష్టమైన అభిప్రాయాలున్న దక్షిణ రాష్ట్రాల నుంచి ఉత్తర దిక్కుగా ప్రయాణిస్తుంది. ఆ ప్రక్రియలో, ఒక తెల్ల వ్యక్తిని చంపవలిసి వస్తుంది.

కోరా పరుగు మీద నుంచి దృష్టి మళ్ళించకుండానే రచయిత అనేకమైన ఇతర పాత్రలనీ, వారి దృష్టి కోణాలనీ, అంతర్గత జీవితాలనీ కనపరుస్తారు. 'తనకీ ప్లాంటేషన్కీ మధ్యనున్న ప్రతీ మైలూ ఒక విజయమే' అనుకున్న కోరా ఏ చోటూ భద్రమైనది కాదని గ్రహిస్తుంది. తను అడుగు పెట్టిన ప్రతీ రాష్ట్రంనుంచీ నేర్చుకుంటూ– మానసికంగా, తాత్వికంగా ఎదుగుతుంది. సౌత్ కారొలీనా వెళ్ళినప్పుడు కొత్త పేర్లూ, కొత్త గుర్తింపూ ఉన్న నూతన జీవితాలు మొదలెడతారు కోరా, సీసర్. అక్కడే సీసర్ హత్య జరుగుతుంది.

పారిపోయిన బానిసలని తిరిగి తెచ్చే రిజ్వే గతంలో కోరా తల్లిని వెతకడంలో విఫలుడైన వ్యక్తి. అతనిప్పుడు కోరాని వెంబడిస్తాడు. మొదటిసారి ఆమె తప్పించుకుంటుంది. రెండోసారి అతన్ని రెయిలు మెట్లమీద నుంచి తోసి, గాయపరిచి– పట్టాలమీదగా పారిపోయి, నేలమాళిగ నుండి బయటకి వచ్చి– పశ్చిమదిక్కుగా ప్రయాణిస్తున్న బిడారుతో కలిపి వెళ్ళిపోతుంది. పారిపోయే వారికి సహాయం చేసేవారిని 'కండక్టర్స్' అనీ, బానిసలని 'కార్గో' అనీ పిలుస్తారు.



కాల్సన్ వైట్హెడ్

ఈ నవల చారిత్రాత్మక వాస్తవికత యొక్క కాల్పనిక వృత్తాంతం. ఆనాటి రెయిలు వ్యవస్థకి ఆధునిక సౌకర్యాలని కలిపిస్తారు వైట్హెడ్. బానిసల మనస్తత్వాలని సూక్ష్మంగా వ్యక్తీకరిస్తారు. నిషేధించబడిన 'నీగ్రో, నిగ్గర్' అన్న మాటలని రచయిత వాడతారు. రచయిత మాటల్లో: 'మనం గతాన్ని నిర్లక్ష్యపెట్టలేం. భయం సృష్టించడంతో గతాన్ని పునరావృతం చేయలేం. వర్తమానాన్ని గుర్తిస్తూ, గతంతో పాటు జీవించక తప్పదు... సమస్యకి పరిష్కారం ఉండే వీలు లేదు కనుక కథకీ పరిష్కారం లేదు. అమెరికాలో నల్లవారిగా ఉండటం అనేది ఏ విధమైన ముగింపుకీ చేరలేదు.'

రాయడానికి రచయితకి 16 సంవత్సరాలు పట్టిన ఈ నవలని అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా, టీవీ ప్రయోక్త ఓప్రా విన్‌ఫ్రే చదివారు. ఇది వైట్హెడ్ ఆరవ నవల. మాజికల్ రియలిజం పద్ధతిలో ఉండి, ప్రథమ పురుష స్వరంతో కొనసాగుతుంది. 2016లో అచ్చయి, అదే యేడు 'నేషనల్ బుక్ అవార్డ్ ఆఫ్ ఫిక్షన్' పొందింది. 2017లో పులిట్జర్ అవార్డు గెలుచుకుంది. ఆడియో పుస్తకం కూడా ఉంది.

◆ కృష్ణ వేణి

ఈవారం పుస్తకాలు




ఇంటివైపు
కవి: అఫ్సర్; పేజీలు: 264; వెల: 180; ప్రచురణ: వాకిలి; ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.



అంగారస్వప్నం
కవి: ఊర్మిళ; పేజీలు: 200(హార్డ్ బౌండ్); వెల: 200; ప్రచురణ: ప్రేమలేఖ; ప్రతులకు: ఫ్లాట్ నం.821, ట్రైడెంట్ గ్రాండే అపార్ట్‌మెంట్స్, గుండ్లపోచంపల్లి రోడ్, మేడ్చల్ జిల్లా, తెలంగాణ–500014. ఫోన్: 9032599252



యథేచ్ఛ
కవి: నందకిషోర్; పేజీలు: 96; వెల: 100; ప్రచురణ: వాకిలి; ప్రతులకు: 8–415/89, సప్తగిరి కాలనీ, మియాపూర్, హైదరాబాద్–49.



మట్టిపూల గాలి
కవి: స్వేచ్ఛ; పేజీలు: 104; వెల: 65; ప్రతులకు: సహచర బుక్ మార్క్స్, హెచ్ఐజీ(ఓజీ) బ్లాక్ 5, షాప్ నం. 29, సుందరయ్య పార్క్ దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్–44. ఫోన్: 9848348173

బ్రహ్మోత్రపంచం

వ్రాసి ఫేమస్ అయ్యి విగ్రహం పెట్టించుకోడం కన్నా,
ముందు విగ్రహం పెట్టించుకుని తరువాత వ్రాయడం ఈజీ అనిపించిందోయ్.
అందుకని...



పదం పలికింది - పాట నిలిచింది

రాలుపూల తేనియకై రాతిపూల తుమ్మెదనై



ఒక పాత్ర మానసిక స్థితికీ, దాని మేధో స్థాయికీ తగిన పదాలతో రాసిన పాట విన్నప్పుడు ఒక రసస్పందన ఏదో కలుగుతుంది. అలాంటి అనుభూతే 1982లో వచ్చిన 'మేఘసందేశం' చిత్రంలోని 'ఆకాశ దేశాన ఆషాఢ మాసాన' కలిగిస్తుంది. గీత రచయిత దేవులపల్లి కృష్ణశాస్త్రి. అందులో మొదటి చరణంలో నాయకుడు–

'వానకారు కోయిలనై తెల్లవారి వెన్నెలనై ఈ ఎడారి దారులలో ఎడద నేను పరిచానని / కడిమి వోలె నిలిచానని' అని పాడతాడు. రెండో చరణంలో– *'రాలుపూల తేనియకై రాతిపూల తుమ్మెదనై / ఈ నిశీధి నీడలలో నివురులాగ మిగిలానని / శిథిల జీవినైనానని'* అని తన మనోవేదననూ, మరణ యాతననూ వెల్లడిస్తాడు.

నాగేశ్వరరావు, జయసుధ, జయప్రద, జగ్గయ్య నటించగా దాసరి నారాయణ రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సంగీతం సమకూర్చింది రమేశ్ నాయుడు. పాడింది కె.జె.యేసుదాస్. ఈ చిత్రాన్ని కృష్ణశాస్త్రికి అంకితమివ్వడం గమనించదగ్గది. ఇది అక్కినేని 200వ చిత్రం కావడం మరో విశేషం.

రారండోయ్

- సన్నిధానం నరసింహశర్మ 'ప్రాణహిత' ఆవిష్కరణ ఫిబ్రవరి 6న సా॥ 5 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని షోయబ్ హాల్లో జరగనుంది.
- చాగంటి తులసి నవల 'యాత్ర' ఆవిష్కరణ ఫిబ్రవరి 8న సాయంత్రం 6 గంటలకు విజయనగరం కేంద్ర గ్రంథాలయంలో జరగనుంది.
- బి.ఎస్.ఎమ్.కుమార్ 'నిర్మయ మిళీనలు... తెర్చీ తెరవని గుమ్మాలు' ఆవిష్కరణ ఫిబ్రవరి 9న సా॥ 5.30కు రవీంద్రభారతిలో జరగనుంది.
- ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక నాలుగో మహాసభ సందర్భంగా 'సమాచార వినిమయ మాధ్యమాలు– జండర్ దృక్పథం' పేరిట రెండ్రోజుల జాతీయ సదస్సు ఫిబ్రవరి 10, 11 తేదీల్లో తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్‌లో జరగనుంది.
- ఉప్పరపాటి వెంకటేశులు 'చిత్రావతి కథలు' ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటలకు అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో జరగనుంది.
- గుడిపాటికి ఈదూరు సుబ్బయ్య సాహితీ పురస్కార ప్రదానం ఫిబ్రవరి 11న సాయంత్రం 5.30కు త్యాగరాయ గానసభలో జరగనుంది.
- లలితానంద్ కవిత్వం 'గుర్తుకొస్తున్నాయి' ఆవిష్కరణ ఫిబ్రవరి 11న సాయంత్రం 5 గంటలకు విజయవాడ శిఖర స్కూల్‌లో జరగనుంది.
- కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారానికి అంకం లింగమూర్తి (అమ్మ–నాన్న), జీడిగుంట రామచంద్రమూర్తి (మూడు నాటికలు); కొలకలూరి భాగీరథి కవితా పురస్కారానికి ఈతకోట సుబ్బారావు (కాకిముద్ద), అడిగోపుల వెంకటరత్నం (ముందడుగు) ఎంపికయ్యారు. ప్రదానం ఫిబ్రవరి 26న తెలుగు విశ్వవిద్యాలయంలో.

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం. తిథి బ.పంచమి ప.12.28 వరకు, తదుపరి షష్ఠి. నక్షత్రం హస్త ప.2.35 వరకు, తదుపరి చిత్త. వర్జ్యం రా.10.44 నుంచి 12.21 వరకు. దుర్ముహూర్తం ప.12.34 నుంచి 1.19 వరకు, తదుపరి ప.2.49 నుంచి 3.35 వరకు. అమృత ఘడియలు ఉ.8.34 నుంచి 10.11 వరకు.

సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం : 5.52
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 5.33
జొహర్ : 12.30
అసర్ : 4.37
మగ్రీబ్ : 6.13
ఇషా : 7.27



24 గంటల్లో 980 విమానాలు

ముంబై విమానాశ్రయం అరుదైన రికార్డు

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం అరుదైన ఘనత సాధించింది. 24 గంటల్లో 980 విమానాల రాకపోకలతో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే సింగిల్ రన్‌వే విమానాశ్రయంగా రెండో ఏడాది కూడా రికార్డుల్లోకెక్కింది. జనవరి 20న ఈ విమానాశ్రయం ఈ ఘనత సాధించినట్లు ఎయిర్‌పోర్ట్ అధికార ప్రతినిధి తెలిపారు. గతేడాది డిసెంబర్ 6న 24 గంటల్లో 974 విమానాల రాకపోకలతో తన పేరిట ఉన్న రికార్డును ముంబై ఎయిర్‌పోర్ట్ బద్దలు కొట్టిందన్నారు. గత మార్చిలో ఒక్క రోజు వ్యవధిలో 837 విమానాల రాకపోకలతో ముంబై విమానాశ్రయం లండన్‌లోని గట్విక్ ఎయిర్‌పోర్ట్ (757 విమానాల రాకపోకలు)ను వెనక్కు నెట్టిందని వెల్లడించారు. ముంబై విమానాశ్రయం 24 గంటల పాటు పనిచేస్తే, ప్రభుత్వ నిషేధం కారణంగా గట్విక్ ఎయిర్‌పోర్ట్ ఉదయం 5 నుంచి రాత్రి 12 గంటల వరకే పనిచేస్తుందన్నారు. అయినప్పటికీ ఈ విమానాశ్రయానికి 2018లో రోజుకు 870 ఫ్లైట్ల రాకపోకల సామర్థ్యం ఉందన్నారు. రద్దీ సమయాల్లో ముంబై విమానాశ్రయంలో గంటకు 52 విమానాల రాకపోకలు జరిగితే, గట్విక్‌లో ఇది 55గా ఉంటుందన్నారు. విమానాలు నిలిపేందుకు ఎక్కువ చోటు లేకపోవడం, మౌలికవసతుల కొరత ముంబై ఎయిర్‌పోర్టుకు సమస్యగా మారిందన్నారు.

'ఫేక్' బుక్ ఖాతాల్లో భారత్ టాప్!



హైదరాబాద్: సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లో దాదాపు 20 కోట్ల నకిలీ ఖాతాలున్నట్లు తేలింది. ఆ సంస్థ ప్రకటించిన 2017 డిసెంబర్ నాటి వార్షిక నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ఈ నకిలీ ఖాతాలు అధికంగా భారత్‌లోనే ఉన్నట్లు పేర్కొంది. 2017 నాలుగో త్రైమాసికంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న మంత్లీ ఆక్టివ్ యూజర్లు (ఎంఏయూ)లలో 10 శాతం నకిలీ ఖాతాలే అని అంచనా వేసింది. అలాగే ఈ నకిలీ ఖాతాలున్న దేశాల్లో తొలి స్థానాల్లో భారత్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ ఉన్నట్లు పేర్కొంది. 2017 చివరి నాటికి మొత్తం 2.13 బిలియన్ల ఎంఏయూలు ఉన్నారని, 2016తో పోలిస్తే 14 శాతం ఎంఏయూలు పెరిగారంది. 2017లో ఖాతాలు పెరగడానికి భారత్, ఇండోనేసియా, వియత్నాం దేశాలే కారణమని పేర్కొంది. ఒక వాడకందారుడికి ఒకటి కంటే ఎక్కువ ఖాతాలుంటే.. అందులో మొదటి ఖాతా మినహా మిగతావన్నీ నకిలీవేనని పేర్కొంది.

'మత హింస' అమిత్ షా లక్షణం: సిద్ధరామయ్య



బెంగళూరు: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య బీజేపీ చీఫ్ అమిత్ షాపై విమర్శల తీవ్రతను పెంచారు. మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం అమిత్ షాకు ఉన్న లక్షణమని సిద్ధరామయ్య ఆదివారం నాడిక్కడ విమర్శించారు. 'కర్ణాటకలో మత హింసను రెచ్చగొట్టే చర్యల్ని మేం ఎంతమాత్రం అనుమతించం. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది' అని సిద్ధరామయ్య హెచ్చరించారు. 'ప్రధాని మోదీ కర్ణాటకకు వచ్చి మత ఉద్రిక్తతల్ని రెచ్చగొడుతున్నారని నేను చెప్పడం లేదు. అది అమిత్ షాకు ఉన్న లక్షణం. అది తప్ప షాకు మరొకటి తెలీదు. మత హింసనే అతను రాజకీయ వ్యూహంగా భావిస్తాడు' అని విమర్శించారు.

'నో డిటెన్షన్'తో ప్రమాణాలు తగ్గడం అపోహే!

న్యూఢిల్లీ: పాఠశాలల్లో నో డిటెన్షన్ పాలసీతో విద్యా ప్రమాణాలు తగ్గిపోవడం కేవలం అపోహ మాత్రమేనని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం), అహ్మదాబాద్ పరిశోధకులు అంకిత్ సరఫ్, కేతన్ ఎస్ దేశ్‌ముఖ్ 'టు ఫెయిల్ ఆర్ నాట్ టు ఫెయిల్' పేరిట ఈ అధ్యయనం నిర్వహించారు. దీనికిగానూ యాన్యువల్ సర్వే ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్స్(ఏఎస్ఈఆర్)లో 10ఏళ్ల పాటు నమోదైన డేటాను సేకరించి పరిశీలించారు. అధ్యయన నివేదికను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీతో పాటు దేశంలో నూతన విద్యా విధానాన్ని రూపొందించే ప్యానెల్‌కు అందించారు. నో డిటెన్షన్ పాలసీ అమలుచేయడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు తగ్గిపోవట్లేదని వారు గుర్తించారు. పాఠశాలలో ఉత్తీర్ణులు కాని విద్యార్థులను అదే తరగతిలో ఉంచే డిటెన్షన్ విధానాన్ని వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేస్తామని కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే గత జూలైలో ప్రకటించిన విషయం తెలిసిందే.

ఎలక్ట్రానిక్ రుజువులకు ధ్రువీకరణ తప్పనిసరికాదు



న్యూఢిల్లీ: కేసుల విచారణ సందర్భంగా పరిగణనలోకి తీసుకునే ఎలక్ట్రానిక్ ఆధారాలకు ధ్రువీకరణ తప్పనిసరి కాదని, న్యాయబద్ధంగా ఉందని కోర్టులు భావిస్తే విశ్వాసంలోకి తీసుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లోని 65బీపై ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన వివరణ కోర్టుల్లో నేర విచారణ తీరుపై ప్రభావం చూపనుంది. దీంతో సీడీలు, మొబైల్ వీడియో రికార్డులు, ఫోన్ కాల్‌డేటా, సీసీటీవీ ఫుటేజీల వంటి ఎలక్ట్రానిక్ రుజువులను కోర్టులు ప్రభుత్వ అధికారి ధ్రువీకరణ లేకున్నా పరిశీలించవచ్చు. అయితే, ఈ రికార్డులను సమర్పించే వ్యక్తి బాధ్యతాయుత పదవిలో ఉన్న అధికారై ఉండాలని జస్టిస్ ఏకే గోయెల్, జస్టిస్ యు.యు.లలిత్‌ల బెంచ్ పేర్కొంది.

పాక్ ఆర్మీపై తాలిబాన్ల ఆత్మాహుతి దాడి

పెషావర్: పాకిస్తాన్‌లో తాలిబాన్ ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. స్వాత్ జిల్లాలోని ఆర్మీ యూనిట్ లక్ష్యంగా ఓ ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ఓ మేజర్ సహా 11 మంది పాక్ సైనికులు ప్రాణాలు కోల్పోగా, 13 మంది గాయపడ్డారు. తాలిబాన్లకు గట్టి పట్టున్న స్వాత్ లోయలోని ఆర్మీ బేస్ సమీపంలో శనివారం ఈ దాడి జరిగినట్లు పాక్ ఆర్మీ మీడియా విభాగం తెలిపింది. తొలుత నిషేధిత ప్రాంతంలోకి చొచ్చుకొచ్చిన ఉగ్రవాది.. ఆర్మీ బేస్ బయట వాలీబాల్ ఆడుతున్న సైనికులు లక్ష్యంగా తనను తాను పేల్చేసుకున్నాడని వెల్లడించింది.

సుప్రీంకోర్టు ఉత్తర్వులను పాటించొద్దు

భద్రతా దళాలను ఆదేశించిన మాల్దీవుల ప్రభుత్వం



యమీన్

మాలే: హిందూ మహా సముద్రంలోని ద్వీప దేశం మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం కొనసాగుతోంది. అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్‌ను అరెస్ట్ చేసేలా లేదా అభిశంసించేలా ఆ దేశ సుప్రీం కోర్టు ఇచ్చే ఆదేశాలను పాటించకూడదంటూ పోలీసులు, భద్రతా దళాలను ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. 'అధ్యక్షుణ్ని అరెస్ట్ చేయాలంటూ సుప్రీంకోర్టు ఉత్తర్వు ఇస్తే అది అక్రమం. మాల్దీవుల రాజ్యాంగానికి విరుద్ధం. కాబట్టి అలాంటి ఉత్తర్వును అమలు చేయకూడదని నేను పోలీసులకు, ఆర్మీకి చెప్పాను' అని అటార్నీ జనరల్ మహమ్మద్ అనిల్ ఆదివారం మీడియాకు చెప్పారు. గతంలో యమీన్ 9 మంది అసమ్మతి నేతలను జైలులో పెట్టించారు. అధికార పక్షం నుంచి ప్రతిపక్షంలోకి వెళ్లిన మరో 12 మందిపై అనర్హత వేటు వేశారు. గత గురువారం సుప్రీంకోర్టు తీర్పునిస్తూ జైలులోని 9 మందిని విడుదల చేయాలని ఆదేశించడంతోపాటు 12 మంది సభ్యులపై అనర్హతను ఎత్తివేసింది. దీంతో 85 మంది సభ్యులున్న మాల్దీవుల పార్లమెంటు పీపుల్స్ మజ్లిస్‌లో ప్రతిపక్ష మాల్దీవియన్ డెమొక్రాటిక్ పార్టీ (ఎండీపీ)కి ఆధిక్యం లభించినట్లైంది. సోమవారం జరగాల్సిన పార్లమెంటు సమావేశాల్లో అధ్యక్షుడు యమీన్‌ను అభిశంసించాలని ఎండీపీ భావించగా, అలా జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం పార్లమెంటును నిరవధికంగా వాయిదా వేసింది. కాగా, దేశాన్ని ఎవరు పాలించాలో నిర్ణయించే అవకాశాన్ని ప్రజలకే ఇచ్చేలా ముందస్తు ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో ఉన్నట్లు యమీన్ చెప్పారు.

కాంట్రాక్టు రైల్వే కార్మికుల వివరాల క్రోడీకరణ

'వ్యవస్థీకృత' ప్రయోజనాలు కల్పించేందుకు..

న్యూఢిల్లీ: రైల్వేలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వివరాలు క్రోడీకరించాలని ఆ శాఖ నిర్ణయించింది. హౌస్ కీపింగ్, క్లీనింగ్, కన్సల్టెన్సీ, ట్రైనింగ్ తదితర సర్వీసుల్లో పనిచేస్తున్న కార్మికులకు వ్యవస్థీకృత రంగ ప్రయోజనాలు కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. కార్మికుల హక్కుల ఉల్లంఘనపైనా దీని ద్వారా దృష్టి సారించవచ్చని భావిస్తోంది. ఈ మేరకు జనరల్ కండీషన్స్ ఆఫ్ కాంట్రాక్టు (జీసీసీ) నిబంధనలు రూపొందించింది. ఆ ప్రకారం వంతెనలు, భవనాలు, గేజ్ మార్పిడి ప్రాజెక్టులు, ఇతర సేవలకు సంబంధించిన పనుల్లో నిమగ్నమైన కాంట్రాక్టర్ల నియమాలను మార్చనుంది. కొత్త విధానం ప్రకారం.. రైల్వేకు సేవలందిస్తున్న కాంట్రాక్టు కార్మికుల వివరాల కోసం డిజిటల్ కాంట్రాక్టు లేబర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తారు. కార్మికుల వ్యక్తిగత వివరాలు, పోలీస్ వెరిఫికేషన్, ఆరోగ్య బీమా, పీఎఫ్ రిజిస్ట్రేషన్, గుర్తింపు కార్డు, హాజరు సమాచారం, పని వేళలు, జీతం, కార్మికుల బయోమెట్రిక్ వివరాలను ఇందులో పొందుపరచనున్నారు.



అమెరికాలోని దక్షిణ కరోలినా రాష్ట్రంలో ఆదివారం పట్టాలపై నిలిపి ఉంచిన సరకు రవాణా రైలును ఢీకొన్న ప్యాసింజర్ రైలు. ఈ ప్రమాదంలో ప్యాసింజర్ రైలు సిబ్బంది ఇద్దరు మృతిచెందగా, 116 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్!

కర్ణాటకలో ఆ పార్టీ ప్రభుత్వం ఇప్పుడు ఎగ్జిట్ గేట్ వద్ద ఉంది

- ప్రభుత్వం హత్యా రాజకీయాలు చేస్తోంది
- అవినీతిలో సిద్ధరామయ్య సర్కారు కొత్త రికార్డులు
- టమోటా, ఆనియన్, పొటాటో(టాప్)లకు ప్రాధాన్యత
- బీజేపీ ర్యాలీలో ప్రధాని మోదీ

సాక్షి, బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు కౌంట్‌డౌన్ దగ్గర పడిందని, సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అవినీతిలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డులు సృష్టించిందని, కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆదివారం బెంగళూరు ప్యాలెస్ మైదానంలో రాష్ట్ర బీజేపీ నిర్వహించిన పరివర్తన యాత్ర ముగింపు సభలో ప్రధాని మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని.. సులభతర వ్యాపార నిర్వహణ గురించి కాకుండా సులభంగా హత్యలు ఎలా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని ఆరోపించారు. కర్ణాటక అసెంబ్లీలో మొత్తం 224 స్థానాలు ఉండగా.. 150 సీట్లు సాధించాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది.

రాష్ట్రంలో స్టీల్, ఇసుక మాఫియా రాజ్యం

అవినీతి, కుల రాజకీయాలతో రాష్ట్రాన్ని కాంగ్రెస్ భ్రష్టు పట్టించిందని మోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'కాంగ్రెస్ ముక్త రాష్ట్రంగా చేయాలని కర్ణాటక ప్రజలు నిర్ణయించుకున్నారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే ఆ పార్టీకి కాలం చెల్లినట్లు ఉంది. ప్రతి పనికి 10 శాతం కమీషన్‌ను తీసుకోవడం సిద్ధరామయ్య ప్రభుత్వానికి అలవాటుగా మారింది. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా కమిషన్ ఇచ్చి తీరాల్సిందే. కాంగ్రెస్ ముక్త ప్రభుత్వం అంటే వారసత్వ పాలన, బంధుప్రీతి, అవినీతి, దోపిడీ నుంచి విముక్తి అని అర్థం. రాష్ట్రంలో ఇద్దరు మంత్రులు, ఒక సీనియరు కాంగ్రెస్ నేత ఇళ్లలో ఐటీ దాడులు జరిగాయి. రాష్ట్రంలో స్టీల్ మాఫియా, ఇసుక మాఫియా, బదిలీ మాఫియా రాజ్యమేలుతోంది. స్టీల్ బ్రిడ్జ్ పేరిట కొందరు కోట్లాది రూపాయలు కొల్లగొట్టేందుకు కుట్ర చేశారు. ప్రజల నిరసన, బీజేపీ ఆందోళనలతో ప్రాజెక్టును విరమించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాషాయ పవనాలు వీస్తున్నాయి. స్టార్టప్‌ల కోసం ఇప్పటికే రూ. 10 వేల కోట్ల నిధిని ఏర్పాటు చేశాం. దీనివల్ల మధ్యతరగతి యువతకు ఎంతో మేలు జరుగుతుంది' అని ప్రధాని పేర్కొన్నారు.

రాష్ట్రంలో దారుణంగా శాంతి భద్రతల పరిస్థితి

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిని ప్రస్తావిస్తూ.. 'ఒకవైపు కేంద్రంలోని బీజేపీ దేశ పురోగతి కోసం ప్రయత్నిస్తుంటే.. మరోవైపు కర్ణాటక ప్రభుత్వం వ్యతిరేక దిశలో పోతోంది. బెంగళూరు మొత్తం నేరగాళ్ల నియంత్రణలో ఉంది. హింసాత్మక శక్తులు చెలరేగిపోతున్నాయి. వీటితో సామాన్య ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు' అని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో అనేక మంది బీజేపీ, దాని అనుబంధ సంస్థల కార్యకర్తల్ని హత్య చేశారని మోదీ ఆరోపించారు. 'సమాజాన్ని, సంస్కృతిని, రాజకీయాల్ని కాంగ్రెస్ నాశనం చేసింది. కాంగ్రెస్ నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయాలని ప్రజలు నిర్ణయించుకోవడం నేను చూస్తున్నాను. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వ పాలన ఎంతో దూరంలో లేదు' అని మోదీ అన్నారు.

'టాప్' ప్రయారిటీ

దేశంలో కూరగాయలు, పళ్లను పండించే వారికి 'టాప్' ప్రయారిటీ(ప్రాధాన్యం) ఇస్తామని మోదీ పేర్కొన్నారు. 'టాప్(టీవోపీ) అంటే టమోటా, ఆనియన్(ఉల్లి), పొటాటో(బంగాళదుంప) అని అర్థం. అందుకే 'టాప్' అని పిలుస్తున్నాను' అని మోదీ చెప్పారు.

ప్రతి వ్యక్తి విమానంలో తిరగాలన్నదే నా కల

ట్రిపుల్ తలాక్ బిల్లును అడ్డుకోవాలని కాంగ్రెస్ యత్నిస్తోందని, ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు కూడా ఆ పార్టీ వ్యతిరేకంగా ఉందని మోదీ ఆరోపించారు. 'ఈ ఏడాది దేశవ్యాప్తంగా 9 వేల కి.మీ. మేర జాతీయ రహదారుల్ని నిర్మించాలని, భారత్‌మాలాలో 35 వేల కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. హవాయి చెప్పులు వేసుకునే వారు కూడా విమానంలో తిరగాలనేదే నా కల. కర్ణాటకకు చెందిన రాహుల్ ద్రవిడ్ శిక్షణలోని అండర్ 19 క్రికెట్ భారత జట్టు ప్రపంచకప్ గెలుచుకుంది. ఈ విజయంలో ద్రవిడ్ పాత్ర ఎంతో ఉంది' అన్నారు. బెంగళూరులో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు బడ్జెట్‌లో బెంగళూరు సబర్బన్ రైల్వే ప్రాజెక్టు కోసం రూ.17 వేల కోట్లు కేటాయించామన్నారు.



తనకు బహూకరించిన జ్ఞాపికతో ప్రధాని మోదీ

కశ్మీర్‌లో పాక్ దురాగతం

- కాల్పుల్లో ఓ అధికారి, ముగ్గురు జవాన్ల మృతి
- ఆటోమేటిక్ ఆయుధాలు, మోర్టార్లతో దాడి

జమ్మూ: నియంత్రణ రేఖ వద్ద పాకిస్తాన్ సైన్యం మరోసారి దురాగతానికి తెగబడింది. ఎలాంటి కవ్వింపు చర్యలూ లేకపోయినప్పటికీ భారత సైనికులపైకి విచక్షణా రహితంగా కాల్పులు జరిపి నలుగురిని బలిగొంది. కాల్పుల్లో మరో ముగ్గురు గాయపడ్డారు. చనిపోయిన వారిలో ఒకరు ఆర్మీ లెఫ్టినెంట్ అధికారి కాగా, మిగిలిన ముగ్గురు జవాన్లు. జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్, రాజౌరీ జిల్లాల్లో పాక్ సైనికులు ఆదివారం కాల్పులు విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఆటోమేటిక్ తుపాకులు, మోర్టార్లతో పౌర ప్రాంతాలపైనా దాడి చేశారు. కొన్ని ఇళ్లు ధ్వంసమయ్యాయి. తొలుత ఉదయం 11.10 గంటల ప్రాంతంలో పూంచ్‌లోని షాపూర్ సెక్టార్‌లో పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మైనర్లు, ఓ ఆర్మీ జవాన్ గాయపడ్డారు. భారత సిబ్బంది తమ తుపాకులతో పాక్‌కు దీటైన సమాధానమిచ్చారని ఓ అధికారి చెప్పారు. రాజౌరీ జిల్లాలోని మధ్యాహ్నం 3.40 గంటలకు భీంభేర్ గలీ సెక్టార్‌లోనూ పాక్ సైనికులు మోర్టార్లతో విరుచుకుపడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు అక్కడికక్కడే మరణించగా, మరో అధికారి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం తరలిస్తుండగా ఆయనా మృత్యువాత పడ్డారు. రాజౌరీలోనూ పాక్ కాల్పులకు భారత జవాన్లు దీటుగా సమాధానమిచ్చారు.

ఆరు రోజుల్లో పుట్టినరోజు ఉందనగా...

చనిపోయిన వారిలో వయసురీత్యా అందరికన్నా చిన్నవాడే ఆ అధికారి. హరియాణకు చెందిన కపిల్ కుందు (22) ఆర్మీలో లెఫ్టినెంట్‌గా విధులు నిర్వర్తించేవారు. మరో ఆరు రోజుల్లో ఆయన జన్మదిన వేడుకలు జరుపుకోవాల్సి ఉంది. ఇంతలోనే పాక్ కాల్పులకు కుందు బలయ్యారు. చనిపోయిన జవాన్లలో కశ్మీర్‌కు చెందిన రోషన్ లాల్ (42), శుభం సింగ్ (23)తోపాటు మధ్య ప్రదేశ్‌కు చెందిన రామావతార్ (27) ఉన్నారు. మరోవైపు నియంత్రణ రేఖకు ఐదు కి.మీ. దూరంలో ఉన్న అన్ని పాఠశాలలనూ మూడురోజులపాటు మూసివేస్తున్నట్లు రాజౌరీ ఉప కమిషనర్ చెప్పారు.



కుటుంబ సభ్యులతో కపిల్ కుందు

27 ఏళ్లకు బోఫోర్స్‌పై

పీఏసీ నివేదిక!

బడ్జెట్ సమావేశాల్లోనే రూపొందొచ్చంటున్న సభ్యులు

న్యూఢిల్లీ: బోఫోర్స్ శతఘ్నుల కొనుగోలు ఒప్పందాన్ని 27 ఏళ్లుగా పరిశీలిస్తున్న ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ)కి చెందిన ఓ ఉప సంఘం.. ఎట్టకేలకు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల సమయంలోనే తన నివేదికకు తుదిరూపునిచ్చే అవకాశం కనిపిస్తోంది. బోఫోర్స్ ఒప్పందంపై కాగ్ 1989–90లో ఇచ్చిన నివేదిక అప్పటి నుంచి ఆరుగురు సభ్యుల పీఏసీ ఉప సంఘం వద్ద పెండింగ్‌లోనే ఉంది. కాగ్ తన నివేదికను పార్లమెంటుకు సమర్పించాక, దానిని పరిశీలించడమే పీఏసీ ప్రధాన విధి. బీజేడీకి చెందిన భర్తృహరి మహతబ్ ఈ రక్షణ వ్యవహారాల ఉప సంఘానికి ప్రస్తుతం నేతృత్వం వహిస్తున్నారు. ఒప్పందం గురించి సమగ్ర వివరాలను సంబంధిత మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు ఇవ్వకపోవడం వల్లనే ఈ అంశం 27 ఏళ్లు ఆలస్యమైందని ఉపసంఘంలోని ఓ సభ్యుడు తెలిపారు. తమ నివేదిక సమగ్రంగా, ఒప్పందం గురించి ఉన్న అపోహలను తొలగించేలా ఉంటుందన్నారు. ఉప సంఘం ఈ నివేదికను రూపొందించిన తర్వాత దాన్ని పీఏసీ ప్రధాన కమిటీకి పంపుతారు. కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున ఖర్గే ప్రధాన కమిటీకి నేతృత్వం వహిస్తున్నారు.

మోదీ కేర్‌కు లక్ష కోట్లు కావాలి

- పరిశోధనా పత్రంలో 'ఎన్ఐపీఎఫ్‌పీ' ప్రొఫెసర్ అంచనా
- రాష్ట్రాల్లో ఆరోగ్య పథకాల అమలుకు ఇబ్బందులు రావచ్చు



న్యూఢిల్లీ: కేంద్రం బడ్జెట్‌లో భారీ స్థాయిలో ప్రకటించిన జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం(మోదీ కేర్) అమలుకు ఏడాదికి రూ. లక్ష కోట్లు అవసరమవుతాయని ఒక అధ్యయనంలో తేలింది. బీమా మొత్తంలోని 2 శాతాన్ని ప్రీమియంగా వసూలు చేసినా.. పథకం అమలుకు ఏడాదికి రూ. లక్ష కోట్లు అవసరమని అధ్యయనం తేల్చింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ(ఎన్ఐపీఎఫ్‌పీ)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మితా చౌదురీ రూపొందించిన ఈ పత్రంలో.. 'మోదీ కేర్ పథకం వల్ల రాష్ట్రాలు తమ సొంత ఆరోగ్య పథకాల్ని అమలు చేసుకునే స్వేచ్ఛ తగ్గవచ్చు' అని ఆందోళన వెలిబుచ్చారు. 'మోదీ కేర్' అమలుకు ఏడాదికి రూ. 10 నుంచి 12 వేల కోట్లు సరిపోతాయని నీతి ఆయోగ్ సలహాదారు అలోక్ కుమార్ విశ్లేషించిన నేపథ్యంలో పరిశోధన పత్రంలోని అంశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. '60 శాతం నిధుల్ని కేంద్రం, మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయని నిర్ణయించారు. ఈ లెక్కన కేంద్ర ప్రభుత్వం అదనంగా రూ. 60 వేలకోట్లు సమకూర్చాలి' అని పరిశోధన పత్రంలో తెలిపారు. మోదీ కేర్‌పై విమర్శల్ని నీతి ఆయోగ్ వైస్‌చైర్మన్ రాజీవ్ కుమార్ తోసిపుచ్చారు. అదనంగా వసూలు చేసే 1% సెస్ నిధులు ఈ పథకం అమలుకు సరిపోతాయన్నారు.

సంక్షేమ పథకాలే ప్రచారాస్త్రాలు

అసెంబ్లీ ఎన్నికలపై కమలనాథుల దృష్టి

న్యూఢిల్లీ: ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన జాతీయ ఆరోగ్య బీమా, ఉచిత ఎల్పీజీ సిలిండర్, రైతుల పంటకు కనీసమద్దతు ధరను 150 శాతం పెంచడంలాంటి సంక్షేమ పథకాలు ఈ ఏడాది జరగనున్న పలు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ప్రధాన అస్త్రాలుగా మారతాయని కమలనాథులు భావిస్తున్నారు. రైతులు, సంక్షేమ పథకాలకు పెద్ద ఎత్తున నిధుల కేటాయింపుతో రాబోయే ఎన్నికల్లో పార్టీ లబ్ధి పొందుతుందని విశ్వసిస్తున్నారు. ఇందుకనుగుణంగానే బడ్జెట్‌లో రైతులు, పేదల కోసం కేంద్రం తెచ్చిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ అధినాయకత్వం పార్టీ శ్రేణుల్ని ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ పట్టుకోల్పోయిందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శల్ని తిప్పికొట్టవచ్చని వెల్లడించాయి. ఈ నెల 18న త్రిపురలో, ఆ తర్వాత వరుసగా కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. అన్నింటికంటే ముఖ్యంగా కర్ణాటకలో గెలవడం ద్వారా బీజేపీ గ్రామీణ ప్రాంతాల్లో బలహీనపడిందన్న కాంగ్రెస్ వాదనకు చెక్ పెట్టవచ్చని అగ్రనాయకత్వం భావిస్తున్నట్లు బీజేపీ శ్రేణులు తెలిపాయి.



అమెరికాలో జనగణనపై జగడం

సెన్సస్‌లో పౌరసత్వ ప్రశ్నలు!

- అల్పసంఖ్యాక వర్గాలు దూరంగా ఉండే అవకాశం
- ప్రతినిధుల సభలో సీట్లు, నిధుల పంపకంపై ప్రభావం

వాషింగ్టన్

అమెరికాలో 2020లో చేపట్టనున్న తదుపరి జనాభా లెక్కలపై అప్పుడే వివాదం రేగింది. జనాభా లెక్కల సందర్భంగా అధికారులు.. పౌరసత్వానికి సంబంధించి ప్రశ్నించవచ్చని వస్తున్న వార్తలు వివాదాస్పదమవుతున్నాయి. ఈ ప్రశ్న వల్ల మైనారిటీలు సెన్సస్‌లో పాలుపంచుకోకపోవచ్చని, దీని వల్ల జనాభా గణాంకాల ప్రామాణికత తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెపుతున్నారు. సెప్టెంబర్‌లో జరిగిన తాజా సర్వేల్లో పాల్గొన్న ప్రజలు ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం గురించి తీవ్ర ఆందోళన చెందుతున్నట్టు వ్యక్తమైందని ఎన్ఏఎల్ఈఓ ఎడ్యుకేషనల్ ఫండ్ హెడ్ ఆర్టురో వర్గాస్ పేర్కొన్నారు. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారాన్ని చేపట్టిన తర్వాత వలసలను, విదేశీయులను.. ఉగ్రవాదం, నేరాలు, ఉద్యోగాలు కోల్పోవడానికి సంబంధం కల్పిస్తూ యాంటీ ఇమిగ్రేషన్ ఎజెండాను చేపట్టారు. గత నెలలో ట్రంప్ స్టేట్ ఆఫ్ యూనియన్ ప్రసంగంలో కూడా లీగల్ ఇమిగ్రేషన్‌ను తగ్గిస్తామని ప్రతిజ్ఞ చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వలసదారులను, వారి కుటుంబాల నుంచి వేరు చేసి స్వదేశం పంపేస్తున్నారనే వార్తలు కలకలం రేపుతున్నాయి. దీంతో సెన్సస్ సమాచారాన్ని తమకు వ్యతిరేకంగా అధికారులు వినియోగించే అవకాశం ఉందనే ఆందోళనతో జనాభాలో ఎక్కువ శాతం మంది జన గణనలో పాల్గొనేందుకు ఆసక్తి చూపకపోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. డిసెంబర్‌లో జాతీయతకు సంబంధించిన ప్రశ్నను కూడా సర్వేలో చేర్చాలని న్యాయ శాఖ సెన్సస్ బ్యూరోకు సూచించడం వివాదం రేపింది. అయితే ఓటింగ్ హక్కుల చట్టాన్ని పరిరక్షించేందుకు పౌరుల సమాచారం ఉపయోగపడుతుందని న్యాయ శాఖ వాదించింది. కాగా, ప్రశ్నావళిపై తాము కసరత్తు చేస్తున్నామని, ప్రశ్నావళి తుది జాబితాను మార్చి 31 నాటికి కాంగ్రెస్‌కు సమర్పిస్తామని సెన్సస్ ప్రోగ్రామ్ డైరెక్టర్ అల్ ఫాంటెనాట్ స్పష్టం చేశారు.

32.7 కోట్లకు..!

అమెరికా రాజ్యాంగం ప్రకారం.. ప్రతినిధుల సభలో ప్రతి రాష్ట్రానికి ఎన్ని సీట్లు కేటాయిస్తారనేది సెన్సస్ లెక్కలపైనే ఆధారపడి ఉంటుంది. అలాగే స్కూళ్లు, ఆస్పత్రులు, ప్రజాసేవకు సంబంధించి నిధుల పంపకానికి కూడా జనాభా లెక్కలే కీలకం. సెన్సస్‌కు కొన్ని వర్గాలు దూరంగా ఉండటం పాత సమస్యే. 2010 జనాభా లెక్కల్లో లాటినోస్ సంఖ్యను 7,75,000 తక్కువగా లెక్కించినట్టు అంచనా. అయితే ఈసారి ఈ సమస్య మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. 2010 గణనలో 30.88 కోట్ల అమెరికన్లు ఉన్నట్టు తేలగా, ప్రస్తుతం ఈ సంఖ్య 5.8% పెరుగుదలతో 32.7 కోట్లకు చేరుతుందని అంచనా.



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వేదికపై ఆర్యవైశ్య సంఘం నేతలు ఎమ్మెల్సీ వీరభద్రస్వామి, వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, నెల్లూరు డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, గుబ్బా చంద్రశేఖర్. చిత్రంలో ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తదితరులు

ఆర్య వైశ్యులకు అండగా ఉంటాం

▶ మొదటి పేజీ తరువాయి

భాగంగా 79వ రోజు ఆదివారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలోని దేవరపాళెంలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. తెలుగు రాష్ట్ర ఏర్పాటు కోసం ఆత్మబలిదానం చేసిన పొట్టి శ్రీరాములును పాలకులు నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మనందరి ప్రభుత్వంలో ఆయన్ను ఘనంగా గౌరవిస్తామని భరోసా ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పన్నుల పేరుతో దాడులు జరుగుతున్నాయని, అవమానాలు ఎదురవుతున్నాయని ఆర్యవైశ్యులు ఈ సందర్భంగా జగన్ దృష్టికి తెచ్చారు. వారి ఆవేదన విన్న జననేత సానుకూలంగా స్పందిస్తూ ఏమన్నారంటే..

పొట్టి శ్రీరాములుకు ప్రత్యేక గుర్తింపు

''ఆర్యవైశ్యులకు గొప్ప చారిత్రక, రాజకీయ నేపథ్యం ఉంది. ఇదే సామాజిక వర్గం నుంచి వచ్చిన గాంధీజీ ఈ దేశానికే స్ఫూర్తిదాయకం. దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం మరువలేనిది. ఇదే జిల్లాకు చెందిన పొట్టి శ్రీరాములు గురించి ఎంత చెప్పినా తక్కువే. తెలుగోళ్లంతా ఒక రాష్ట్రంగా ఏర్పడేందుకు ఉద్యమించి, దేశాన్నే కదిలించారు. ప్రాణాలను కూడా అర్పించిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు. అయితే... అలాంటి గొప్ప త్యాగం చేసిన వ్యక్తిని రాష్ట్రావతరణ రోజే పట్టించుకోకపోవడం బాధేస్తోంది. కనీసం ఆయన్ను తలుచుకునే పరిస్థితుల్లో కూడా రాష్ట్ర పెద్దలు లేకపోవడం విచారకరం. అందుకే రేపు మన ప్రభుత్వం వచ్చాక నవంబర్ ఒకటో తేదీన పొట్టి శ్రీరాములు గౌరవార్థం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుతాం.

అన్ని కులాల్లోనూ పేదరికం

మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్య వైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా చెప్పాను. ఇచ్చిన ఆ మాటకు కట్టుబడి ఉన్నాం. కచ్చితంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆర్యవైశ్యులకు అండగా నిలబడతాం. జీఎస్టీ దాడులు విపరీతంగా జరుగుతున్నాయని ఆర్యవైశ్యులు నాకు చెప్పారు. ఆర్యవైశ్యులను అవమానించడం, అనుమానించడం మొదలు పెడితే దేశం ముందడుగు వేయదు. ఇది పాలించే వాళ్లకు అర్థం కావాలి. టర్నోవర్ ఎంత ఉంటుందని ఆలోచన చేసి చెప్పమనాలి. వాళ్లు చెప్పింది నమ్మాలి. కానీ వాళ్లు చెప్పింది నమ్మకుండా వాళ్లపై దాడులు చేస్తూ, వేధిస్తుంటే.. అసలు మనం మనదేశంలోనే ఉన్నామా? అన్న అనుమానం కలుగుతోంది. నాన్నగారి హయాంలో ఆర్యవైశ్యులకు మంచి జరిగింది. ఏ విధమైన ఇబ్బందులు, దాడులు ఉండేవి కావు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాకే దాడులు మొదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఈ దాడులు జరుగుతుండటం బాధాకరం. నాన్నగారిచ్చిన జీవో వల్లే వాసవీ మాతా దేవాలయాలను నడుపుకునే స్వేచ్ఛ వచ్చిందని ఆర్యవైశ్యులు చెప్పారు. సత్రాలు కూడా నడుపుకునే స్వేచ్ఛ ఇస్తూ జీవో ఇచ్చినా, కొన్ని కారణాల వల్ల అమలు కాలేదని.. ఇప్పుడవన్నీ మూతపడే పరిస్థితుల్లో ఉన్నాయని తెలిపారు. సత్రాలను ఆర్యవైశ్యులకు అప్పగించి నడిపిస్తే పేదలకు మేలు జరుగుతుందని వారు చెబుతున్న మాటలకు పూర్తి మద్దతు ఇస్తున్నా. ఇలాంటి మంచి పనులకు ముందుంటానని భరోసా ఇస్తున్నా. ఆర్యవైశ్యుల్లోనూ పేదరికం ఉంది. ఇలా పేదరికంలో ఉన్న వాళ్ల కోసమే నవరత్నాలు ప్రకటించాం. ప్రతీ ఒక్క పేదకూ ఇవి వర్తించేలా రూపొందించాం' అని వైఎస్ జగన్ అన్నారు. కాగా ఈ సమ్మేళనం ప్రారంభంలో వేద పండితులు వైఎస్ జగన్‌ను ఆశీర్వదించారు.



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో జగన్‌ను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

వైఎస్సార్ పాలన రావాలంటే జగన్‌ను గెలిపించుకోవాలి



రాష్ట్రంలో వైఎస్సార్ పాలనలో ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా ఉండేవారు. తిరిగి అలాంటి కాలం రావాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి. టీడీపీ పాలనలో పొట్టి శ్రీరాములు విగ్రహాలు, వైఎస్సార్ విగ్రహాలను తొలగిస్తున్నారు. ఆర్యవైశ్యులంతా ఏకతాటిపై నిలిచి జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేయాలి. దేశ పునర్నిర్మాణంలో ఆర్యవైశ్యులు ఎంతో కీలక పాత్ర పోషించారు.

– వెలంపల్లి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ విజయవాడ నగరాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే

ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలి




ఆర్యవైశ్యులు వ్యాపారానికే పరిమితం కాకుండా రాజకీయాల్లో కూడా సామర్థ్యాన్ని నిరూపించుకోవాలి. నంద్యాల ఉప ఎన్నిక సమయంలో ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకి రాగానే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆర్యవైశ్యులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడతారు. 2014లో ఎమ్మెల్యేగా ఓడిపోయిన నన్ను ఎమ్మెల్సీ చేశారు. ఆర్యవైశ్యులపై జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రత్యేక అభిమానం దీని ద్వారా అర్థమవుతోంది.

– కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ

79వ రోజు

04-02-2018, ఆదివారం
దేవరపాళెం,
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా



ఒక్క ఉద్యోగమైనా ఇవ్వకపోగా.. ఉన్న ఉద్యోగాలను తీసేయడం న్యాయమేనా?

మనం చేసే మంచి పనులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.. ఈ రోజు ములుమూడిలో పద్మావతి అనే అక్క కలిసింది. ఆమె నన్ను ఏమీ కోరడానికి రాలేదు.. ఏ సమస్యా చెప్పుకోలేదు. నన్ను కలిసి కృతజ్ఞతలు తెలియజేసింది. పేద కుటుంబానికి చెందిన ఆమె ఒక్కగానొక్క కొడుక్కి గుండె జబ్బు ఉండేదట. అది తెలిసి దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయారట. ఆ సమయంలో నాన్నగారి చలవతో ఆ బిడ్డకు ఉచితంగా గుండె ఆపరేషన్ జరిగిందట. ఇప్పుడా పిల్లాడు చక్కగా చదువుకుంటున్నాడని తల్లి సంతోషంతో కృతజ్ఞతలు తెలిపింది. ఈ రోజు కోట్లాది మంది ప్రజలు నాన్నగారిని తమ గుండెల్లో పెట్టుకున్నారంటే.. పేదల సంక్షేమం పట్ల ఆయన పడ్డ ఆరాటం, వారి కోసం ఆయన అమలు చేసిన పథకాలే కారణం.

'జాబు రావాలంటే.. బాబు రావాలి' అన్నది ఎంత బూటకమో తెలియజేసే మరో ఘటనే.. ఈ రోజు నన్ను కలిసిన ఫార్మా డీ డాక్టర్ల ఉదంతం. 2008లో కేంద్ర ప్రభుత్వం ఆరు సంవత్సరాల ఫార్మా డీ కోర్సులను ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 70 కళాశాలలకు అనుమతిచ్చారు. 2014 నుంచి ఇప్పటి వరకు మూడు బ్యాచ్‌లు బయటికొచ్చాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశాల ప్రకారం.. ప్రతి 50 పడకలకు ఒక క్లినికల్ ఫార్మసిస్ట్ (ఫార్మా డీ) కోర్సు చేసిన వారుండాలన్నది నిబంధన. కాగా, ఇప్పటి వరకు రాష్ట్రంలో ఆ పోస్టులనే సృష్టించలేదు. దీంతో దాదాపు 3000 మంది ఫార్మా డీ అభ్యర్థులు నిరుద్యోగులుగా ఉన్నారట. ఇటీవలే ఆ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు 12 రోజుల పాటు నిరవధిక నిరాహార దీక్ష కూడా చేపట్టారట. అయినా ఈ ప్రభుత్వం స్పందించడం లేదని అభ్యర్థులు వాపోతున్నారు. తక్షణమే తమకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతున్నారు. లేకుంటే.. దాదాపు రూ.10 లక్షలు ఖర్చుచేసి పూర్తిచేసిన తమ చదువు నిరర్థకమవుతుందని ఆవేదన చెందారు.

'బాబు వస్తే జాబు రావడం కాదు.. ఉన్న జాబులు ఊడుతున్నాయ్ అనేందుకు మేమే నిదర్శనం' అన్నారు.. నన్ను కలిసిన విక్రమ సింహపురి అధ్యాపకులు. ఈ యూనివర్సిటీ ప్రారంభం నుంచి తాము పనిచేస్తున్నామని, ఈ ప్రభుత్వం వచ్చాక నిబంధనలకు విరుద్ధంగా 26 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారని చెప్పారు. ఈ అన్యాయంపై హైకోర్టును ఆశ్రయించగా.. మమ్మల్ని కొనసాగించాలని ఆదేశాలిచ్చిందని, ఆ ఆదేశాలను సైతం అధికారులు బేఖాతరు చేస్తున్నారని వాపోయారు. విధిలేని పరిస్థితుల్లో కోర్టు ధిక్కార కేసు దాఖలు చేయాల్సి వచ్చిందని తెలిపారు. 'జాబు ఉండాలంటే.. బాబు పోవాలనే పరిస్థితి వచ్చింది' అని చెప్పారు. నాన్నగారి హయాంలో ఉద్యోగంలో చేరిన వారిని కావాలనే వేధిస్తున్నారట. వాళ్లు చేసిన తప్పేంటి? ఎందుకు పగబట్టినట్లు వ్యవహరిస్తున్నారు?

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. రాష్ట్ర విభజన సమయంలో 1,42,000 ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు ఉన్నట్లు ధ్రువీకరణ జరిగింది. వీటిలో ఒక్క ఖాళీ అయినా భర్తీ చేశారా? ఒక్క ఉద్యోగాన్ని కూడా ఇవ్వకపోగా.. ఉన్న ఉద్యోగాలను సైతం పీకేస్తుండటం న్యాయమేనా?

వైఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర | మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో



యశస్విని: మీరు అధికారంలోకి వచ్చాక పదో తరగతి వరకూ ఉచిత విద్య కల్పిస్తారా?

జగన్: మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచితంగా చదివించడమే కాదు.. ఎంత ఖర్చు అయినా భరించి ఇంజినీర్లు, డాక్టర్లను చేస్తాం. చిన్న పిల్లలను బడికి పంపిన ప్రతి తల్లికీ ఏటా రూ.15 వేలు డబ్బు కూడా ఇస్తాం.



జ్యోతి: గుమాస్తా పనిచేస్తే రూ.10 వేలు మాత్రమే ఆదాయం వస్తోంది. నెలకు రూ.4 వేలు అద్దె కట్టాల్సి వస్తోంది. మాకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోండి. మీకు రుణ పడి ఉంటాం.

జగన్: చంద్రబాబు హయాంలో పట్టణాల్లో ఇళ్లు కట్టిస్తామని చెప్పి మొదలు పెట్టిన పథకం పూర్తిగా అవినీతి మయమైంది. 300 అడుగుల ఇళ్లట. కట్టడానికి అడుగుకు రూ.2 వేలట. ఏ బిల్డరైనా అడుగు వెయ్యి రూపాయలకే కడుతున్నారు. చంద్రబాబు తనకు కావాల్సిన బిల్డర్లను తెచ్చుకుని, వారికే పనులిస్తున్నాడు. పేదల నుంచి అడుగుకు రూ.2 వేలు వసూలు చేస్తున్నాడు. అంటే పేదవాడికి ఒక్కో ఫ్లాట్ రూ.6 లక్షలకు అమ్ముతాడు. ఇందులో లక్షన్నర రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం మరో లక్షన్నర ఇస్తుందట. ఇక మిగిలిన రూ.3 లక్షలు పేదవాడి తరపున అప్పుగా రాసుకుంటారట. ఆ పేదవాడు నెలకు రూ.3 వేల చొప్పున 20 ఏళ్లు కడుతూ పోవాలట. లంచాలు తీసుకునేది చంద్రబాబు.. అప్పు కట్టాల్సింది పేదవాడు. మన ప్రభుత్వం రాగానే దీన్ని పూర్తిగా మారుస్తాం. రూపాయి కూడా అప్పులేకుండా పేదలకు ఇళ్లు కట్టిస్తాం. మహిళల పేరునే రిజిస్ట్రేషన్ చేయిస్తాం. ఆ ఇంటిపై బ్యాంకుల్లో పావలా వడ్డీకే రుణం పొందేలా చేస్తాం.



సునీల్: రుణ మాఫీ కాలేదన్నా.. రూ.3.5 లక్షలకు గాను కేవలం రూ.6,800 మాత్రమే మాఫీ చేశారు. మేమేం చేయలేమని బ్యాంకు వాళ్లన్నారు. మీ ప్రభుత్వంలో మేలు జరుగుతుందని ఆశిస్తున్నాం.

జగన్: వ్యవసాయ రుణాలు రూ.87,612 కోట్లు మాఫీ చేస్తామని చంద్రబాబు ఎన్నికలకు ముందు చెప్పాడు. తీరా ఆయన మాఫీ కింద ఇచ్చిన సొమ్ము.. అప్పులకు అయిన వడ్డీలకు కూడా సరిపోవడం లేదు. మన ప్రభుత్వంలో రైతులకు వడ్డీ లేకుండా రుణాలు ఇప్పిస్తాం. ప్రతీ రైతుకు మే నెలలో రూ.12,500 పెట్టుబడి ఖర్చుల కోసం ఇస్తాం. తొమ్మిది గంటల పాటు రైతులకు పగటిపూటే ఉచిత విద్యుత్ ఇస్తాం. ఉచితంగా రైతులకు బోర్లు వేయిస్తాం. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ప్రతి రైతన్న ముఖంలో చిరునవ్వు తెస్తాం. ఇవన్నీ నవరత్నాల్లో పెట్టాం. చంద్రబాబు మాదిరి అబద్ధాలు చెప్పను.



దీప్తి లక్ష్మి: మీరు గెలిస్తే ప్రత్యేక హోదా తెస్తారా?

జగన్: పార్లమెంట్‌నే సాక్షిగా చేస్తూ ప్రత్యేక హోదా ఇస్తామని రాష్ట్ర విభజన సందర్భంగా చెప్పారు. హోదా ఇస్తే.. రాష్ట్రంలో ఎవరైనా పరిశ్రమ, హోటల్, హాస్పిటల్ పెట్టడానికి ముందుకొస్తే వాళ్ల ఆదాయపు పన్ను, జీఎస్టీ కట్టాల్సిన అవసరం ఉండదు. ఈ హక్కును అడగడం మానేస్తే ఇచ్చేవాళ్లే ఉండరు. చంద్రబాబు అడగడం మానేశాడు. దాన్ని అమ్మేశాడు. మనం దీన్ని మరిచిపోం. ఈ రోజు కాకపోయినా, రేపైనా సాధించేందుకు అడుగులేస్తాం. సుదీర్ఘ పోరాటం ద్వారానే తెలంగాణ సాధించుకున్నారు. హోదా కోసం చిత్తశుద్ధితో పోరాడుతాం.



పద్మప్రియ: ఇప్పుడు రూ.500 కరెంట్ బిల్లు వస్తే పెన్షన్ ఇవ్వడం లేదు. దీన్ని మారుస్తారా?

జగన్: చంద్రబాబు ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలకు కూడా ఐదారొందలు బిల్లులేస్తున్నారు. అసలు పేదవాడు అనే దానికి ప్రామాణికమే లేకుండా పోయింది. జన్మభూమి కమిటీలను తెచ్చాడు. ఆయనకు నచ్చినవాళ్లకే పెన్షన్లు ఇస్తున్నాడు. ఈ పరిస్థితులన్నీ మారుస్తాం. ప్రతి పేదవాడికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పెన్షన్‌లు ఇస్తాం. గ్రామాల్లోనే సెక్రటేరియట్ పెట్టి 72 గంటల్లోనే సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం.

లక్ష్మి: పార్టీ ఫిరాయింపు చేసే వాళ్లనేం చేయాలి?

జగన్: చట్టాలను, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ముఖ్యమంత్రే తూట్లు పొడుస్తుంటే.. ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా అని తలదించుకునే స్థాయికి చంద్రబాబు రాష్ట్రాన్ని తీసుకెళ్లాడు. మీరు మాట్లాడే మాటలతోనైనా ఆయనకు బుద్ధొస్తే వ్యవస్థ బాగుపడుతుంది. లేకపోతే అధికారంలో ఉన్నవాడు ఏం చేసినా చట్టాలు వర్తించవు, రాజ్యాంగం వర్తించదు. లంచం తీసుకుంటే ఏ ప్రభుత్వ ఉద్యోగినైనా తొలగిస్తారు. జైల్లో పెడతారు. ఒక ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి నల్లధనం ఇస్తూ, ఆడియో వీడియో టేపులతో అడ్డంగా దొరికిపోతే కూడా ఈ మనిషి రాజీనామా చేయడు. ఎవరూ జైల్లో పెట్టరు. అంతటి దారుణమైన పరిస్థితి రాష్ట్రంలో ఉంది.

యా అల్లాహ్.. జగన్‌కో కామ్‌యాబ్ కరో..

జగన్‌కు మద్దతుగా ముస్లింల ప్రార్థన.. ఊరూరా ఘన స్వాగతం

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'యా అల్లాహ్.. జగన్‌కో కామ్‌యాబ్ కరో.. జగన్‌కో సీఎం బన్‌నే కా మౌకాదో.. యా అల్లాహ్ ఉన్‌కో గరీబోంకా మదద్ కర్‌నేకా మౌకాదో..' (దేవుడా జగన్‌కు ఆశయ సిద్ధి కలిగేలా చేయి.. ఆయనకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఇవ్వు.. తద్వారా పేద బడుగు వర్గాలకు సాయం చేసే అవకాశాన్ని జగన్‌కు కల్పించు) అంటూ ములుమూడి గ్రామ ముస్లింలు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం పెద్ద ఎత్తున దువా (ప్రార్థన) చేశారు. ప్రజా సంకల్ప యాత్ర 79వ రోజు ఆదివారం నెల్లూరు రూరల్ మండలంలోని ములుమూడికి వచ్చినప్పుడు వైఎస్ జగన్‌ను ఘనంగా ఆహ్వానించి ఆయన వెంట నడిచారు. పాదయాత్ర 'మస్జీద్ ఏ ఉమ్రా' వద్దకు వచ్చినపుడు ఆ మసీదు పేష్ ఇమాం అయిన ఖాదర్ బాష నేతృత్వంలో ఊరి ముస్లింలు అక్కడ గుమికూడి సంఘీభావం తెలిపారు.

జననేతను కలిసిన ఎంఆర్‌పీఎస్ నేతలు

ప్రజా సంకల్పయాత్రలో భాగంగా నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాళెం వద్ద ఆదివారం ఎంఆర్‌పీఎస్ నేతలు జననేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎంఆర్‌పీఎస్ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మందా పెంచలయ్య, జిల్లా నేతలు వెంకటేశ్వర్లు, బుల్లా డేవిడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 45 లక్షల మంది మాదిగలు ఎస్సీ వర్గీకరణ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. ఈ విషయంపై జగన్ స్పందిస్తూ.. ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉందని, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదని చెప్పారు. కాగా, జగన్ పాదయాత్ర సౌత్ మోపూరు నుంచి ప్రారంభం కాగానే జనం పోటెత్తారు. మేళతాళాలతో ఎదురేగారు. వివిధ వర్గాల ప్రజలు జననేతకు సమస్యలు వివరించారు. పాదయాత్రలో ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో సహా పలువురు నేతలు పాల్గొన్నారు.



ములుమూడి మసీదు వద్ద దువా చేస్తున్న ముస్లింలు

ప్రజాసంకల్ప యాత్ర 79వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
1,066.4 కిలో మీటర్లు

79వ రోజు నడిచిన దూరం
12.6 కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 8.00 గంటలకు
నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు

ముగింపు: సా. 5 గంటలకు
నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెం

ముఖ్యాంశాలు

- సౌత్‌మోపూరు గిరిజన కాలని, స్పందన క్రాస్, కొమ్మరపూడి క్రాస్‌లో ప్రజలతో మమేకం.
- ములుమూడిలో పార్టీ జెండా ఆవిష్కరణ.
- దేవరపాళెంలో ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమ్మేళనం

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 8 గంటలకు
నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెం

ముఖ్యాంశాలు: ● కొవ్వూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ, పెనుబల్లి, సాల్మాన్‌పురం, ఆత్మకూరు నియోజకవర్గం సంగం మండలం అన్నారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డులో ప్రజలతో మమేకం.
● బుచ్చిరెడ్డిపాళెంలో బహిరంగ సభ.





కొమ్మరపూడి క్రాస్ వద్ద దివ్యాంగుడి సమస్యను ఓపికగా వింటున్న ప్రతిపక్ష నేత జగన్





ములుమూడి, సౌత్‌మోపూరు గిరిజన కాలనీ వద్ద అవ్వలను ఆప్యాయంగా పలకరిస్తున్న జగన్

దేవరపాళెంలో జగన్‌తోపాటు పాదయాత్రలో నడుస్తున్న గ్రామస్తులు



దేవరపాళెం వద్ద జగన్‌తో కరచాలనం చేసేందుకు బస్సు కిటికీలోంచి పోటీ పడుతున్న అక్కచెల్లెమ్మలు





← స్పందన క్రాస్ వద్ద జగన్‌తో కలిసి నడుస్తున్న తెలంగాణలోని మెదక్ జిల్లాకు చెందిన దివ్యాంగుడు ధీరజ్

సాక్షి ఫ్యామిలీ

విజయవాడ
సోమవారం, 5-2-2018



● ఏడాది వయస్సులో వాకర్‌లో ఆడుకుంటున్న నవీన

ఆ పాపకు అమ్మ లేదు.
వారంత అమ్మ అయ్యారు.
నాన్న విడిచి పెట్టాడు.
అక్కడి సిబ్బందే నాన్న అయ్యారు.
అప్పుడే పుట్టిన బిడ్డకు పాలు ముఖ్యం.
వెచ్చని ఒడి ముఖ్యం.
దగ్గరకు తీసుకునే భద్రత అవసరం.
అవన్నీ వారే అయ్యారు.
సంవత్సరం పాటు కంటికి రెప్పలా
కాపాడిన వారి మనసులో ఉన్నది
స్వచ్ఛమైన పాల వంటి కరుణ.
కష్టాల కడలిలో ఉండాల్సిన పాపను
పాల కడలిపై ఉంచిన
గొప్ప మనసులు వారివి.

పాల మనసులు


ఆసుపత్రికి అంటే చాలా సందర్భాల్లో నిర్లక్ష్యానికీ, నిర్దాక్షిణ్యానికి మారుపేరు అనే ప్రచారం ఉంది. కాని ఆ ఆసుపత్రి గురించి వింటే ముఖ్యంగా అందులోని ఆ విభాగం గురించి తెలుసుకుంటే కరుణ ఇంకా మనిషిలో మిగిలే ఉందనీ మానవత్వం సజీవంగా ఉందని తెలుసుకుంటాం. నల్లగొండ ప్రభుత్వాసుపత్రిలోని 'స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్' (ఎస్.ఎన్.సి.యు) గత సంవత్సరంగా ఒక పాపాయిని తన యూనిట్‌లో కంటికి రెప్పలా కాపాడుతోంది. పెంచి పెద్ద చేస్తోంది. ఊపిరి పోసి, ఉయ్యాలలూపి నేడు ప్రభుత్వానికి అపురూపంగా అప్పజెప్పనుంది. ఇది మానవత్వానికి మెచ్చుతునక.



● కంగారు మదర్ కేర్ అందిస్తున్న అద్దెతల్లి సరిత



● పట్టుబట్టలను తొడిగి సంబరపడుతున్న సిబ్బంది



● నవీనతో డాక్టర్ యాదయ్య

ఆ తల్లి ఆ బిడ్డ...

ఏడాది క్రితం... నల్లగొండ జిల్లా చిట్యాల మండలానికి చెందిన అనురాధ కాన్పుకోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. 2017 ఫిబ్రవరి 2న కవలలకు జన్మనిచ్చింది. ఇద్దరు ఆడశిశువులు. కాని ప్రిమెచ్యూర్ డెలివరీ కావడంతో శిశువులు తక్కువ బరువుతో జన్మించారు. మరుసటిరోజు ఒక ఆడశిశువు మరణించగా, మూడవ రోజున తల్లి కూడా రక్తస్రావంతో చనిపోయింది. ప్రాణంతో ఉన్న శిశువును తండ్రి విడిచి పెట్టి వెళ్లిపోయాడు. 900 గ్రాముల బరువుతో అన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఉన్న ఆ చిన్నారిని వేరే ఎక్కడైనా అయితే ఎలా చూసేవారో. కాని ఆ చిన్నారికి మాత్రం ఎస్.ఎన్.సి.యునే అన్నీ అయ్యింది.

నవీనగా నామకరణం

పాప ఆరునెలల వయసుకు మూడు కిలోల బరువుకు చేరుకుంది. ఆరునెలల తరువాత ఆరోగ్యంగా ఉంటే ఆ చిన్నారిని శిశు గృహాలకు అప్పగించే అవకాశం ఉంటుంది. కానీ చిన్నారికి చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు ఉండటం ఒక కారణమైతే చిన్నారిపై పెంచుకున్న మరో కారణం కావడాన యూనిట్ నర్సులు, సిబ్బంది పాపను పంపించలేకపోయారు. అంతేకాదు చిన్నారికి నామకరణ మహోత్సవాన్ని నిర్వహించి నవీనగా నామకరణం చేశారు. డోలారోహణ కార్యక్రమాన్ని నిర్వహించి తొట్టెను ఏర్పాటు చేసి అందులో ఊపారు. అన్నప్రాసన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. చిన్నారి నవీనకు ప్రతి రోజూ ఒకరు చొప్పున ఆహారం, కోడిగుడ్డును తీసుకువచ్చి అందజేస్తున్నారు.

తల్లి కంటే మిన్నగా...

చిన్నారిని కాపాడుకోవడానికి రంగంలో దిగిన ఎస్.ఎన్.సి.యు సిబ్బంది పాపకు ఆధునిక వైద్యసేవలను అందించారు. 70 రోజులు కంటికి రెప్పలా కాపాడితే బరువు 1కిలో 200 గ్రాములకు వచ్చింది. చిన్నారికి డోనర్ ద్వారా సేకరించిన పాలు, ఫార్ములా ఫీడ్‌ను ఆహారంగా అందించారు. ఇక నెలలు నిండని, బరువు తక్కువ చిన్నారులకు 'కంగారూ మదర్ కేర్' (కేఎంసీ) పద్ధతిన ట్రీట్‌మెంట్‌ను అందించాలి. చిన్నారిని తల్లి ఎదపై బోర్లా పడుకోబెట్టుకుని వెచ్చదనాన్ని అందించే విధానాన్ని 'కంగారూ మదర్‌కేర్ ట్రీట్‌మెంట్' అంటారు. అయితే చిన్నారికి తల్లికాని, బంధువులుకాని లేకపోవడంతో అద్దెతల్లిని తీసుకున్నారు. చర్లపల్లికి చెందిన సరిత అనే మహిళ చిన్నారికి మూడు నెలల పాటు కేఎంసీ ట్రీట్‌మెంట్‌ను అందించి తన మానవత్వాన్ని చాటుకుంది. కేఎంసీకి అద్దెతల్లులను వినియోగించడం దేశ చరిత్రలోనే మొదటిదని యూనిట్ పేర్కొంటుంది.

ప్రస్తుతం నవీన వయసు ఏడాది

ప్రస్తుతం నవీనకు ఏడాది వయసు వచ్చింది. ఏడు కిలోల బరువుతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉంది. వాకర్‌లో యూనిట్ మొత్తం తిరుగుతుండటంతో సిబ్బంది ఆనందాలకు అవధులు లేకుండా ఉన్నాయి. దాంతోపాపను 'శిశుగృహ'కు అప్పగించడానికి ఏర్పాట్లు చేశారు. పాపతో అనుబంధం వల్ల ఇది కొంచెం బాధించే విషయమే అయినా పాప భవిష్యత్తు రీత్యా తప్పడం లేదని యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ దామెర యాదయ్య, వైద్యులు డాక్టర్ జిలాని, డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ అంబేడ్కర్, డాక్టర్ వసుంధర, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డితో పాటు నర్సింగ్ సిబ్బంది పేర్కొన్నారు.

- ఆవుల లక్ష్మయ్య,
సాక్షి ప్రతినిధి, నల్లగొండ టౌన్



హౌ స్వీట్!

ఫెమినిజం మగాళ్ల విషయం

ఇరవై అంటే పెద్ద వయసేం కాదు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యుసాఫ్జాయ్ వయసు ఇరవైకి ఒక ఏడాది ఎక్కువ. అది కూడా ఎక్కువేం కాదు. అయితే 'ఫెమినిజం'కి ఆమె చెప్పిన అర్థంలో.. వయసుకు మించిన పరిణతే కనిపిస్తోంది. టీనేజ్‌లోనే మలాలా నోబెల్‌ను సాధించడం కన్నా గొప్ప సంగతి ఈ పరిణతి. 'ఫెమినిజం మగాళ్ల విషయం' అన్నారు మలాలా. ఎగ్జాక్ట్‌లీ! 'స్త్రీవాదం గురించీ, స్త్రీల హక్కుల గురించీ మాట్లాడ్డం అంటే.. నిజానికది స్త్రీవాదనను అంగీకరించాలని పురుషులకు నచ్చచెప్పడమే' అని ఇటీవల మలాలా దావోస్‌లో ప్రసంగిస్తూ అన్నారు! 'హౌ స్వీట్' అంటూ హాలంతా చప్పట్లు. 2015లో హాలీవుడ్ నటి ఎమ్మా వాట్సన్‌తో సంభాషిస్తున్నప్పుడు 'ఫెమినిజం అంటే ఏంటీ?' అనే ప్రశ్నకు 'ట్రికీ వర్డ్' అని జవాబిచ్చారు మలాలా. తికమకపెట్టే పదం అని. అప్పటికి 'జెండర్ ఈక్వాలిటీ' అన్నదొక్కటే ఆమెకు తెలుసు. తర్వాత కొన్నాళ్లు ఫెమినిజం అంటే అదేదో సుపీరియరిజం అనుకున్నారట మలాలా. ఇప్పుడు ఫెమినిజాన్ని కూడా ఈక్వాలిటీ అనే అర్థంలోనే చూస్తున్నారు.

''ఫెమినిజానికి ఇంకో అర్థం సమానత్వం. స్త్రీ.. సమానత్వాన్ని అడుగుతున్నప్పుడు ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన పని లేదు. అయితే మనం ఫెమినిజం అన్న ప్రతిసారీ అది పురుషుడిని ఉద్దేశించి మాట్లాడటమే' అని దావోస్‌లో చెప్పారు మలాలా. అంతకంటే కూడా సభను మురిపించిన మరో సంగతి, 'స్త్రీవాదాన్ని సమర్థిస్తున్నవారూ స్త్రీలు వాదించడాన్ని అంగీకరించలేకపోవచ్చు. ఇప్పుడైతే గట్టిగా చెప్పగలను. స్త్రీవాదాన్ని నేను స్వీకరించాను' అని మలాలా చెప్పడం.

ఎమ్మా వాట్సన్ ప్రస్తుతం 'హీ ఫర్ షీ' అనే స్త్రీవాద ప్రచారోద్యమాన్ని నడుపుతున్నారు. 'మీ టూ', 'టైమ్స్‌అప్'తో పాటు 'హీ ఫర్ షీ'ని.. మలాలా సమర్థిస్తున్నారు. 'బయటపడిపోతాం అని భయపడుతూ ఉంటే, విషయం బయటపడేదెలా?' అని మలాలా ఇంకో అర్థవంతమైన మాటను అన్నారు. స్త్రీవాదానికి నవతరం నాయిక దొరికినట్లే ఉంది మలాలా మెచ్యూరిటీని చూస్తుంటే.

వావ్ గ్రేట్!

దమ్మున్న అమ్మాయిలు



● పార్వతి

పెద్ద దర్శకులంటే, పెద్ద హీరోలంటే.. ఇండస్ట్రీలోని పెద్దపెద్దవాళ్లే వణికి చస్తుంటారు. ఈ హీరోయిన్‌లు చూడండీ.. స్వరా భాస్కర్, పార్వతి.. మనసులో ఉన్నది ఎలా ధైర్యంగా మాట్లాడేశారో! దమ్మున్న అమ్మాయిలు అనిపించారు. స్వరా భాస్కర్ బాలీవుడ్ నటి. 'పద్మావతి' సినిమా చూసొచ్చి భన్సాలీని పబ్లిక్‌గా తిట్టేసింది. లాస్ట్ సీన్ ఆమెకు నచ్చలేదు.. దీపికా పదుకోన్, వందల మంది మహిళల్ని వెంటేసుకుని.. ఖిల్జీ నుంచి తప్పించుకోడానికి.. వెళ్లి అగ్నిగుండంలో పడిపోవడం! 'స్త్రీకి బతికే హక్కులేదా? స్త్రీ అంటే ఇక వేరే అర్థం లేదా? స్త్రీ దేహానికి ఇంకో పరమార్థమే లేదా' అనే అర్థం వచ్చేలా కాస్త తీవ్రంగానే భన్సాలీపై ఆమె విరుచుకుపడింది. ఇక అప్పట్నుంచీ స్వరా భాస్కర్‌కు భన్సాలీ అభిమానుల టార్చర్ మొదలైంది.

ఇంకో అమ్మాయి పార్వతి. మలయాళీ నటి. 'కసాబా' (2016) చిత్రంలో మమ్ముట్టీ.. మహిళా పోలీస్ బాస్‌ను అభ్యంతరకరంగా తిడతాడు. ఆ డైలాగ్‌తో ఆ క్యారెక్టర్ ఎలాంటిదో చెప్పించడం డైరెక్టర్ ఉద్దేశం కావచ్చు కానీ, స్త్రీని అనకూడని మాట అది! స్త్రీ దేహధర్మాలను కించపరిచే డైలాగ్ అది. దానిపై మమ్ముట్టిని, డైరెక్టర్‌ను తిట్టిపడేసింది పార్వతి. ఏడాదిగా తిడుతూనే ఉంది. డిసెంబర్‌లో మళ్లీ ఒకసారి క్రిటిక్‌ల సభలో ఆమె ఈ విషయాన్ని ఉతికి ఆరేసింది. మమ్ముట్టి అభిమానులు కూడా ప్రతీకారంగా పార్వతిపై ఏదో ఒక రూపంలో దాడి చేస్తూనే ఉన్నారు. అయినా ఆమె వెనక్కి తగ్గలేదు. సినిమాల్లోనే కాదు, సినిమాల బయటా ధైర్యంగా ప్రశ్నించే అమ్మాయిలు ఉన్నారు!



● స్వరా భాస్కర్

చెట్టు నీడ

మేం చేస్తాం ఇవ్వండి

ఓర్పు, నేర్పు మహిళలకే అధికం. మగవాళ్లది భుజ బలం అనుకుంటే, మగువలది మనోబలం. కొత్త పని, కష్టమైన పని చేయడానికి మగువ ముందొక దారి వేస్తే, ఆ తర్వాత పురుషుడు ఆ దారిలో పయనించిన సందర్భాలు చరిత్రలో అనేకం కనిపిస్తాయి. 1930లలో యు.ఎస్.లో మారుమూల కొండప్రాంతాల వారికి పుస్తకాలు అందుబాటులో ఉండేవి కాదు. పుస్తకం ఉన్న ఇల్లంటే గొప్ప. స్కూళ్లలో కూడా అంతే. గ్రంథాలయం ఉంటే అది గొప్ప స్కూలు. ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు... ఈ కొండ ప్రాంతాల వారికి పుస్తకాలు సరఫరా చెయ్యడం ఎలా అని చిన్న సమావేశం కూడా ఏర్పాటు చేసి, ఆలోచనలు జరిపారు. మొబైల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అంతా అన్నారు కానీ.. ఆ కొండల్లోకి, గుట్టల్లోకి, మంచు ప్రదేశాల్లోకి వాహనాలు వెళ్లలేవు. 'సరే అయితే, గుర్రాలపై పంపిద్దాం' అన్నారు రూజ్‌వెల్ట్! చదువుకునే వాళ్ల సంఖ్య తగ్గితే అమెరికా అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన ఆందోళన. గుర్రాలైతే సిద్ధంగా ఉన్నాయి. పుస్తకాలూ సిద్ధంగా ఉన్నాయి. మరి గుర్రాలను స్వారీ చేసేవారెవరు? పుస్తకాలను రవాణా చేసేవారెవరు? మొదటైతే మగవాళ్లెవరూ ముందుకు రాలేదు. మగువలే ఉత్సాహంగా వచ్చి 'మేం చేస్తాం' అన్నారు! ప్రెసిడెంట్‌కి సంతోషం వేసింది. గుర్రాలపై స్వారీ చేస్తూ పుస్తకాలు మోసుకెళ్లడం. పాఠశాలలకు ఇవ్వడం. ఇళ్లకు మామూలు పుస్తకాలను చేరవేయడం, వాళ్లు చదివిన పుస్తకాలను తిరిగి తీసుకోవడం, ఎవరైనా పెద్దవాళ్లు చదివి వినిపించ మని కోరితే వారితో కొద్దిసేపు కూర్చొని పుస్తక పఠనం చేయడం.. ఈ బాధ్యతలనన్నింటినీ మహిళలు చక్కగా నిర్వర్తించారు. 'బుక్ ఉమెన్' అని వాళ్లకు పేరు. కొండపైన ఉండే కాలనీల్లోకి బుక్ ఉమెన్ వస్తున్నారంటే పండుగ వచ్చినట్లే ఉండేది. 1943 వరకు ఈ గుర్రపు గ్రంథాలయాలు నిరాటంకంగా నడిచాయి. నడవడం కాదు, మహిళలు నడిపించారు. ఆ తర్వాత నిధుల్లేక ఆగిపోయాయి. మహిళలకు అప్పగించిన పని ఏదైనా నిధుల్లేక ఆగిపోవల్సిందే కానీ, నిబద్ధత లేక ఆగిపోయింది ఒక్కటీ కనిపించదు. చరిత్రను తిరగేసి చూడండి. వర్తమానాన్నీ తరచి చూడండి. ఎక్కడా కనిపించదు.



● వండర్ ఉమెన్: సంచార గ్రంథాలయాలు




● కొండ ప్రాంతంపై ఉన్న గృహిణికి పుస్తకం అందిస్తున్న ఓ బుక్ ఉమన్!

> **దేశాలను ప్రభుత్వాలు నడుపుతాయి. ప్రభుత్వాలను పథకాలు నడుపుతాయి. పథకాలు మహిళలు నడిపితేనే ఫలవంతం అవుతాయి.**

సెటైర్

పండుగ చేస్కుందాం రండి

పరీక్షలు రాసే పిల్లల కోసం, పరీక్షలు రాయించే పేరెంట్స్ కోసం, పరీక్షలు పెట్టే టీచర్ల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఓ పుస్తకం రాశారు. ఆ పుస్తకం పేరు 'ఎగ్జామ్స్ వారియర్స్'. పరీక్షల యోధులు అని! మొన్న శనివారమే విడుదలైంది. పరీక్షల ఒత్తిడిని తట్టుకోవడం ఎలా? అని ఆ బుక్కులో 25 సూత్రాలు ఇచ్చారు మోదీజీ. సూత్రాలతో పాటు గుప్పెడు ఆసనాలు కూడా! గత ఏడాది జనవరిలో మోదీజీ 'మన్ కీ బాత్' రేడియో ప్రసంగంలో పరీక్షల ఒత్తిడి గురించి మాట్లాడారు. జూలై కల్లా పరీక్షల ఫలితాలు వచ్చాయి. అప్పుడు పాస్ అయినవాళ్లు చాలామంది మోదీకి పర్సనల్‌గా ఉత్తరాలు రాశారట.. 'మీ వల్లే.. మీ వల్లే' అని. ఆ ఇన్‌స్పిరేషన్‌తో మోదీజీ ఇప్పుడు ఏకంగా పుస్తకమే తెచ్చారు. 'పరీక్షలు పండుగల్లాంటివి.. కాబట్టి పండుగ చేస్కోండి'. 'మీ నావకు మీరే లంగరు. కాబట్టి మీ చేతి బలం చూసుకోండి'. 'చీట్ చెయ్యడం అంటే చీప్ అవ్వడమే'.. ఇలా ఉంది పుస్తకంలో మో(డీ)టివేషన్. పెంగ్విన్ ప్రచురణకర్తలు ఈ బుక్ వేశారు. ధర 98 రూపాయలు. మోదీజీని మెల్లిగా మోటివేట్ చేసి.. నోట్ల రద్దు స్ట్రెస్ మీద, జీఎస్టీ స్ట్రెస్ మీద కూడా బుక్కులు వేయిస్తే.. ఇండియా మొత్తం స్ట్రెస్ ఫ్రీ అవుతుంది కదా!



లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా..! నేను ఒక అమ్మాయిని లవ్ చేస్తున్నా. తను నా మరదలు. ఇంట్లో మా పెళ్లి ఫిక్స్ చేశారు. ప్రాబ్లమ్ ఏంటంటే... ఆ అమ్మాయి నాతో ఎప్పుడు మాట్లాడలేదు. ఎందుకు మాట్లాడటంలేదు అని అడిగితే.. ''నేనేమైనా పెళ్లి చేసుకోనని చెప్పానా?'' అని ప్రశ్నిస్తోంది. ''నేనింతే, నాతో మాట్లాడకు'' అంటోంది. ఆ అమ్మాయికి నేనంటే ఇష్టమా? కాదా? ప్లీజ్ మంచి సలహా ఇవ్వండి అన్నయ్యా.

– విజయ్

మౌనరాగం సినిమా చూడన్నా..!
'ఎందుకు సార్??'
చూస్తే మౌనం ఎందుకో అర్థం అవుతుంది.
'అదేదో మీరే చెప్పొచ్చు కాదా సార్?'
కుదరదు విజయ్ సినిమా చూడాల్సిందే..
'చూస్తే ఏమవుద్ది సార్???'
సినిమా చూసినట్టు అనిపిస్తుంది..!
'సార్...! బుర్ర తినకండి.. అరటిపండు ఇస్తా అసలు విషయం చెప్పండి సార్??!'
మౌనంలో కసి ఉంటుంది, కోపం ఉంటుంది. అసహ్యం ఉంటుంది. చీదర ఉంటుంది. వాటన్నింటి వెనుక ఓ గౌరవంతో కూడిన ప్రేమ ఉంటుంది..!!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

2	6			7			5	
	5	3		2	6	7	1	9
		1				8		
6		4			2			7
	7						4	
3			6			1		5
		6				2		
1	2	7	3	9		5	6	
	8			6			7	4

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

6	5	3	4	7	1	9	8	2
8	1	9	5	3	2	4	7	6
2	7	4	6	8	9	5	3	1
5	2	6	9	1	8	3	4	7
9	4	8	3	6	7	1	2	5
1	3	7	2	5	4	6	9	8
3	8	2	1	9	5	7	6	4
7	9	5	8	4	6	2	1	3
4	6	1	7	2	3	8	5	9


పంతం... చెడు అంతం



గోపీచంద్

ఎవరూ ఊరికే పంతం పట్టరు. ఏదైనా సొంతం చేసుకోవాలనో లేక ఎవర్నైనా అంతం చేయాలనో... పంతం పట్టడానికి ఇలా ఏదో ఒక కారణం ఉంటుంది. విలన్ పంతం అతని పతనానికి కారణమవుతుంది. హీరో పంతం ఇతరుల మంచి కోసం ఉపయోగపడుతుంది. గోపీచంద్ ఓ మంచి పని కోసం పంతం పట్టారు. అదేంటో స్క్రీన్‌పైనే చూడాలంటున్నారు నిర్మాత కేకే రాధామోహన్. గోపీచంద్, మెహరీన్ జంటగా శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై చక్రి దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మిస్తున్న సినిమాకు 'పంతం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'ఫర్ ఏ కాజ్' అనేది ఉపశీర్షిక. ఈ సినిమాను మే 18న రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ''గోపీచంద్‌గారు మా బ్యానర్‌లో 25వ సినిమా చేయడం ఆనందంగా ఉంది. ప్లాన్ చేసుకున్న ప్రకారం ఇప్పటికే ఒక పాట, కొంత టాకీ పార్ట్‌ను కంప్లీట్ చేశాం. ప్రస్తుతం ఇంటర్‌వెల్ బ్యాంగ్‌లో వచ్చే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. కమర్షియల్ హంగులు జోడించి మంచి మేసేజ్‌తో దర్శకుడు చక్రి సినిమాను చక్కగా తెరకెక్కిస్తున్నారు'' అన్నారు నిర్మాత కేకే రాధామోహన్. పృథ్వీ, జయప్రకాశ్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు గోపీసుందర్ స్వరకర్త.

దేశభక్తికి సరిహద్దుల్లేవ్



అల్లు అర్జున్

సరిహద్దులు దేశానికి ఉంటాయి. దేశభక్తికి కాదు. అందుకే శత్రువు తూటాకన్నా, సైనికుడి కళ్లలోనే పవర్ ఎక్కువ. దేశభక్తి ముందు వారికి ప్రాణం మీద తీపి తక్కువ. పరిస్థితులు ఏవైనా, ప్రాంతం ఏదైనా అలుపెరుగని పోరాటం చేసే ధీరుడు సైనికుడు. ఇలాంటి సైనికుడి పాత్రలోనే అల్లు అర్జున్ నటిస్తున్నారు. వక్కంతం వంశీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా కె. నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై లగడపాటి శిరీషా శ్రీధర్ నిర్మిస్తున్న సినిమా 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. 'బన్నీ' వాసు సహ నిర్మాత. ఇందులో అనూ ఇమ్మాన్యుయేల్ కథానాయిక. ''ఆల్రెడీ రిలీజ్ చేసిన మూవీ ఫస్ట్ ఇంపాక్ట్, మేకింగ్ వీడియో, 'సైనిక' సాంగ్‌కు మంచి స్పందన లభిస్తోంది. దీనికి కొనసాగింపుగానే ఫిబ్రవరి 14న మరో సాంగ్‌ను రిలీజ్ చేయాలనుకుంటున్నాం. ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో మైనస్ 12 డిగ్రీల వాతావరణంలో షూటింగ్ చేస్తున్నాం. విశాల్–శేఖర్ మంచి సంగీతం అందిస్తున్నారు. ఏప్రిల్ 27న సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు నిర్మాతలు. ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ బాబు.

హిట్ అనుకున్నాం.. సూపర్ హిట్ అయ్యింది – నాగశౌర్య



నాగశౌర్య, గౌతమ్, ఉషా, రష్మిక మండన్న, శంకర్ ప్రసాద్, వెంకీ కుడుముల

''ఛలో' ఓ ఎమోషనల్ జర్నీ. మంచి సినిమా తీశాం. హిట్ అవుతుందని అనుకున్నాం. కానీ పెద్ద హిట్.. సూపర్‌హిట్ అయ్యింది. టికెట్లు దొరకడం లేదని కొందరు నన్ను టికెట్లు అడుగుతుంటే 'వీళ్లు కావాలనే అడుగుతున్నారా.. లేకుంటే నిజంగానే పెద్ద హిట్ అయ్యిందా అన్నది అర్థం కావడం లేదు'' అని నాగశౌర్య అన్నారు. నాగశౌర్య, రష్మిక మండన్న జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఛలో'. శంకర్‌ప్రసాద్ మూల్పూరి సమర్పణలో ఉషా మూల్పూరి నిర్మించిన ఈ సినిమా ఇటీవల విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో థ్యాంక్స్ మీట్ నిర్వహించారు. నాగశౌర్య మాట్లాడుతూ– ''ఛలో' సినిమాకి నేనొక్కడినే బలం కాదు. నా తోటి నటీనటులు, సాంకేతిక నిపుణులందరూ. నాకు మా అమ్మానాన్న బలమైతే.. ఐరా క్రియేషన్స్‌కి బుజ్జి అంకుల్, శ్రీనివాసరెడ్డి అంకుల్ ఇద్దరే బలం. మరో నాలుగు సినిమాలు తీయొచ్చనే ధైర్యం ఇచ్చింది వారిద్దరే. 'ఛలో'ని బాగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు'' అన్నారు. ''ఈ రోజుల్లో డైరెక్టర్‌గా అవకాశం దొరకడం ఎంత కష్టమో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన నాకు తెలుసు. అటువంటిది నన్ను నమ్మి, సొంత ప్రొడక్షన్ స్టార్ట్ చేసి నాకు ఈ అవకాశం ఇచ్చిన నాగశౌర్యకు జీవితాంతం రుణపడి ఉంటాను. ఈ సినిమా ఇంత బాగా రావడానికి కారణం ఉషా ఆంటీ, శంకర్‌ప్రసాద్ అంకుల్. మిమ్మల్ని జీవితంలో మరచిపోలేను. శౌర్య, రష్మిక చాలా బాగా చేశారు'' అన్నారు వెంకీ కుడుముల. ''ఛలో' సినిమాని ఆదరించడంతో పాటు నన్ను బాగా సపోర్ట్ చేసిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మీ ఆదరాభిమానాలు ఎప్పుడూ ఇలాగే ఉండాలి'' అన్నారు రష్మిక మండన్న. శంకర్‌ప్రసాద్, ఉషా, కెమెరామ్యాన్ సాయి శ్రీరామ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడి నీటిలోనే ఏదో ఉంది – 'దిల్' రాజు

''భీమవరం ఊర్లో ఏముందో తెలియదు కానీ ఇక్కడి నుంచి త్రివిక్రమ్, సునీల్ వంటివారు.. పక్కనున్న పాలకొల్లు నుంచి చిరంజీవిగారు, కృష్ణంరాజుగారు, ప్రభాస్ వంటి ఎందరో తెలుగు చిత్ర పరిశ్రమకి వచ్చారు. ఇక్కడి నీటిలోనే ఏదో ఉంది. సినిమాకు కావాల్సిన కళ ఇక్కడ ఉంది. అదే



వెంకీ అట్లూరి, వరుణ్ తేజ్, బీవీఎస్ఎన్ ప్రసాద్, 'దిల్' రాజు, రాశీఖన్నా

మిమ్మల్ని, మమ్మల్ని ఇక్కడివరకు తీసుకొచ్చింది'' అని నిర్మాత 'దిల్'రాజు అన్నారు. వరుణ్ తేజ్, రాశీఖన్నా జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన 'తొలిప్రేమ' ఈ నెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా భీమవరంలో ప్రీ–రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. 'దిల్'రాజు మాట్లాడుతూ– ''1998లో వచ్చిన 'తొలిప్రేమ'కు, 2018లో రానున్న 'తొలిప్రేమ'కు నేనే డిస్ట్రిబ్యూటర్‌ని. ఆ 'తొలిప్రేమ' లా ఈ చిత్రం కూడా 100 శాతం యూత్‌దే. బ్యూటీఫుల్ లవ్‌స్టోరీ. 'ఫిదా' తర్వాత ఈ సినిమా రావడం వరుణ్‌కి ప్లస్ అవుతుంది'' అన్నారు. ''తొలిప్రేమ' టైటిల్ పెట్టినప్పుడు కాస్త భయపడ్డాం. వరుణ్ ఏమో 'పర్వాలేదు కదా' అన్నాడు. ఆ సినిమాతో పోలిక పెట్టను కానీ.. దాని గౌరవాన్ని కాపాడతాను'' అన్నారు వెంకీ అట్లూరి. ''చిరంజీవితో సినిమా తీయాలని 33ఏళ్ల కిందట తణుకు నుండి మద్రాస్ వెళ్లాను. బన్నీతో 'ఆర్య 2', రామ్‌చరణ్‌తో 'మగధీర', పవన్‌కల్యాణ్‌తో 'అత్తారింటికి దారేది' తీశా. వరుణ్‌తో తీసిన 'తొలిప్రేమ' గ్యారంటీగా పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. ''వెంకీకి తొలి చిత్రమే అయినా బాగా తీశాడు. భవిష్యత్‌లో పెద్ద దర్శకుడవుతాడు. ఈ సినిమాను అందరి కంటే ఎక్కువగా నమ్మింది 'దిల్'రాజుగారే. బాపినీడు, ప్రసాద్‌గారు అద్భుతంగా నిర్మించారు. సినిమాటోగ్రాఫర్ జార్జ్ విలియమ్స్ ప్రతి సీన్‌ను ఎంతో అందంగా చూపించారు. కథకు తగ్గ టైటిల్ అనిపించే 'తొలిప్రేమ' పెట్టాం. బాబాయ్ టైటిల్‌ని పాడు చేసేలా ఉండదు ఈ సినిమా'' అన్నారు వరుణ్ తేజ్. ఎమ్మెల్యే రాధాకృష్ణ, రాశీఖన్నా, నటుడు 'హైపర్' ఆది, ఎస్.ఆర్.కె.ఆర్.కాలేజ్ ప్రిన్సిపాల్ పార్థసారథి పాల్గొన్నారు.



జాక్వెలిన్ ఫెర్నాండెజ్

కిక్ ఇచ్చింది

''స్టార్స్‌గా వెలుగుతున్న ప్రతి ఒక్కరికి ఒక స్ట్రగులింగ్ పాస్ట్ ఉంటుంది. ఎంత హార్డ్‌వర్క్ చేసి ఆ దశ దాటుతామో అంత మంచి సక్సెస్‌ను చూడగలుగుతాం'' అని చెబుతున్నారు జాక్వెలిన్ ఫెర్నాండెజ్. యాక్టర్‌గా బిగ్ సక్సెస్‌ను అందుకోక ముందు తన కెరీర్‌లో చూసిన స్ట్రగులింగ్ పాస్ట్‌ను గుర్తు చేసుకున్నారు జాక్వెలిన్. ''నా లైఫ్‌లో నేను చూసిన చీకటి రోజులంటే యాక్టర్‌గా నా తొలి రోజులు. కొన్ని సంవత్సరాల పాటు నాలో కాన్ఫిడెన్స్ అనేదే లేదు. నన్ను నేనే యాక్సెప్ట్ చేయలేనంత నెగటివిటీకి వెళ్లిపోయాను. మా నాన్నగారు వాటికన్ సిటీ చూడాలని అడిగారు. మా పేరెంట్స్‌ను ట్రిప్‌కు తీసుకువెళ్ళాను. నేను సొంతంగా వాళ్లకు చూపించే ఆఖరి ట్రిప్ ఇదే అవుతుందనుకున్నాను. చాలా బాధ అనిపించింది. ఒకవేళ మా పేరెంట్స్‌కు చూపించే లాస్ట్ ట్రిప్ ఇదే అనుకుంటే.. అదే అయ్యేదేమో. కానీ నేను ఇదే లాస్ట్ ట్రిప్ అవ్వాలనుకోలేదు. వాళ్లకి ఇంకా చూపించాలి, చాలా ఇవ్వాలని బలంగా నిర్ణయించుకున్నాను. నన్ను నిరుత్సాహరిచే వాళ్లందరినీ దూరం పెట్టాను. నా గోల్ మీద ఫుల్ ఫోకస్‌తో ట్రై చేశాను. అదే సమయంలో హీరో సల్మాన్ ఖాన్, దర్శకుడు సాజిద్ నడియాడ్‌వాలా నాకు 'కిక్' సినిమాలో అవకాశం ఇచ్చారు. ఆ సినిమా నా కెరీర్‌కు ఫుల్ కిక్కిచ్చింది. సో.. ఎప్పుడూ మనం చేసే పని మీద కాన్ఫిడెన్స్ వదులుకోకూడదు. అదే నా ఎక్స్‌పీరియన్స్‌లో నేను నేర్చుకున్న లెసన్'' అన్నారు జాక్వెలిన్.

ఒకే ఒక్క పాత్రతో...



ఆదిత్య ఓం

'లాహిరి లాహిరి లాహిరిలో, ధనలక్ష్మి ఐ లవ్‌యూ, మీ ఇంటికొస్తే ఏమిస్తారు మా ఇంటికొస్తే ఏం తెస్తారు, ఒట్టు ఈ అమ్మాయెవరో తెలీదు, ఫ్రెండ్ రిక్వెస్ట్' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు నటుడు ఆదిత్య ఓం. ఆయన ప్రధాన పాత్రలో ఓ సినిమా రూపొందనుంది. అందులో విశేషం ఏంటంటే... ఈ సినిమా మొత్తం ఒకే ఒక్క పాత్రతో ఉంటుంది. వినూత్న కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి రాఘవ తిరువాయిపాటి దర్శకత్వం వహించనున్నారు. ఎమినెంట్ 5ఎంటర్‌టైన్‌మెంట్స్ అనే నూతన సంస్థ ఎస్.ఆర్. ప్రొడక్షన్ సమర్పణలో రూపొందించనున్న ఈ సినిమా ఈ నెలాఖరు నుంచి షూటింగ్ జరుపుకోనుంది. ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే: రాకేష్ గోవర్ధన్ గిరి, కెమెరా: మధుసూదన్ కోట.

మంచీ చెడూ త్వరలో...



హర్షవర్ధన్, శ్రీముఖి, మురళి

''గుడ్, బ్యాడ్, అగ్లీ ఈ మూడు కోణాలు మన అందరిలోనూ ఉంటాయి. సందర్భం వచ్చినప్పుడు బయటకు వస్తుంటాయి. ఈ మూడు అంశాల మీదే ఈ సినిమా నడుస్తుంది. సినిమా మొత్తం ఎంటర్‌టైన్‌మెంట్‌తో సాగుతుంది. కథకు సూట్ అవుతుందనే ఈ టైటిల్‌ను ఫిక్స్ చేశాం'' అన్నారు దర్శకుడు హర్షవర్ధన్. మురళీ, శ్రీముఖి, కిశోర్ ముఖ్య పాత్రల్లో రచయిత హర్షవర్ధన్ దర్శకత్వంలో అంజిరెడ్డి నిర్మించిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో.. ''సినిమా కంప్లీట్ అయింది. ఈ నెలాఖరులో రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నాం'' అని నిర్మాత అన్నారు. ''నా గత సినిమాలతో పోలిస్తే ఈ సినిమా చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. నన్ను నేను కొత్తగా చూసుకునే అవకాశం ఈ సినిమా వల్ల వచ్చింది'' అన్నారు శ్రీముఖి.

నీకు నాకు మధ్యలో ఏదో ఉంది



సదా

''మనం చాలా పాటలు వింటుంటాం. కొన్ని పాటలు మన చెవుల వరకే పరిమితం అయితే కొన్ని పాటలు మన హృదయాన్ని హత్తుకుంటాయి. 'దళపతి' చిత్రంలో 'నీకు నాకు మధ్య ఏదో ఉంది' పాట అలాంటిదే'' అంటున్నారు సదా. సదా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'దళపతి'. కవితా అగర్వాల్ హీరోయిన్. 'నీకు నాకు ఏదో ఉంది' అనే పాట యూట్యూబ్‌లో కోటి వ్యూస్‌తో సంచలనం చేస్తుండటంతో దర్శకుడు సదా మాట్లాడుతూ – ''ఫాస్ట్ బీట్ పాటలకు లైఫ్ చాలా తక్కువ. మెలోడీ పాటలే ఎక్కువ కాలం శ్రోతల మదిలో మెదులుతాయి. ఈ పాట కూడా ఇలాంటిదే. త్వరలో రానున్న 'దళపతి' సినిమాకు ఇదే ప్రధాన ఆకర్షణ. ఈ పాటను కంపోజ్ చేసి, పాడిన యాజమాన్యకు, శ్రేయా ఘోషల్‌కు, పాటను రచించిన రాంబాబు గోసాలకు చాలా థ్యాంక్స్. ఇంత హిట్ అయిన ఈ పాట పేరునే నా నెక్స్ట్ సినిమాకు టైటిల్‌గా పెట్టుకుంటాను'' అని అన్నారు. ఈ సినిమాను బాబురావు పెద్దపుడి నిర్మిస్తున్నారు.

స్వచ్ఛమైన ప్రేమకథ



సంచిత, విద్యాసాగర్‌రాజు

విద్యాసాగర్ రాజు హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం 'రచయిత'. సంచితా పదుకొనే కథానాయిక. కల్యాణ్ ధూళిపల్ల నిర్మించిన ఈ సినిమా ఈనెల 16న విడుదలవుతోంది. ''స్వచ్ఛమైన, అందమైన ప్రేమకథగా రూపొందిన చిత్రమిది. 1950 నేపథ్యంలో కథ సాగుతుంది. వైజాగ్‌లో వేసిన భారీ సెట్‌లో తీసిన కీలక సన్నివేశాలు ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తాయి. ఈనెల 10న ఒంగోలులో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహిస్తున్నాం'' అన్నారు కల్యాణ్ ధూళిపల్ల. ఈ చిత్రానికి సంగీతం: షాన్ రెహమాన్, నేపథ్య సంగీతం: జీవన్.బి, కెమెరా: సాయిశ్రీరామ్.

పరి పరిశోధన

ఉబ్బసం ఇబ్బందికి కారణం తెలిసింది...

ఉబ్బసం సమస్య మొదలైనప్పుడు ఊపిరితిత్తుల్లోని గాలితిత్తులు ఎందుకు మూసుకుపోతాయో శాస్త్రవేత్తలు కనుక్కున్నారు. దీంతో ఉబ్బస వ్యాధి చికిత్సకు మరింత మెరుగైన మందులు తయారు చేయడం వీలవుతుందని అంచనా. హ్యూస్టన్ మెథాడిస్ట్‌కు చెందిన శాస్త్రవేత్తల అంచనా ప్రకారం ఇలా గాలితిత్తులు మూసుకుపోయేందుకు కేవలం రెండే రెండు పరమాణువులు కారణం. ఈ రెండింటినీ నియంత్రించగలిగితే ఉబ్బసం తీవ్రమైనప్పుడు ఊపిరి తీసుకునేందుకు విపరీతమైన ఇబ్బంది పడటం ఉండదు. గాలితిత్తుల ద్వారా ఒక రకమైన ప్రొటీన్ ఉత్పత్తి ఎక్కువగా జరగడం.. ఈ ప్రొటీన్ జిగురుగా ఉంటుందన్నది తెలిసిందే. ఊపిరితిత్తుల లోపలిగోడల్లో ఉండే కొన్ని ప్రత్యేక కణాలు గాలితిత్తులు ఆరోగ్యంగా ఉండటంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఈ క్రమంలోనే అవి జిగురులాంటి మ్యూసిన్‌ను ఉత్పత్తి చేస్తాయి. అయితే రోగ నిరోధక వ్యవస్థకు చెందిన కొన్ని కణాలు ఊపిరితిత్తులు విడుదల చేసే ఓఎక్స్40 అనే రసాయనం కారణంగా మ్యూసిన్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేస్తున్నారు.



మాయన్ల మహా నగరం బయటపడింది...

సింధు నాగరికత గుర్తుంది కదా.. దక్షిణ అమెరికాలోనూ అచ్చం ఇలాంటిదే ఒక నాగరికత వేల ఏళ్ల క్రితం అకస్మాత్తుగా మాయమైపోయింది. అడపాదడపా ఒకట్రెండు నిర్మాణాలు, అవశేషాలు దొరికినప్పటికీ ఈ మాయన్ నాగరికత మర్మమేమిటో మాత్రం పూర్తిగా తెలియరాలేదు. ఇక ఈ సమస్యకు ఓ పరిష్కారం చిక్కినట్లే. ఎందుకంటారా? ఈ మధ్యే.. మాయన్లకు సంబంధించి గ్వాటమాలా వద్ద అత్యంత కీలకమైన ఆవిష్కరణ ఒకటి జరిగింది. అత్యాధునిక లిడార్ టెక్నాలజీ సాయంతో అమెజాన్ అటవీ ప్రాంతంలో భూగర్భంలో దాక్కున్న భారీ కట్టడాలను, మానవ ఆవాసాలను పురాతత్వ శాస్త్రవేత్తలు గుర్తించారు. తాము మొత్తం 2,100 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వైమానిక సర్వే లాంటిది చేశామని, క్రీస్తుపూర్వం వెయ్యి నుంచి 900 ఏళ్ల కాలం నాటి మాయన్ల నాగరకతకు చెందిన మహా నగరం లభించింది. ఇది ఎంత పెద్దది అంటే.. సుమారు కోటిమంది నివసరించిన నగరం అని అంచనా వేస్తున్నారు. మునుపటి అంచనాల కంటే చాలా ఎక్కువగా మాయన్లు అటవీ భూమిని వ్యవసాయం కోసం చదును చేశారని, సాగునీరు కోసం కాలువల వంటి ఏర్పాట్లు విస్తృతంగా వాడారని టులాన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు తెలిపారు.



జాబిల్లిపై రెండు లక్షల టన్నుల చెత్త!

భూమ్మీద ఇప్పటికే చెత్త సమస్యను సృష్టించుకున్న మనిషి జాబిల్లిని కూడా వదల్లేదు. ఎప్పుడో భవిష్యత్తులో చంద్రుడిపై ఆవాసం ఏర్పాటు చేసుకుంటామని నాసా చెబుతోంది కానీ.. ఇప్పటికే అక్కడ కూడా బోలెడంత చెత్త పేరుకుపోయిందట. నాసా అంచనాల ప్రకారం.. ఇప్పటివరకూ జాబిల్లిపైకి వెళ్లిన ఉపగ్రహాలు, మానవ ప్రయాణాలను కలిపి చూస్తే మొత్తం రెండు లక్షల టన్నుల చెత్త అక్కడ ఉంది. జాబిల్లిపైకి వెళ్లేందుకు వాడిన రాకెట్లు, ఉపగ్రహాల్లో అత్యధిక భాగాన్ని అక్కడే వదిలి వేయడం వల్ల ఈ సమస్య వస్తోన్నట్లు అంచనా. వ్యోమగాములను భూమ్మీదకు తిరిగి తీసుకొచ్చేందుకు ఇది చౌకైన మార్గమని ఇప్పటివరకూ శాస్త్రవేత్తలు అనుకునేవారు. జాబిల్లిపై తిరిగేందుకు ఉపయోగించిన మూన్‌ల్యాండర్‌లు, ఇతర ఉపగ్రహ విడిభాగాలు, మానవ వ్యర్థాలతోపాటు అపోలో 15 వ్యోమగాములు వదిలిన అల్యూమినియంతో చేసిన జ్ఞాపికల వంటివన్నీ ఇక్కడే ఉండిపోయాయి. అప్పట్లో జాబిల్లిపై చేరిన వ్యోమగాములు అక్కడ గోల్ఫ్ ఆడారు. ఆ తరువాత గోల్ఫ్ బంతులతోపాటు ఇతర సామగ్రిని కూడా అక్కడే వదిలేశారు. భూమి చుట్టూ అంతరిక్షంలో పేరుకుపోయిన ఎలక్ట్రానిక్ చెత్తకు జాబిల్లి ఉపరితలంపై ఉన్న చెత్త అదనం అన్నమాట!





మలిన స్పర్శ!

పూర్ణిమా గోవిందరాజులు

అది ఆప్యాయంగా తాకే చేయా?
కాదు... కానే కాదు. మరి ఆకలిగా తడిమే చెయ్యా?
అవును... అవును... అవును.
ఆ చేతినీ, ఆ చేష్టనూ ఆపేదెలా?
ఆమెకు అప్పుడు తెలియదు. కానీ ఇప్పుడు తెలిసింది.
అలాంటి చేతులకు అడ్డుకట్ట ఎలా వేయాలో.
ఎప్పటివో తప్పులకు ఇప్పుడూ శిక్షపడేందుకు
చట్టంలోనే ఓ మార్పు వచ్చేలా కృషిచేస్తున్న
పూర్ణిమా గోవిందరాజులు బయోగ్రఫీ ఇది.

పందొమ్మిది వందల ఎనభైఆరో.. ఎనభైఏడో.. సంవత్సరం సరిగ్గా గుర్తులేదు. అప్పుడామె వయస్సు 22 ఏళ్లు ఉండొచ్చు. మాంట్రియల్ (కెనడా)లోని తన సోదరుడి ఇంట్లో ఆమె టీవీ చూస్తూ ఉంది. నాన్న చనిపోవడంతో అమ్మ, తను చెన్నై నుంచి అన్న దగ్గరకి వచ్చేశారు.

టీవీలో చానెల్స్ మారుస్తూ ఉంది. ఓ చానెల్‌లో వస్తున్న ఓ షో దగ్గర ఆగిపోయింది. చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ టాపిక్. దాని బారినపడ్డవాళ్లను ఇంటర్వ్యూలు చేస్తున్నారు. హఠాత్తుగా ఆలోచనల్లో పడింది ఆమె. 'అయితే ప్రపంచంలో నేనొక్కదాన్నే కాదన్నమాట. నాలాంటి వాళ్లు ఇంతమంది ఉన్నారు' అనుకుంది. ఏవో జ్ఞాపకాలు వెంటాడాయి. చిన్నప్పుడు తనను తన కజిన్ హజ్బెండ్ అలాగే అబ్యూజ్ చేశాడు. అప్పుడు ఆమెకు ఆరేళ్లు. వాళ్ల నాన్న చాలా డబ్బు పోగొట్టుకొని వాటిని రికవరీ చేసుకోవడానికి వెళ్లేవాడు. అమ్మకేమో స్క్లీరోసిస్. పిల్లలను చూసుకునే స్థితిలో ఉండేదికాదు. దాంతో ఆమె తండ్రి అలా వెళ్లినప్పుడల్లా వాళ్లను ఆమె కజిన్ ఇంట్లో దింపేవాడు. ఆ ఇంట్లో రాత్రుళ్లు ఏదో భయంకరమైన కల భయపెట్టి నిద్రలోంచి ఉలిక్కిపడిలేచేలా చేసేది. కళ్లు తెరిచి చూసేసరికి పక్కన అతను ఉండేవాడు. ఆ అమ్మాయి పాంటీ విప్పి ఏదో చేస్తూ. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేనప్పుడుకూడా తన పాంటీలో చేతులు పెట్టేవాడు. వణుకుతూ దిగ్గున కూర్చుంది ఆ పిల్ల. ఏడుపొస్తుంటే వెంటనే తన చేత్తో ఆమె నోటిని మూసేశాడు. అలాగే వెనక్కి వాల్చి పడుకో అన్నట్టు సైగచేసి గమ్మున బయటకు వెళ్లిపోయాడు. కాని ఆరేళ్ల ఆ పాప నిద్రపోయేది కాదు మిగిలిన రాత్రంతా. భయం.. పడుకుంటే మళ్లీ వస్తాడేమోనని. అది మొదటిసారి కాదు చాలాసార్లు జరిగింది. తాకకూడని చోట్ల తాకాడు. చేయడకూడని పనులు చేశాడు. కాని ఆ బాధ ఎప్పుడూ ఎవరితో చెప్పలేదు. చెబితే అందరూ తననే తిడతారేమోననే భయం. అతను అలా తాకినప్పుడల్లా తానంతా డర్టీగా అయిపోయాననే భావన. తన కజిన్‌తో చెప్పి ఏడ్వాలనిపించేది. కాని వాళ్లు తమ కన్నా డబ్బున్నవాళ్లు. ఆర్థికంగా తన కుటుంబానికి చాలా సాయం చేస్తున్నారు. తండ్రి ఊళ్లకు వెళ్లినప్పుడల్లా తమను ఇంట్లో పెట్టుకుంటున్నారు. అతను మంచివాడు కాదు... ఇలా చేస్తున్నాడు అని చెబితే ఆ సాయమంతా ఆగిపోతుందనే భయం. ఇంటికి రానివ్వరని భయం. అమ్మానాన్న తిడతారనే భయం. ఇంచుమించు తన వయసున్న అతని బిడ్డా తనతో సన్నిహితంగానే ఉంటుంది.



"భారతదేశంలో చాలామంది పిల్లల బాల్యం ఇలాంటి పీడకలలతోనే తెల్లారుతోంది. కుటుంబ బంధాలు, అనుబంధాలు,ఆర్థిక సమస్యలు, పిల్లల ఇబ్బందులను అర్థంచేసుకోలేని, వాళ్ల మాటలను నమ్మని పరిస్థితులు వగైరాల వల్ల ఆ పిల్లలలెవరూ నోరెత్తరు. వాళ్లు చెప్పినా వినేపెద్దవాళ్లుండరు. ఆ సైలెన్స్‌ను బ్రేక్‌చేయడానికే నేను నోరువిప్పా. జరిగినదాన్ని నిర్భయంగా బయటకు చెప్పే ధైర్యం మిగిలిన వాళ్లకు ఇవ్వడానికి నేనొక ఉదాహరణగా ఉండదల్చుకున్నా. నాలా చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్‌కు గురైనవాళ్లకు మానసికస్థైర్యం కల్పించే ప్రయత్నం చేస్తాను. నిందితులకు శిక్షపడాలి. బాల్యం అందరికీ అందమైన జ్ఞాపకంగా ఉండాలి. ఇది పిల్లల హక్కు"అంటున్నారు పూర్ణిమా గోవిందరాజులు.

ఆమెతోనూ చెప్పలేదు ఇదే భయంతో. ఆ గతం పీడ ఒళ్లు గగుర్పొడిచేలా చేసి ఈ లోకంలోకి తెచ్చింది ఆమెను.

ఇప్పుడు ఆమె వయసు 53 ఏళ్లు. పేరు పూర్ణిమా గోవిందరాజులు. కెనడాలో ఎకాలజిస్ట్‌గా పనిచేస్తోంది. చెన్నైలో పుట్టిపెరిగింది. తన 21వ యేట కెనడాకు వెళ్లింది. ఓవైపు అక్కడ పనిచేస్తూనే ఇంకోవైపు వరల్డ్ పల్స్ కమ్యూనిటీలో చేరి తన మాతృభూమి ఇండియా అభివృద్ధిలో పాలుపంచుకుంటోంది.

పూర్ణిమ గురించి చెప్పడానికి సందర్భం?

బాల్యంలో తాను ఎదుర్కొన్న చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్‌కు ఇప్పుడు ఇండియాలో పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్) అనే యాక్ట్ వచ్చిందని తెలిసీ 2016లో కంప్లయింట్ ఫైల్ చేసింది. మైనర్‌గా ఉన్నప్పుడు తన మీద సెక్సువల్‌అబ్యూజ్ జరిగిందని. పూర్ణిమను పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఆ వ్యక్తి వయసు ఇప్పుడు 75 ఏళ్లు. ''ఆ సంఘటన జరిగింది దాదాపు నలభై ఏళ్ల కిందట. ఆ సమయంలో సెక్స్ అనే పదాన్ని కూడా నేను వినలేదు. చిన్నపిల్లల పట్ల అలా పాల్పడుతున్న నేరానికి ఓ పేరుంటుందన్న జ్ఞానం కూడా నాకులేదు'' అంటుంది నాటి పరిస్థితులను గుర్తుచేసుకుంటూ. కాలక్రమంలో పూర్ణిమను అలా బాధించిన వ్యక్తి కూతురుతోనే ఆమె అన్న పెళ్లి అయింది.

ఒకసారి..

మాంట్రియల్‌లో పూర్ణిమ, వాళ్ల వదిన ఇద్దరూ కలిసి టీవీ చూస్తున్నారు. అప్పుడూ ఇలాగే చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మీద షో వస్తోంది. ''ఇండియాలో అయితే ఇలాంటి ఘోరాలు ఉండవు'' అంటూ మొదలుపెట్టింది పూర్ణిమ వాళ్ల వదిన. వినీ వినీ ఒక్కసారిగా అంది పూర్ణిమ 'ఎందుకుండవ్? ఉంటాయి చాలా. నాకే జరిగింది'' దాదాపు అరిచినట్టుగా చెప్పింది. తనతో అలా ఎవరు ప్రవర్తించారో కూడా చెప్పింది. నిశ్చేష్టురాలైంది వదిన. ''మా నాన్నా?'' నమ్మలేనట్టుగా అడిగింది. ''అవును.. మీ నాన్నే'' చెప్పింది. తన తండ్రి పూర్ణిమతో ఎప్పుడూ వింతగా ప్రవర్తించడం గుర్తుకురాసాగింది ఆమెకు. ఎప్పుడైనా తన తండ్రి తనను దగ్గరకు తీసుకుంటున్నప్పుడు పూర్ణిమ కోపంగా వచ్చి తన తండ్రిని అవతలకు తోసేసేది. అలా ఎందుకు చేసేదో అప్పుడు ఆమెకు అర్థంకాలేదు. కాని ఈ రోజు అర్థమైంది. ఇక ఆ విషయం గురించి ఆ ఇద్దరు ఎప్పుడూ మాట్లాడుకోలేదు. కాని 1999లో అనుకుంటా.. పూర్ణిమా వాళ్ల అన్నయ్యకు పాప పుట్టింది. చంటిదాన్ని తీసుకొని ఇండియాకు రావల్సిందని ఆయన మామగారు ఆహ్వానించారు. అప్పుడు అడిగాడు పూర్ణిమ వాళ్లన్నయ్య ఆమెను.. ''మేము పాపను తీసుకొని ఇండియాకు... పర్టిక్యులర్‌గా ఆ ఇంటికి వెళ్లొచ్చా. నా బిడ్డకు క్షేమమేనా?'' అని అడిగాడు. ''క్షేమం కాదు'' అని చెప్పింది ఖరాకండిగా. ఎందుకో కూడా వివరించింది. నివ్వెరపోయాడు అన్న. బిడ్డతో ఇండియాకు వెళ్లినప్పుడు మామగారిని నిలదీశాడు. తర్వాత అత్తగారినీ అడిగాడు. ''నాకు మెలకువ వచ్చిచూసినప్పుడల్లా ఆయన పూర్ణిమ పక్కనే కనపడేవాడు. పీడకలతో పిల్ల ఉలిక్కిపడుతుంటే ధైర్యం చెబుతున్నా అనేవాడు'' అంది. ఇదంతా అయ్యాక పూర్ణిమతో ఆమె.. ''మా ఆయన నిన్ను కూతురు వాత్సల్యంతోనే చూశాడు. ముట్టుకున్నాడు. నువ్వేమనుకున్నా అతను నా దేవుడు. క్షమించు'' అంది. ఈ సంఘటన తర్వాత తన కజిన్‌తో కూడా మాట్లాడ్డం మానేసింది పూర్ణిమ. ఆమె, వాళ్లన్నయ్య బాగా ఆలోచించి ఒకటి నిశ్చయించుకున్నారు. తమ ఆడపిల్లలకే కాదు ఆ కుటుంబంలోని అమ్మాయిలందరికీ రక్షణ కావాలని. దాంతో చిన్నప్పుడు తనకేం జరిగిందో వివరిస్తూ తమ పరివారంలోని సభ్యులందరికీ ఈ-మెయిల్ చేసింది పూర్ణిమ. ''ఓ చేదు గతాన్ని... అదీ భయంతో గడిచిన బాల్యం గురించి అలా అందరికీ చెప్పడం మానసికంగా నన్ను చాలా డిస్టర్బ్ చేసింది. వినడం వల్ల మా వాళ్లు కూడా డిస్టర్బ్ అయ్యారు'' అంటారు పూర్ణిమ. ఈ మెయిల్ చదివిన ఇంకో కుటుంబసభ్యురాలు ఆ వ్యక్తి తననూ చిన్నప్పుడు అలాగే చేశాడని పూర్ణిమ, వాళ్లన్నయ్యతో చెప్పుకుంది. ''చిన్నప్పటి ఆ దారుణం వల్ల నేను ఏ మగవాడినీ నమ్మలేకపోయా. చివరకు కట్టుకున్న భర్తను కూడా. పిల్లల్ని కనాలంటే భయమేసేది. వాళ్లను కాపాడుకోగలనా అని మథనపడేదాన్ని. ఇలాంటి నరకంతోనే పదహారేళ్ల వైవాహిక జీవితం గడిచిపోయింది. భర్తతో చనువుగా ప్రవర్తించలేక.. అతనితో సఖ్యంగా ఉండలేక చివరకు విడాకులతో ఆ బంధాన్ని సమాప్తం చేసుకున్నా'' అని చెప్పింది పూర్ణిమ. ''ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపిన నేను నన్ను అబ్యూజ్ చేసిన అతని మీద కంప్లయింట్ ఇచ్చిన రాత్రి హాయిగా... ప్రశాంతంగా నిద్రపోయా''అని అంది. ఇదే విషయం మీద కెనడా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోనూ కంప్లయింట్ ఫైల్ చేసింది ఆమె.

అయితే ఆమె కంప్లయింట్ మీద చాలాతర్జనభర్జనలు, చర్చలూ జరిగాయి... ఎప్పుడో చిన్నప్పుడు జరిగిన అబ్యూజ్‌ను ఇన్నేళ్ల తర్వాత కంప్లయింట్‌గా ఇస్తే దాన్ని పోక్సో చట్టంకింద తీసుకోవచ్చా అని! ఇప్పుడు విమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ మంత్రిత్వశాఖ చిన్నప్పుడు జరిగిన సెక్సువల్ అబ్యూజ్‌ను తన జీవితకాలంలో ఎప్పుడైనా సరే కంప్లయింట్ ఇవ్వచ్చు అనే దిశలో చట్టంలో మార్పులు చేయడానికి అడుగులు వేస్తోంది. ఈ శుభపరిణామానికి పూర్ణిమ గోవిందరాజులు ప్రయత్నమే కారణం.

- శరాది

ఈ వారం YouTube హిట్స్

సమ్మక్క సారక్క - కామెడీ షో

'మై విలేజ్ షో' యూ ట్యూబ్ చానల్ ద్వారా ఇద్దరు తెలంగాణ వ్యక్తులు ఫేమ్‌లోకి వచ్చారు. ఒకరు గంగవ్వ. మరొకరు రాజు. వీళ్లిద్దరూ తల్లీకొడుకులుగా చేసే వీడియో షోస్‌కు పెద్ద ఆదరణ ఉంది. శ్రీరామ్ శ్రీకాంత్ అనే ఔత్సాహికుడు ఈ షోస్‌కు రచన, దర్శకత్వం నిర్వహిస్తుంటాడు. కరీంనగర్ సమీపంలోని 'లంబాడి పల్లి' అనే ఊరిలో గంగవ్వ, రాజు పాత్రల మధ్య సహజంగా జరిగే హాస్య సంభాషణలు, ప్రహసనాలు ఈ చానెల్‌లో ఉంటాయి. తాజాగా 'సమ్మక్క సారక్క జాతర' పేరున ఒక వీడియో విడుదల చేశారు. అమాయకురాలైన తల్లి, కొంచెం చదివి ఫ్యాషన్‌కు పోయే కొడుకు సమ్మక్క సారక్క జాతర కోసం ఎలా సిద్ధమయ్యారనేది కంటెంట్. అచ్చతెనుగు తెలంగాణ భాషలో సాగే ఈ సంభాషణలు వినడానికి చూడటానికి ముచ్చటగా, హాస్యం వచ్చేలా ఉంటాయి. పెట్టిన నాలుగు రోజులకే 11 లక్షల హిట్స్ సాధించిన వీడియో ఇది.



నిడివి: 6 ని. 37 సె.; హిట్స్: 13,11,650

బ్రేకప్ సైకిల్ - షార్ట్‌ఫిల్మ్



నిడివి: 5 ని. 45 సె.; హిట్స్: 11,08,100

యూ ట్యూబ్ చానెల్స్ ద్వారా పాపులర్ అయిన 'ఫన్నీ గర్ల్' ప్రాజక్త కోలి తాజా వీడియో 'బ్రేకప్ సైకిల్'. ఇవాళ రేపు కుర్రకారు మధ్య టీ తాగినంత సామాన్యంగా బ్రేకప్స్ అయిపోతున్నాయి. బ్రేకప్ పార్టీలు కూడా జరుగుతున్నాయి. అలా బ్రేకప్ అయిన ఒక కుర్రాడు, బ్రేకప్ అయిన మరో అమ్మాయి కలిసి కాసేపు కబుర్లు చెప్పుకోవడం ఈ వీడియో. 'నా గర్ల్‌ఫ్రెండ్ పేరు ఉష. కాని బతుకంతా చీకటి చేసి వెళ్లిపోయింది' అని అతడంటే 'నా బోయ్‌ఫ్రెండ్ పేరు ప్రకాశ్. అతను కూడా అంతే' అని ఆమె అంటుంది. నా గర్ల్ ఫ్రెండ్ కోసం అన్ని చేశాను అని ఇతడంటే నా బోయ్‌ఫ్రెండ్ కోసం ఇన్ని చేశాను అని ఈ అమ్మాయి అంటుంది. చివరకు కుర్రాడు బిల్ పే చేస్తాడు. కాని మగాడి బుద్ధి ఊరికే ఉండదు కదా. కలిసి టీ తాగిన పాపానికి ఫోన్ నంబర్ అడుగుతాడు. ఆ అమ్మాయి ఇస్తుంది. అతడు హుషారుగా తిరిగి వచ్చి మరసటి రోజు ఫోన్ చేస్తాడు. ట్విస్ట్ ఏమిటంటే అది రాంగ్ నంబర్. సరదాగా ఉన్న ఈ వీడియో పోస్ట్ అయిన నాలుగు రోజులకు పది లక్షల హిట్స్ దాటిపోయింది.

బియాండ్ ది క్లౌడ్స్ - ట్రైలర్



నిడివి: 2 ని. 15 సె.; హిట్స్: 53,05,675

స్లమ్స్‌లో ఉండేవాళ్ల జీవితంపై పారలల్ సినిమాలు వచ్చాయి కానీ సీరియస్ కమర్షియల్ సినిమాలు రాలేదు. 'స్లమ్‌డాగ్ మిలియనీర్' తీసినది మన దర్శకుడు కాదన్న సంగతి మనకు తెలిసిందే. మన స్లమ్స్‌లో ఉన్నవాళ్ల జీవితాలను బిగువుగా చెప్పడానికి మరో పరాయి దర్శకుడు వచ్చాడు. మజిద్ మాజిది. సుప్రసిద్ధ ఇరాన్ దర్శకుడైన మజిద్ మాజిది తన 'చిల్డ్రన్ ఆఫ్ హెవన్', 'ది సాంగ్ ఆఫ్ స్పారోస్' వంటి గొప్ప సినిమాలు తీసి అంతర్జాతీయ ఖ్యాతి పొందాడు. అతడు ఇప్పుడు మొదటిసారిగా హిందీలో 'బియాండ్ ది క్లౌడ్స్' సినిమాతో రానున్నాడు. స్లమ్స్‌లో డ్రగ్స్‌ను చేరవేసే ఒక కుర్రాడి కథ ఇది. అతడు, అతడి ప్రియురాలు, కుటుంబం ఒక క్రైమ్‌లో ఎలా ఇరుక్కున్నారన్నది కథ. ఏ.ఆర్. రహమాన్ ఈ సినిమాకు సంగీతం అందించాడు. విశాల్ భరద్వాజ్ మాటలు రాశాడు. కొత్త నటీనటులు ఉన్న ఈ సినిమా ట్రైలర్ యూ ట్యూబ్‌లో ఈ వారం విడుదలయ్యి కుతూహలం రేపుతోంది.

చమక్ చమక్ చామ్ - రీమిక్స్



నిడివి: 5 ని. 58 సె.; హిట్స్: 16,08,006

మెగాస్టార్ చిరంజీవి మేనల్లుడు సాయి ధరమ్‌తేజ్ తన మేనమామ పాటలకు మెల్లగా హక్కుదారుడవుతున్నాడు. రామ్‌చరణ్, అల్లు అర్జున్ కంటే సాయి ధరమ్ తేజ్ ఎక్కువగా చిరంజీవి పాటలను రీమిక్స్ చేసి తన సినిమాలలో వాడుతున్నాడు. గతంలో అతడు 'అందం హిందోళం', 'గువ్వా గోరింకతో' పాటలను రీమిక్స్ చేశాడు. తాజాగా 'కొండవీటి దొంగ'లోని 'చమక్ చమక్‌చామ్' పాటతో 'ఇంటిలిజెంట్' సినిమా ద్వారా మన ముందుకు వస్తున్నాడు. వివి వినాయక్ దర్శకత్వంలో లావణ్య త్రిపాఠి హీరోయిన్‌గా నిర్మితమైన ఈ సినిమాలో సాయి ధరమ్‌తేజ్ మాస్ క్యారెక్టర్ చేశాడని వినికిడి. మెగా అభిమానులను ఆకర్షించడంలో భాగంగా 'చమక్ చమక్‌చామ్' పాటను ఇందులో ఉపయోగించి ఉండొచ్చు. ఇళయరాజా చేసిన ఈ పాట గతంలో పెద్ద హిట్ అయ్యింది. స్టెప్స్ వేయడంలో చిరంజీవి పోలికలున్న సాయి ధరమ్ తేజ్ ఈ పాటనూ పండిస్తాడనే ఆశిద్దాం. యూట్యూబ్‌లో ఈ పాట 14 లక్షల హిట్స్‌కు చేరుకుంది.

హెల్దీ డైట్

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు...
ఎంతోమంది పేదవారికి విద్యను
ప్రసాదించే దేవాలయాలు...
ఆ దేవాలయాల పరిస్థితి ఎంత బాగుంటే...
విద్యావిధానం కూడా అంతే బాగుంటుంది....
ఇందుకు ప్రభుత్వాలే కాదు అందరూ బాధ్యత తీసుకోవాలి...
ఝార్ఖండ్ హజీరాబాఘ్ పట్వాడీ అంగన్‌వాడీ
పరిస్థితి దయనీయంగా ఉంది... ఒక అధికారి దత్తత
తీసుకున్నారు... ఇప్పుడు అది అందాలను సంతరించుకుంది...

అది ఆమె స్కూల్



● గరిమాసింగ్, ఐఏయస్

గరిమా సింగ్ ఆలిండియాలో 2015లో యుపిఎస్‌సిలో 55వ ర్యాంకు సాధించారు. అంతకు ముందు ఆమె ఐపీయస్ ఆఫీసర్‌గా ఉన్నప్పుడు మహిళల తక్షణ రక్షణ కోసం ఓ రెస్క్యూ ఫోన్ నంబరును ఏర్పాటు చేశారు. మహిళా రక్షణ టీమ్‌లో తానూ సభ్యులుగా ఉన్నారు. మోహన్‌లాల్‌గంజ్ రేప్ కేసును పరిష్కరించారు.

నిజాయితీకి మారుపేరుగా నిలిచే ఆమె ఒక సిన్సియర్ పోలీస్ ఆఫీసర్. తన మంచి పనులతో తన పరిధిలో ఉన్న మహిళలకు, అణగారిన వర్గాల వారికి రోల్‌మోడల్‌గా నిలిచారు గరిమ సింగ్.



● మట్వారీ అంగన్‌వాడీ

గరిమ... ఐపీయస్ నుంచి ఐఏయస్‌గా మారారు. కలెక్టరుగా ఆవిడ విధానాలు చాలా కొత్తగా అందరికీ ఉపయోగపడే విధంగా ఉంటాయి. 2016లో కలెక్టరుగా ఆవిడ నిర్వహించిన మొదటి బాధ్యత ఝార్ఖండ్ హజీరాబాఘ్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖలో అదనపు బాధ్యతలు. ''ఈ బాధ్యత... పిల్లలకు విద్యావకాశాలు మెరుగు పరచడానికి నాకు ఎంతో ఉపయోగపడింది. అది నాకు మరపురాని సంఘటన'' అని చెబుతారు గరిమ సింగ్.

అక్కడి స్థానిక అంగన్‌వాడీలో పరిస్థితులు హీనంగా ఉండటం చూసి, గరిమ వెంటనే పాఠశాల పునరుద్ధరణకు నడుం బిగించారు.

''విద్యార్థులు తమ తొలి తరగతుల్లో చదువుకున్న అంశాలు వారి మెదడులో నిలిచిపోయేలా ఉండాలి. విద్యా విధానం కూడా అందుకు అనువుగా రూపొందాలి'' అంటారు గరిమ. మట్వారీ మస్జిద్ రోడ్‌లో ఉన్న అంగన్‌వాడీని తాను దత్తత తీసుకున్నారు. ఆ పాఠశాలను అభివృద్ధిచేసి, జిల్లాకే ఆ పాఠశాలను ఆదర్శంగా నిలపాలనుకున్నారు.

తాను దాచుకున్న డబ్బులలో నుంచి ఏభై వేల రూపాయలు ఖర్చు చేశారు. బిల్డింగ్‌కి రంగులు వేయించి, కొత్తగా తయారుచేశారు. అక్షరమాలను గోడల మీద వేసి, గుమ్మంలోని పెద్ద హోర్డింగ్ పెట్టారు.

ప్రీ స్కూల్‌కి అవసరమైన చార్టులు, బ్లాకులు, బొమ్మలు కొని ఇచ్చారు. వీటి ద్వారా పిల్లలు అన్ని విషయాలు బాగా తెలుసుకుంటారంటారు గరిమ. ఊగే గుర్రపు బొమ్మను కూడా ఇచ్చారు. ''ప్రీస్కూల్ పిల్లలకు గుర్రం మీద కూర్చుని ఊగుతూ విద్యనేర్చుకోవడం సరదాగా ఉంటుంది కదా'' అంటారామె.

'మట్వారీ కేంద్ర పరిస్థితి అస్సలు బాగా లేదు. చదువుకునే ప్రదేశం ప్రశాంతంగా, అందంగా ఉండకపోతే, పిల్లలు చదవడానికి ఇష్టపడరు. పెద్ద పెద్ద ఆఫీసర్లు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారవేత్తలు... వంటి వారు అంగన్‌వాడీలను దత్తత తీసుకుంటే బాగుంటుంది' అంటారు గరిమ. ఈ సంవత్సరం మార్చినాటికి మొత్తం 50 అంగన్‌వాడీలను బాగుచేసే పనిలో ఉన్నారు గరిమ.

ఇప్పుడు మట్వారీ అంగన్‌వాడీ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కలెక్టరు చేతుల మీదుగా ప్రారంభోత్సవాని సిద్ధంగా ఉంది. ఈ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు వారి విద్యాభ్యాసం మరపురానిదిగా మిగిలిపోతుంది అంటున్నారు గరిమసింగ్.

గరిమ సింగ్ వంటి ఉన్నతాధికారి పూనుకోవడంతో ఒక జిల్లాలోని అంగన్‌వాడీలన్నీ నూతనత్వాన్ని సంతరించుకుంటున్నాయి. మరింత మంది అధికారులు ఇలాగే ముందుకు వస్తే, మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది.



● ఝార్ఖండ్ హజీరాబాఘ్‌లో జిల్లాలోని స్థానిక మట్వారీ అంగన్‌వాడీ రూపురేఖలు మార్చిన తరువాత...

ఆస్కార్ 2018 ఉత్తమ నటి ఎవరో?

ఆస్కార్.. ఆస్కార్.. ఆస్కార్ అని హాలీవుడ్ అంతా జనవరి మొదట్నుంచీ ఒకే పాట పాడుతోంది. మార్చి 4న ఆస్కార్ అవార్డులను ప్రకటించేవరకూ ఈ పాట రిథమిక్‌గా మోగుతూనే ఉంటుంది. మన దగ్గరా హాలీవుడ్ సినిమా అభిమానులు ఈ పాటను అందుకుంటున్నారు. ఏ సినిమా బెస్ట్ పిక్చర్ అవుతుంది? బెస్ట్ యాక్టర్ ఎవరవుతారు? బెస్ట్ యాక్ట్రెస్‌గా ఎవరు అవార్డు అందుకుంటారు? అన్నీ చర్చలే! నామినేషన్స్ కూడా అనౌన్స్ అయ్యాక ఈ చర్చ ఇంకా తారాస్థాయికి చేరిపోయింది. బెస్ట్ యాక్ట్రెస్ (ఉత్తమ నటి)గా నామినేషన్స్ ఎవరెవరు దక్కించుకున్నారో, వారిలో ఎవరికి అవార్డు రావడానికి ఎక్కువ స్కోప్ ఉందో చూద్దాం..



● ఫ్రాన్సిస్ మెక్‌డొర్మాండ్ ● సాలీ హాకిన్స్ ● మెరిల్ స్ట్రీప్ ● సీర్షా రోనాన్ ● మార్గో రాబీ

సాలీ హాకిన్స్ (చిత్రం: ది షేప్ ఆఫ్ వాటర్)

'ది షేప్ ఆఫ్ వాటర్'.. ఈ ఏడాది బెస్ట్ పిక్చర్ జాబితాలో అవార్డు అందుకునేందుకు గట్టి పోటీనిస్తోంది. ఈ సినిమాలో ప్రధాన పాత్రలో హాకిన్స్ నటన కూడా ది బెస్ట్ అనిపించుకుంది. ఒక్క డైలాగ్ కూడా ఉండదు హాకిన్స్‌కు ఈ సినిమాలో. ఒక గవర్నమెంట్ ల్యాబ్‌లో మూగ భాషతోనే చెప్పాలనుకున్న విషయాలు చెప్తుంది. ఈ పాత్రలో హాకిన్స్ నటన 'అద్భుతం' అన్న కితాబులు అన్ని వైపుల నుంచీ వచ్చాయి. నామినేషన్స్ దక్కించుకున్న ఐదుగురిలో ఒకరైన హాకిన్స్‌కు అవార్డు దక్కే అవకాశాలు చాలానే ఉన్నాయి.

గతంలో 'బ్లూ జాస్మిన్' (2013) అనే సినిమాలో బెస్ట్ సపోర్టింగ్ రోల్‌కు ఆస్కార్‌కు నామినేట్ అయింది హాకిన్స్. 'ది షేప్ ఆఫ్ వాటర్'కి గనక ఆమె అవార్డు అందుకుంటే ఉత్తమ నటిగా అదే ఆమెకు మొదటి అవార్డు.

ఫ్రాన్సిస్ మెక్‌డొర్మాండ్

చిత్రం: త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి

'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి'.. ఈ సినిమా ఎవ్వరూ ఊహించని విధంగా బెస్ట్ పిక్చర్‌గా గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కించుకున్నాక మరింత పాపులర్ అయింది. ఈ సినిమా ఆస్కార్ నామినేషన్ దక్కించుకుంటే గొప్పే అని అన్నవారంతా, ఇప్పుడు గట్టి పోటీ ఇచ్చే సినిమాగా కూడా చూస్తున్నారు. ఇందులో ఫ్రాన్సిస్ మెక్‌డొర్మాండ్ వ్యవస్థపై పోరాడే ఓ తల్లి పాత్రలో కనిపించింది. కూతురును రేప్ చేసి, మర్డర్ చేస్తే, దానిపై తనకు కావాల్సిన సమాధానాల కోసం, జరగాల్సిన న్యాయం కోసం పోరాడే తల్లి పాత్రలో ఫ్రాన్సిస్ నటనకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సినిమాకు ఆ పాత్రతోనే ఒక ప్రత్యేకమైన డెప్త్ వచ్చింది అంటారు హాలీవుడ్ సినీ పండితులు.

ఫ్రాన్సిస్ గతంలో 'మిసిస్సిపి బర్నింగ్' (1999), 'ఆల్మోస్ట్ ఫేమస్' (2001), 'నార్త్ కంట్రీ' (2006) సినిమాలకు బెస్ట్ యాక్ట్రెస్ సపోర్టింగ్ రోల్‌లో ఆస్కార్‌కు నామినేట్ అయింది. 'ఫార్గో' (1997)కి ఉత్తమ నటిగా ఒక అవార్డు కూడా అందుకుంది. ఇప్పుడు 2018లోనూ ఆస్కార్ కొడితే ఆమెకిది రెండో ఆస్కార్!

మార్గో రాబీ (చిత్రం: ఐ, టోన్యా)

'ఐ, టోన్యా'.. ఫిగర్ స్కేటర్ టోన్యా హార్డింగ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన సినిమా. ఆమె జీవితంలో కాంట్రవర్సీగా నిలిచిన కొన్ని విషయాలను ప్రస్తావిస్తూ సాగే ఈ సినిమాలో టోన్యా పాత్రలో మార్గో రాబీ నటించింది. మార్గో నటనే ఈ సినిమాకు మేజర్ హైలైట్స్‌లో ఒకటిగా నిలిచింది. ఈ సినిమాతోనే మార్గో నటిగా ఓ గుర్తింపు కూడా తెచ్చుకుంది. 'ఐ, టోన్యా' ఆమెకు మొట్టమొదటి ఆస్కార్ నామినేషన్. బెస్ట్ యాక్ట్రెస్ నామినేషన్స్‌లో ఉన్న మిగతావారితో పోల్చితే మార్గోపై అంచనాలు తక్కువే ఉన్నా, మంచి పోటీ ఇచ్చే అవకాశమైతే ఉంది.

సీర్షా రోనాన్ (చిత్రం: లేడీ బర్డ్)

'లేడీ బర్డ్'.. ఇటు బాక్సాఫీస్ పరంగా, అటు విమర్శకుల ప్రశంసల పరంగా 2017లో సూపర్ హిట్ అనిపించుకున్న సినిమాల్లో ఒకటి. ఇందులో ఒక హైస్కూల్ స్టూడెంట్ పాత్రలో రోనాన్ నటన అద్భుతం అనే కితాబులిచ్చారంతా. కమింగ్ ఆఫ్ ఏజ్ ప్రేమలు, వాళ్ల ఆలోచనల చుట్టూ కథ తిరుగుతుంది. రోనాన్ తప్ప ఇంకెవ్వరూ ఈ పాత్రలో నటించలేరు అన్నట్టుగా చేసిందామె. ఆస్కార్ అవార్డు నామినేషన్స్ పొందిన ఐదుగురిలో రోనాన్‌కు అన్ని విధాలా బెస్ట్ యాక్ట్రెస్ అవార్డు అందుకునే అర్హత, అవకాశం ఉన్నాయి. ఇది రోనాన్‌కు ఫస్ట్ ఆస్కార్ నామినేషన్. ఒకవేళ రోనాన్ ఆస్కార్ కొడితే, చిన్న వయసులో బెస్ట్ యాక్ట్రెస్‌గా అవార్డు అందుకున్న క్యాటగిరీలో నాలుగో స్థానంలో చేరుతుందామె. ఆమె వయసు ఇప్పుడు 23 సంవత్సరాలు.

మెరిల్ స్ట్రీప్ (చిత్రం: ది పోస్ట్)

'ది పోస్ట్'.. ఎంతోమంది దర్శకులకు ఇన్స్‌పిరేషన్ అయిన స్పీల్‌బర్గ్ తీసిన సినిమా. గత డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పట్నుంచీ ఏదో ఒక విధంగా వార్తల్లో ఉంది. స్పీల్‌బర్గ్ తన స్థాయికి తగ్గ సినిమా తీస్తే ఎలా ఉంటుందో అలా ఉంది 'ది పోస్ట్'. ఇక ఇందులో మెరిల్ స్ట్రీప్ నటన మేజర్ హైలైట్స్‌లో ఒకటి. వియత్నాం వార్ టైమ్‌లో ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని సీక్రెట్స్‌ను బయటపెట్టే కథతో ఆసక్తికరంగా నడుస్తుంది 'ది పోస్ట్'. ఇందులో మెరిల్ ఓ జర్నలిస్ట్‌గా కనిపిస్తుంది. మెరిల్ ఇప్పటివరకూ చేసిన వాటిల్లో ది బెస్ట్ అనేంతగా విమర్శకులను మెప్పించిందీ పాత్రతో! ఇప్పటికే బెస్ట్ యాక్ట్రెస్‌గా రెండు, సపోర్టింగ్ రోల్‌లో ఒక ఆస్కార్ పొందిన మెరిల్, ఈ రెండు క్యాటగిరీల్లో మొత్తం 17 నామినేషన్స్ దక్కించుకున్నారు ఇప్పటివరకూ.

ఆస్కార్ లిస్ట్‌లో అందరికీ గట్టి పోటీ ఇవ్వగల మెరిల్ స్ట్రీప్ ఆస్కార్‌ను కూడా సొంతం చేసుకునే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. ఈ లిస్ట్ మొత్తంలో ఎక్కువ క్రేజ్ మెరిల్ స్ట్రీప్‌కే కనిపిస్తోంది. అయితే ఆస్కార్ రిజల్ట్ ఎలా ఉంటుందన్నది మార్చి 4 వరకూ చెప్పలేం!!

బ్రిట్నీ స్పియర్స్ మోసపోయిందా?

పాపులర్ సింగర్ బ్రిట్నీ స్పియర్స్ గురించి ప్రత్యేకించి పరిచయం అక్కర్లేదు. 2010 నుంచీ కొన్నేళ్ల పాటు ఇటు పర్సనల్‌గా, కెరీర్ పరంగా చాలా కష్టాలనే ఎదుర్కొన్న ఆమె, ఇప్పుడిప్పుడే అన్నీ సెట్ చేస్కొని చక్కగా లైఫ్‌ని లీడ్ చేస్తోంది. ముఖ్యంగా శామ్ అస్గరీతో ప్రేమలో పడ్డాక బ్రిట్నీ లైఫంతా మారిపోయింది. ఇప్పుడు ఊహించనంత సంతోషంగా రోజులను గడుపుతోందామె. ఎక్కడ చూసినా ఈ జంటే కనిపిస్తారు. బ్రిట్నీకేమో 36 ఏళ్లు. శామ్ అస్గరీకి 23 ఏళ్లు. వయసులో చాలా తేడా ఉన్నా ఇద్దరూ చూడముచ్చటగా కనిపిస్తారు. అది వాళ్లిద్దరూ ఒకరినొకరు ఇష్టంగా ప్రేమించుకోవడం వల్లేనేమో! కపుల్ గోల్స్ క్యాటగిరీలో వీళ్లనూ పడేస్తుంటారు నెటిజన్స్. ఇంతవరకూ బాగానే ఉంది. ఇక్కడే తాజాగా బయటకొస్తోన్న ఓ వార్త కొంత తేడాగా ఉంది.


● బ్రిట్నీ స్పియర్స్, శామ్ అస్గరీ

ఓవైపు బ్రిట్నీతో ప్రేమలో ఉంటూనే, మరోవైపు వేరే అమ్మాయిలతోనూ డేట్ చేస్తున్నాడట శామ్. ఇదెంతవరకూ నిజమన్నది ఎవ్వరికీ తెలియదు కానీ డేటింగ్ యాప్స్‌లో శామ్ అఫీషియల్ అకౌంట్స్ ఉన్నాయని, బ్రిట్నీతో పాటుగా, అతను వేరే అమ్మాయిల వెంట కూడా పడుతున్నాడని ఈ అకౌంట్స్ చూపించి, చెబుతున్నారు నెటిజన్లు. బ్రిట్నీ అంత పాపులర్ కాదు శామ్. మోడల్‌గా ఇప్పుడే కెరీర్‌లో వృద్ధిలోకి వస్తున్నాడు. అలాంటి వాడు బ్రిట్నీనే మోసం చేస్తున్నాడా? బ్రిట్నీ నిజంగానే ప్రేమలో మోసపోతోందా? కాలమే సమాధానం చెప్పాలి. శామ్ అయితే తాను అలాంటి వాడిని కానని క్లీన్ చీట్ ఇచ్చుకుంటున్నాడు తనకు తానే! చూడాలి... ఈ ప్రేమకథ ఎటు వెళుతుందో!!

బిల్డింగు దూకబోతే..!


● టామ్ క్రూయిజ్

ఆగస్టు నెల. 2017. 'మిషన్ ఇంపాజిబుల్ 6' షూటింగ్ జరుగుతోంది. టామ్ క్రూయిజ్ ఒక బిల్డింగ్ మీద నుంచి పరిగెత్తుకుంటూ వస్తున్నాడు. ఆ యాక్షన్ సీన్‌కు అనుగుణంగా ఆయనకు వైర్లు కట్టి ఉంచారు. పరిగెత్తుకుంటూ వచ్చి క్రూయిజ్ ఒక బిల్డింగ్ మీది నుంచి ఇంకో బిల్డింగ్ మీదకు దూకాలి. క్రూయిజ్ పరిగెత్తుకుంటూ వస్తున్నాడు. ఒక్క ఉదుటున గాల్లో ఎగిరి పక్క బిల్డింగ్ మీద లాండ్ అవ్వబోతున్నాడు. చిన్న గ్యాప్. అంతే పక్క బిల్డింగ్ మీద ల్యాండ్ అవ్వాల్సిన వాడు కాస్తా ఆ గోడకు గట్టిగా గుద్దుకున్నాడు. ముందు పాదం గట్టిగా గోడను తాకింది. ఆ తర్వాత బాడీ కూడా. చుట్టూ కెమేరాలున్నాయి. వైర్లతో కట్టి ఉంచారు కాబట్టి క్రూయిజ్ కిందపడడు. అలాగే అంత పెద్ద దెబ్బ తగిలినా వెంటనే లేచి, ఆ బిల్డింగ్‌పైకి అడుగుపెట్టి మళ్లీ పరిగెడుతూ ఆ సీన్ పూర్తి చేశాడు క్రూయిజ్. అప్పటికే చీలమండకు పెద్ద గాయమైంది. ఈ సీన్ అయితే పూర్తి చేశాడు కానీ, ఆ తర్వాత కొంతకాలం పాటు షూటింగ్ అంతా పక్కన పెట్టాల్సినంత పరిస్థితి వచ్చింది. ఇప్పుడిప్పుడే మళ్లీ కోలుకోవడంతో షూట్ మళ్లీ మొదలుపెట్టారు. జూలై 27న ఎలాగైనా సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు టీమ్ పనులన్నీ వేగవంతం చేసింది. ఈ సంఘటన జరిగి ఇన్ని నెలలయ్యాక టామ్ క్రూయిజ్, ఆ వీడియోను విడుదల చేస్తూ అసలు విషయం చెప్పుకొచ్చాడు. ఈ సందర్భంగానే సినిమాకు 'మిషన్ ఇంపాజిబుల్ : ఫాల్ ఔట్' అన్న పేరును ఖరారు చేసినట్టు తెలిపాడు. అంతపెద్ద దెబ్బ తగిలినా, తన పనిపట్ల టామ్ క్రూయిజ్ చూపించిన డెడికేషన్‌కు ఫ్యాన్స్ అయితే ఫిదా అయిపోయారు. 'ఇది చిన్న విషయమేలే!' అన్నట్టు క్రూయిజ్ నవ్వి ఊరుకుంటున్నాడు కానీ, ఆయన వయసు ఇప్పుడు 55! ఇదేం చిన్న విషయమైతే కాదు!!


● ఫాల్ ఔట్‌లో ఓ దృశ్యం

ఆ డబ్బు నేను ఉంచుకోను!!

'ఎ రెయినీ డే ఇన్ న్యూయార్క్' అనే సినిమాలో రెబెక్కా హాల్ ఓ కీలక పాత్రలో నటిస్తోంది. ఉడీ అలెన్ ఈ సినిమాకు దర్శకుడు. సెప్టెంబర్‌లో మొదలైన ఈ సినిమా షూట్ ఇప్పటికే దాదాపుగా పూర్తి కావొచ్చింది. ఈ టైమ్‌లో ''ఈ సినిమాకు పనిచేసినందుకు సిగ్గుపడుతున్నా. ఈ సినిమాకు నాకొచ్చిన రెమ్యునరేషన్‌లో ఒక్క డాలర్ కూడా నేను ఉంచుకోను'' అని చెప్పేసి 'టైమ్ ఈజ్ అప్' అనే సంస్థకు ఆ డబ్బు డొనేట్ చేసింది రెబెక్కా. రెబెక్కా మాత్రమే కాదు, ఈ సినిమాకు పనిచేసిన స్టార్స్ అంతా జీవితంలో మళ్లీ ఉడీ అలెన్‌తో పనిచేయమని చెప్పేసి తమ రెమ్యునరేషన్‌ను టైమ్ ఈజ్ అప్ అనే సంస్థకు డొనేట్ చేశారు. అన్నీ బాగుంటే 'ఎ రెయినీ డే ఇన్ న్యూయార్క్' 2018లో వచ్చే క్రేజీ సినిమాల్లో ఒకటి కావాలి. కానీ అలా కావడం లేదు. కారణం ఉడీ అలెన్. నిజానికి ఉడీ అలెన్ సినిమాలంటే ఆయన వల్లే క్రేజ్ తెచ్చుకుంటాయి. అలాంటిది ఇప్పుడు ఆయన పేరే ఇందుకు నెగటివ్‌గా మారింది. కారణం అలెన్ కూతురే ఆయన తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని చెప్పడం. ఇప్పుడీ ఆరోపణల వల్లే గ్రేటెస్ట్ ఫిల్మ్‌మేకర్స్‌లో ఒకరనిపించుకున్న అలెన్ ఒక్కసారే ఇలాంటి స్థాయికి వచ్చి పడిపోయాడు. ఇదే సినిమాకు పనిచేసిన తిమోతి, సెలెనా గొమేజ్ కూడా అలెన్‌తో మళ్లీ పనిచేయమని చెప్పేశారు. మొత్తం మీద ఇప్పుడు ఈ సినిమా విడుదల వరకూ వెళుతుందా? అన్న ప్రశ్న కూడా వినబడుతోంది.


● రెబెక్కా హాల్

కలయా.. నిజమా...
చైనా మాయా..



ఇక్కడ రెండు ఈఫిల్ టవర్లు ఉన్నాయి.. ఒకటి ప్యారిస్‌లో.. రెండోది చైనాలోని తయాండు చెంగ్‌లో ఉంది.. ఇంతకీ ఈ రెండిట్లో ఏది ఒరిజినల్ ఏది డూప్లికేట్?? తెలియడం లేదా.. లేటెస్ట్ ఐఫోన్‌కు కూడా వెంటనే డూప్లికేట్ తయారుచేసేసే చైనాలో.. ఈఫిల్ టవర్‌కు డూప్లికేట్ సృష్టించడం ఓ లెక్కా.. అందుకే తయాండుచెంగ్‌లో కట్టేశారు. చుట్టుపక్కల ఉన్న భవనాలను కూడా దాదాపు అరే రీతిలో నిర్మించారు. ఈఫిల్ విషయానికొస్తే.. అసలైనదాని పొడవుతో పోలిస్తే.. అందులో మూడోవంతు ఎత్తులో డూప్లికేట్ ను కట్టారు. ఇంతకీ ఒరిజినల్ ఏదో చెప్పలేదు కదూ. కుడివైపున ఉన్నది అసలైన ఈఫిల్ టవర్.


ఎడ్డీ.. అతని గర్ల్‌ఫ్రెండ్.. ఓ ఫొటో..

మధ్య ఆస్ట్రేలియాలోని ప్రఖ్యాత వులురు రాక్ ప్రాంతం.. సరదాగా తిరుగుదామని ఎడ్డీ అనే టూర్ గైడ్ తన గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి అక్కడికి వచ్చాడు.. అయితే, ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది.. భారీ వర్షం పడే సూచనలు.. ఉరుములు.. మెరుపులు.. ఫొటోగ్రఫీ అంటే పడిచచ్చే ఎడ్డీ వెంటనే కెమెరా తీసుకున్నాడు.. కొంచెం రిస్క్ తీసుకున్నాడు.. ఢదేలుమంటూ ఓ మెరుపు ఆకాశం నుంచి దూసుకొచ్చి.. వులురును తాకుతున్నట్లుగా ఉన్న ఈ సూపర్ చిత్రాన్ని తన కెమెరాలో బంధించాడు.. ఇంక ఎడ్డీ గర్ల్‌ఫ్రెండ్ కళ్లల్లో ఆనందం ఉంది చూడండి.. నా సామిరంగా..



డాలర్ల దంపు..
మన ట్రంపు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాగా రిచ్ అన్న సంగతి మనందరికీ తెలిసిందే.. అయితే.. ఎంత రిచ్.. గత అధ్యక్షుల కన్నా సంపన్నుడా? ఈ లెక్క తీయడం కోసం ట్రంపుతో పాటు మిగతా అధ్యక్షుల వ్యక్తిగత ఆస్తిని 2016 డాలర్ రేటు(అప్పట్లో ఒక డాలరు=రూ.67) ఆధారంగా విలువ కట్టారు. అంటే.. అప్పుడెప్పుడో ఓ లక్ష డాలర్లు ఉంటే.. అది 2016లో ఎంత అయిండేదన్న అంచనా ఆధారంగా అన్న మాట. తీరా చూస్తే.. నోరెళ్లబెట్టాల్సిన పరిస్థితి. మామూలుగానే ట్రంపు అత్యంత ధనికుడని తేలింది. అలా కాదని.. మిగతా వారి ఆస్తి మొత్తం ఓ వైపు.. ట్రంపు గారి వ్యక్తిగత ఆస్తి మరోవైపు.. తులాభారం వేసినా ట్రంపుగారే టాప్‌లో నిలిచారు.





విజయవాడలోని గుణదల మేరీ మాత ఉత్సవాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో ఆలయాన్ని మిరుమిట్లుగొలిపేలా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మా కొడుకు ఆచూకీ తెలపండి

ఉపరాష్ట్రపతికి ఇంజనీర్ శ్రీహర్షరెడ్డి తల్లిదండ్రుల వినతి



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుని కలిసిన లక్ష్మారెడ్డి కుటుంబసభ్యులు, తదితరులు

విజయవాడ రూరల్ (గన్నవరం): మహారాష్ట్రంలోని పుణే సమీపంలో కరాటే వద్ద వొడాఫోన్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తూ 18 నెలల క్రితం కనిపించకుండా పోయిన శ్రీహర్షరెడ్డి ఆచూకీ తెలుసుకోవాలని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకు అతని కుటుంబసభ్యులు విజ్ఞప్తి చేశారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులో వారు ఆదివారం వెంకయ్యను కలిశారు. తప్పిపోయిన శ్రీహర్ష విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి చెందిన గుడిబండ లక్ష్మారెడ్డి కుమారుడు. తన కుమారుడి కోసం ఏడాదిన్నరగా తిరుగుతున్నా జాడ తెలియడంలేదని కంటతడిపెట్టారు. స్పందించిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఓఎస్‌డీ(ఐఏఎస్)తో ఫోనులో మాట్లాడారు. శ్రీహర్షరెడ్డి వివరాలను తీసుకొని పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ముగిసిన ప్రపంచ తెలుగు సమాఖ్య రజతోత్సవాలు



రజతోత్సవ కార్యక్రమంలో గోరటి వెంకన్నను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, చెన్నై : చెన్నైలో రెండ్రోజులపాటు జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) 11వ ద్వైవార్షిక అంతర్జాతీయ మహాసభలు, రజతోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వ్యాపార సదస్సుతో ఆదివారం నాటి సమావేశాలు ప్రారంభం కాగా.. 'తెలుగుభాష, సంస్కృతి పరిరక్షణలో యువత, తల్లిదండ్రుల పాత్ర' అనే అంశంపై సహస్రావధాని గరికపాటి నరసింహారావు ప్రసంగం అందరినీ ఆలోచింపజేసింది. ప్రముఖ జానపద కవి, గాయకుడు గోరటి వెంకన్న నిర్వహించిన రేలారేరేలా కార్యక్రమం ఎంతో ఆనందింపజేసింది. కళాకారులను సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరాదత్ సత్కరించారు. ముగింపు సభలో కేంద్రమంత్రి సుజనాచౌదరి, వ్యాపారవేత్త 'నల్లి' కుప్పుస్వామి ప్రసంగించారు. సినీనటి గాయత్రి భార్గవి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

గాజువాకలో నవ వధువు అనుమానాస్పద మృతి



భర్త రాజుతో సంధ్య (ఫైల్)

గాజువాక: విశాఖ జిల్లా గాజువాకలో నవ వదువు అనుమానాస్పద స్థితిలో శనివారం రాత్రి మృతి చెందింది. ఆమెది వరకట్న హత్యేనని అని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా బుచ్చయ్యపేట మండలం ఎల్‌బీపురం గ్రామానికి చెందిన పర్రె రాజు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇదే జిల్లా చోడవరం మండలం నర్సయ్యపేటకు చెందిన సంధ్య (19)ను నాలుగు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. రెండు నెలల క్రితం స్థానిక బీసీ రోడ్‌లోని భానోజీతోటలో కాపురం పెట్టాడు. అక్కడికి సమీపంలో కణితి రోడ్ ఏరియాలో ఉంటున్న తన సోదరి నాగమణి ఇంటికి వెళ్లి వచ్చేసరికి సంధ్య ఉరి వేసుకొని మృతి చెందిందని మృతురాలి తండ్రి గంట్ల అప్పారావుకు శనివారం రాత్రి ఫోన్ చేశాడు. మృతదేహాన్ని పరిశీలించిన ఆమె బంధువులు దేహంపై గాయాలున్నాయని, ఒక చేయి విరిగిపోయి ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహమైనప్పట్నుంచీ వరకట్నం కోసం అల్లుడు రాజు, అతడి సోదరి నాగమణి తమ కుమార్తెను వేధిస్తున్నారని మృతురాలి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా, మృతురాలి భర్త రాజు బుచ్చియ్యపేట పోలీసుల అదుపులో ఉన్నట్టు గాజువాక పోలీసులు తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్లలో మెడికో!

తిరుపతి సిటీ: చిత్తూరు జిల్లా తిరుపతి మంగళం సమీపంలోని శేషాచలం అడవుల్లో ఆదివారం రాత్రి ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లలో ఒకరు తమిళనాడుకు చెందిన ఓ వైద్య విద్యార్థి ఉన్నట్టు అధికారులు గుర్తించారు. కాగా, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ విజయ నరసింహులు, సిబ్బంది అడవిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు స్మగ్లర్లు తారసపడ్డారు. నిందితులు కర్ణాటకకు చెందిన ఏసు, తమిళనాడు వేలూరుకి చెందిన అజిత్ కుమార్‌గా గుర్తించారు. కాగా, అజిత్ కుమార్ తిరువణ్ణామలై వర్సిటీలో వైద్య విద్య అభ్యసిస్తున్నట్టు గుర్తించారు.

బంగారు కలశం చోరీ

మచిలీపట్నం సబర్బన్ : బంగారు కలశం వెలికితీత అంశం కృష్ణాజిల్లా మచిలీపట్నం మండలం, సీతారామపురంలో కలకలం రేపింది. బాపులపాడు మండలం, హనుమాన్‌జంక్షన్ సమీపంలోని ఓ పురాతన ఆలయానికి చెందిన కలశాన్ని సీతారామపురానికి చెందిన వ్యక్తి రెండు నెలల కిందట అపహరించి తన పొలంలో పాతిపెట్టాడు. దీని విలువ కోటి రూపాయల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. కాగా, కలశం చోరీపై విజయవాడ స్పెషల్ పార్టీ పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఈ నెల 3వ తేదీ తెల్లవారుజామున చోరీ చేసిన వ్యక్తిని అతని ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. తన పొలంలో కలశాన్ని పాతిపెట్టినట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు.

బలవంతపు రిజిస్ట్రేషన్లు!

- సీఆర్‌డీఏ అధికారుల ప్రయత్నాలు
- చట్టం ఒప్పుకోదన్న రిజిస్ట్రేషన్ల శాఖ
- అభివృద్ధి చేయని ప్లాట్లు తీసుకోమన్న రైతులు
- రాజధానిలో ప్లాట్ల వ్యవహారంలో గందరగోళం



సాక్షి, అమరావతి: రాష్ట్ర రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు ప్లాట్ల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో తీవ్ర గందరగోళం నెలకొంది. భూ సమీకరణ సమయంలో ప్రకటించిన విధంగా అభివృద్ధి చేసిన ప్లాట్లనే తమకు ఇవ్వాలని రైతులు డిమాండు చేస్తుండగా రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. పొలాలను బిట్లుగా విభజించి యథాతథంగా రైతులకు అంటగట్టాలని చూస్తోంది. ప్రభుత్వం (సీఆర్‌డీఏ) వాటా కింద ఉంచుకునే ప్రాంతంలో వేగంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తూ తమకు ప్లాట్లు కేటాయించే ప్రాంతాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయకపోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ముక్కారు పంటలు పండే సారవంతమైన భూములను తాము త్యాగం చేసి రాజధాని కోసం ఇస్తే సర్కారు ఇలా ద్రోహం చేయడం దారుణమని రైతులు విమర్శిస్తున్నారు. భూసమీకరణ ఒప్పందాలు సమర్పించిన మూడు నెలల్లో ప్లాట్లు కేటాయిస్తామని చెప్పి మూడేళ్లయినా లేఅవుట్ల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉండటం గమనార్హం.

రైతుల విముఖత

రాజధానికి భూ సమీకరణ కింద 33 వేల ఎకరాలు పైగా ఇచ్చిన రైతులకు ఎల్‌పీఎస్ ఒప్పంద నిబంధనల ప్రకారం నివాస, వాణిజ్య ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన ప్లాట్లను కేటాయించాలి. అయితే కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్లాట్లను రైతులకు కట్టబెట్టేందుకు సీఆర్‌డీఏ ప్రయత్నిస్తోంది. దీంతో వాటిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రైతులు అంగీకరించడంలేదు. రాజధానికి ఎల్‌పీఎస్ కింద భూములు ఇచ్చిన వారికి సీఆర్‌డీఏ 59,014 ప్లాట్లు కేటాయించగా ఇప్పటి వరకూ 6,900 మంది మాత్రమే తమ పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అందులోనూ అధికార పార్టీ నాయకులుగా పలుకుబడి ఉపయోగించి రోడ్ల పక్కన, పెద్ద ప్లాట్లను పొందిన వారే ఇలా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిలో ఎక్కువ మంది ఉన్నారు. మిగిలిన 52,114 ప్లాట్లు రైతులు తీసుకునేందుకు ఇష్టపడడంలేదు. లేఅవుట్లు అభివృద్ధి చేయకుండా కాగితాలపై ఇచ్చే ప్లాట్లు తమకెందుకని రైతులు మండిపడుతున్నారు.

ఏకపక్ష రిజిస్ట్రేషన్ల కోసం...

రైతులు ఎదురుతిరగడంతో ఏకపక్షంగా వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి చేతులు దులుపుకోవాలని సీఆర్‌డీఏ శత విధాలా ప్రయత్నిస్తోంది. 'రైతుల హాజరు, సంతకాలతో సంబంధం లేకుండా వారి పేర్లతో సీఆర్‌డీఏ అధికారులు వచ్చి ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తార'ంటూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు సీఆర్‌డీ కమిషనర్ శ్రీధర్ లేఖ రాశారు. కొనుగోలుదారుల (స్వీకర్తల) ఆమోదం లేకుండా వారి పేర్లతో రిజిస్ట్రేషన్ చేయడానికి రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం వీలు కాదని ఆశాఖ అధికారులు తేల్చి చెప్పారు. రిజిస్ట్రేషన్ చట్టాన్ని సవరించి అయినా ఆ ప్లాట్లను రైతులకు కట్టబెట్టాలని సీఆర్‌డీఏ ప్రయత్నాలు కొనసాగిస్తోంది. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్, సీఆర్‌డీఏ మధ్య వివాదం నెలకొంది.

మూడేళ్లయినా అతీగతీ లేదు




రాజధాని నిర్మాణానికి భూమి ఇస్తే రైతులకు అన్ని విధాలా లాభం కలిగేలా అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామని మూడేళ్ల క్రితం హామీ ఇచ్చారు. ఇంత వరకు ఒక్క రైతుకు కూడా అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చిన దాఖలాలు లేవు. తొలుత రైతులకు తుళ్లూరులో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్లాట్ల కాగితాలు ఇచ్చినప్పుడు నెల రోజుల్లో రైతులందరికి అభివద్ధి చేసి ప్లాట్లు అందిస్తామన్నారు. ఏడాది అయినా ఇంత వరకు మౌలిక సదుపాయాలు కల్పించలేదు. కాగితపు స్థలాలు మాకు అవసరం లేదనే రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంలేదు.

– కొమ్మినేని కస్తూరావు, దొండపాడు రైతు

న్యాయ వ్యవస్థ విలువలు కాపాడడమే లక్ష్యం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు



మాట్లాడుతున్న జస్టిస్ సోమయాజులు

విశాఖ లీగల్: వారసత్వం ద్వారా వచ్చిన విలువల సంపదను కాపాడడమే తన లక్ష్యమని ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు అన్నారు. విశాఖపట్నంలో ఆదివారం వైజాగ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సోమయాజులును ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీవీ సుబ్బారావు తనయుడిగా తనకు లభించిన వారసత్వం, విలువలు, ఉన్నత లక్ష్యాన్ని కాపాడతానన్నారు. ఈ న్యాయమూర్తి పదవి విశాఖ ప్రజలు అందించిన అమూల్య కానుక అన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్, ఏయూ పూర్వ రెక్టార్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ సోమయాజులు న్యాయమూర్తిగా నియమితులవడం న్యాయవ్యవస్థకు ఒక శుభపరిణామంగా చెప్పారు. కార్యక్రమంలో వైజాగ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఎ.వి.మోనీష్‌రావు, ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ గోలి భాస్కరరావు, కార్యదర్శి వీరమోహన్, డీవీ రాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగర పౌరులు సోమయాజులను సన్మానించారు.

రాష్ట్ర పండగగా పెలికాన్ ఫెస్టివల్

- మంత్రులు భూమా అఖిలప్రియ, కామినేని శ్రీనివాస్
- కృష్ణాజిల్లా ఆటపాకలో పెలికాన్ పక్షుల పండగ ప్రారంభం
- హాజరైన సినీ హీరో వెంకటేష్



పెలికాన్ ఫెస్టివల్‌లో మాట్లాడుతున్న హీరో వెంకటేష్ వేదికపై మంత్రి కామినేని తదితరులు

కైకలూరు: పెలికాన్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ప్రకటించారు. పక్షి ప్రేమికులు స్వర్గధామంగా పేరుగడించిన కృష్ణాజిల్లాలోని ఆటపాక పక్షుల కేంద్రంలో పెలికాన్ పక్షుల పండగ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. నెల్లూరు జిల్లాలో నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్ తరహాలో మొదటిసారి ఆటపాకలో పెలికాన్ ఫెస్టివల్‌ను కలెక్టరు లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో తలపెట్టారు. మంత్రి భూమా అఖిలప్రియ హీలియం బెలున్‌లను ఎగురవేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పక్షుల కేంద్రం అభివృద్ధికి టూరిజం శాఖ నుంచి బృందాన్ని ఏర్పాటు చేస్తామని అఖిలప్రియ చెప్పారు. ఆటపాక గ్రామానికి 4 వేల కిలోమీటర్ల నుంచి 35 వేల పక్షుల రావడం అబ్బురపరుస్తోందన్నారు. సినీ హీరో వెంకటేష్ మాట్లాడతూ పక్షులు దేవుళ్లతో సమానమన్నారు. పక్షుల కేంద్రం రానున్న రోజుల్లో ప్రపంచంలో మంచి గుర్తింపు పొందుతుందన్నారు. మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ పెలికాన్ ఫెస్టివల్‌ను వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర క్యాలండరులో చేర్చడానికి సీఎం చంద్రబాబు అంగీకరించారన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర ప్రసంగిస్తూ నెల్లూరు జిల్లాలో ఫ్లెమింగో ఫెస్టివల్ మాదిరిగా ఆటపాక కేంద్రం భవిష్యత్తులో పేరుగడిస్తుందన్నారు. కలెక్టరు మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి ఫెస్టివల్‌ను మరింత ఘనంగా జరుపుతామన్నారు. వందేమాతరం శ్రీనివాస్, ఉషా, గీతామాధురి, ధనుంజయ్, శ్రీనివాసశర్మ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో కాపు కార్పొరేషన్ చైర్మన్ రామానుజయ, మాజీ ఎమ్మెల్యే జె.వెంకటరమణ, ఎమ్మెల్సీ విఠల్‌రావు పాల్గొన్నారు.

జీఎస్టీఐఎన్ ప్రదర్శనతో చిక్కులు

- పాన్ నంబర్ దుర్వినియోగం అవుతోందని వ్యాపారుల ఆందోళన
- ఈ విధానాన్ని మార్చాలంటున్న నిపుణులు

సాక్షి, అమరావతి: ప్రతి దుకాణం ముందు జీఎస్టీఐఎన్ (గూడ్స్ అండ్ సర్వీస్‌ట్యాక్స్ ఐడెంఫికేషన్ నంబర్)ను ప్రదర్శించాలన్న నిబంధనపై వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 15 అంకెలు ఉండే జీఎస్టీఎన్‌ను ఇలా బహిర్గతం చేయడం వల్ల తమ పాన్ నంబర్ అందరికీ తెలిసిపోతోందని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పుడు భారీ లావాదేవీలు నిర్వహించాలంటే పాన్ నంబర్ తప్పనిసరని, ఇలాంటి సమయంలో జీఎస్టీఐఎన్‌లో పాన్ నంబర్‌ను దుర్వినియోగం చేసే అవకాశం ఉందంటున్నారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రతీ నమోదిత ట్రేడరుకు 15 అంకెల జీఎస్టీఐఎన్‌ను కేటాయించారు. ఇందులో మొదటి రెండు అంకెలు రాష్ట్రాన్ని సూచిస్తాయి. ఆ తర్వాత వచ్చే 10 అంకెలు వ్యాపారి పాన్ నంబర్‌ను సూచిస్తుంది. 13వ అంకె ఆ వ్యాపారి అదే పాన్ నంబర్‌పై ఎన్ని జీఎస్టీఐఎన్‌లు తీసుకున్నాడన్న నంబర్‌ను తెలియజేస్తుంది. 14వ అంకె డీఫాల్ట్‌గా జెడ్ అని ఉంటుంది. లావాదేవీల్లో తప్పులను తెలుసుకోవడానికి ఆ నంబర్‌ను వినియోగిస్తారు. మన రాష్ట్రం విషయానికొస్తే జీఎస్టీలో రాష్ట్ర సంఖ్యను 28గా పేర్కొన్నారు. అంటే మన రాష్ట్రంలో నమోదైన ప్రతీ జీఎస్టీఐఎన్ 28తో మొదలవుతుంది. ఉదాహరణకు జీఎస్టీఐఎన్ '28ఏఏఏఏఏ0000ఏ1జెడ్5'గా ఉంది అనుకుందాం. ఇక్కడ '28' అనేది ఏపీని సూచిస్తుంది. ఆ తర్వాత వచ్చే 'ఏఏఏఏఏ0000ఏ' పాన్ నంబర్‌ను తెలియజేస్తుంది.

కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసిన వ్యాపారులు

జీఎస్టీఐఎన్ దుర్వినియోగమవుతున్న విషయాన్ని ఇప్పటికే జీఎస్టీ కౌన్సిల్ దృష్టికి తీసెకెళ్లినట్లు వ్యాపారులు చెబుతున్నారు. తమ జీఎస్టీఐఎన్ నుంచి పాన్ నంబర్ తెలుసుకొని లావాదేవీలు నిర్వహించే వారు ఉంటున్నారని, అయితే ఆదాయపన్ను శాఖ నుంచి నోటీసులు వస్తే తాము సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని విజయవాడకు చెందిన రిటైల్ సంస్థ యజమాని ఒకరు వాపోయారు. ఇప్పటికే ఒకటి, రెండు చిన్న సంఘటనలు ఇలా జరిగినట్లు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఒక బులియన్ వ్యాపారి తెలిపారు. జీఎస్టీఐఎన్‌ను దుకాణం వెలుపల ప్రదర్శించకపోతే రూ.1,000 వరకు జరిమానా కూడా విధిస్తున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది దొంగ వ్యాపారం చేసే వారు తమకు తెలియకుండా జీఎస్‌టీఐఎన్ వినియోగిస్తున్నారని, ఈ నంబర్ తెలిస్తే దాని ద్వారా బ్యాంకు అకౌంట్ నంబరు కూడా తెలుసుకోవచ్చని మరో వ్యాపారి వివరించారు. సరుకులు కొన్నవారికి మాత్రమే జీఎస్టీఐఎన్ ఇస్తే సరిపోయేలా చట్టంలో మార్పు తీసుకురావాలని వ్యాపారులు అంటున్నారు. జీఎస్టీఐఎన్‌లో పాన్ నంబర్ పూర్తిగా లేకుండా కొత్త జీఎస్టీఐఎన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని జీఎస్టీ ట్యాక్సేషన్ నిపుణుడు పీవీ సుబ్బారావు సూచించారు.

హైకోర్టు సాధనకు ప్రాణాలైనా అర్పిస్తాం

పోరుబాట పట్టిన రాయలసీమ న్యాయవాదులు

నిరవధిక నిరాహార దీక్షకు సిద్ధమైన కడప లాయర్ నాగరాజు




రాయలసీమ న్యాయవాదుల జేఏసీ మహాసభలో పాల్గొన్న న్యాయవాదులు

అనంతపురం లీగల్: ప్రాణాలు అర్పించైనా రాయలసీమ ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటయ్యేలా చూస్తామని న్యాయవాదులు తేల్చిచెప్పారు. ఆదివారం అనంతపురంలో రాయలసీమ న్యాయవాదుల జేఏసీ మహాసభ నిర్వహించారు. రాయలసీమ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ మస్తాన్‌వలి అధ్యక్షతన 'అనంత' న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తరిమెల భరత్‌భూషణరెడ్డి, రాష్ట్ర న్యాయవాద మండలి సభ్యుడు ఆలూరు రామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ సభకు నిర్వహించారు. రాయలసీమ జిల్లాలకు చెందిన 400 మంది న్యాయవాదులు హాజరయ్యారు. సీనియర్ న్యాయవాదులు గురుప్రసాద్, రాంకుమార్, పి.రవీంద్రనాథరెడ్డి, నాగలక్ష్మి, అబ్దుల్ రజాక్‌లు మాట్లాడుతూ.. విభజన నేపథ్యంలో తీవ్రంగా నష్టపోయిన రాయలసీమను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లేనిపక్షంలో మరోసారి సమైక్యాంధ్ర తరహాలో ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. హైకోర్టు సాధన కోసం సోమవారం ఉదయం నుంచి వైఎస్సార్ జిల్లా కోర్టు వెలుపల నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు కడప సీనియర్ న్యాయవాది నాగరాజు తెలిపారు. అమరావతిలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని నిరసిస్తూ ఈ నెల 5 నుంచి 17 వరకు కోర్టు విధులు (జాతీయ లోక్ అదాలత్ మినహాయింపు) బహిష్కరించాలని మహాసభలో తీర్మానించారు. అలాగే ఈ నెల 7 నుంచి 9 వరకు నిరసన ర్యాలీలు, 17 వరకు న్యాయస్థానాల వద్ద రిలే నిరాహార దీక్షలు, ప్రతి రోజు న్యాయస్థానాల గేట్ల వద్ద బైఠాయింపు తదితర కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు.

సమస్య ఓ చోట.. కమిటీ మరో చోట!

- ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సమస్యలంటూ విద్యార్థి విన్నపం
- నూజివీడు ట్రిపుట్ ఐటీపై కమిటీ వేసిన రాష్ట్ర మానవవనరుల శాఖ



నూజివీడు: రోగం ఒకరికైతే మందు వేరొకరికి వేసిన చందంగా రాష్ట్ర మానవ వనరుల శాఖ తీసుకుంటున్న నిర్ణయాలు ఉంటున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కృష్ణా జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీపై త్రిసభ్య కమిటీని నియమిస్తూ శుక్రవారం జారీచేసిన జీవో నెంబరు 15 వివాదాస్పదంగా మారింది. దీనిపై నూజివీడు ట్రిపుల్‌ఐటీ సిబ్బందిలో విస్మయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సీబీఎస్ వెంకటరమణ చైర్మన్‌గా, జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ ఎం.స్వరూపారాణి, రిటైర్డ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎంకే రహమాన్‌లను సభ్యులుగా నియమిస్తూ త్రిసభ్య కమిటీని నియమించింది. గత నెల 18న నూజివీడులో జరిగిన ఆర్జీయూకేటీ స్నాతకోత్సవంలో వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి చెందిన మెకానికల్ బ్రాంచి విద్యార్థి శివకుమార్ మంత్రి గంటా శ్రీనివాసరావును కలిసి కొన్ని సమస్యలను వివరించారు. తాను తీసుకున్న గోల్డ్‌మెడల్ ఫ్యాకల్టీలు బోధిస్తే రాలేదని, తనంతట తాను చదువుకున్నానని, ఎవరూ కూడా తరగతులకు రావడం లేదని, విద్యాబోధన అనేది అంతా స్కాం అని తెలిపాడు. ఈ నేపథ్యంలోనే కమిటీ ఏర్పాటు జరిగినట్లు సమాచారం. అయితే ఇడుపులపాయలో సమస్యలున్నాయని అక్కడి విద్యార్థి చెబితే నూజివీడుకు కమిటీ వేయడం వల్ల ఉపయోగం ఏముంటుందనే అభిప్రాయం ట్రిపుల్ ఐటీ సిబ్బందిలో వ్యక్తమవుతోంది.

● తెలంగాణ

మరో ప్రాణం తీసిన 'మైనర్ డ్రైవింగ్'

సాక్షి, హైదరాబాద్/బహదూర్‌పురా: మైనర్ డ్రైవింగ్ మరో బాలుడి ప్రాణం తీసింది. ఈ ఘటనలో వాహనం నడిపింది.. ప్రాణాలు కోల్పోయింది మైనర్లే. నగరంలోని కిషన్‌బాగ్ అసద్‌బాబానగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ తాజ్ కుమారుడు మహ్మద్ రియాజ్(12), అతడి సమీప బంధువు జునైద్ (15)తో కలసి ఆదివారం ఉదయం 11.30 గంటలకు బహదూర్‌పుర నుంచి అత్తాపూర్‌కు యాక్టివాపై బయలుదేరారు. జునైద్ వాహనాన్ని నడుపుతుండగా.. రియాజ్ వెనుక కూర్చున్నాడు. ముందు వెళ్తున్న లారీ(ఏపీ 12వీ 9248)ని ఓవర్‌టెక్ చేసేందుకు వీరు పలుమార్లు ప్రయత్నించారు. కిషన్‌బాగ్ చౌరస్తాలో వేగంగా ముందుకు వెళ్లిన వీరు మెహక్ ఫంక్షన్ హాల్ వద్దకు వచ్చేసరికి తమ వాహనాన్ని ఒక్కసారిగా మలుపు తిప్పేందుకు ప్రయత్నించారు. దీంతో వెనుక కూర్చున్న రియాజ్ వాహనంపై నుంచి కింద పడిపోయాడు. వెనుకు నుంచి వేగంగా వస్తున్న లారీ వెనుక టైరు.. రోడ్డుపై పడిన రియాజ్ తలపై నుంచి వెళ్లిపోయింది. దీంతో అతను అక్కడికక్కడే అశువులుబాశాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. మైనర్‌రైన బాలుడికి వాహనమిచ్చిన దాని యజమాని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన మైనర్ ఇద్దరూ నిందితులేనని, వీరిపైనా కేసు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ ఖలీల్ పాషా చెప్పారు.

బౌద్ధుల కోవెల

తెలుగు నేల..

- 300 బౌద్ధ క్షేత్రాల నిలయం ఇది
- బుద్ధుని కాలంలో ఆంధ్ర దేశంలోకి..
- ఎక్కువగా తీరాంధ్ర, తెలంగాణలోనే ఆనవాళ్లు
- యాత్రా స్థలాలుగా విలసిల్లిన బౌద్ధారామాలు

సాక్షి, అమరావతి

ఉత్తరాంధ్ర (కళింగ) దేశంలోని సారిపల్లి నుంచి రాయలసీమలోని నందలూరు వరకూ, తూర్పున ఘంటసాల నుంచి వాయవ్యాన ధూళికట్ట వరకూ తెలుగు నేలపై దాదాపు 300కు పైగా బౌద్ధ క్షేత్రాలు వెలుగు చూశాయి. వీటిలో థేరవాద శాఖకు చెందినవి ఉత్తరాంధ్రలోనూ.. మహాయాన క్షేత్రాలు కృష్ణా–గోదావరి మధ్య ప్రాంతంలోనూ విస్తరించాయి.

బుద్ధుని కాలంలోనే ఆంధ్రదేశంలోకి..

అశోక చక్రవర్తి కళింగాన్ని జయించిన తర్వాత చేపట్టిన బౌద్ధ ధర్మ ప్రచారంలో భాగంగా ఆంధ్ర దేశంలో బౌద్ధం ప్రవేశించింది. మౌర్యుల తర్వాత దక్షిణ పథాన్ని పాలించిన శాతవాహన కాలంలో విశేషంగా ఆదరణకు నోచుకుంది. బుద్ధుని జీవిత కాలంలోనే ఆంధ్రదేశంలో బౌద్ధం ప్రవేశించినట్లు కాలచక్ర మూలతంత్రం అనే గ్రంథం చెబుతుండగా.. ఆయన ఉండగానే తెలుగు నేలపై బుద్ధుని ధర్మం ప్రసరించిందని సుత్తనిపాతంలోని 'పారాయణవగ్గ'లోని బావరి, అతని శిష్యుల కథవల్ల తెలుస్తోంది. వంశధార, గోస్తని, తాండవ, గోదావరి, కృష్ణ, తుంగభద్ర, బహుదా మొదలైన నదీ పరివాహక ప్రాంతాల్లోనూ, ఉత్తర తీర ప్రాంతంలో ఉన్న


ఘంటసాలలోని బౌద్ధ మ్యూజియం


విశాఖ జిల్లా తొట్లకొండలోని బౌద్ధ స్థూపం

చదునైన కొండచరియలపైనా మౌర్యుల (క్రీ.పూ 43 శతాబ్దాలు) నుండి విష్ణుకుండినుల (క్రీ.శ 56 శతాబ్దాలు) కాలం దాకా విలసిల్లిన అనేక బౌద్ధ క్షేత్రాలు వెలుగులోకి రావటమే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. బౌద్ధ క్షేత్రాలు ఎక్కువగా తీరాంధ్ర దేశంలోనూ, తెలంగాణ పీఠ భూమిలోనూ ఉండగా రాయలసీమలో కేవలం వైఎస్సార్ కడప జిల్లాలోని నందలూరు, తాళ్లపాక, పుష్పగిరి, అనంతపురం జిల్లాలోని సాసనకోట అనే చోట్ల మాత్రమే గుర్తించారు. రాయలసీమ ప్రాంతం అంతా కొండలతో నిండి ఉండటం, నదులు ఎక్కువగా లేకపోవటం, పొరుగు ప్రాంతాలతో సరైన రవాణా సౌకర్యాలు లేకపోవటంవల్ల బౌద్ధ క్షేత్రాలు ఆ ప్రాంతంలో విస్తరించలేదని చెప్పొచ్చు.

తెలంగాణలో చారిత్రక నగరం

దక్షిణ కోసల దేశానికి చెందిన బావరి అనే బ్రాహ్మణుడు దక్షిణా పథంలో గల ముళకలలో (తెలంగాణలోని గోదావరి తీరస్థ అస్సక ప్రాంతంలో) స్థిరపడ్డారనీ, అతడు తన 16 మంది శిష్యులతో బుద్ధుడిని కలిసి, అతని బోధనలను గ్రహించటానికిగాను వారిని రాజ గృహానికి పంపినట్లు తెలుస్తోంది. బుద్ధ భగవానునికి ముఖ్య శిష్యుడైన మహాకాత్యాయనుడు.. అస్సక ప్రాంతపు రాజుకు బౌద్ధ ధర్మాన్ని బోధించాడని విమానవత్తు అనే గ్రంథం చెప్పింది. అస్సక, ముళక


నాగార్జునకొండలోని మహాస్థూపం

అనే జనపదాలు దక్షిణాపథంలో ఇరుగు పొరుగున ఉండేవని సుత్తనిపాత గ్రంథంలో వివరించారు. 'పోతిలి' రాజధానిగా (నిజామాబాద్ జిల్లాలోని బోధన్) ఉన్న అస్సక ప్రాంతంతోపాటు ప్రస్తుత తెలంగాణాలోని ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలుగా వాటిని గుర్తించారు. కరీంనగర్ జిల్లాలో గోదావరి నది ఎడమ ఒడ్డున గల కోటలింగాల ప్రాంతంలో జరిపిన తవ్వకాల్లో తొలియుగానికి చెందిన చారిత్రక నగరం బయటపడింది. చుట్టూ కోటగోడలతో ఉన్న ఇక్కడ సంఘారామం, గృహవాసాలు, అప్పటి నాణేలు, పూసలు, ఇనుప పనిముట్లు, గాజులు, మట్టి బొమ్మలు, పలు రకాల మట్టి పాత్రలు వెలుగుచూడటంతో ఇక్కడ ఓ ప్రాచీన నగరం ఉండేదన్న విషయం బలపడుతోంది. అలాగే విశాఖపట్నం జిల్లాలోనూ బౌద్ధ క్షేత్రాలు వెలుగుచూశాయి.

బ్రహ్మదత్తుని కాలంలో బౌద్ధ కట్టడాలు

బుద్ధుని దహన సంస్కారాల తరువాత చితాభస్మం నుండి అతని ఎడమ దంత ధాతువును ఖేమథేర అను బిక్షువు గ్రహించాడని.. దానిని ఒక స్తూపంలో అరాధన నిమిత్తమై నిక్షిప్తం చేయటానికిగాను కళింగ రాజైన బ్రహ్మదత్తునికి ఇచ్చినట్లు సుత్త పిటకంలోని దీఘనికాయంలో వివరించి ఉంది. అతడు అక్కడ ఒక పట్టణాన్నీ, బౌద్ధ కట్టడాలను నిర్మించాడనీ, దానినే దంతపురంగా



ఘంటసాలలోని గౌతమబుద్ధుడి ప్రతిమ

తదుపరి కాలంలో పిలిచారనీ బౌద్ధ వాఙ్మయంలో పేర్కొన్నారు. ఈ దంతపురమే ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో ఉన్న దంతావక్త్రుని కోటగా గుర్తించవచ్చు. ఆంధ్రదేశంలో మాజేరు, ధాన్యకటకం (గుంటూరు జిల్లాలోని ఇప్పటి అమరావతి ప్రాంతం), దంతపురం, గోపాలపట్నం, భట్టిప్రోలు, తెలంగాణలోని కోటలింగాల, ధూళికట్ట బౌద్ధ క్షేత్రాలు విలసిల్లాయి.

బౌద్ధ కేంద్రంగా అమరావతి

ధాన్యకటకంలో ప్రత్యేకంగా పాటలీపుత్రం నుంచి వచ్చిన భిక్షువులకు ఆరామం నిర్మించినట్లు ఇక్కడ లభించిన శాసనం ద్వారా తెలుస్తోంది. ఈ విధంగా మహా సాంఘికులవల్ల ధాన్యకటకం అత్యంత ప్రాముఖ్యం గల బౌద్ధ కేంద్రంగా వర్ధిల్లింది. శాతవాహనుల కాలపు అమరావతి, జగ్గయ్యపేట, నాగార్జునకొండ, శాలిహుండం, గుంటుపల్లి, గుమ్మడిదుర్రు, ఘంటసాల తదితర బౌద్ధ క్షేత్రాలు చారిత్రక యాత్రా స్థలాలుగా మధ్యయుగం వరకు విలసిల్లాయి.

అగ్ని ప్రమాద బాధితులను మానవత్వంతో ఆదుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బాలయోగి


జస్టిస్ బాలయోగిని సత్కరిస్తున్న రామకృష్ణారావు తదితరులు

అమలాపురం రూరల్: అగ్ని ప్రమాదాల్లో సర్వం కోల్పోయిన బాధితులను మానవత్వంతో ఆదుకోవాలని హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ నక్కా బాలయోగి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా అమలాపురం మండలం ఈదరపల్లిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన 15 బాధిత కుటుంబాలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు సహకారంతో చీరలు, దుప్పట్లను ఆయన ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ బాలయోగి మాట్లాడుతూ.. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ 43 ఏళ్లుగా 600 మంది నిరుపేదలకు వితరణ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఆ సంస్థ కార్యాలయంలో జస్టిస్ బాలయోగిని ముషిణి రామకృష్ణారావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత నక్కా సంపత్‌కుమార్, మాజీ సర్పంచ్ ములపర్తి సత్యనారాయణ, న్యాయవాది ముషిణి నాగేంద్రమణి తదితరులు పాల్గొన్నారు.

చేతగాని దద్దమ్మలు రాజకీయాలను శాసిస్తున్నారు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం



సాక్షి, అమరావతి/ఒంగోలు టౌన్/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలో, కేంద్రంలో చేతగాని దద్దమ్మలు రాజకీయాలను శాసిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను 44 నెలలు అవుతున్నా ఇంత వరకు కేంద్రంలోని బీజేపీ నెరవేర్చలేదని, రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం ఒత్తిడి చేయడం లేదని మండిపడ్డారు. సీపీఐ ప్రకాశం జిల్లా 15వ మహాసభల సందర్భంగా ఆదివారం ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. చేతగాని దద్దమ్మలు ఎంపీలుగా ఉండటం వల్లనే రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందన్నారు. తెల్ల చర్మం (విదేశీయుడు) కనిపిస్తే చాలు తెల్లకాగితంపై సంతకం పెట్టించుకోవడం చంద్రబాబుకు అలవాటైపోయిందన్నారు. కాగా, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈనెల 8న వామపక్షాలు తలపెట్టిన బంద్‌కు అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ బంద్‌కు మద్దతు ఇస్తోందని, వైఎస్సార్ సీపీ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, కె.పార్థసారథి, జనసేన నాయకుడు రాఘవయ్య, శంకర్‌గౌడ్‌లను సంప్రదించామని తెలిపారు. మరోవైపు రాష్ట్రబంద్‌కు విద్యార్థి, యువజన సంఘాలు మద్దతు ప్రకటించాయి. విజయవాడలో విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల రంగన్న మాట్లాడుతూ విభజన హామీల అమలుకు కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడాన్ని తప్పుబట్టారు.

ఏపీ అభివృద్ధిపై కావాలనే నిర్లక్ష్యం: గంటా

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

సాగర్‌నగర్ (విశాఖ తూర్పు)/భీమునిపట్నం: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కేంద్రప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం ధోరణి ప్రదర్శిస్తోందని రాష్ట్ర మానవవనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆరోపించారు. రుషికొండలో ఏపీ టూరిజంశాఖ చేపట్టిన సమగ్ర అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ఆదివారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ఎన్నికల ప్రచార సభలో అప్పట్లో నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని నిర్మిస్తానని హామీ ఇచ్చారన్నారు. అలాంటిది నాలుగో బడ్జెట్‌లోనూ ఆ అంశాలు ప్రస్తావనకు రాలేదంటే కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌పై నిర్లక్ష్యం వహించారని స్పష్టమవుతోందన్నారు. ప్రత్యేక హోదా చట్టంలో ఉన్న రైల్వే జోన్ అంశాన్నీ పక్కన పెట్టేశారు. పోలవరం ప్రాజెక్టుకు సరిపడా నిధులు కేటాయించలేదు.. ఇలా అన్ని రకాలుగా బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మిత్రపక్షం అధికారంలో ఉన్న రాష్ట్రం అయినా కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. దీనిపై భవిష్యత్తులో బీజేపీ మూల్యం చెల్లించికోవాల్సి వస్తోందని హెచ్చరించారు.

విజయనగరం ఎమ్మెల్యేలతో గంటా సమావేశం

విజయనగరం పార్లమెంట్ నియోజకర్గ ఎమ్మెల్యేలతో ఆదివారం మంత్రి గంటా శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవరినీ లోపలికి అనుమతించలేదు. ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ పరిస్థితి ఎలా ఉంది.. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలేమిటి అన్నది చర్చించినట్టు తెలిసింది. బీజేపీతో విభేదాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో పరిస్థితులు ఎలా ఉంటాయి అనే విషయాలపై చర్చించి ఉంటారని పార్టీలోని కొందరు నాయకులు అనుకుంటున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు తీరని అన్యాయం

వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు తీరని అన్యాయం జరిగిందని వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేనేతపై వివక్ష చూపుతోందన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా అంటూ ప్రచారం చేస్తున్న ప్రభుత్వం నైపుణ్యం కలిగిన చేనేత కార్మికులను నిర్లక్ష్యానికి గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో సవరణలు చేయాలని కోరుతూ త్వరలో కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, స్మృతి ఇరానీని కలిసి వినతి పత్రం సమర్పిస్తామన్నారు.

నిధులు రాబట్టుకోవడంలో భయమెందుకు బాబూ?

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు



విజయవాడ సిటీ: ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు భయపడుతున్నారో ప్రజలకు చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. ఇందుకు కారణం చంద్రబాబు విచ్చలవిడి అవినీతి, ఓటుకు కోట్లు కేసే కారణమని ప్రజలు అంటున్నారని చెప్పారు. బీజేపీ మెడ పట్టుకుని బయటకు గెంటినా చూరు పట్టుకుని వేలాడుతున్న చందంగా చంద్రబాబు పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. విజయవాడ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అనుభవజ్ఞుడని ప్రజలు అధికారం కట్టబెడితే ఆయన మాత్రం రాష్ట్ర ప్రయోజనాలను ఓటుకు నోటు కేసు కోసం కేంద్రం వద్ద తాకట్టుపెట్టారని విమర్శించారు. అంతేకాక, తన కుమారుడు లోకేష్‌ను రాజకీయాల్లోకి తీసుకురావడానికి, రెండెకరాల నుంచి రూ.2లక్షల కోట్ల ఆస్తులు సంపాదించడానికి, కోట్లు వెచ్చించి ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొనడానికి, దోచుకున్న సొమ్మును వచ్చే ఎన్నికల్లో వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టేందుకు తన అనుభవానంతా ఉపయోగిస్తున్నారని అంబటి ధ్వజమెత్తారు. ఆదివారం జరిగిన తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ సమావేశానికి ముందు కొన్ని టీవీ చానళ్లలో లేనిపోని లీకులు, స్క్రోలింగులు చూసి ఏదో జరగబోతోందని అనుకున్నామన్నారు. చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం కఠిన నిర్ణయాలు తీసుకుంటారేమోనని ఆశించామన్నారు. తీరా సమావేశం ముగిశాక చూస్తే 'సింగడు అద్దంకి వెళ్లనే వెళ్లాడు తిరిగి వచ్చాడు' అనే నానుడి గుర్తుకు వచ్చిందని చురకలంటించారు. వాస్తవానికి కేంద్ర బడ్జెట్‌ను కేబినెట్‌లో ఆమోదించిన అనంతరమే పార్లమెంటులో ప్రవేశపెడతారని.. అలాంటిది కేంద్రమంత్రిగా ఉన్న అశోక్‌గజపతిరాజుకు తెలిసినప్పుడు చంద్రబాబుకు తెలియకుండా ఎలా ఉంటుందని అంబటి ప్రశ్నించారు. టీడీపీ సమావేశం అనంతరం.. కేంద్రంతో పోరాటం చేస్తామని సుజనాచౌదరి చెప్పిన తీరు పిట్టలదొర మాటలను తలపించిందన్నారు. నమ్మి ఐదేళ్ల అధికారం ఇస్తే నాలుగేళ్లు మాట్లాడకుండా ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ మొదటి అడుగువేస్తున్నామని చంద్రబాబు చెబుతున్నారని.. మరి చివరి అడుగు ఎప్పుడు వేస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు మొదటి అడుగు వేసేలోపే ప్రజలు వామనావతారం ఎత్తి అథఃపాతాళానికి తొక్కేస్తారని హెచ్చరించారు. రాష్ట్రంలో రూలింగ్ లేదు.. ట్రేడింగ్ జరుగుతోందని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు సమాధానం చెప్పాలని అంబటి డిమాండ్ చేశారు.

సమాజంలో మార్పునకు బుద్ధిజం తోడ్పాటు

స్పీకర్ కోడెల శివప్రసాదరావు


విజయవాడలో ర్యాలీగా వస్తున్న బౌద్ధ భిక్షువులు

సాక్షి, విజయవాడ: సమాజంలో మంచి మార్పుకు బుద్ధిజం దోహదపడుతుందని స్పీకర్ కోడెల శివప్రసాదరావు అభిప్రాయపడ్డారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న అమరావతి బౌద్ధ వారసత్వ మహోత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోడెల మాట్లాడుతూ.. రాష్ట్రంలో బుద్ధిజానికి ప్రసిద్ధి గాంచిన ధరణికోట, భట్టిప్రోలు, ఘంటసాల, జగ్గయ్యపేట లాంటి ప్రదేశాలు ప్రాచుర్యంలోకి రావాలన్నారు. జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మాట్లాడుతూ.. అమరావతిలో గ్లోబల్ శాంతి కోసం జరుగుతున్న చర్చలు మానవాళికి ఎంతో ఉపయోగమన్నారు.

విశ్వశాంతి కోసం బుద్ధధ్యానారాధన..

విశ్వశాంతి యాత్రలో భాగంగా స్వరాజ్యమైదానం నుంచి హోటల్ మనోరమ వరకు బౌద్ధభిక్షువులు శాంతి ర్యాలీ నిర్వహించి ధ్యానం చేశారు. తర్వాత బౌద్ధభిక్షువులు ఉండవల్లి గృహలను సందర్శించారు. కాగా, బౌద్ధమతంలోని శాఖలైన తేరవాడ, వజ్రయాన, మహాయానకు చెందిన బౌద్ధగురువులు, భిక్షువులు విజయవాడ స్వరాజ్యమైదానంలో విశ్వశాంతి కోరుతూ ద్యాన ఆరాధన చేశారు.

అమరావతిలో బౌద్ధభిక్షువుల ప్రార్థనలు....

అమరావతిని సుమారు 1000 మంది బౌద్ధ భిక్షువులు సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విజయవాడ, భట్టిప్రోలు, ఘంటసాలలో నిర్వహిస్తున్న అమరావతి బౌద్ధ వారసత్వ ఉత్సవాల్లో పాల్గొనేందుకు చైనా, మయన్మార్, జపాన్, శ్రీలంక, దక్షిణ కొరియాల నుంచే కాక మన దేశంలోని సాంచి, సారనాథ్, కుసినగర్, లుంబిని, ధర్మస్థలి నుంచి వచ్చిన బౌద్ధభిక్షువులు అమరావతి వారసత్వ కేంద్రంలోని కాలచక్ర వద్ద పూజలు చేశారు.

స్వచ్ఛాంధ్రలో స్వాహా పర్వం

- రోడ్లు ఊడ్చే యంత్రాల కొనుగోలులో అవినీతి
- తప్పుడు ధ్రువీకరణ పత్రాలిచ్చిన సంస్థకు టెండరు
- ఫిర్యాదులపై స్పందించని స్వచ్ఛాంధ్ర అధికారులు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అక్రమాలపై కోర్టుకెక్కిన పోటీ సంస్థ

సాక్షి, అమరావతి: రోడ్లు ఊడ్చే యంత్రాల (స్వీపింగ్ మెషీన్లు) కొనుగోలు, నిర్వహణ టెండర్లలో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. రెండు వ్యాపార సంస్థలతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధికారులు చేతులు కలిపి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు అనుకూలమైన వ్యాపార సంస్థలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా వాటిని పట్టించుకోకుండా అధికారులు టెండర్లు ఖరారు చేశారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో టెండరు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్న రెండు సంస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులు ఆదేశించినా, తమ బ్యాంకు మేనేజరు ఇచ్చిన సాల్వెన్సీ లెటరును పునఃపరిశీలించాలని ఒక జాతీయ బ్యాంకు జోనల్ మేనేజరు హెచ్చరించినా, వాటిని అధికారులు పట్టించుకోలేదని తెలుస్తోంది.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో టెండర్లు..

విజయవాడ నగరపాలక సంస్థలోని రహదారులను ఊడ్చేందుకు ఒక క్యూబిక్ మీటరు సామర్థ్యం గల రోడ్లు ఊడ్చే యంత్రాల సరఫరా, మూడు సంవత్సరాలపాటు శుభ్రం చేసే పనిని అప్పగించేందుకు గుర్తింపు పొందిన సంస్థల నుంచి గత జూలై 13న స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చీఫ్ ఇంజినీరు దరఖాస్తులు కోరారు. మొత్తం రూ. 142.11 కోట్ల విలువైన ఈ పనిని చేపట్టేందుకు ఆసక్తి కలిగిన సంస్థలు అదే నెల 28వ తేదీన టెక్నికల్ బిడ్‌లోనూ, ఆగస్టు 3వ జరగనున్న ప్రైస్ బిడ్‌లో పాల్గొనాలని కోరారు. టెండర్‌లో పాల్గొనదలిచిన సంస్థలు అనుభవం, అర్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలన్నీ జత చేయాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీరాజరాజేశ్వరీ ఎంటర్‌ప్రైజస్, వేదా ఎంటర్‌ప్రైజస్, టీపీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థలు టెండర్‌లో పాల్గొన్నాయి. అధికారులు ఏ కారణం చూపకుండానే టీపీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ టెండరును తిరస్కరించారు. శ్రీరాజరాజేశ్వరీ ఎంటర్ ప్రైజెస్ టెండరును ఖరారు చేశారు. వేదా ఎంటర్‌ప్రైజెస్‌ను ఎల్–2గా నిర్ణయించారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు జరిగాయని టీపీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. టెండర్ దక్కించుకున్న సంస్థ తప్పుడు ధ్రువీకరణ పత్రాలు దాఖలు చేసిందని ఆధారాలతో సహా అధికారులకు వివరించినా టెండర్లు ఖరారు చేశారు. దీంతో టెండర్లు రద్దు చేయాలంటూ ఆ సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

టెండర్ నిబంధనలు, టెండర్ పొందిన సంస్థ ధ్రువీకరణ పత్రాల వివరాలు..

- టెండర్‌లో పాల్గొనే వ్యాపార సంస్థ ఏదేని వాణిజ్య బ్యాంకు నుంచి రూ. 31,58,78,000 సాల్వెన్సీ సర్టిఫికెట్‌ను జత చేయాలి. హైదరాబాద్ చౌటుప్పల్ ఇండియన్ బ్యాంకు బ్రాంచ్ నుంచి శ్రీరాజరాజేశ్వరీ సంస్థ సాల్వెన్సీ సర్టిఫికెట్‌ను తీసుకుని టెండర్ షెడ్యూల్స్‌తో జతచేశారు. అయితే బ్రాంచ్ మేనేజర్‌కు సాల్వెన్సీ సర్టిఫికెట్ ఇచ్చే అధికారంలేదని ఆ బ్యాంకుకు చెందిన జోనల్ మేనేజర్ ఇచ్చిన లేఖలో స్పష్టం చేశారు.
- పది సంవత్సరాల కాలపరిమితిలో ఏదేని ఒక సంవత్సరంలో రూ. 3.08 కోట్ల విలువైన స్వీపింగ్ పనిని ఏ మున్సిపాల్టీలోనైనా చేయాలి లేదా రోజుకు 200 కిలోమీటర్ల పరిధిలో రహదారులను శుభ్రపరిచి ఉండాలనే నిబంధన ఉంది. అయితే ఈ సంస్థ ఒక సంవత్సర కాలానికి సంబంధించిన అనుభవ పత్రాన్ని అంద చేయకుండా హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నుంచి 2016 నవంబరు నుంచి 2017 మే వరకు స్వీపింగ్ పనిని చేసినట్టుగా పొందిన సర్టిఫికెట్‌ను టెండరు సమయంలో దాఖలు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ రెండు అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు శ్రీరాజరాజేశ్వరీ ఎంటర్‌ప్రైజెస్‌కు టెండర్‌ను ఖరారు చేశారని టీపీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రతినిధులు ఆరోపించారు.

అక్రమాలు జరగలేదు: స్వచ్ఛాంధ్ర ఎండీ

స్వీపింగ్ టెండర్లలో ఎటువంటి అక్రమాలు జరగలేదు. టెండర్లు ఖరారు చేశాం. స్వీపింగ్ మెషీన్ల సరఫరా జరుగుతోంది. ఫిర్యాదు చేసిన సంస్థ విధానాలు సక్రమంగా లేవు. టెండర్లలో పాల్గొనకుండా అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. బ్యాంకు మేనేజరు ఇచ్చిన సాల్వెన్సీ సర్టిఫికెట్‌పై జోనల్ మేనేజరు ఇచ్చిన లేఖ గురించి మాకు తెలియదు. దీనికి సంబంధించిన వివరాలన్నీ కోర్టుకు అందచేశాం.

ఏడుగురికి ఐఏఎస్ హోదా

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి చెందిన ఏడుగురు అధికారులకు త్వరలో ఐఏఎస్ హోదా లభించనుంది. డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న ఏడుగురు స్టేట్ సివిల్ సర్వీసెస్ (రెవెన్యూ) అధికారులను కేంద్ర సెలక్షన్ కమిటీ ఐఏఎస్ పదోన్నతికి ఎంపిక చేసింది. రాష్ట్ర కేడర్‌కు సంబంధించి ఏడు కన్ఫర్డ్ ఐఏఎస్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పదోన్నతి ద్వారా వీటి భర్తీ కోసం రాష్ట్ర సివిల్ సర్వీసెస్‌కు చెందిన 14 మంది పేర్లను రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ.. డీఓపీటీకి పంపించింది. యూపీపీఎస్సీ, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి/సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన సెలక్షన్ కమిటీ ఢిల్లీలో సమావేశమై ఈ జాబితాలోని వారి పనితీరు, ఇతర అంశాలను పరిశీలించి ఏడుగురికి కన్ఫర్డ్ ఐఏఎస్‌గా పదోన్నతి కల్పించాలని ఎంపిక చేసింది.

ఆ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి: కత్తి

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఆర్ట్, వర్క్, హెల్త్ ఎడ్యుకేషన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడ హనుమాన్‌పేటలోని ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఆర్ట్, వర్క్ టీచర్లలకు రెగ్యులర్ వారితో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు.

ఎన్టీటీపీసీ సీఈని బదిలీ చేయడం దారుణం

సాక్షి, అమరావతి: డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ ఛీఫ్ ఇంజనీరు పద్మ సుజాతను బలవంతంగా బదిలీ చేయడం దారుణమని వైఎస్సార్ విద్యుత్తు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేతలు, జెన్‌కో కార్యదర్శి వీఆర్‌డీ ప్రసాద్, ప్రాంతీయ అధ్యక్షులు పి.కుటుంబరావులు పేర్కొన్నారు. ఆమె బదిలీని కార్యవర్గం ఖండిస్తూ ప్రకటన విడుదల చేసింది.

సర్వీస్ రూల్స్ అమలుకు కృషి చేయాలి: పీఆర్టీయూ

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ అమలుకు ఎదురవుతున్న న్యాయపరమైన చిక్కులు తొలగించడానికి ప్రభుత్వం కృషి చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు గడ్డం నారాయణరావు డిమాండ్ చేశారు. విజయవాడలో ఓ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దుకు మంత్రి వర్గ ఉపసంఘం వేయాలని, 2008 హామీ పత్రాల టీచర్లకు జూనియర్‌తో సమానంగా వేతన స్థిరీకరణ జరగాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ జూన్ వరకు పొడిగించాలని, వేతన బకాయిలు చెల్లించాలన్నారు.


గరికపాడు వద్ద గుండు గీయించుకుంటున్న దృశ్యం

బడ్జెట్‌లో అన్యాయంపై వినూత్న నిరసన

గరికపాడు(జగ్గయ్యపేట): కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు మొండిచెయ్యి చూపటంపై కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం గరికపాడు గ్రామ సమీపంలోని ఏపీ, తెలంగాణ సరిహద్దు వద్ద అన్నవరం గ్రామానికి చెందిన ఎన్టీఆర్ అభిమానులు దుర్గంపుడి రాంబాబు, గుంటూరు జిల్లా నరసారావుపేటకు చెందిన శివప్రసాద్ ఆదివారం గుండు గీయించుకొని నిరసన తెలిపారు.

పవన్‌కల్యాణ్‌కు రాజకీయాలపై స్పష్టత లేదు

మాజీ ఎంపీ హర్షకుమార్

యూనివర్సిటీ క్యాంపస్: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు రాజకీయాలపై స్పష్టత లేదని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ పేర్కొన్నారు. 'పవర్ టు పూర్' అనే అంశంపై ఆదివారం తిరుపతిలోని ఎస్వీయూలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్‌కల్యాణ్‌కు ఆయన సోదరుడు చిరంజీవికి ఉన్నంత మాత్రం కూడా రాజకీయాలపై అవగాహన లేదన్నారు. ఆయన ఎప్పుడు ప్రశ్నిస్తాడో, ఎప్పుడు జవాబిస్తాడో ఆయనకే తెలియదని చెప్పారు. ఆయన వైఖరి ఆయనకే సరిగా తెలియదన్నారు. ప్రభుత్వాలు చేసే తప్పులను ఏమాత్రం ప్రశ్నించడం లేదని విమర్శించారు. రాజకీయాల్లో పోటీ చేస్తాడో లేదో కూడా ఆయనకే తెలియదన్నారు.

విశాఖ జేసీకి హైకోర్టు జరిమానా

అనకాపల్లి (విశాఖ జిల్లా): తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించడంలో జరుగుతున్న జాప్యంపై విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ జి.సృజనకు హైకోర్టు రూ.2 వేల జరిమానా విధించినట్లు ఆలస్యంగా తెలిసింది. ప్రస్తుతం ఫ్యాక్టరీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా కూడా ఆమె వ్యవహరిస్తున్నారు. తుమ్మపాల కర్మాగారంలో 184 మంది పదవీ విరమణ పొందారు. వీరందరికీ సుమారు రూ.నాలుగు కోట్ల బెనిఫిట్లను చెల్లించాల్సి ఉంది. అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించకపోవడంతో కార్మికులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దీనికి స్పందించిన హైకోర్టు బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. అయినా ప్రయోజనం లేకపోవడంతో మళ్లీ కార్మికులు కోర్టుని ఆశ్రయించారు. శుక్రవారం విచారణకు వచ్చిన ఈ కేసుపై హైకోర్టు తీవ్రంగా స్పందించి కోర్టు ధిక్కారం కింద కర్మాగారం ఎండీ, జేసీ (పర్సన్ ఇన్‌చార్జ్), పరిశ్రమల శాఖ కార్యదర్శి తదితరులకు నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఫ్యాక్టరీ సహకార రంగంలో ఉన్నందున యాజమాన్యమే తేల్చుకోవాలని, బకాయిల విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని కోర్టుకు నివేదించారు. ఈ విచారణ కోసం కోర్టుకు కర్మాగారం ఎండీ హాజరు కాగా, జేసీ విచారణకు హాజరు కాలేదు. దీంతో జేసీకి రూ.2 వేల జరిమానా విధించి, తదుపరి విచారణకు హాజరుకావాలని కోర్టు ఆదేశించింది. హైకోర్టులో కేసు నడుస్తుండటంతో తమకు ఫ్యాక్టరీ నుంచి రావాల్సిన బకాయిలు అందుతాయని కార్మికులు ఆశలు పెట్టుకున్నారు. రెగ్యులర్ కార్మికులకు రూ.6.50 కోట్లు, ఎన్ఎంఆర్ కార్మికులకు రూ.4 కోట్లు, రిటైర్డ్ కార్మికులకు రూ.4 కోట్లు చెల్లించాల్సి ఉంది.

జేఎన్ఏఎఫ్ఏయూలో పీహెచ్‌డీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ).. ఆర్కిటెక్చర్, ఎన్విరాన్‌మెంటల్ డిజైన్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్, అప్లైడ్ ఆర్ట్ అండ్ పెయింటింగ్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ (పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్)కు దరఖాస్తులు కోరుతోంది. సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు రుసుం రూ.1,000 (ఎస్సీ/ఎస్టీ-రూ.500). దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ: మార్చి 5, 2018. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.jnafau.ac.in

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సివిల్స్ ప్రిలిమ్స్ 2018

గ్రాడ్యుయేట్స్ స్పెషల్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్స్ ఎగ్జామినేషన్ దేశంలోనే అత్యున్నత పోటీ పరీక్ష. దీన్ని ఏటా నిర్వహించడంతోపాటు నిర్దిష్ట వ్యవధిలో నియామక ప్రక్రియ పూర్తి చేస్తారు. ఈ కారణంగానే దేశంలోని ప్రతిభావంతులంతా సివిల్స్ లక్ష్యంగా కష్టపడుతుంటారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్-2018కు ఈ నెల 7న నోటిఫికేషన్ విడుదల కానుంది. జూన్ 3న పరీక్ష జరగనుంది. ఈ నేపథ్యంలో సివిల్స్ ప్రిలిమ్స్‌లో విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు..



ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర 24 జాతీయ స్థాయి సర్వీసుల్లో పోస్టుల భర్తీ ప్రక్రియలో తొలిదశ పరీక్ష సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్. ఇది వడపోత పరీక్ష. ఏటా దాదాపు 5 లక్షల మంది ప్రిలిమ్స్‌కు హాజరవుతున్నారు. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన వారిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఇంతటి పోటీని తట్టుకొని.. మలి దశకు ఎంపిక కావాలంటే.. ఏం చేయాలి? ఎలా చదవాలి? ఎలాంటి వ్యూహాలు అనుసరించాలి? తదితరాలపై అభ్యర్థికి స్పష్టత అవసరం.

సిలబస్‌పై అవగాహన

అభ్యర్థులు తొలుత నోటిఫికేషన్‌ను క్షుణ్నంగా పరిశీలించాలి. వయోపరిమితి, విద్యార్హతలు, దరఖాస్తు విధానం తదితరాల గురించి తెలుసుకోవాలి. అన్ని పోస్టులకు విద్యార్హత బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. చివరి సంవత్సరం విద్యార్థులు కూడా ప్రిలిమ్స్‌కు హాజరు కావొచ్చు. అభ్యర్థులు నోటిఫికేషన్‌లో ప్రధానంగా పరిశీలించాల్సిన అంశం 'సిలబస్'. నోటిఫికేషన్‌లో పేర్కొనే సిలబస్ అధ్యయనంతో అభ్యర్థికి తన వ్యక్తిగత సామర్థ్యాలపై అవగాహన ఏర్పడుతుంది. ప్రిపరేషన్ పరంగా దృష్టిపెట్టాల్సిన అంశాలపై స్పష్టత వస్తుంది. వీటితోపాటు అంశాల వారీగా కేటాయించాల్సిన సమయం, చదవాల్సిన పుస్తకాలు తదితరాలపై అవగాహన ఏర్పడుతుంది. మెటీరియల్ సేకరణలో అప్రమత్తంగా వ్యవహరించాలి. సబ్జెక్టుల వారీగా సిలబస్‌లో పేర్కొన్న అన్ని అంశాలను పొందుపర్చిన ప్రామాణిక పుస్తకాన్ని ఎంపిక చేసుకోవాలి. ఒక సబ్జెక్టుకు నాలుగైదు పుస్తకాలు చదివే కంటే.. ఒకట్రెండు ప్రామాణిక పుస్తకాలకు పరిమితమవడం మేలు.

మారుతున్న ప్రశ్నల శైలి

మెటీరియల్ సేకరణ పూర్తయిన వెంటనే ప్రిపరేషన్ ప్రారంభించాలి. ప్రిపరేషన్ పరంగా ముందు గత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. తద్వారా ప్రశ్నల శైలి.. అంశాల వారీగా లభిస్తున్న ప్రాధాన్యంపై అవగాహన ఏర్పడుతుంది. గత ఐదేళ్ల సివిల్స్ ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే.. ఏటా ప్రశ్నల శైలిలో మార్పు కనిపిస్తోంది. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలు, అసెర్షన్ టైప్ ప్రశ్నలకు ప్రాధాన్యం పెరిగింది. సిలబస్‌లో ఏ టాపిక్ నుంచి ఎన్ని ప్రశ్నలు అడిగే అవకాశముందో చెప్పడం కష్టంగా ఉంది. ఉదాహరణకు పాలిటీ అండ్ గవర్నెన్స్‌ను తీసుకుంటే.. దీన్నుంచి 2015లో 12 ప్రశ్నలు అడగ్గా.. 2016లో ఆ సంఖ్య ఆరుకు పడిపోయింది. తిరిగి 2017లో ఈ విభాగం నుంచి 22 ప్రశ్నలు రావడం విశేషం. అయితే హిస్టరీ, సైన్స్ అండ్ టెక్నాలజీ/ఎన్విరాన్‌మెంటల్ ఎకాలజీ, బయోడైవర్సిటీ అండ్ క్లైమేట్ ఛేంజ్ విభాగాల నుంచి గత ఐదేళ్లుగా సగటున 18 నుంచి 20 ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి అభ్యర్థులు సిలబస్‌లోని అన్ని అంశాలపై పట్టు సాధించాల్సిన అవసరముంది.

కరెంట్ అఫైర్స్

గత నాలుగేళ్లుగా కరెంట్ అఫైర్స్ ప్రశ్నల శైలిలో మార్పు కనిపిస్తోంది. డైరెక్ట్ కొశ్చన్స్ స్థానంలో పరోక్ష ప్రశ్నల సంఖ్య పెరుగుతోంది. దీంతోపాటు సమకాలీన అంశాలతో ముడిపడిన కోర్ సబ్జెక్టుల్లోని అంశాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. గతేడాది కరెంట్ ఈవెంట్స్ విభాగం నుంచి 22 ప్రశ్నలు అడిగితే..వాటిలో 12 కోర్ సబ్జెక్టు (పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ తదితర)కు సంబంధించినవి ఉన్నాయి.

సమయపాలన

ప్రిపరేషన్ పరంగా టైమ్ మేనేజ్‌మెంట్ కీలకం. రోజూ కనీసం ఎనిమిది గంటలకు తగ్గకుండా ప్రిపరేషన్ కొనసాగించాలి. అలాగే రోజులో అన్ని సబ్జెక్టులు చదవడాన్ని అలవరచుకోవాలి. 'ఒక సబ్జెక్టు పూర్తయిన తర్వాత మరొక సబ్జెక్టు' అనే విధానం సరికాదు. దీనివల్ల కొన్ని సబ్జెక్టుల ప్రిపరేషన్ మిగిలిపోయే అవకాశం ఉంది. అభ్యర్థులు ప్రిపరేషన్ పరంగా మెమరీ టిప్స్ పాటిస్తూ ముందుకెళ్లాలి. దీనివల్ల ప్రిపరేషన్ మరింత ఉపయోగకరంగా ఉంటుంది. అభ్యర్థులు షార్ట్‌కట్ నోట్స్, విజువలైజేషన్ టెక్నిక్, చార్ట్ బేస్డ్ నోట్స్ వంటి వ్యూహాలను అనుసరించాలి.

పేపర్-2 కీలకమే!

సివిల్స్ ప్రిలిమ్స్ అభ్యర్థులు పేపర్-2 (ఆప్టిట్యూడ్ టెస్ట్) విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. దీన్ని అర్హత పరీక్షగానే పేర్కొన్నప్పటికీ.. ఇందులో 33 శాతం మార్కులు సాధిస్తేనే పేపర్-1 (జనరల్ స్టడీస్) మూల్యాంకనం చేస్తారు. కాబట్టి పేపర్-2 కూడా కీలకమే. ముఖ్యంగా రీడింగ్ కాంప్రెహెన్షన్, న్యూమరికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ తదితర అంశాలపై దృష్టిపెట్టాలి. పరీక్ష తేదీకి నెల రోజుల ముందు నుంచి అభ్యర్థులు పూర్తిగా రివిజన్‌కు పరిమితం కావాలి. ఆ సమయంలో మాక్, మోడల్ టెస్టులకు హాజరుకావాలి.

సివిల్స్ ప్రిలిమ్స్ (ఆబ్జెక్టివ్)

పేపర్	అంశం	ప్రశ్నలు	మార్కులు
పేపర్-1	జనరల్ స్టడీస్	100	200
పేపర్-2	ఆప్టిట్యూడ్ టెస్ట్	80	200

సివిల్స్ ప్రిలిమ్స్.. గత రెండేళ్లలో విభాగాల వారీగా ప్రశ్నల సరళి

విభాగం	2017	2016
ఇండియన్ హిస్టరీ అండ్ ఇండియన్ నేషనల్ మూమెంట్	14	17
ఇండియా అండ్ వరల్డ్ జాగ్రఫీ	8	7
ఇండియన్ పాలిటీ అండ్ గవర్నెన్స్	22	6
ఎకనామిక్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్	15	28
ఎన్విరాన్‌మెంటల్ ఎకాలజీ, బయో డైవర్సిటీ అండ్ క్లైమేట్ ఛేంజ్	11	19
సైన్స్ అండ్ టెక్నాలజీ	8	13
కరెంట్ ఈవెంట్స్	22	10

సివిల్స్ ప్రిలిమ్స్-2018 వివరాలు

- నోటిఫికేషన్ విడుదల: ఫిబ్రవరి 7, 2018.
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 6, 2018.
- ప్రిలిమ్స్-2018 పరీక్ష తేదీ: జూన్ 3, 2018.

రిఫరెన్స్

- మోడ్రన్ ఇండియన్ హిస్టరీ- బిపిన్ చంద్ర.
- ఇండియాస్ స్ట్రగుల్ ఫర్ ఇండిపెండెన్స్ – బిపిన్ చంద్ర.
- ఇండియన్ జాగ్రఫీ – మాజిద్ హుస్సేన్.
- ఇండియన్ పాలిటీ – లక్ష్మీకాంత్.
- ఇండియన్ ఎకానమీ – రమేశ్ సింగ్.
- ఇండియా ఇయర్ బుక్.
- ఎకనామిక్ సర్వే.
- అనలిటికల్ రీజనింగ్- ఎం.కె.పాండే.
- వెర్బల్ అండ్ నాన్ వెర్బల్ రీజనింగ్ – ఆర్.ఎస్.అగర్వాల్.

115-120 మార్కులు లక్ష్యంగా..

గత ఐదేళ్ల సరళిని గమనించి సివిల్స్ ప్రిలిమ్స్ ఔత్సాహికులు కనీసం 115 నుంచి 120 మార్కులు లక్ష్యంగా కృషి చేయాలి. తద్వారా మెయిన్స్ అర్హతను ఖాయం చేసుకోవచ్చు. అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలోనే గత ప్రశ్నపత్రాలను సాధన చేస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. అదేవిధంగా డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో ప్రిలిమ్స్ ప్రిపరేషన్ కొనసాగిస్తే.. మెయిన్ ఎగ్జామినేషన్‌కు సైతం సన్నద్ధత లభిస్తుంది.

– వి.గోపాలకృష్ణ, డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ అకాడమీ.

కాంపిటీటివ్ కౌన్సెలింగ్

బ్యాంకు పరీక్షల్లో విజయానికి ఎలా చదవాలి?

-ఎం.అవినాష్, హైదరాబాద్.

బ్యాంకు పరీక్షల్లో విజయ సాధనలో అత్యంత కీలక పాత్ర పోషించే అంశం వేగం. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. వాటి సాధనలో అన్వయ సామర్థ్యం అవసరం ఎంతగానో ఉంటుంది. మరోవైపు అందుబాటులోని సమయం కూడా పరిమితమే. ముఖ్యంగా క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగంలో గణిత సంబంధ ప్రశ్నలకు సమాధానం కనుక్కోవాలంటే అంచెలవారీగా (స్టెప్‌వైజ్) నిర్దిష్ట సమస్యను పరిష్కరిస్తూ సాగాలి. అదే విధంగా జనరల్ ఇంగ్లిష్ విభాగంలోని ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే వేగంగా చదవడం; కీలక పదాలను గుర్తించడం; ప్యాసేజ్ కింద అడిగిన ప్రశ్నను చదువుతున్నప్పుడే దానికి సంబంధించిన సమాధానం ప్యాసేజ్‌లో ఎక్కడ ఉందో జ్ఞప్తికి తెచ్చుకోవడం వంటి నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. వీటన్నిటికీ ప్రధాన పరిష్కారం నిరంతర ప్రాక్టీస్. ఒక అంశాన్ని చదువుతున్నప్పుడు దానికి సంబంధించిన ప్రీవియస్ ప్రశ్నలను పరిశీలించాలి. అంతేకాకుండా ప్రతి చాప్టర్ పూర్తయ్యాక స్వీయ సమయ పరిమితి విధించుకుని సెల్ఫ్ టెస్ట్ రాయాలి. తొలి దశలో తెలిసిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. అవి ఎంత సమయంలో పూర్తయ్యాయో గుర్తించాలి. అక్కడితో ఆగకుండా తెలియని ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ఉపక్రమించాలి. ఇలా.. రెండు దశల్లో సెల్ఫ్ టెస్ట్ పూర్తిచేసుకుని నిరాటంకంగా ఎన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలిగారు? ఎన్ని ప్రశ్నల్లో దోషాలు తలెత్తాయి? అని విశ్లేషించుకోవాలి. సమాధానం ఇవ్వలేని ప్రశ్నలు పరీక్ష కోణంలో ముఖ్యమైనవా? కాదా? అని పరిశీలించాలి. ఇందుకోసం గత నాలుగైదేళ్ల ప్రశ్నపత్రాలను శాస్త్రీయంగా విశ్లేషించాలి.

సమయపాలన కీలకం

రోజూ ప్రతి సబ్జెక్టును చదివేలా టైం మేనేజ్‌మెంట్‌ను అలవరచుకోవాలి. చదివిన అంశాల పునశ్చరణకు కొంత సమయం కేటాయించుకోవాలి. ఇప్పటికే పలు బ్యాంక్ పరీక్షలు రాసిన అభ్యర్థులు వాటిలో తమకు వచ్చిన మార్కులు, ఎందులో వెనుకంజలో ఉన్నామో గమనించి, ఆ అంశాలపై మరింత దృష్టి సారించాలి. పరీక్షకు రెండు వారాల ముందు నుంచి రివిజన్‌కే కేటాయించాలి. కనీసం అయిదు మాక్‌టెస్ట్‌లకైనా హాజరు కావాలి.

బులెటిన్ బోర్డ్

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 44 ఖాళీలు

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీవోఎం).. స్కేల్-1, స్కేల్-2, స్కేల్-4 కేటగిరీలోని 44 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** స్కేల్-1లో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్స్ (ఆండ్రాయిడ్ డెవలపర్స్‌తో సహా)-4 , సాఫ్ట్‌వేర్ టెస్టర్-3 , ఒరాకిల్ డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్-1, ఎంఎస్ఎస్‌క్యూఎల్ డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్-1, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్-4; స్కేల్-2లో డేటా అనలిస్ట్-10, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ (సైబర్ సెక్యూరిటీలో అనుభవమున్న)-5, హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్స్-5; స్కేల్-4లో చీఫ్ మేనేజర్-11 (ప్రాజెక్ట్ అప్రైజల్-10+సీఏం బాలెన్స్ షీట్-1).
- **వేతన శ్రేణి:** స్కేల్-1 పోస్టులకు రూ.23,700-రూ.42,020; స్కేల్-2 పోస్టులకు రూ.31,705-రూ.45,950; స్కేల్-4 పోస్టులకు రూ.50,030-రూ.59,170.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి డీగ్రీ/బీఈ/బీటెక్/ఎంసీఏ/ఎంఎస్సీ/పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా/మాస్టర్స్ డిగ్రీ/సీఏ/ఎఫ్ఆర్ఎం/సీఎఫ్ఏ. అలాగే నిబంధనల మేర అనుభవం, సంబంధిత రంగం ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** స్కేల్-1 పోస్టులకు 23-30 ఏళ్ల లోపు; స్కేల్-2, స్కేల్-4 పోస్టులకు 25-35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** గ్రూప్ డిస్కషన్+పర్సనల్ ఇంటర్వ్యూ/పర్సనల్ ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-రూ.100 (ఇంటిమేషన్ చార్జీలు); మిగిలిన కేటగిరీలకు రూ.600 (అప్లికేషన్ ఫీ+ఇంటిమేషన్ చార్జీలు).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 22, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** మార్చి 4, 2018.
- **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

'బామర్ లారీ'లో 42 అప్రెంటీస్ ఖాళీలు

కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వ శాఖకు చెందిన బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్.. కోల్‌కతా, చెన్నైలో ఉన్న తన ఎస్‌బీయూ యూనిట్లలోని 42 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** అప్రెంటీస్ (ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్-కస్టమర్ క్లియరెన్స్). **శిక్షణ వ్యవధి:** 15 నెలలు. ఇందులో క్లాస్‌రూమ్ బేసిక్ ట్రైనింగ్ 3 నెలలు, ఆన్ ద జాబ్ ట్రైనింగ్ 12 నెలలు ఉంటుంది.

- **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత.
- **వయసు:** 2018, ఫిబ్రవరి 1 నాటికి 14-21 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.balmerlawrie.com

జాబ్ ట్రెండ్స్

ఫ్రీలాన్సింగ్.. నైపుణ్యమే పెట్టుబడి!



ఒకరి కింద పనిచేయాల్సిన అవసరం ఉండదు. నచ్చిన సమయంలో, ఇష్టమైన ప్రదేశంలో, వీలున్నప్పుడు.. బిందాస్‌గా పనిచేస్తూ సంపాదించడమే ఫ్రీలాన్సింగ్. ఏదైనా ఒక డిమాండింగ్ స్కిల్ తెలిసుంటే చాలు. వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌తో లైఫ్‌ను నింపాదిగా గడిపేయొచ్చు. ఇటీవల అన్నిదేశాల్లోనూ ఫ్రీలాన్స్ వర్క్ కల్చర్ పుంజుకుంటోంది. ముఖ్యంగా మన దేశంలో ప్రతిభగల యువతకు చక్కటి అవకాశంగా నిలుస్తోంది రంగం. భవిష్యత్‌లో ఫ్రీలాన్సింగ్ మరింత విస్తృతమవుతుందనే అంచనాల నేపథ్యంలో దీనిపై విశ్లేషణ..

నిర్దిష్ట పనిగంటలు, డెడ్‌లైన్లు, అవసరమున్నా లేకున్నా మీటింగులు, టార్గెట్లు వంటివి లేని వర్క్ లైఫ్.. ఫ్రీలాన్సింగ్! ఇష్టమైన సమయంలో పనిచేసుకునే వెసులుబాటు, నైపుణ్యముంటే రెగ్యులర్ ఉద్యోగం కంటే ఎక్కువగా సంపాదించుకునే వీలు.. వెరసి ఫ్రీలాన్సింగ్‌కు క్రేజ్ పెరుగుతోంది. కంటెంట్ రైటింగ్ నుంచి కార్పొరేట్ ప్రొడక్ట్ డెలివరీ వరకు.. అన్ని ఉద్యోగాలూ ఫ్రీలాన్సింగ్‌కు అనువైనవే!

వీటికి డిమాండ్

- ఫ్రీలాన్సింగ్‌లో ఐటీ నైపుణ్యాలు, కంటెంట్ రైటింగ్ స్కిల్స్‌కు జాబ్ మార్కెట్లో డిమాండ్ ఉంది. నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, సోషల్ మీడియా మేనేజ్‌మెంట్, మై ఎస్‌క్యూఎల్ ప్రోగ్రామింగ్, ఇన్‌స్టాగ్రామ్ మార్కెటింగ్, బిజినెస్ కన్సల్టింగ్, మెషిన్ లెర్నింగ్, 3డీ రెండరింగ్, లా, అకౌంటింగ్, ఫొటోగ్రఫీ/వీడియో ఎడిటింగ్, వాయిస్‌ఓవర్ ఆర్టిస్టులకు ఎక్కువగా ఫ్రీలాన్సింగ్ అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.
- ఫ్రీలాన్సింగ్ ఏ ఒక్క విభాగానికో పరిమితం కాలేదు. అన్ని కేటగిరీలకు విస్తరించింది. ఒకప్పుడు ఫ్రీలాన్సర్ అంటే.. రచయితలు, జర్నలిస్టులు, ట్రాన్స్‌లేటర్లు, ఫొటోగ్రాఫర్లు గుర్తొచ్చే వారు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. డేటా ఎంట్రీ నుంచి డేటా సైంటిస్టుల వరకు పరిధి విస్తరించింది. సేల్స్, డిజైనింగ్ అండ్ క్రియేటివ్, వెబ్, మొబైల్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఐటీ, నెట్‌వర్కింగ్, డేటా సైన్స్ అండ్ అనలిటిక్స్, ఫారెన్ లాంగ్వేజెస్, ట్రాన్స్‌లేషన్, లీగల్, అడ్మిన్ సపోర్ట్, కస్టమర్ సర్వీస్ తదితర విభాగాల్లో ఫ్రీలాన్స్ కనిపిస్తోంది.

కన్సల్టెంట్‌లదే హవా!

ఫ్రీలాన్సింగ్ వర్క్ స్వరూపం మార్కెట్ అవసరాల మేరకు మారుతుంటుంది. ప్రస్తుతం కన్సల్టెంట్ల హవా కొనసాగుతోంది. అంటే.. ఆయా రంగంలోని నిష్ణాతులు స్వయంగా కార్యాలయం ఏర్పాటుచేసుకొని.. సంబంధిత కంపెనీలకు తమ సేవలు అందిస్తుంటారు. ఉదాహరణకు ఒక స్టార్టప్‌ను ప్రారంభించేందుకు, వ్యాపార విస్తరణ వ్యూహాలకు కంపెనీలు కన్సల్టెంట్లను నియమించుకుంటున్నాయి. వీరిలో ముఖ్యంగా చార్టర్డ్ అకౌంటెంట్స్, ఫైనాన్షియల్ అనలిస్టులు, హెచ్‌ఆర్ స్పెషలిస్టులు, లీగల్ అడ్వయిజర్లు, ఆర్కిటెక్ట్స్ ముందంజలో ఉంటున్నారు. వీరు ఆయా రంగాల్లోని కంపెనీలకు విలువైన సలహాలు, సూచనలు ఇస్తూ ఆర్జిస్తుంటారు.

కంటెంట్ రైటింగ్

ఫ్రీలాన్సింగ్‌లో ఎక్కువగా డిమాండ్ నెలకొన్న మరో స్కిల్.. కంటెంట్ రైటింగ్. ఫ్రీలాన్సింగ్ వెబ్‌సైట్లలో కంటెంట్ రైటర్ల కోసం వెతికే కంపెనీల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ప్రస్తుతం ఫ్రీలాన్సింగ్‌లో హాట్‌జాబ్ ప్రొఫైల్స్ పరంగా టాప్‌లో నిలుస్తోంది కంటెంట్ డెవలపర్. ఇప్పుడు ప్రతి వ్యాపార సంస్థకు వెబ్‌సైట్స్ తప్పనిసరిగా మారాయి. అందుకే కంటెంట్ రైటింగ్, బ్లాగింగ్‌కు ఎక్కువగా డిమాండ్ ఏర్పడింది. వెబ్‌సైట్ కంటెంట్‌లో ఉపయోగించే కీ వర్డ్స్‌తో సదరు వెబ్‌సైట్‌ను వీక్షించే వారి సంఖ్య పెరుగుతూ ఉంటుంది. నేటి ఇంటర్నెట్, ఈ-కామర్స్ యుగంలో వెబ్‌సైట్‌కు వినియోగదారులను రప్పించడం తప్పనిసరి కావడంతో కంటెంట్ రైటింగ్ నిపుణులకు డిమాండ్ ఏర్పడింది.

వెబ్ డిజైనింగ్

ప్రతి రంగంలోనూ ఆయా సంస్థలు సరికొత్త వెబ్‌సైట్లు రూపొందిస్తున్నాయి. సమాచారాన్ని ఆకర్షణీయ రీతిలో పొందుపరిచే స్కిల్స్ ఉన్నవారి కోసం అన్వేషిస్తున్నాయి. ముఖ్యంగా టెక్నికల్ వెబ్‌సైట్స్, ప్రొడక్ట్ డిస్క్రిప్షన్ విభాగాల్లో ప్రత్యేక నైపుణ్యాలున్న కంటెంట్ డెవలపర్ల కోసం ఎన్నో అవకాశాలు ఎదురు చూస్తున్నాయి. అలాగే డిజైనింగ్ కూడా మరో ప్రధాన ఉపాధి వేదికగా నిలుస్తోంది. వెబ్‌సైట్‌ను వీక్షకులకు ఆకర్షణీయంగా కనిపించేలా చేయడానికి అవసరమైన గ్రాఫిక్ డిజైనర్స్, వెబ్ డెవలపర్లకు కూడా ఇటీవల కాలంలో డిమాండ్ పెరిగింది. లోగోల డిజైన్, వెబ్‌సైట్లను ఆకర్షణీయంగా రూపొందించడం, గ్రాఫిక్ డిజైన్, వీడియో ప్రొడక్షన్, ఫొటోగ్రఫీ మొదలైన కేటగిరీల్లో డిజైనర్లకు చక్కటి అవకాశాలు ఉన్నాయి.

సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్

ఆన్‌లైన్ వెబ్‌సైట్స్, ఈ-కామర్స్ సంస్థలు.. కంటెంట్ డెవలపర్స్, వెబ్ డిజైనర్స్‌కే పరిమితం కాకుండా.. ఎస్ఈఓ (సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్), ఎస్ఈఎం (సెర్చ్ ఇంజన్ మేనేజ్‌మెంట్) సేవలను సైతం పొందాలని చూస్తున్నాయి. వినియోగదారులు ఒక కీవర్డ్ ద్వారా ఏదైనా ఒక ప్రొడక్ట్ లేదా సర్వీస్‌ను సెర్చ్ ఇంజన్స్ ద్వారా తెలుసుకోవాలనుకునే క్రమంలో తమ వెబ్‌సైట్ ముందుగా కనిపించాలని కోరుకుంటున్నాయి. అలాంటి రైటింగ్ స్కిల్స్, కంటెంట్ డెవలప్‌మెంట్ స్కిల్స్ ఉన్న సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్ స్పెషలిస్ట్‌లకు ఫ్రీలాన్సింగ్ అవకాశాలు ఎక్కువ.

ఐటీలో ఫ్రీలాన్సింగ్ మేటి

ఐటీ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ప్రోగ్రామింగ్, డేటాసైన్స్, యాప్ డెవలప్‌మెంట్, ఫ్రంట్ ఎండ్ డెవలప్‌మెంట్, టెక్ సపోర్ట్ వంటి ఐటీ, ఐటీ ఆధారిత పనుల్లోనూ ఫ్రీలాన్సింగ్ వేగంగా విస్తరించింది. టాప్ ఎంఎన్‌సీలు మొదలు, స్టార్టప్‌ల వరకు ఫ్రీలాన్సర్లను నియమించుకోవడంపై దృష్టిసారిస్తున్నాయి. మరీ ముఖ్యంగా అంకుర సంస్థలు ఫ్రీలాన్సింగ్ ద్వారానే తమ పనులు చేయించుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. ప్రాజెక్టులు వచ్చినప్పుడు ఫ్రీలాన్సర్లను తీసుకోవడం ద్వారా డబ్బు ఆదా చేసుకుంటున్నాయి. ఉద్యోగులను నియమించుకోవడం, తర్వాత క్లయింట్స్, ప్రాజెక్టులు లేకపోతే ఆర్థికంగా ఇబ్బందిపడే అవకాశం ఉండటంతో సేఫ్ జోన్‌లో ఉండేలా అంకుర సంస్థలు ఫ్రీలాన్సింగ్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఫలితంగా ఐటీ రంగంలో పని చేస్తున్న పలువురు ఫ్రీలాన్స్ అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు. డేటాసైన్స్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీపై నిపుణుల కొరత ఉండటంతో పెద్ద, చిన్న కంపెనీలు ఫ్రీలాన్సర్ల కోసం అన్వేషిస్తున్నాయి. వీరికి పెద్దమొత్తంలో చెల్లించడానికి వెనకాడటం లేదు.

వ్యక్తిగత పరిచయాలు, వెబ్‌సైట్ల ఆధారంగా ఫ్రీలాన్సింగ్ ప్రాజెక్టులు పొందొచ్చు. కమర్షియల్ ప్రాజెక్టులు అయితే ఎక్కువ చెల్లింపులు ఉంటాయి. ఒక ఫ్రీలాన్సింగ్ ప్రాజెక్టు పూర్తిచేస్తే సదరు క్లయింట్ మన ప్రొఫైల్‌పై ఇచ్చే రేటింగ్/ఎండార్స్‌మెంట్ ఆధారంగా మరిన్ని అవకాశాలు వస్తాయి. ఫ్రీలాన్సింగ్‌లోనూ కొన్ని ప్రతికూలతలున్నాయి. ప్రాజెక్టు సగం పూర్తిచేసి దానిద్వారా క్లయింట్ సంతృప్తి చెందితేనే నిర్దేశించుకున్న మొత్తంలో కొంత భాగం విడుదల చేస్తారు. ఒకవేళ నచ్చకుంటే పని వృథా అవుతుంది. ఫ్రీలాన్సింగ్‌లో రాణించాలంటే ఎప్పటికప్పుడు స్కిల్స్‌ను మెరుగుపరచుకోవాలి. కొత్త టెక్నాలజీలు నేర్చుకోవాలి.

– అనుమోజు శ్రవణ్ కుమార్, ఐటీ ఫ్రీలాన్సర్.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
840 ▼	256 ▼
35,067	10,761

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	7,241	▼	145
డోజోన్స్	25,521	▼	666
ఎఫ్‌టీఎస్ఈ 100	7,443	▼	47
డాక్స్	12,785	▼	219
షాంఘై	3,463	▲	16
నికాయ్	23,275	▼	212

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.90	65.03
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	92.97	93.16
€	యూరో	ఎస్‌బీఐ	81.45	81.61
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.43	59.55
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.24	52.35
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.64	49.74
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.40	18.26
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.77	18.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.16	11.62

మీ బీమాకు నామినీ ఉన్నారా?

ఏ పాలసీకైనా నామినీ తప్పనిసరి ● ఆ వివరాలు లేకుంటే క్లెయిమ్‌లు ఇబ్బందే

చట్టబద్ధ వారసులకు దక్కినా... సమయం పడుతుంది ● ఒకరికన్నా ఎక్కువ వారసులున్నపుడు మరింత కష్టం

జీవిత బీమా పాలసీ ఎందుకు? అనుకోనిదేమైనా జరిగితే కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించడానికే కదా!! మరి పాలసీదారుడు మరణించిన సందర్భంలో ఆ పరిహారం ఎవరికి అందించాలన్న వివరాలను పేర్కొనకపోతే లాభమేంటి? కుటుంబ సభ్యులను ఇబ్బందుల్లోకి నెట్టినట్టే కదా!! అందుకే జీవిత బీమా పాలసీకి నామినీ చాలా అవసరం. దీని ప్రాధాన్యాన్ని తెలియజేసే కథనమే ఇది.



నామినీ ఎందుకు?

నామినేషన్ ప్రాధాన్యం తెలుసుకునే ముందు నామినీ గురించి తెలుసుకోవాలి. పాలసీదారు మరణిస్తే జీవిత బీమా పరిహారం అందుకునేందుకు అర్హులైన వారే నామినీ. నిజానికి టర్మ్ పాలసీల్లో ఇది తప్పనిసరి కనక అంతా నామినీ పేరు పేర్కొంటారు. కానీ కొన్ని రకాల మెచ్యూరిటీ తీరాక నగదు అందే పాలసీలకు కొందరు నామినీ వివరాలివ్వరు. తామే తీసుకుంటాం కదా అనే భరోసాయే దీనిక్కారణం. నిజానికి వాటికీ కొంత కవరేజీ ఉంటుంది. పాలసీదారు మరణించిన సందర్భంలో ఆ కవరేజీ మొత్తాన్ని నామినీకి చెల్లిస్తారు. అయితే పాలసీలో ఎవరినీ నామినీగా పేర్కొనకపోతే అలాంటి సందర్భంలో పరిహారం చట్టబద్ధమైన వారసులకే చెందుతుంది. జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులు చట్టబద్ధమైన వారసులు. కాకపోతే ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. ''బీమాసంస్థ వారసత్వ ధ్రువీకరణ పత్రాన్ని అడుగుతుంది. అది చట్టబద్ధమైన వారసులను సూచించేలా ఉండాలి. ఇందుకు సమయం పడుతుంది. వారి కుటుంబ సభ్యులకు వ్యయాలు కూడా అవుతాయి. ఇది సరైనది కాదు. ఎందుకంటే బీమా పాలసీ తీసుకోవడం అన్నది తమపై ఆధారపడిన వారికి ఆర్థిక భద్రత చేకూర్చేందుకే'' అని టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యూసుఫ్ పచ్‌మరివాలా వివరించారు.

ఒకరికి మించి వారసులుంటే...

నామినీగా ఎవరినీ పేర్కొనని సందర్భాల్లో ఒకరికి మించి వారసులు ఉంటే క్లెయిమ్ పరిష్కార ప్రక్రియ మరింత జటిలం అవుతుంది. బీమా సంస్థలు పలు రకాల పత్రాలు, ఇండెమ్నిటీ బాండ్ అడగొచ్చు. ఇందుకు సమయం పడుతుంది. కొన్ని సందర్భాల్లో ఇరు పార్టీల మధ్య వివాదానికి దారితీయవచ్చు. ఒకవేళ పాలసీదారుడు నామినీగా ఎవరినీ పేర్కొనకపోయినా, విల్లు రాసి ఉంటే, అందులో పేర్కొన్న వ్యక్తికి బీమా సంస్థ నిబంధనల మేరకు అన్ని ప్రయోజనాలను చెల్లిస్తుంది. ఒకవేళ బీమా పాలసీలో నామినీగా ఒకరిని నమోదు చేయించి, విల్లులో మరొకరిని చట్టబద్ధమైన వారసుడిగా పేర్కొంటే, అప్పుడు బీమా సంస్థ విల్లులో ఉన్న వారికే ప్రయోజనాలను బదలాయిస్తుంది. అందుకే పాలసీలో నామినీగా ప్రతిపాదించిన వారినే విల్లులోనూ పేర్కొనడం మర్చిపోవద్దు.

నమోదు ప్రక్రియ ఇలా...

జీవిత బీమా పాలసీ తీసుకునే సమయంలోనే నామినీ వివరాలిస్తే మంచిది. దీని వల్ల భవిష్యత్తులో వారి కుటుంబానికి సమస్యలు రాకుండా ఉంటాయి. ''నామినీ నమోదు ప్రక్రియ చాలా సులభం. నామినీగా ప్రతిపాదిస్తున్న వ్యక్తి పూర్తి పేరు (అధికారిక ధ్రువీకరణ పత్రాల్లో ఉన్నట్టుగా), వయసు, పాలసీదారునితో ఉన్న అనుబంధం వివరాలు ఇస్తే చాలు'' అని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఈడీ పునీత్ నందా తెలిపారు. నామినీ అంటే ఒక్కరనే పరిమితి లేదు. ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా పేర్కొనే ఆప్షన్ పాలసీదారునికి ఉంటుంది. ఇలా పేర్కొంటే ఒక్కో నామినీకి ఎంత మేర పరిహారం చెల్లించాలన్న వివరాలూ ఇవ్వాలి. ఒకవేళ నామినీ మైనర్ అయితే ఆ మైనర్‌కు సంబంధించి అపాయింటీ లేదా ట్రస్టీని పేర్కొనాల్సి ఉంటుంది. ''చట్ట ప్రకారం మైనర్లు ఓ కాంట్రాక్టు పరిధిలో చేరేందుకు అర్హులు కారు. దాంతో బీమా పరిహారం నేరుగా పొందేందుకు అవకాశం లేదు. ఇటువంటి సందర్భం ఎదురైతే అపాయింటీకి పరిహారం చెల్లిస్తారు'' అని పునీత్ వివరించారు. ఒకసారి నామినీగా ఎవరి పేరును అయినా నమోదు చేసిన తర్వాత పాలసీ కాల వ్యవధిలోపు ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు తిరిగి మార్చుకోవచ్చు. చివరిగా పేర్కొన్న నామినీయే చట్టప్రకారం అర్హులుగా ఉంటారు. ఒకవేళ నామినీలో మార్పులు చేయదలిస్తే సంబంధిత దరఖాస్తును పూర్తి చేసి బీమా సంస్థకు అందజేయాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు నామినేషన్ వివరాలను సమీక్షించుకుంటూ, జీవితంలో వివాహం, నామినీగా ప్రతిపాదించిన వారు మరణించడం వంటి సందర్భాల్లో కొత్తగా మరొకరిని నామినీగా చేర్చుకోవడం పాలసీదారులు గుర్తుంచుకోవాల్సిన విషయం. ప్రస్తుతం బీమా సంస్థలు ఆన్‌లైన్‌లోనే నామినీ వివరాలు మార్చుకునే అవకాశం కూడా కల్పిస్తున్నాయి.

చెల్లుబాటు

జీవిత బీమా పాలసీదారుడు మరణించిన సందర్భంలో నామినీకి పరిహారం అందుతుంది. కొన్ని సందర్భాల్లో కాదు. ఉదాహరణకు పాలసీదారుడు ఏదైనా రుణం తీసుకుని హామీగా బీమా పాలసీని తనఖాగా ఉంచితే, అప్పుడు ఆ పాలసీని అసైన్ చేయాల్సి ఉంటుందని యూసుఫ్ పేర్కొన్నారు. ''పాలసీని తనఖాగా ఉంచి ఇతరులకు అప్పగించితే అప్పుడు పాలసీదారుడు ఆ విషయాన్ని కంపెనీకి తెలియజేయాల్సి ఉంటుంది. దాంతో బీమా సంస్థ అసైన్‌మెంట్‌ను రిజిస్టర్ చేస్తుంది. అప్పుడు పాలసీ డాక్యుమెంట్‌ను అసైనీ (ఎవరికి అయితే తనఖా పెట్టారో)కి పంపడం జరుగుతుంది. ఆ తర్వాత ఏ పాలసీదారుడు మరణిస్తే పరిహారం అసైనీకే చెల్లించడం జరుగుతుంది'' అని యూసుఫ్ వివరించారు. తనఖా పెట్టి ఆ తర్వాత విడిపించుకుంటే తిరిగి పాలసీదారుడు తన పాలసీకి నామినేషన్ నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

నామినీ ఎవరు?

నామినీ అంటే పాలసీదారుడి కుటుంబమే. జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులు. అయితే, పాలసీదారుడు ఇంకెవరినైనా కూడా నామినీగా ప్రతిపాదించొచ్చు. "చట్టబద్ధమైన వారసులు కాకుండా, రక్త సంబధీకులు కాకుండా మరెవరినో నామినేట్ చేస్తే, క్లెయిమ్ సమయంలో కుటుంబ సభ్యుల మధ్య వివాదం ఏర్పడవచ్చు. రక్త సంబంధం లేదా పాలసీదారుని కుటుంబ సభ్యులు అయితే ఎటువంటి ప్రశ్నలు లేకుండా క్లెయిమ్ దరఖాస్తును ఆమోదించడం జరుగుతుంది. ఇతరులైతే బీమా కంపెనీల్లో అండర్ రైటింగ్ సమయంలో ప్రశ్నలు తలెత్తవచ్చు" అని పచ్‌మరివాలా పేర్కొన్నారు.





- స్టాక్స్ విలువలు గరిష్ట స్థాయికి చేరాయి
- బడ్జెట్లో పన్నుతో కాస్తంత కరెక్షనూ మొదలైంది
- దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేసేట్లయితేనే మంచిది
- మార్కెట్ల హెచ్చుతగ్గులు చూసి సిప్ ఆపడం సరికాదు

గడిచిన ఏడాది కాలంలో మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తులు 30 శాతం పెరిగిపోయాయి. 2016 డిసెంబర్‌లో రూ.16.46 లక్షల కోట్లుగా ఉంటే 2017 డిసెంబర్ నాటికి అవి రూ.21.37 లక్షల కోట్లకు వృద్ధి చెందాయి. సిప్ విధానంలో నెలనెలా ఈక్విటీలోకి వచ్చే పెట్టుబడులు ఏకంగా రూ.6,200 కోట్లకు చేరాయి.

'ఫండా'లంటే... ఈ తప్పలొద్దు!

సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం

రయ్యిమంటూ ఎగసిన స్టాక్ మార్కెట్లలో... బడ్జెట్‌కు కాస్త ముందు నుంచే దిద్దుబాటు మొదలైందని చెప్పాలి. సూచీల్లోని స్టాక్‌లు పెద్దగా పడకపోయినా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు బాగానే పడ్డాయి. ఇక బడ్జెట్ నాడు, ఆ తరువాతి రోజు అన్ని షేర్లూ భారీగానే పతనమయ్యాయని చెప్పాలి. మరి ముమ్ముందు మార్కెట్లు ఎలా ఉంటాయి? కొందరేమో ఈ కరెక్షన్ కొనసాగవచ్చని అంచనాలు వేస్తున్నారు. కొందరైతే పెరిగిన మార్కెట్లలో దిద్దుబాటు తప్పదని, ఇది తాత్కాలికమేనని చెబుతున్నారు. ఎవరేం చెప్పినా ఇపుడు ఇన్వెస్టర్ల ముందున్న ప్రశ్నల్లా ఒకటే! మనమేం చెయ్యాలి అని? ముఖ్యంగా మ్యూచ్‌వల్ ఫండ్లలో సిస్టమాటిక్ ప్లాన్‌లో (సిప్) ఇన్వెస్ట్ చేస్తున్న వారంతా... మార్కెట్లు ఇంకా పడ్డాక సిప్ చేద్దామా... ప్రస్తుతానికి ఆపేద్దామా అనుకుంటున్నారు. ఇది ఎంతమాత్రమూ సరికాదన్నది నిపుణుల మాట. ఎందుకంటే 'సిప్'కు మార్కెట్లు పెరగటం, తగ్గటంతో సంబంధం లేదు. అలా చేస్తేనే లాభాలొస్తాయి కూడా!! అందుకే... ఈ సమయంలో మ్యూచ్‌వల్ ఫండ్ ఇన్వెస్టర్లు చేయకూడని తప్పులేంటో ఒకసారి చూద్దాం..

డివిడెండ్ల కోసం పెట్టుబడులు

బ్యాలన్స్‌డ్ ఫండ్స్ అన్నవి డెట్, ఈక్విటీ పెట్టుబడులతో ఉంటాయి. ఒకవైపు భద్రత మరోవైపు అధిక రాబడులిచ్చే విధానంతో ఇవి పని చేస్తాయి. అయితే, వీటిని డివిడెండ్ ఆదాయాన్నిచ్చే ఫండ్స్‌గా పరిగణించడం అలవాటైపోయింది. దీంతో గతంలో ఏడాదికోసారే డివిడెండ్‌నిచ్చే ఈ ఫండ్లు మూడు నెలలకోసారి, కొన్ని నెలకోసారి ఇస్తున్నాయి. పన్ను పరంగా వీటిని మెరుగైన స్థిరాదాయాన్నిచ్చే పథకాలుగా చూస్తున్నారు. అయితే, ఈ డివిడెండ్లను ఆయా ఫండ్లు మిగులు నిల్వల నుంచి చెల్లిస్తుంటాయి. అయితే, ఈ తరహా చెల్లింపులు ఎల్లవేళలా కొనసాగుతాయనే హామీ ఏమీ ఉండదు. ఎందుకంటే మార్కెట్ల ర్యాలీకి బ్రేక్ పడితే ఈ ఫండ్స్ వద్ద మిగులు నిల్వలు తగ్గిపోతాయి. దాంతో డివిడెండ్లు చెల్లించేందుకు సరిపడా నిధులుండవు. దీనికి బదులు స్థిరాదాయం కోరుకునే వారు బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌లోనే గ్రోత్ ఆప్షన్‌లో ఇన్వెస్ట్ చేసి, ఏడాది గడిచాక క్రమానుగత ఉపసంహరణ విధానంలో (ఎస్‌డబ్ల్యూపీ) నిర్ణీత మొత్తం వెనక్కి తీసుకోవాలి. దీనివల్ల మెరుగైన ఆదాయంతోపాటు, ఫండ్స్ వద్ద మిగిలి ఉన్న నిధులపై మెరుగైన రాబడులు రావడానికి ఆస్కారం ఉంటుంది.

స్వల్పకాలం కోసం పెట్టుబడి..!

మార్కెట్లలో సిప్ ద్వారా పెట్టుబడులు ఆరంభించేవారు అవసరమైతే మరింత ఎక్కువ కాలం కొనసాగేందుకు ముందే సిద్ధపడాలి. ఎందుకంటే 1997 ఏప్రిల్ నుంచి 2000 మార్చి మధ్య ఫ్రాంక్లిన్ ఇండియా ప్రైమా ప్లస్ పథకంలో సిప్ ద్వారా ప్రతి నెలా రూ.10,000 చొప్పున ఇన్వెస్ట్ చేసి ఉంటే ఆ పెట్టుబడుల విలువ మూడేళ్లలో రూ.10.41 లక్షలకు చేరి ఉండేది. అదే 2000 ఏప్రిల్‌లో సిప్ ఆరంభించి 2003 మార్చి వరకు చేసి ఉంటే పెట్టుబడుల విలువ రూ.3.8 లక్షలయి ఉండేది. ఇక్కడ రెండు భిన్న సమయాల్లోనూ నికర పెట్టుబడి రూ.3.6 లక్షలు. కానీ మొదటి ఉదాహరణలో అది రూ.10.41 లక్షలకు పెరిగితే, రెండో ఉదాహరణలో కేవలం 3.6 శాతం వృద్ధితోనే రూ.3.8 లక్షలకు చేరింది. మార్కెట్ల పరిస్థితిని బట్టి రాబడులుంటాయి కనక అవసరమైతే అధిక కాలం ఇన్వెస్ట్‌మెంట్ కొనసాగించాల్సి ఉంటుంది.

సిప్ ఆపేయడం సరికాదు...

ఇన్వెస్టర్లు 2017లో రూ.1.9 లక్షల కోట్ల విలువైన హోల్డింగ్స్‌ను విక్రయించేశారు. 2016 కంటే ఇది 45 శాతం అధికం. కొందరు ఇన్వెస్టర్లు మొత్తం పెట్టుబడులకు సంబంధించి లాభాల స్వీకరణ చేయగా, కొందరు విలువలు పెరగడంతో సిప్ పెట్టుబడులను ఆపేశారు. ఇలా చేయడం దీర్ఘకాలంలో నష్టానికి కారణమవుతుంది. కరెక్షన్ వస్తుందన్న అంచనాలతోనే, వచ్చిందన్న భయంతోనో మీ పెట్టుబడులను వెనక్కి తీసేసుకుంటే వాటిపై కాంపౌండింగ్ ప్రయోజనాలను కోల్పోతారు. దీంతో మీ లక్ష్యిత నిధి కంటే తక్కువే సమకూరడానికి దారితీయవచ్చు.

స్మాల్, మిడ్‌క్యాప్స్ విషయంలో జాగ్రత్త

గత మూడు సంవత్సరాల్లో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ ఫండ్స్ 23 శాతం, 17 శాతం చొప్పున వార్షిక రాబడులను ఇచ్చాయి. దీంతో అవి మల్టీక్యాప్, లార్జ్‌క్యాప్ ఫండ్స్ మించి రాబడులను ఇచ్చాయి. ఈ పనితీరు చూసిన వారు ఈ ఫండ్స్‌లో ఎక్కువగా ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి చూపడం సాధారణం. అయితే, స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌కు కేటాయింపులు పెంచడం సరికాదనేది నిపుణుల అభిప్రాయం. అధిక రాబడులను ఇచ్చే సామర్థ్యం ఈ పథకాలకు ఉంటుంది. అయితే, మార్కెట్లు ప్రతికూలంగా మారినప్పుడు వీటిలో ఆటుపోట్లు ఎక్కువవుతాయి. తాజా బడ్జెట్‌లో లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్ను వేయటంవల్ల శుక్రవారం మార్కెట్ సూచీలు భారీగా దాదాపు 2 శాతానికి పైనే నష్టపోయాయి. కానీ స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లు కొన్ని 10 శాతం కన్నా ఎక్కువే పడ్డాయి. అందుకే ఇప్పటికే మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసిన వారు వారికి సౌకర్యం అనిపించే స్థాయిలో అలా కొనసాగించడమే మంచిదంటున్నారు నిపుణులు. ఒకవేళ ఇన్వెస్ట్ చేసి ఉండకపోతే వాటికి ఈ సమయంలో దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

అవసరమైతే సలహా తీసుకోక తప్పదు

ఫండ్స్‌లో ఓ పథకంలో నేరుగా పెట్టుబడులు పెట్టుకునేందుకు అవకాశం ఉంది. వీటిని డైరెక్ట్ ప్లాన్లుగా పేర్కొంటారు. రెగ్యులర్ పథకాలతో పోలిస్తే డైరెక్ట్ ప్లాన్లలో ఖర్చుల శాతం తక్కు వ ఉంటుంది. అయితే, మ్యూచువల్ ఫండ్స్ పట్ల తగినంత అవగాహన లేని వారు నేరుగా ఇన్వెస్ట్ చేయకుండా ఉండడమే నయం. ఎందుకంటే తగిన పథకాన్ని ఎంచుకోకపోయినా, తరచూ పెట్టుబడుల నుంచి వైదొలగినా, అననుకూల సమయాల్లో పెట్టుబడులు పెట్టినా డైరెక్ట్ ప్లాన్లు లక్ష్యాలను చేరేందుకు సాయపడలేవు. ఈ సమయంలో ఆర్థిక సలహాదారుల అవసరం ఏర్పడుతుంది. వారు అన్ని రకాల పరిస్థితులకు తగినట్టు సూచనలు చేస్తారు.

ఇంటి రుణం తీర్చే.. ఈజీ మార్గాలివి!

సొంతింటిని గౌరవానికి చిహ్నంగా భావించే వారు మనలో చాలామంది. సొంతిల్లును తమ జీవితంలో కీలక లక్ష్యాల్లో ఒకటిగా చేర్చుకోవడంతో పాటు దాన్ని ఏదో ఒకరోజు వీలైతే చిన్న వయసులోనే సాకారం చేసుకోవాలని కోరుకోవడం సహజం. తక్కువ వడ్డీ రేట్లకే గృహ రుణాలు లభించే ప్రస్తుత పరిస్థితుల్లో సొంతింటి కల సాకారం అసాధ్యమేమీ కాదు. కేంద్రం నుంచి ఇళ్ల కొనుగోలుకు వడ్డీ రాయితీలు కూడా ఉండడంతో బడ్జెట్ ధరలోని గృహాలకు డిమాండ్ పెరిగింది. ముమ్ముందు ఈ మార్కెట్ ఇంకా వృద్ధి చెందుతుందనేది నిపుణుల అంచనా. అయితే, సొంతింటికి ప్లాన్ చేసుకునే వారు తమ వంతు కొంత నిధిని సమకూర్చుకోకపోతే ప్రతి నెలా అధికంగా ఈఎంఐ చెల్లించాల్సి వస్తుంది. దీంతో వస్తున్న ఆదాయంలో అధిక భాగం ఇంటి రుణ వాయిదాలకే చెల్లించాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఈ నేపథ్యంలో ఇంటి రుణాన్ని ఇబ్బంది లేకుండా స్మార్ట్‌గా తీర్చే మార్గాలను నిపుణులు తెలియజేస్తున్నారు...

- ఏటా వేతనం పెరిగితే దానికి తగ్గట్టే రుణ చెల్లింపు
- బోనస్, ఇతరత్రా నగదు అందితే అదీ ఈఎంఐకే
- ఇలా చేస్తే వడ్డీ భారం; కాల వ్యవధి రెండూ తగ్గుతాయి
- లేదంటే రుణ కాల వ్యవధి పెంచుకోవడమే పరిష్కారం

బోనస్ వస్తే కొంత తీర్చేయాలి..

కార్పొరేట్ ఉద్యోగుల్లో చాలా మందికి వార్షికంగా బోనస్ అందడం సహజం. ఈ బోనస్‌ను కూడా రుణ చెల్లింపులకు కేటాయించుకోవాలి. దీన్ని అదనపు ఈఎంఐగా భావించాలి. ఇలా ముందే రుణాన్ని తీర్చివేయడం ఆరంభిస్తే తిరిగి చెల్లించాల్సిన కాల వ్యవధి తగ్గుతుంది. ముందుగానే అదనంగా చెల్లింపులు చేయడం వల్ల కొన్నాళ్లకు ఈఎంఐ భారం కూడా దిగొస్తుంది. దీర్ఘకాలంలో ఇదో మంచి నిర్ణయం అవుతుంది. ఫ్లోటింగ్ వడ్డీ రుణాలపై ముందస్తు చెల్లింపుల చార్జీలను చాలా వరకు బ్యాంకులు, హోమ్ ఫైనాన్స్ కంపెనీలు వసూలు చేయడం లేదు. ఇక ముందుగానే రుణాన్ని తీర్చివేయడం వల్ల క్రెడిట్ స్కోరు కూడా పెరుగుతుంది.

రుణం దీర్ఘకాలానికి తీసుకుంటేనే బెటర్

ఈఎంఐ భారం తగ్గించుకోవటానికి ఉన్న మార్గాల్లో రుణాన్ని దీర్ఘకాలానికి తీసుకోవడం ఒకటి. ప్రతి నెలా వస్తున్న ఆదాయంలో ఇంటి రుణానికే ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తుంటే దీనికి బదులు రుణ కాల వ్యవధి పెంపును పరిశీలించొచ్చు. ఉదాహరణకు రూ.60 లక్షల ఇంటి రుణాన్ని 20 ఏళ్ల కాలానికి తీసుకున్నారనుకోండి. వడ్డీ రేటు 9 శాతం అనుకుంటే నెలసరి ఈఎంఐ రూ.53,984 అవుతుంది. ఈ కాల వ్యవధిని 20 ఏళ్లకు బదులు 30 ఏళ్లకు పెంచుకున్నారనుకోండి. అప్పుడు ఈఎంఐ రూ.48,227కు తగ్గుతుంది. ప్రతి నెలా రూ.5,757 వెసులుబాటు లభిస్తుంది. ఒకవేళ ఇలా వ్యవధి పెంచుకున్నప్పటికీ వేతనం పెరిగిన సందర్భాల్లో ఈఎంఐ పెంచుకుంటూ వెళితే నిర్ణీత కాలం కంటే ముందే రుణ చెల్లింపులు ముగుస్తాయి.

మధ్య మధ్యలో అదనంగా...

జీవితంలో అప్పుడప్పుడు కొంత మేర అదనపు ఆదాయం లభించిన సందర్భాలను సైతం రుణం చెల్లింపులకు వాడుకోవాలి. జీవిత బీమా మనీ బ్యాక్ పాలసీ నుంచి వచ్చే ఆదాయం, లేదా మెచ్యూరిటీ తీరిన ఫిక్స్‌డ్ డిపాజిట్ కానీయండి... వీటిని గృహ రుణ చెల్లింపులకు వినియోగించాలి. ఈ విధంగా చేతికి అందే అదనపు నిధులను ఇంటి రుణం భారం దింపుకునేందుకు వాడడం మంచి ఆలోచనే. ఉదాహరణకు రూ.50 లక్షల రుణంపై (15 ఏళ్ల కాల వ్యవధితో 9 శాతం వడ్డీ రేటుతో తీసుకుంటే) మొదటి మూడు సంవత్సరాల్లో రూ.లక్ష చెల్లించగలిగితే లోన్ టర్మ్‌లో రూ.1.88 లక్షల మొత్తం.. ఆరు నెలల కాల వ్యవధి తగ్గుతాయి. ఈ విధంగా రుణ కాల వ్యవధిలో రెండు మూడు సార్లు అదనపు చెల్లింపులు చేసినాగానీ భారం చాలా వరకు తగ్గుతుంది.

రుణ బదిలీ చేసుకోవచ్చు...

ఇప్పటికే రుణం తీసుకుని ఉన్నారు. ఈఎంఐ భారంగా అనిపిస్తుంటే, దీనికంటే తక్కువ వడ్డీకి, సులభ నిబంధనలపై మరో సంస్థ రుణం అందిస్తుంటే రుణాన్ని బదలాయించుకోవడం మంచి ఆప్షనే అవుతుంది. దీన్నే బ్యాలన్స్ ట్రాన్స్‌ఫర్‌గా పేర్కొంటారు. అయితే, రుణాన్ని బదలాయించుకునేందుకు అయ్యే వ్యయాలను తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలి. ఫీజులు, మార్ట్‌గేజ్‌పై స్టాంప్‌డ్యూటీ చార్జీలను లెక్క వేసుకుని బదలాయింపు లాభదాయకం అనుకుంటేనే ఆ పనిచేయాలి. ప్రస్తుతం వడ్డీ రేట్లు చాలా వరకు దిగొచ్చాయి. 8.35 శాతానికే రుణాలు లభిస్తున్నాయి. మరీ ఎక్కువ వడ్డీకి తీసుకున్న రుణాలైతే బదిలీ అవకాశాన్ని పరిశీలించొచ్చు. కాకపోతే మనం తీసుకున్న రుణం ఏ తరహాది, కాల వ్యవధి, తీసుకున్న రుణం మొత్తం వంటి అంశాలపై ఈ బదిలీ ఆధారపడి ఉంటుంది.





"కొన్నిసార్లు మన గురించి మనకే స్పష్టంగా తెలియకపోవచ్చు..
ఇతరుల కళ్ల ద్వారా మనల్ని మనం చూసుకున్నప్పుడు ఈ విషయం బోధపడుతుంది."
– ఎలెన్ డిజనెరస్ , అమెరికా నటి, నిర్మాత

పొదుపు-మదుపు



బ్యాంక్ డిపాజిట్ కన్నా మెరుగైన రాబడి

సంప్రదాయ ఇన్వెస్టర్ అయితే.. పెట్టుబడుల పరంగా రిస్క్ తీసుకోవడం ఇష్టం లేకపోతే.. అటువంటి వారు హెచ్‌డీఎఫ్‌సీ మీడియం టర్మ్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను పరిశీలించొచ్చు. ఇది ప్రధానంగా 60 నెలల కాల వ్యవధికి మించని డెట్, మనీ మార్కెట్ సాధనాల్లో, ప్రభుత్వ బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తుంటుంది. ఈ పథకం 2010లో ప్రారంభమైంది. ఇప్పటి వరకు ఇచ్చిన రాబడులను పరిశీలిస్తే బ్యాంకు డిపాజిట్ల కంటే కాస్త మెరుగైన రాబడులనే ఇచ్చిందని చెప్పుకోవచ్చు.

2017లో ఆర్‌బీఐ ఒకే ఒక్కసారి వడ్డీ రేట్లను తగ్గించింది. ద్రవ్యోల్బణం పెరుగుతున్న దృష్ట్యా అప్పటి నుంచి వేచి చూసే ధోరణిని అనుసరిస్తోంది. మధ్య కాలానికి 4 శాతం పరిధిలో ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయాలనుకుంటున్న దృష్ట్యా ఇప్పటికైతే వడ్డీ రేట్లను మరోసారి తగ్గించే అవకాశాలు కనిపించడం లేదు. మరోవైపు కేంద్రం ద్రవ్య లోటు విషయంలో లక్ష్యాన్ని చేరుకోవడంపైనా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ ఆటుపోట్లకు పరిమితం చేసే హెచ్‌డీఎఫ్‌సీ మీడియం టర్మ్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను పరిగణనలోకి తీసుకోవచ్చు.

హెచ్‌డీఎఫ్‌సీ మీడియం టర్మ్ ఆపర్చునిటీస్ ఫండ్

మంచి ట్రాక్ రికార్డు

రాబడుల పరంగా ఈ ఫండ్‌కు మంచి ట్రాక్ రికార్డే ఉంది. అన్ని రకాల వడ్డీ రేట్ల సమయాల్లోనూ మంచి పనితీరే ప్రదర్శించింది. బాండ్లకు అత్యంత అనుకూలంగా ఉన్న 2016లో ఏకంగా 10.6 శాతం రిటర్నులు పంచింది. గిల్ట్ ఫండ్లకు ప్రతికూలంగా ఉన్న 2015లోనూ రాబడులు 8.6 శాతానికి తగ్గలేదు. ఇక గిల్ట్ ఫండ్లకు ప్రతికూలంగా ఉన్న గతేడాది (2017లో) చాలా వరకు గిల్ట్ ఫండ్స్ రాబడులు 5–6 శాతానికి పరిమితం కాగా, హెచ్‌డీఎఫ్‌సీ మీడియం టర్మ్ ఆపర్చునిటీస్ 6.5 శాతం రాబడులిచ్చింది. ఇప్పటి వరకు రాబడుల పరంగా చూస్తే ఏటా సగటున 8.9 శాతం రాబడినిచ్చింది. మూడేళ్ల కాలంలో చూసుకుంటే 8.3 శాతం, ఐదేళ్ల కాలంలో సగటున 8.7 శాతం వార్షిక ప్రతిఫలాన్నిచ్చింది. ఈ ఫండ్ పెట్టుబడులకు సంబంధించిన వడ్డీ రేట్ల రిస్క్ చాలా పరిమితం. ఎందుకంటే ఏడాదిన్నర నుంచి మూడున్నరేళ్ల కాల వ్యవధి కలిగిన బాండ్లే దీని పోర్ట్ ఫోలియోలో ఎక్కువగా ఉంటాయి. అధిక రేటు కలిగిన (ఏఏఏ) బాండ్లలో, ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. దీంతో క్రెడిట్ రిస్క్ తగ్గుతుంది. ఈ ఫండ్ మొత్తం నిధుల్లో 76 శాతం ఏఏఏ రేటింగ్ ఉన్న బాండ్లలోనే ఉన్నాయి. 19 శాతం ప్రభుత్వ బాండ్లకు కేటాయించింది. హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్ కార్పొరేట్ బాండ్లలో ఎక్కువ వాటా కలిగి ఉంది. ఈ ఫండ్ నిర్వహణలో ఉన్న పెట్టుబడుల విలువ సుమారు రూ.13,000 కోట్లు.





టాప్ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు (శాతంలో)
పవర్ ఫైనాన్స్‌కార్ప్ 2020	4.75
ఓఎన్‌జీసీ పెట్రో అడిషన్స్ 2019	4.51
రాజస్తాన్ స్టేట్ 2021 (8.15 వడ్డీ)	3.44
రాజస్తాన్ స్టేట్ 2021 (8.39 వడ్డీ)	2.75
ఎఫ్‌సీఐ 2022 (9.95 వడ్డీ)	2.26
ఎన్‌హెచ్‌ఏఐ 2021 (7.17)	2.25
రిలయన్స్ జియో 2021 (8.32)	2.16
రాజస్తాన్ స్టేట్ 2026 (8.39)	2.15
హెచ్‌డీబీ ఫైనాన్షియల్ 2020	2.14
హెచ్‌డీఎఫ్‌సీ 2020	1.94

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, జనవరి 9 నాటికి (అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1–2 ఏళ్లు	5 ఏళ్లు, ఆపైన
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50	6.25
యాక్సిస్ బ్యాంక్	6.25-6.5	6.25- 6.75	6.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.25	6.45- 6.55	6.25-6.5
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.60	6.25
కెనరా బ్యాంక్	6.35	6.3- 6.5	6.00
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6-6.25	6.5-6.6	6.50
డీసీబీ బ్యాంక్	6.65	6.85- 7	7- 7.1
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.75-6.25	6.25 - 6.75	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6 - 6.50	6.6- 6.75	6.50
ఐడీబీఐ బ్యాంక్	6 - 6.5	6.5-6.75	6.00
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	5.75 - 6.25	6.50 - 6.75	6.00
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.25 - 6.5	6.75 - 6.85	6.50
కోటక్ మహీంద్రా బ్యాంక్	6.6- 6.7	6.7-6.85	6.25
ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.2-6.4	6.60	6.40
ఎస్‌బీఐ	6.25	6.25	6.00
సిండికేట్ బ్యాంక్	6.15	6.50	6.50

మరింత సమాచారం కోసం www. bankbazaar.com పై క్లిక్ చేయండి

పసిడి అప్‌ట్రెండ్ బలహీనం

వారంలో 13 డాలర్లు పతనం

రూపాయి బలహీనతతో దేశంలో లేని ఎఫెక్ట్

ఏడు వారాల అప్‌ట్రెండ్‌లో దాదాపు 1,240 డాలర్ల నుంచి 1,360 డాలర్ల స్థాయిని తాకిన పసిడి ధర కొంత స్థిరత్వ దశలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఫిబ్రవరి 2వ తేదీతో ముగిసిన వారంలో పసిడి ఔన్స్ (31.1గ్రా) అంతర్జాతీయ న్యూయార్క్ మర్కెంటైల్ ఎక్స్ఛేంజ్– నైమెక్స్‌లో 13 డాలర్లు బలహీనపడి 1,335 డాలర్లకు పడిపోయింది. ఇదే వారంలో డాలర్ ఇండెక్స్ 88.87 నుంచి 89.04 బలపడింది. రెండు వారాల క్రితం డాలర్ ఇండెక్స్ మూడేళ్ల కనిష్ట స్థాయి 88.30ని తాకిన సంగతి తెలిసిందే. 1,310 డాలర్ల వద్ద పసిడికి తక్షణ మద్దతన్న విశ్లేషణ వెలువడుతోంది. అమెరికా ఆర్థిక అనిశ్చితి కొనసాగితే, పసిడి 1,400 డాలర్ల వరకూ దూసుకుపోయే వీలుంది. అయితే ఈ దశలో కొంత ఒడిదుడుకులు ఉంటాయన్నది వారి వాదన. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాలనాయంత్రాంగం కరెన్సీ మార్కెట్లలో ఒడిదుడుకులను సృష్టిస్తోందని, దీంతో డాలర్ ఇండెక్స్ ఒడిదుడుకులకు గురవుతుందనీ, ఇదే ధోరణి పసిడిలోనూ కనిపిస్తుందన్నది విశ్లేషణ.

దేశీయంగా 'రూపాయి' ఎఫెక్ట్!

అంతర్జాతీయంగా పసిడి బలహీనపడితే, దేశంలో బంగారం ధర పటిష్టంగానే ఉంది. దీనికి కారణం రూపాయి బలహీనత ప్రధాన కారణం. రూపాయి వారంలో 63 పైసలు బలహీనపడింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 63.60 నుంచి 64.23కు బలహీనపడింది. ఈ ఎఫెక్ట్ దేశీయ మార్కెట్‌పై పడింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్) లో పసిడి వారంలో 10 గ్రాములకు స్వల్పంగా రూ. 6 పెరిగి రూ.30,367కి చేరింది. ప్రధాన ముంబై స్పాట్ మార్కెట్‌లో 99.9 స్వచ్ఛత ధర రూ.40 లాభంతో రూ.30,635కు చేరింది. 99.5 స్వచ్ఛత ధర కూడా అదే స్థాయిలో ఎగసి రూ. 30,485కు ఎగిసింది. వెండి కేజీ ధర మాత్రం రూ.495 తగ్గి, రూ. 39,270కు చేరింది.



యాప్‌కీ కహానీ...

ఆర్‌బీఎల్ బ్యాంక్ మొ-క్యాష్

డబ్బులు అత్యవసరమా? అయితే ఇంకేం తక్షణమే పొందండి. అదేలా అనుకుంటున్నారా? ఆర్‌బీఎల్ బ్యాంక్ మొ-క్యాష్ మొబైల్ యాప్ సాయంతో. ఇన్‌స్టంట్ లోన్, క్రెడిట్ కార్డు ఫీచర్ల అనుసంధానంతో బ్యాంక్ ఈ యాప్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీన్ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రత్యేకతలు...



- ఇన్‌స్టంట్ అప్రూవల్: కేవలం మూడు నిమిషాల్లో క్రెడిట్ లిమిట్‌ను తెలుసుకోవచ్చు.
- క్రెడిట్ లిమిట్‌లో ఎంత అవసరమో అంతే వాడుకోవచ్చు. ఈ విధంగా రుణంగా తీసుకున్న మొత్తానికి వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది. అంటే క్రెడిట్ లిమిట్ రూ.5,00,000 ఉంటే దానిలో రూ.2,00,000 ఉపయోగించాం. అప్పుడు రూ.2 లక్షలను వడ్డతో సహా చెల్లించాలి.
- ఎప్పుడు అవసరమనుకుంటే అప్పుడు డబ్బుల్ని బ్యాంక్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. మొత్తం 100 శాతం క్రెడిట్ లిమిట్‌ను బ్యాంక్ అకౌంట్‌కు పంపుకోవచ్చు.
- రుణాన్ని తిరిగి సరళమైన ఈఎంఐల రూపంలో చెల్లించొచ్చు.
- క్రెడిట్ కార్డు కూడా పొందొచ్చు. దీన్ని రిటైల్, ఆన్‌లైన్ షాపింగ్‌కు ఉపయోగించుకోవచ్చు. బ్యాంక్ ఈ క్రెడిట్ కార్డు ద్వారా కస్టమర్లకు పలు ప్రయోజనాలను, ఆఫర్లను అందిస్తోంది.

గమనిక: ఉద్యోగం చేసేవారు, స్వయం ఉపాధి పొందేవారు ఈ సేవలు పొందడానికి అర్హులు. నెలవారీ జీతం రూ.25,000కు పైన ఉండాలి.

ఇన్వెస్టర్లు యులిప్‌ల బాట పట్టొచ్చు

ఎల్‌టీసీజీతో బీమా పథకాలకు ఆదరణ


- మోర్గాన్ స్టాన్లీ అంచనా



ముంబై: ఈక్విటీలు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌పై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) వేయడంతో బీమా పథకాలు, ముఖ్యంగా యూనిట్ ఆధారిత బీమా పథకాల(యులిప్)కు ఆకర్షణ పెరుగుతుందని ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. బడ్జెట్‌లో ఎల్‌టీసీజీని తిరిగి ప్రవేశపెడుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఈ నెల 1న ప్రకటించిన వెంటనే మార్కెట్లు భారీగా పతనమై కోలుకోగా, మరుసటి రోజు మళ్లీ భారీ క్షీణత(2.3 శాతం)ను నమోదు చేసిన విషయం విదితమే. ఈక్విటీలు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై ఒక ఏడాదిలో దీర్ఘకాలిక లాభం రూ.లక్ష మించితే 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పంపిణీ చేసే డివిడెండ్లపైనా కేంద్రం 10 శాతం పన్ను విధించింది. ''తాజా ప్రతిపాదన నేపథ్యంలో జీవిత బీమా పాలసీలు ముఖ్యంగా యులిప్‌లు మధ్య కాలం నుంచి దీర్ఘకాలంలో ఆకర్షణీయంగా మారొచ్చని భావిస్తున్నాం''అని మోర్గాన్‌స్టాన్లీ తన వారంతపు నివేదికలో వివరించింది. ఆదాయ పన్ను చట్టంలోని నిబంధనల ప్రకారం జీవిత బీమా పథకాల నుంచి అందే ఆదాయంపై పన్ను లేదన్న విషయాన్ని నివేదికలో గుర్తు చేసింది. బడ్జెట్ ప్రతిపాదనలపై మరింత స్పష్టత కోసం చూస్తున్నామని, ప్రస్తుత వివరాలు కచ్చితమే అయితే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ వంటి ప్రైవేటు కంపెనీలకు లాభం కలుగుతుందని పేర్కొంది. మరోవైపు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌పై ఎల్‌టీసీజీ తోపాటు డివిడెండ్ పంపిణీపైనా పన్ను వేయడం ఈ రంగంలోకి పెట్టుబడుల రాకకు కొంత మేర అడ్డంకి కాగలదని నిపుణులు సైతం భావిస్తున్నారు.

స్టాక్స్ వ్యూ


పీవీఆర్ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్
ప్రస్తుత ధర: రూ.1,308 టార్గెట్ ధర: రూ.1,596

ఎందుకంటే: మల్టీప్లెక్స్ సినిమా హాళ్లను నిర్వహిస్తున్న పీవీఆర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సర మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలను అందుకోలేకపోయాయి. ఈ కంపెనీ రూ.618 కోట్ల ఆదాయంపై రూ.121 కోట్ల ఇబిటా, 19.7 శాతం చొప్పున ఇబిటా మార్జిన్ సాధిస్తుందన్న అంచనాలున్నాయి. కానీ ఆదాయం 5 శాతం మాత్రమే వృద్ధి చెంది రూ.5,57 కోట్లకు పెరిగింది. ఇబిటా 25 శాతం వృద్ధితో రూ.100 కోట్లకు ఎగసింది. మార్జిన్ 3 శాతం వృద్ధితో 18 శాతానికి పెరిగింది. అద్దె వ్యయాలు 1 శాతం తగ్గడం, నిర్వహణ, ఇతర వ్యయాలు 4.4 శాతం చొప్పున తగ్గడంతో నికర లాభం 21 శాతం వృద్ధి చెంది రూ.28.9 కోట్లకు పెరిగింది. ఈ కంపెనీ దక్షిణ భారత దేశంలో విస్తరణపై ప్రధానంగా దృష్టి పెట్టింది. ఈ క్యూ3లో ఘజియాబాద్‌లో మూడు స్క్రీన్లను ఏర్పాటు చేయగా, బెంగళూరులో 12 స్క్రీన్లను ప్రారంభించింది. ముంబైలో పీవీఆర్ ఓబెరాయ్‌ను మళ్లీ ప్రారంభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో కొత్తగా 36 స్క్రీన్లను ఏర్పాటు చేయగా, ఈ ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసిక కాలంలో మరో 31 కొత్త స్క్రీన్లను ఏర్పాటు చేయనున్నది. దీంట్లో 28 స్క్రీన్లు దక్షిణ భారత్‌లోనే ఏర్పాటు కానున్నాయి. మొత్తం స్క్రీన్లలో ప్రస్తుతం 23 శాతంగా ఉన్న దక్షిణాది స్క్రీన్ల సంఖ్య ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి 26.4 శాతానికి చేరుతుంది. వివిధ వివాదాల కారణంగా క్యూ3లో రిలీజ్ కావలసిన పద్మావతి సినిమా క్యూ4లో రిలీజ్ కావడం, విడుదలై మంచి వసూళ్లను సాధించడం, మరిన్ని సినిమాలు క్యూ4లో విడుదల కానుండటంతో ఈ క్యూ4లో ఈ కంపెనీ మంచి ఫలితాలు సాధిస్తుందని భావిస్తున్నాం. ఫుడ్ అండ్ బేవరేజేస్‌పై జీఎస్‌టీని 18% నుంచి 5 శాతానికి తగ్గించడం(ఇన్‌పుట్ క్రెడిట్ లేకుండా) సానుకూలాంశం కాగా, పన్ను రేట్లలో మార్పులతో ఫిల్మ్‌హైర్ ఛార్జీలపై ప్రభావం పడనుండడం ప్రతికూలాంశం.

ఇంజినీర్స్ ఇండియా — కొనొచ్చు




బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్
ప్రస్తుత ధర: రూ.167 టార్గెట్ ధర: రూ.195

ఎందుకంటే: ప్రభుత్వ రంగంలోని ఇంజినీర్స్ ఇండియా కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో అంచనాలను మించిన ఆర్థిక ఫలితాలను వెల్లడించింది. వివిధ విభాగాల నుంచి ఆర్డర్లు రావడం, ఆర్డర్ల అమలు కారణంగా ఈ క్యూ3లో ఈ కంపెనీ మంచి ఆర్థిక ఫలితాలను సాధించింది. ఆదాయం 46 శాతం వృద్ధితో రూ.473 కోట్లకు పెరిగింది. దీంట్లో కన్సల్టెన్సీ విభాగం వాటా 81 శాతం ఉండగా, టర్న్ కీ సెగ్మెంట్ వాటా 19 శాతంగా ఉంది. ఈ రెండు విభాగాల్లో మంచి పనితీరు సాధించడంతో ఇబిటా మార్జిన్ 28.5 శాతానికి పెరిగింది. ఇక ఇబిటా 67 శాతం వృద్ధితో రూ.135 కోట్లకు ఎగసింది. ఇబిటా మంచి వృద్ధిని సాధించినా, ఇతర ఆదాయం 30 శాతం తగ్గడంతో కంపెనీ నికర లాభం 28 శాతమే వృద్ధి చెంది రూ.108 కోట్లకు పెరిగింది. క్యూ3లో రూ.114 కోట్ల విలువైన ఆర్డర్లు మాత్రమే దక్కాయి. దీంతో ఆర్డర్ల బుక్ విలువ రూ.8,301 కోట్లకు పెరిగింది. ఈ ఆర్డర్లతోనే మూడేళ్ల వరకూ మంచి వృద్ధిని సాధించే అవకాశాలు ఈ కంపెనీకి ఉన్నాయి. అయితే రెండేళ్లలో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల నుంచే భారీ ఆర్డర్లు రానున్నాయి. రూ.700–1,200 కోట్ల హెచ్‌పీసీఎల్ బామర్ ప్రాజెక్ట్, రూ.600 కోట్ల ఐఓసీ గుజరాత్ రిఫైనరీ విస్తరణకు సంబంధించిన కన్సల్టెన్సీ ఆర్డర్ ఈ కంపెనీకే దక్కనున్నాయి. అంతేకాకుండా ఐఓసీకే చెందిన కోయాలి, బరౌని, మధుర రిఫైనరీల విస్తరణ ఆర్డర్లు వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్‌లో ఇంజినీర్స్ ఇండియాకే లభించవచ్చు. గెయిల్–కాకినాడ పెట్రో కెమికల్ ప్రాజెక్ట్, బీపీసీఎల్–నుమాలీఘర్ విస్తరణ ప్రాజెక్ట్ ఆర్డర్లు కూడా ఈ కంపెనీకి దక్క అవకాశాలున్నాయి. కంపెనీ నగదు నిల్వలు రూ.2,150 కోట్లు. రుణభారం లేదు. రెండేళ్లలో ఇబిటా మార్జిన్ 25 శాతం, నికర అమ్మకాలు 18 శాతం, నికర లాభం 14 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందుతాయని అంచనా.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

గతవారం బిజినెస్

డిసెంబర్‌లో నెమ్మదించిన మౌలిక రంగం



ఎనిమిది మౌలిక పరిశ్రమల గ్రూప్ వృద్ధి రేటు డిసెంబర్‌లో నెమ్మదించింది. వృద్ధి 4 శాతంగా నమోదయ్యింది. ఇది ఐదు నెలల కనిష్ట స్థాయి. గత ఏడాది ఇదే నెల్లో గ్రూప్ వృద్ధి రేటు 5.6 శాతం.

ఆస్ట్రేలియా మార్కెట్లోకి ఓలా

ట్యాక్సీ సర్వీసుల దేశీ దిగ్గజం ఓలా... విదేశీ మార్కెట్లకు కూడా కార్యకలాపాలు విస్తరిస్తోంది. త్వరలో ఆస్ట్రేలియాలోనూ సర్వీసులు ప్రారంభించనుంది. ఇందులో భాగంగా.. ప్రస్తుతం సిడ్నీ, మెల్‌బోర్న్, పెర్త్ నగరాల్లో ప్రైవేట్ వాహనదారులను తమ ప్లాట్‌ఫాంపై నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఓలా తెలిపింది.

ఆటోమొబైల్స్



- దేశీ దిగ్గజ టూవీలర్ల తయారీ కంపెనీ 'హీరో మోటోకార్ప్' తాజాగా 'ఎక్స్‌ట్రీమ్ 200ఆర్' పేరిట కొత్త బైక్‌ను మార్కెట్‌లోకి ఆవిష్కరించింది. దీని ధర రూ.90,000– రూ. 1,00,000 శ్రేణిలో ఉండొచ్చు.
- ఇటాలియన్ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ 'మాసెరటి' తన ప్రముఖ ప్రీమియం ఎస్‌యూవీ 'లెవాంటె'లో అప్‌డేటెడ్ వెర్షన్‌ను భారత మార్కెట్లోకి తెచ్చింది. దీని ప్రారంభ ధర రూ.1.45 కోట్లు (ఎక్స్‌షోరూమ్). మాసెరటి నుంచి మన దేశంలోకి వస్తోన్న తొలి ఎస్‌యూవీ ఇదే.
- ప్రముఖ వాహన తయారీ కంపెనీ 'ఫోర్డ్ ఇండియా' తాజాగా కొత్త కాంపాక్ట్ యుటిలిటీ వెహికల్ 'ఫ్రీస్టైల్'ను మార్కెట్‌లోకి ఆవిష్కరించింది. ఇది ఏప్రిల్‌లో కస్టమర్లకు అందుబాటులోకి రానుంది.

రైతులకు ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులు

ఎస్‌బీఐ రైతులకు క్రెడిట్ కార్డులను అందించనున్నట్లు ప్రకటించింది. తమ అనుబంధ సంస్థ 'ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్స్ సర్వీసెస్' ద్వారా రైతులకు క్రెడిట్ కార్డులను అందిస్తామని ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ తెలిపారు. 'గుజరాత్, రాజస్తాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో పైలట్ ప్రాతిపదికన ఈ ప్రాజెక్ట్ చేపట్టాం. దీని విజయం ఆధారంగా తర్వాత దేశవ్యాప్త విస్తరణ ఉంటుంది' అని వివరించారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) మాదిరి కాకుండా ఎస్‌బీఐ కార్డులో 40 రోజుల క్రెడిట్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

భూషణ్ స్టీల్‌పై జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ఆసక్తి



మొండిబాకీలతో ఎన్‌సీఎల్‌టీ ముందుకు చేరిన భూషణ్ స్టీల్, భూషణ్ పవర్ అండ్ స్టీల్, మోనెట్ ఇస్పాత్ సంస్థల కొనుగోలుపై జేఎస్‌డబ్ల్యూ స్టీల్ దృష్టి సారించింది. భూషణ్ స్టీల్, భూషణ్ పవర్ అండ్ స్టీల్‌కి సంబంధించి ఫిబ్రవరి 3లోగా బిడ్లు దాఖలు చేస్తామని సంస్థ జేఎండీ శేషగిరిరావు తెలిపారు. మోనెట్ ఇస్పాత్ కోసం ప్రణాళికను సమర్పించినట్లు పేర్కొన్నారు.

కాల్ డ్రాప్స్ కట్టడికి టెల్కోల 74 వేల కోట్లు!



టెలికం కంపెనీలు కాల్ డ్రాప్స్ సమస్య పరిష్కారానికి భారీ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యాయి. ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో సహా ఇతర టెలికం కంపెనీలు రూ.74,000 కోట్లకు పైగా ఇన్వెస్ట్‌మెంట్లతో వాటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అప్‌గ్రేడ్ చేసుకోనున్నాయని టెలికం కార్యదర్శి అరుణ సుందరరాజన్ తెలిపారు. తద్వారా కాల్ డ్రాప్స్ సమస్యను అధిగమించడానికి టెల్కోలు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు.

27 నుంచి 28కి ఐఎస్‌బీ ర్యాంకు!

ఐఐఎం బెంగళూరు, ఐఐఎం కోల్‌కతాల గ్లోబల్ ర్యాంక్ ఈ ఏడాది మెరుగుపడింది. అయితే ఐఐఎం– అహ్మదాబాద్, ఐఎస్‌బీ హైదరాబాద్ ర్యాంక్ మాత్రం తగ్గింది. ఫైనాన్షియల్ టైమ్స్ లండన్ 'గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్–2018'లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. స్టాన్‌ఫర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ టాప్ ర్యాంక్‌ను సొంతం చేసుకోగా... దీని తర్వాతి స్థానంలో ఫ్రెంచ్ స్కూల్ ఇన్‌సీడ్ ఉంది. 2017లో 27వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్న ఐఎస్‌బీ... ఈసారి 28కి పరిమితమయింది.

డీల్స్..



- వ్యాపార దిగ్గజం ముకేశ్ అంబానీకి చెందిన మీడియా గ్రూప్ 'టీవీ18 బ్రాడ్‌కాస్ట్' తన జాయింట్ వెంచర్ కంపెనీ 'వయాకామ్ 18'లో మెజారిటీ వాటాలు సొంతం చేసుకుంది. ఇందు కోసం 20 మిలియన్ డాలర్లు చెల్లించి అమెరికాకు చెందిన భాగస్వామ్య సంస్థ వయాకామ్ నుంచి 1 శాతం వాటా కొనుగోలు చేసింది. దీంతో వయాకామ్18లో టీవీ18 వాటా 51 శాతానికి చేరింది.
- వాల్‌మార్ట్.. ఫ్లిప్‌కార్ట్‌లో 15 నుంచి 20 శాతం వాటా కొనుగోలు చేయాలని భావిస్తోంది. దీనికోసం సుమారు 1 బిలియన్ డాలర్ల వరకూ ఇన్వెస్ట్ చేయాలని యోచిస్తోంది.
- బిగ్‌బాస్కెట్.. ఆలీబాబా, అబ్రాజ్ క్యాపిటల్, శాండ్స్ క్యాపిటల్, ఐఎఫ్‌సీ తదితర సంస్థల నుంచి రూ.1,920 కోట్లు పెట్టుబడులు సమీకరించింది. మరోవైపు జొమాటోలో ఆలీబాబా అనుబంధ సంస్థ ఆంట్ స్మాల్ అండ్ మైక్రో ఫైనాన్షియల్ సర్వీసెస్ గ్రూప్ 20 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టింది.
- జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో (జీహెచ్‌ఐఏఎల్) జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (జీఏఎల్) 11 శాతం వాటా పెంచుకుంటోంది. మలేషియన్ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్, ఎంఏహెచ్‌బీ (మారిషస్) నుంచి ఈ వాటాను కొనుగోలు చేస్తోంది. డీల్ విలువ సుమారు రూ.484 కోట్లు.

కోటక్ ఎంఎఫ్ కొత్త స్కీమ్

కోటక్ మ్యూచువల్ ఫండ్ తాజాగా 'కోటక్ ఇండియా గ్రోత్ ఫండ్ సిరీస్–4' అనే కొత్త స్కీమ్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఇది ఫిబ్రవరి 12 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ఫండ్ ప్రధానంగా లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడులు పెడుతుంది.

బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్రం



కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న 2018–19 ఆర్థిక సంవత్సరానికి గానూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ మొత్తం రూ.24.42 లక్షల కోట్లు.

2017-18 క్యూ3 ఆర్థిక ఫలితాలు

కంపెనీ	నికర లాభం (కోట్లలో)			మొత్తం ఆదాయం (కోట్లలో)		
	2017–18	2016–17	వృ/క్షీ(%)	2017–18	2016–17	వృ/క్షీ(%)
హెచ్‌డీఎఫ్‌సీ	6,677	2,729	145	16,847	14,989	12
టెక్ మహీంద్రా	943	856	10	7,776	7,558	3
ఓరియంటల్ బ్యాంక్	-1,985	-130	--	4,699	5,416	-13
గోద్రెజ్ కన్సూమర్ ప్రొడక్ట్స్	430	352	22	2,666	2,057	30
ఐటీసీ	7,883	3,995	97	1,20,865	--	15
రిలయన్స్ పవర్	280	276	2	2,590	2,985	-13
ఎస్‌బీఐ లైఫ్	230	190	21	9,720	6,060	60
టీవీఎస్ మోటార్	154	133	16	3,685	3,240	14
ఎన్‌టీపీసీ	2,361	2,469	-4	21,087	19,646	7
ఐడీబీఐ బ్యాంక్	-1,524	-2,255	--	6,645	7,104	-6
ఎల్ అండ్ టీ	1,490	--	53	28,747	--	9
వేదాంత	2,173	2,133	2	24,934	21,405	16
ఐసీఐసీఐ బ్యాంక్	1,894	2,611	-27	28,501	27,876	2
అశోక్ లేలాండ్	450	162	178	7,151	4,854	47
టైటాన్	282	232	21	4,296	4,000	7
హిందాల్కో	376	--	17	11,023	9,914	11
బజాజ్ ఆటో	1,013	977	4	6,369	5,354	19



బొమ్మ-బొరుసు

"ప్రపంచంలోని చాలా అందమైన, ఉత్తమమైన విషయాలను చూడలేం. అలాగే తాకలేం. వాటిని కేవలం మనసుతో మాత్రమే ఆస్వాదించగలం." – హెలెన్ కెల్లర్, అమెరికా రచయిత



భారత్ నుంచి సంపన్నుల వలస

2017లో 7,000 మంది విదేశాలకు..



- సంఖ్యాపరంగా అంతర్జాతీయంగా రెండో స్థానం
- వెల్లడించిన వరల్డ్ వెల్త్ రిపోర్ట్

న్యూఢిల్లీ: పేదవారు పొట్ట చేత పట్టుకుని వలస పోవడం వినే ఉంటారు. వారిది జీవనపోరాటం. అయితే, వలసలు వారికే పరిమితం కాదు. సంపన్నులు కూడా తమ అవసరాల కోసం, ఆశయాల కోసం, మెరుగైన జీవనం కోసం వలసల బాట పడుతున్నారు. విదేశాలకు తమ గమ్యస్థానాన్ని మార్చుకుంటున్నారు. 2017లో మన దేశం నుంచి 7,000 మంది మిలియనీర్లు (అధిక విలువ కలిగిన వ్యక్తులు/ మిలియన్ డాలర్లు/రూ.6.4 కోట్లు ఆపై సంపద ఉన్నవారు) విదేశాలకు వలసపోయారని న్యూవరల్డ్ వెల్త్ రిపోర్ట్ చెబుతోంది. 2016లో వలస వెళ్లిన వారి సంఖ్య కంటే 16 శాతం అధికం. 2016లో 6,000 మంది, 2015లో 4,000 మంది మిలియనీర్లు మన దేశం నుంచి విదేశాలకు మకాం మార్చారు. అమెరికా, యూఏఈ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మన దేశ వాసులను ఆకర్షించిన టాప్ దేశాలు.

కీలక అంశాలు...

- 2017లో 10,000 మంది చైనీయులు ఆ దేశం వీడి వెళ్లారు. వలసల్లో అంతర్జాతీయంగా మొదటి స్థానం చైనాదే. టర్కీ 6,000 మంది, బ్రిటన్ 4,000 మంది, ఫ్రాన్స్ 4,000 మంది, రష్యా 3,000 మంది మిలియనీర్లను కోల్పోయాయి. మిలియనీర్ల వలసల సంఖ్య 2017లో మొత్తం మీద అంతర్జాతీయంగా 95,000గా ఉంది.
- మిలియనీర్లను ఆకర్షించడంలో ఆస్ట్రేలియా అగ్ర స్థానం దక్కించుకుంది. 2017లో ప్రపంచ దేశాల నుంచి ఈ దేశానికి తరలివెళ్లిన వారు 10,000 మంది ఉన్నారు. అగ్ర రాజ్యం అమెరికా ఈ విషయంలో మరోసారి ఆస్ట్రేలియా కంటే వెనుకబడింది. అయితే, మొత్తం మీద మిలియనీర్ల ఆకర్షణలో ఆస్ట్రేలియా తర్వాత నిలిచింది అగ్రరాజ్యమే. 9,000 మంది ఈ దేశాన్ని ఆశ్రయించారు. ఆ తర్వాత కెనడా 5,000 మంది, యూఏఈ 5,000 మందిని ఆకర్షించాయి.
- మిలియనీర్ల సంపద ఎక్కువగా వున్న దేశాల్లో భారత్‌కు ఈ నివేదిక ఆరో స్థానం కల్పించింది. మొత్తం సంపద విలువ 8,230 బిలియన్ డాలర్లు.
- భారత్‌లో 3,30,400 మంది మిలియనీర్లు ఉన్నారు. మిలియనీర్ల సంఖ్యా పరంగా భారత్ అంతర్జాతీయంగా 9వ స్థానంలో నిలిచింది. మల్టీ మిలియనీర్లు 20,730 మంది ఉన్నారు. ఈ విషయంలో ఏడో స్థానంలో ఉంది. 119 మంది బిలియనీర్ల (100 కోట్ల డాలర్లు, అంతకు పైన సంపద ఉన్నవారు)తో అమెరికా, చైనా తర్వాత మూడో స్థానంలో నిలిచింది.

ఆర్‌బీఐ పాలసీ, క్యూ3 కీలకం

- ఈ నెల 7న ఆర్‌బీఐ పాలసీ వెల్లడి
- ఎస్‌బీఐ, పీఎన్‌బీ, టాటా మోటార్స్.. దిగ్గజ కంపెనీల ఫలితాలు
- ఎల్‌టీసీజీ ప్రభావం స్వల్పకాలమేనంటున్న విశ్లేషకులు



ఆర్‌బీఐ పాలసీ, ఈ వారంలో వెలువడే కొన్ని దిగ్గజ కంపెనీల క్యూ3 ఆర్థిక ఫలితాలు ఈ వారం స్టాక్ మార్కెట్‌కు కీలకమని నిపుణులంటున్నారు. ప్రపంచ మార్కెట్ల పోకడ, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల కదలికలు, డాలర్‌తో రూపాయి మారకం గమనం, విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి కూడా ఈ వారం స్టాక్ సూచీల కదలికలను నిర్దేశిస్తాయని వారంటున్నారు. ఇక నేడు(సోమవారం) వెలువడే సేవల రంగ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్(పీఎమ్ఐ) గణాంకాలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయని విశ్లేషకులంటున్నారు.

వెయ్యి కంపెనీల ఫలితాలు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన చివరిదైన ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ సమావేశం మంగళవారం(రేపు) మొదలై బుధవారం ముగుస్తుంది. కీలక రేట్లపై ఈ నెల 7(బుధవారం)న ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంటుంది. ఈ వారంలో దాదాపు వెయ్యి వరకూ కంపెనీలు క్యూ3 ఫలితాలను వెల్లడించనున్నాయి. ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, టాటా మోటార్స్, హీరో మోటొకార్ప్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోల్ ఇండియా, భెల్, సెయిల్, లుపిన్, సిప్లా, అరబిందో ఫార్మా, టాటా స్టీల్, ఓఎన్‌జీసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ తదితర కంపెనీలు క్యూ3 ఆర్థిక ఫలితాలను వెల్లడిస్తాయి.

ఎల్‌టీసీజీ ప్రభావం తాత్కాలికమే...

వచ్చే ఆర్థిక సంవత్సర ద్రవ్యలోటు అంచనాలను మించడం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం తదితర అంశాల కారణంగా వడ్డీరేట్ల విషయమై ఆర్‌బీఐ కఠినంగా వ్యవహరించే అవకాశాలున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. ఎల్‌టీసీజీ విధింపు తాత్కాలికంగానే ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. బడ్జెట్ సంబంధిత ఒడిదుడుకులు ఎక్కువ కాలం కొనసాగిన దాఖలాలు లేవని, మార్కెట్ దృష్టి కంపెనీల ఫలితాలు, ఇతర ఆర్థిక విషయాలపైకి మరలుతుందన్నారు. గత రెండు నెలలుగా మార్కెట్ అధిక వేల్యూయేషన్‌తో ట్రేడవుతోందని, బడ్జెట్ తర్వాత పతనమైందని యాక్సిస్ సెక్యూరిటీస్ ఎమ్‌డీ, సీఈఓ అరుణ్ తుక్రల్ తెలిపారు. ఎల్‌టీసీజీతో ఇన్వెస్టర్లు నిరాశ చెందారని అరిహంత్ క్యాపిటల్ డైరెక్టర్ అనితా గాంధీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పుంజుకునేలా బడ్జెట్ ఉందని, భారత వృద్ధిని మరో మెట్టు పైకి తీసికెళ్లేలా బడ్జెట్ ఉందని, అయితే అమలు కీలకం కానున్నదని పేర్కొన్నారు. ద్రవ్యలోటు లక్ష్యాన్ని మీరకుండా బడ్జెట్‌లో ప్రతిపాదించిన భారీ పథకాలు అమలు సాధ్యాసాధ్యాలపై అనిశ్చితి నెలకొన్నదని జియోజిత్ ఫైనాన్షియల్ చీఫ్ మార్కెట్ స్ట్రాటజిస్ట్ ఆనంద్ జేమ్స్ తెలిపారు.

గెలాక్సీ లిస్టింగ్...: గెలాక్సీ సర్ఫ్‌క్టాంట్స్ కంపెనీ షేర్ ఈ నెల 8న (గురువారం) స్టాక్‌మార్కెట్లో లిస్ట్ కానున్నది. గత నెల 29–31 మధ్య రూ. 1,470–1,480 ప్రైస్‌బాండ్‌తో వచ్చిన ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.937 కోట్లు సమీకరించింది. ఈ ఐపీఓ 20 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది.

జనవరిలో రూ.22,000 కోట్ల విదేశీ పెట్టుబడులు..

విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) మన క్యాపిటల్ మార్కెట్లో గత నెలలో భారీగా పెట్టుబడులు పెట్టారు. కంపెనీల క్యూ3 ఫలితాలు బాగా ఉంటాయనే అంచనాలు, బాండ్ల ఈల్డ్‌లు ఆకర్షణీయంగా ఉండడం, కొత్త ఏడాది ఖాతాల ప్రారంభం సందర్భంగా కొనుగోళ్లు చోటు చేసుకోవడం తదితర కారణాల వల్ల ఈ ఏడాది జనవరిలో మన క్యాపిటల్ మార్కెట్లో ఎఫ్‌పీఐలు రూ.22,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. డిపాజిటరీల గణాంకాల ప్రకారం, ఎఫ్‌పీఐలు మన స్టాక్ మార్కెట్లో రూ.13,781 కోట్లు, డెట్‌మార్కెట్లో రూ.8,473 కోట్ల మేర ఇన్వెస్ట్ చేశారు.

బిజినెస్ క్విజ్ -3

పెట్టుబడులు, పొదుపు పథకాలకు సంబంధించి ఆసక్తికరమైన ప్రశ్నలు, వాటికి జవాబులు తెలియాలంటే... థర్డ్ అంపైర్ మీడియా సీఈవో సునీల్ ధవళ అందిస్తున్న క్విజ్

WWW.SAKSHIBUSINESS.COMలో..
SAKSHIBUSINESS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్,యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

GET IT ON Google Play | Available on the App Store

బోర్డ్ మీటింగ్స్

టాటా మోటార్స్, కోల్గేట్ పామోలివ్, కొచ్చిన్ షిప్‌యార్డ్, హడ్కో, బాష్, జేఎస్‌డబ్ల్యూ హోల్డింగ్స్, ఐఎఫ్‌సీఐ, ఎమ్ఎమ్ ఫోర్జింగ్స్, టీబీజడ్, యూనికెమ్ ల్యాబ్స్, ఉజ్జీవన్ ఫైనాన్షియల్ సర్వీసెస్, మెక్‌లాయిడ్ రస్సెల్, సెంచురీ ప్లై, గ్రీవ్స్ కాటన్, ఇగరాషి మోటార్స్, కాకతీయ సిమెంట్, లా-ఒపాలా ఆర్‌జీ, సెయింట్ గోబైన్, ఆస్ట్రాజెనెకా ఫార్మా

కోడిగుడ్లు

(హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 5-2-2018

విజయవాడ	354-00
గోదావరి	354-00
విశాఖ	355-00
వరంగల్	362-00
చిత్తూరు	378-00
చెన్నై	385-00
ముంబై	405-00
నమక్కల్	370-00
4-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	360-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.20
బెంగళూరు	370-00
కోల్‌కతా	390-00
ఢిల్లీ	378-00

మూలధన పన్నుతో రూ. 40,000 కోట్లు..

ఆర్థిక శాఖ కార్యదర్శి హష్ముఖ్ అధియా అంచనా... ● ఎల్‌టీసీజీ విధింపు సబబేనని వ్యాఖ్య...



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ లావాదేవీలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను(ఎల్‌టీసీజీ) విధించిన కేంద్రానికి కనకవర్షం కురవనుందా? అధికారుల లెక్కలు చూస్తే అలాగే కనబడుతోంది! ఎల్‌టీసీజీతో 2019–20 నాటికి ఖజానాకు సమకూరే ఆదాయం రెట్టింపు అయ్యే అవకాశం ఉందని ఆర్థిక శాఖ కార్యదర్శి హష్ముఖ్ అధియా పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఈ రూపంలో వచ్చే ఆదాయం అప్పటికి రూ.40 వేల కోట్ల స్థాయికి చేరొచ్చని ఆయన అంచనా వేశారు. ప్రధానంగా గాడ్‌ఫాదరింగ్ ప్రభావం (జనవరి 31 నాటికి ఉన్న లాభాలపై పన్ను మినహాయింపు) అప్పటికి పూర్తిగా తొలగిపోనుండటమే దీనికి ప్రధాన కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. దాదాపు 14 ఏళ్ల తర్వాత మళ్లీ కేంద్రం ఎల్‌టీసీజీని ప్రవేశపెట్టడాన్ని ఆయన పూర్తిగా సమర్థించారు. 'కష్టార్జితంతో జీవించే ఉద్యోగులు 30 శాతం వరకూ ఆదాయపు పన్ను కడుతున్నప్పుడు... స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల ద్వారా భారీ లాభాలను కళ్లజూస్తున్న ఇన్వెస్టర్లను పన్ను పరిధిలోకి తీసుకురావడం కచ్చితంగా సరైన నిర్ణయమే' అని అధియా వ్యాఖ్యానించారు. కాగా, 2017–18 అసెస్‌మెంట్ సంవత్సరంలో దాఖలైన ఐటీ రిటర్నుల ప్రకారం రూ.3.67 లక్షల కోట్ల ఆదాయం...దీర్ఘకాలిక మూలధన పన్ను నుంచి మినహాయింపు పొందినట్లు అధియా వివరించారు. ఇప్పటికే షేర్లలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లకు మూలధన లాభాల లెక్కింపు అనేది ఈ ఏడాది జనవరి 31నాటి స్టాక్ ధర ఆధారంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

తొలి ఏడాది రూ.20 వేల కోట్లు...

ఎల్‌టీసీజీ విధింపు తర్వాత తొలి ఆర్థిక సంవత్సరం(2018–19)లో కేంద్ర ప్రభుత్వానికి రూ.20 వేల కోట్ల మేర ఆదాయం లభించవచ్చని.. ఆ తర్వాత ఏడాది(2019–20)లో గాడ్‌ఫాదరింగ్ ప్రభావం పూర్తిగా తొలగిపోవడంతో ఈ మొత్తం రెట్టింపై రూ.40 వేట కోట్లకు చేరనుందని అధియా చెప్పారు. షేర్లు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లలో ఏడాదికి మించిన పెట్టుబడులపై రూ.లక్ష పైబడిన లాభాలకు 10 శాతం చొప్పున ఎల్‌టీసీజీని తాజా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, జనవరి 31 వరకూ వచ్చిన లాభాలకు ఈ పన్ను నుంచి మినహాయింపునిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. షేర్లను కొనుగోలు చేసిన తర్వాత ఏడాదిలోపు విక్రయిస్తే... తద్వారా వచ్చిన మూలధన లాభాలపై ప్రస్తుతం 15 శాతం స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను(ఎస్‌టీసీజీ) అమలవుతోంది. ఇదికాకుండా షేర్ల కొనుగోలు/అమ్మకం లావాదేవీ విలువపై సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ) కూడా కేంద్రం జేబుల్లోకి వెళ్తోంది. అంటే తాజాగా కేంద్రం విధించిన ఎల్‌టీసీజీతో స్టాక్ మార్కెట్ లావాదేవీలపై జంట పన్నులను (డబుల్ ట్యాక్సేషన్) కేంద్రం అమల్లోకి తీసుకొచ్చినట్లయింది.

రేట్ల పెంపునకు ఆర్‌బీఐ దూరంగా ఉండాలి

అసోచామ్ సూచన



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ బాండ్ల మార్కెట్‌లో అధిక ఈల్డింగ్ ఒత్తిళ్లకు అతిగా స్పందించొద్దని, ఈ నెల 7న జరిగే మానిటరీ కమిటీ పాలసీ సమీక్షలో రేట్ల పెంపు నిర్ణయానికి దూరంగా ఉండాలని పారిశ్రామిక సంఘం అసోచామ్ కోరింది. ''రానున్న ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు 3.3%గా పేర్కొనడం అన్నది క్లిష్టమైనది. బాండ్ల మార్కెట్‌కు సంబంధించిన ప్రతికూలతలు త్వరలోనే తేలికపడతాయి'' అని అసోచామ్ బడ్జెట్ అనంతరం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. కనీస మద్దతు ధర వల్ల రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగిపోతుందన్నది అతిశయోక్తిగా అభివర్ణించింది. కూరగాయలకు క్షేత్ర స్థాయిలో ఎటువంటి కనీస మద్దతు ధర లేని విషయాన్ని గుర్తు చేసింది. ''కనీస మద్దతు ధరను గణనీయంగా పెంచుతామన్న కేంద్రం హామీలు, బాండ్ల మార్కెట్లో రాబడులకు ఆర్‌బీఐ అతిగా స్పందించకూడదు. ఫిబ్రవరి 7న జరిగే మానిటరీ పాలసీ కమిటీ సమావేశంలో ఏ విధమైన రేట్ల పెంపునకు కూడా దూరంగా ఉండాలి'' అని అసోచామ్ సూచించింది. కనీస మద్దతు ధర నిర్ణయంలో రైతుల ప్రయోజనాలు, రిటైల్ ధరలను యంత్రాంగం దృష్టిలోకి తీసుకుని సమతూకం పాటిస్తుందని, ఈ విషయంలో ఏదైనా తక్షణ ఆందోళన అనేది అతియేనని, పాలసీ రేట్ల నిర్ణయంలో ఆర్‌బీఐ వీటిని పరిగణనలోకి తీసుకోరాదని పేర్కొంది. స్టాక్ మార్కెట్లో కరెక్షన్ అన్నది ఆరోగ్యకరంగా అభివర్ణించింది.

భూషణ్ స్టీల్ కోసం పోటాపోటీ

రేసులో జేఎస్‌డబ్ల్యూ, ఆర్సెలర్ మిట్టల్, టాటా

న్యూఢిల్లీ: తీవ్ర రుణ భారంతో ఎన్‌సీఎల్‌టీ ముందుకు చేరిన భూషణ్ స్టీల్ ఆస్తుల కొనుగోలుకు ప్రముఖ కంపెనీలు ఆర్సెలర్ మిట్టల్, టాటాస్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ బిడ్లు దాఖలు చేసినట్టు సమాచారం. దివాలా చర్యల ప్రక్రియలో భాగంగా భూషణ్ స్టీల్ ఆస్తులను ఆ సంస్థకు రుణాలిచ్చిన బ్యాంకులు వేలానికి పెట్టాయి. బిడ్ల దాఖలుకు చివరి తేదీ ఈ నెల 3తో ముగిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా బిడ్ దాఖలు చేశాయి. ఆర్సెలర్ మిట్టల్, టాటా స్టీల్ కూడా బిడ్లు వేశాయి. అధిక విలువకు బిడ్ వేసిన సంస్థను మంగళవారం వెల్లడించనున్నారు. బ్యాంకులకు భూషణ్ స్టీల్ రూ.44,478 కోట్ల రుణాలను తీర్చవలసి ఉంది. రిజర్వ్ బ్యాంకు దివాలా చర్యలకు ప్రతిపాదించిన తొలి భారీ 12 ఎన్‌పీఏ కేసుల్లో ఇదీ ఒకటి.

రెండంకెల వృద్ధి ఇప్పట్లో అసాధ్యమే..!

ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్‌చంద్ర గార్గ్

న్యూఢిల్లీ: ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా భారత్ రెండంకెల స్థాయి వృద్ధిని నమోదు చేయడం కష్టమేనని, అయితే, 2020–21నాటికి 8%, ఆ పైన వృద్ధి రేటు సాధ్యమవుతుందని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్‌చంద్ర గార్గ్ అన్నారు. ''ఈ ఏడాది (2017–18) ద్వితీయార్థంలో వృద్ధి రేటు 7%, ఆపైన ఉంటుందనేది మా అంచనా. వచ్చే ఏడాది సగటున 7–7.5% వృద్ధి రేటు ఉంటుందని పేర్కొన్నాం. అంటే కొన్ని త్రైమాసికాల్లో వృద్ధి 8 శాతాన్ని అధిగమించొచ్చు. కనుక వచ్చే ఆర్థిక సంవత్సరంలో 8%కి పైగా వృద్ధి రేటు ఉండే త్రైమాసికాన్ని చూసే అవకాశం ఉంది'' అని గార్గ్ పేర్కొన్నారు.

గత వారం హీరోలు

స్టాక్స్	2 ముగింపు	25 ముగింపు	మార్పు(%)
ఐటీసీ	409	391	5
ఐషర్ మోటార్స్	27,739	26,525	5
క్రాంప్టన్ గ్రీవ్స్	245	237	3
టెక్ మహీంద్రా	617	599	3
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	299	291	3
బ్రిటానియా ఇండస్ట్రీస్	4,732	4,626	2
ఎంఆర్‌ఎఫ్	69,259	67,847	2
ఎం అండ్ ఎం	768	755	2
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,756	1,729	2
హీరో మోటొకార్ప్	3,624	3,570	2

ఎందుకు పెరిగాయంటే...

క్యూ3 ఫలితాలు అంచనాలను మించడం, 1:1 బోనస్ వంటి కారణాల వల్ల ఐటీసీ షేర్ 5% దూసుకుపోయింది. జనవరిలో అమ్మకాలు చెరో 31% పెరిగిన కారణంగా ఐషర్ మోటార్స్, హీరో మోటో షేర్లు 5–2% రేంజ్‌లో లాభపడ్డాయి. అంచనాలను మించిన ఫలితాలను వెల్లడించడం, దీంతో వివిధ బ్రోకరేజ్ సంస్థలు టార్గెట్ ధరలను పెంచడంతో టెక్ మహింద్రా షేర్ 3% ఎగసింది. ఈ క్యూ3లో నికర లాభం రెట్టింపునకు పైగా పెరిగిన కారణంగా జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 3 శాతం పెరిగింది.

గత వారం జీరోలు

స్టాక్స్	2 ముగింపు	25 ముగింపు	మార్పు(%)
వక్రంగీ	263	505	-48
డా.రెడ్డీస్ ల్యాబ్స్	2,122	2,504	-15
భారత్ ఎలక్ట్రానిక్స్	152	177	-14
హావెల్స్ ఇండియా	510	580	-12
డీఎల్‌ఎఫ్	223	253	-12
లుపిన్	849	950	-11
పీఎన్‌బీ	162	181	-11
టాటా గ్లోబల్ బేవరేజ్	275	304	-10
బీహెచ్‌ఈఎల్	93	103	-10
ఐడీఎఫ్‌సీ బ్యాంక్	53	58	-10

ఎందుకు తగ్గాయంటే...


వక్రంగీ షేర్ల ట్రేడింగ్‌లో అవకతవకలు జరిగాయని, సెబీ విచారణ జరపనున్నదన్న వార్తలతో వక్రంగీ షేర్ 48% క్షీణించింది. క్యూ3 ఫలితాల బలహీనత, విశ్లేషకులు అంచనాలను తగ్గించడంతో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ 15% పతనమైంది. ఈ క్యూ3లో నికర లాభం 19% తగ్గడంతో భారత్ ఎలక్ట్రికల్స్ షేర్ 14% నష్టపోయింది. ఇద్దరు ప్రమోటర్లు 2.8% వాటాకు సమానమైన షేర్లను విక్రయించారన్న వార్తల కారణంగా హావెల్స్ ఇండియా షేర్ 12% తగ్గింది.

34,680 దిగువన మరింత క్షీణత

మార్కెట్ పంచాంగం


ఈ ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నెలల్లో ప్రపంచ మార్కెట్లో కరెక్షన్ వచ్చే అవకాశాలున్నాయంటూ గత కాలమ్స్‌లో సూచించిన రీతిలో గతవారం పలు ప్రపంచ ప్రధాన మార్కెట్లు తగ్గడం మొదలుపెట్టాయి. అమెరికాలో వడ్డీ రేట్లు మరింతగా పెరిగే అవకాశాలు కన్పించడంతో ప్రపంచ వ్యాప్తంగా బాండ్ ఈల్డ్స్ ఎగువముఖంగా పరుగులు తీస్తున్నాయి. ఈ ట్రెండ్ సహజంగానే ఈక్విటీ మార్కెట్లను దెబ్బతీస్తున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్లో ప్రతిపాదించిన దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను...ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తాత్కాలికంగా ప్రభావితం చేసింది. దాంతో మన మార్కెట్ గత శుక్రవారం ఇతర వర్ధమాన దేశాలకంటే అధికంగా క్షీణించింది. రెండు సంవత్సరాల నుంచి ఎటువంటి ప్రతికూల సంఘటనకైనా...చలించకుండా పరుగులు తీసిన మార్కెట్లకు ఇప్పుడు బ్రేక్‌పడిన సందర్భంగా సూచీల గమనాన్ని సాంకేతిక అంశాలు ఇలా సూచిస్తున్నాయి ...

సెన్సెక్స్ సాంకేతికాలు..



ఫిబ్రవరి 2తో ముగిసిన వారంలో గత మార్కెట్ పంచాంగంలో ప్రస్తావించిన అంచనాలకు అనుగుణంగా 36,400 పాయింట్ల రికార్డుస్థాయి సమీపంలో అవరోధాన్ని చవిచూసిన బీఎస్ఈ సెన్సెక్స్ 35,000 పాయింట్ల వరకూ పతనమయ్యింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 983 పాయింట్ల భారీ నష్టంతో 35,067 పాయింట్ల వద్ద ముగిసింది. గత శుక్రవారం అమెరికా మార్కెట్ భారీ పతనాన్ని చవిచూసిన నేపథ్యంలో ఈ సోమవారం మార్కెట్ గ్యాప్‌డౌన్‌తో మొదలైతే సెన్సెక్స్‌కు 34,680 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును కోల్పోతే మరింత క్షీణించి 34,040 పాయింట్ల వరకూ పడిపోవొచ్చు. ఇది సమీప భవిష్యత్తులో సెన్సెక్స్‌కు కీలక మద్దతు. ఈ మద్దతును సైతం వొదులుకుంటే కొద్ది రోజుల్లో 32,600 పాయింట్ల స్థాయికి పతనం కావొచ్చు. ఈ వారం తొలి మద్దతుస్థాయిని పరిరక్షించుకోగలిగితే 35,500 పాయింట్ల వరకూ సెన్సెక్స్ కోలుకోవొచ్చు. అటుపైన ముగిస్తే క్రమేపీ 35,820 పాయింట్ల వరకూ పెరిగే అవకాశం వుంటుంది. ఈ స్థాయిని ఛేదిస్తే 36,250 పాయింట్ల వద్దకు చేరవచ్చు.

10,650 మద్దతు కోల్పోతే మరింత పతనం...



గతవారం మార్కెట్ పంచాంగంలో సూచించిన రీతిలో ఎన్ఎస్ఈ నిఫ్టీ 11,160 పాయింట్ల స్థాయికి కాస్త ఎగువన తీవ్ర నిరోధాన్ని చవిచూసి, 10,730 పాయింట్ల వరకూ పతనమయ్యింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 309 పాయింట్ల నష్టంతో 10,761 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సోమవారం గ్యాప్ డౌన్‌తో మార్కెట్ మొదలైతే నిఫ్టీకి 10,650 పాయింట్ల వద్ద తొలి మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతు దిగువనే మార్కెట్ ప్రారంభమైతే వేగంగా 10,465 పాయింట్ల వరకూ క్షీణత కొనసాగే ప్రమాదం వుంటుంది. ఈ కీలక మద్దతుస్థాయిని వదులుకుంటే...రానున్న రోజుల్లో 10,075 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు. ఈ వారం తొలి మద్దతు స్థాయిని పరిరక్షించుకుంటే 10,880 వరకూ నిఫ్టీ పెరగవచ్చు. ఆపైన ముగిస్తే 10,980 వరకూ రిలీఫ్ ర్యాలీ జరగవచ్చు. అటుపైన 11,120 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు.

– పి. సత్యప్రసాద్

స్మాల్ క్యాప్ సిప్‌లు ఇప్పుడు ఆపేయవచ్చా?

నేను నెలకు కొంత మొత్తం సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఒక స్మాల్-క్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఇటీవలే నాకు బోనస్ రూ.2 లక్షల వరకూ వచ్చాయి. దీంట్లో ఒక లక్ష వరకూ ఒకేసారి ఈ స్మాల్‌క్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చా? మార్కెట్ రికార్డ్‌స్థాయికి చేరిన ప్రస్తుత తరుణంలో సిప్ ఇన్వెస్ట్‌మెంట్స్ కొంత కాలం ఆపేస్తే మంచిదని కొంతమంది మిత్రులు చెబుతున్నారు. మార్కెట్ పడిన తర్వాత మళ్లీ సిప్‌లను మొదలు పెట్టవచ్చని వారంటున్నారు. ఇది సరైనదేనా ? వారి సలహాను పాటించవచ్చా ? తగిన సూచనలు ఇవ్వండి.

– ఆనంద్, విశాఖపట్టణం



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

స్మాల్ క్యాప్ ఫండ్‌లో సిప్(సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) విధానంలోనే ఇన్వెస్ట్ చేయాలి. లార్జ్‌క్యాప్ ఫండ్స్‌తో పోల్చితే స్మాల్‌క్యాప్ ఫండ్స్ తీవ్రమైన ఒడిదుడుకులకు గురవుతాయి. హెచ్చుతగ్గులు తీవ్రంగా ఉంటాయి. మార్కెట్ బాగా పెరుగుతున్నప్పుడు, లేదా బాగా పడిపోతున్నప్పుడు ఒడిదుడుకులు మరింత ఎక్కువగా ఉంటాయి. అందుకని స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఎప్పుడూ పెద్ద మొత్తాల్లో ఒకేసారి ఇన్వెస్ట్ చేయకూడదు. కొన్ని స్మాల్ క్యాప్ ఫండ్స్ పెద్ద మొత్తాల్లో ఒకేసారి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను అంగీకరించడం లేదు కూడా. మీరు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్న పెద్ద మొత్తాన్ని ఆరు లేదా పన్నెండు భాగాలుగా విభజించండి. మీరు రెగ్యులర్‌గా ఇన్వెస్ట్ చేస్తున్న సిప్‌కు అదనంగా ఈ భాగాలను నెలకు ఒకటి చొప్పున జత చేసి ఆ స్మాల్‌క్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయండి. మార్కెట్ పెరగడం, తగ్గడం సహజమైన విషయాలే. ఇటీవల బాగా పెరిగినందున కొంత కరెక్షన్ రావడం సహజం. మార్కెట్ మరింతగా పడేదాకా ఎదురు చూసి, అప్పటిదాకా సిప్‌లను ఆపేసి, మార్కెట్ పడిన తర్వాత సిప్‌లను మళ్లీ మొదలు పెట్టడం సరైనది కాదు. మార్కెట్ ఎక్కడిదాకా పడిపోతుందో, ఎక్కడిదాకా పెరుగుతుందో ఖచ్చితంగా అంచనా వేయడం ఎవరి వల్లా కాదు. మార్కెట్ పడిపోవడం ఒకందుకు మంచిదే. అందుకని సదరు స్మాల్‌క్యాప్ ఫండ్‌లో మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను నిరభ్యంతరంగా కొనసాగించండి. మార్కెట్ పడిపోతే, మీకు వీలైతే సిప్ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను ఒకింత పెంచండి. మార్కెట్ బాగా పడిపోయినప్పుడు ఇన్వెస్ట్ చేసి, బాగా పెరిగినప్పుడు అమ్మకాలు జరపడం ద్వారా ఇన్వెస్టర్లు మంచి రాబడులు పొందవచ్చు. కానీ ఇలా చేయడం చాలా కష్టసాధ్యమైన పని. దీనికి మధ్యేమార్గంగా ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్‌ను క్రమం తప్పకుండా కొనసాగించడమే మంచిది. ఇలా రెగ్యులర్‌గా ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగిస్తే, మీరు ఇన్వెస్ట్ చేసే కాలంలో మార్కెట్ ఎన్నో గరిష్ట స్థాయిలను, మరెన్నో కనిష్ట స్థాయిలను చూడవచ్చు. అందుకని మార్కెట్ ఉత్థాన, పతనాలతో సంబంధం లేకుండా మీ సిప్‌లను కొనసాగించండి. మరోవైపు స్మాల్ క్యాప్ ఫండ్స్‌ల్లో సిప్‌ల ద్వారానే ఇన్వెస్ట్ చేయండి.

ఈక్విటీ–ఇన్‌కమ్ ఫండ్స్‌లో ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయవచ్చా? డెట్ ఫండ్స్ కన్నా ఈక్విటీ ఇన్‌కమ్ ఫండ్స్ సురక్షితమా?

– సౌమ్య, హైదరాబాద్

ఈక్విటీ ఇన్‌కమ్ ఫండ్స్.. డెట్ ఫండ్స్ అంత సురక్షితమైనవి కావు. అయితే ఈక్విటీ ఫండ్స్‌తో పోల్చితే ఒకింత సురక్షితమేనని చెప్పవచ్చు. ఈక్విటీ ఇన్‌కమ్ ఫండ్స్ తమ నిధుల్లో మూడో వంతు ఈక్విటీలోనూ, మరో మూడవ వంతు ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లోనూ, మరో మూడో వంతు డెట్ సాధనాల్లోనూ ఇన్వెస్ట్ చేస్తాయి. ఈ ఫండ్స్ ఆర్బిట్రేజ్ పొజిషన్ దాదాపు లిక్విడ్ ఫండ్‌లాగానే ఉంటుంది. ఎందుకంటే ఈక్విటీ ఇన్‌కమ్ ఫండ్‌ను నిర్వహించే ఫండ్ మేనేజర్, ఒక షేర్‌ను కొనుగోలు చేసి, ఈ షేర్ ఫ్యూచర్స్‌ను విక్రయిస్తాడు. దీంతో ఈక్విటీలో ఇన్వెస్ట్ చేసిన మూడో వంతు భాగానికి రిస్క్ ఉండదు. ఈ ఫండ్ ఆర్బిట్రేషన్ పొజిషన్ సాంకేతికంగా ఈక్విటీగా ఉన్నప్పటికీ, క్యారెక్టర్ పరంగా చూస్తే, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్‌గా ఉంటుంది. అందుకని పన్ను పరంగా దీనిని ఈక్విటీ ఫండ్‌గానే పరిగణిస్తారు. ఇక ఈ ఫండ్ నిధులు 35 శాతం వరకూ ఈక్విటీల్లో ఉన్నందున డెట్ ఫండ్ అంత సురక్షితంగా ఈక్విటీ ఇన్‌కమ్ ఫండ్ ఉండదని చెప్పవచ్చు. రిస్క్ ఎక్కువగా వద్దనుకుంటే, మూడు నుంచి ఐదేళ్ల కాలానికి ఈక్విటీ ఇన్‌కమ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు. మీరు ఇన్వెస్ట్ చేసే దాంట్లో మూడో వంతు మాత్రమే ఈక్విటీల్లోకి వెళుతుంది కాబట్టి, ఒకేసారి పెద్ద మొత్తాల్లో కూడా ఈ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు.

నేను ఒక సహకార బ్యాంక్‌లో ఐదేళ్ల కాలానికి కొంత మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాను. ఈ ఎఫ్‌డీలపై పన్ను మినహాయింపులు పొందే అవకాశం ఉందా ?

– హఫీజ్, కరీంనగర్

ఐదేళ్ల కాల వ్యవధి ఉన్న ఏ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్‌పై మీరు పన్ను మినహాయింపులు పొందే అవకాశాలు లేవు. ట్యాక్స్ సేవింగ్/ట్యాక్స్ సేవర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఇన్వెస్ట్ చేస్తేనే, అదీనూ ఐదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తేనే మీరు ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80 సి కింద పన్ను మినహాయింపులు పొందే అవకాశం ఉంటుంది. ట్యాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లకు లాక్–ఇన్–పీరియడ్ ఐదేళ్లుగా ఉంటుంది. ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80 సి కింద ఈ తరహా ట్యాక్స్–సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై పన్ను మినహాయింపులు రూ.1.5 లక్షల వరకూ పొందవచ్చు.



ఆడాలంటే ఇంకో రెండు నెలలు ఆగాలి

తాను మళ్లీ రాకెట్ పట్టేందుకు కనీసం రెండు నెలలు సమయం ఉందని భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా తెలిపింది. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు దూరమైన సానియా మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకునే విషయంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వివరించింది. ఆటకు దూరమవడం... గత అక్టోబర్ నుంచి విశ్రాంతికే పరిమితమవడం తనకు అసహనం కలిగిస్తోందని వ్యాఖ్యానించింది.

మణికట్టు... ఆటకట్టు


చహల్

స్పిన్నర్ల మాయాజాలానికి దక్షిణాఫ్రికా 118కే ఆలౌట్ • చహల్‌కు ఐదు... కుల్దీప్‌కు మూడు వికెట్లు
రెండో వన్డేలో భారత్ 9 వికెట్లతో ఘన విజయం • మూడో వన్డే బుధవారం

పేస్ ఇబ్బంది పెట్టలేదు... బౌన్స్ పెద్దగా కనిపించలేదు... కానీ స్పిన్ మాత్రం సఫారీ బ్యాట్స్‌మెన్‌తో సొంతగడ్డపైనే చిందులు వేయించింది. మణికట్టును వీడిన బంతులు మిసైల్స్‌లా దూసుకొస్తుంటే ఆడుతోంది భారత్‌లోనా లేక తమ దేశంలోనా అని దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌లో సంశయం... ఆ సందేహం తీరేలోపే అంతా ముగిసిపోయింది... ఒకరి వెంట మరొకరు... ఒకే స్కోరు వద్ద ముగ్గురు... కలిసికట్టుగా, సమష్టిగా పెవిలియన్ చేరిపోయారు... 42 పరుగులు మాత్రమే ఇచ్చి 8 వికెట్లు తీసిన మన స్పిన్ మంత్రం మళ్లీ పని చేసింది. ఫలితంగా దక్షిణాఫ్రికా 118 ఆలౌట్...ఆ తర్వాత వరుసగా రెండో మ్యాచ్‌లో భారత్ అలవోక ఛేదన.

దాదాపు మూడు వారాల క్రితం ఇక్కడే రెండో టెస్టులో ఇది భారత్ పిచ్‌లాగానే ఉందని అందరూ అన్నారు. దానిని ఉపయోగించు కోలేకపోయిందంటూ పరాజయం తర్వాత వ్యాఖ్యలూ వినిపించాయి. అయితే ఈసారి కూడా వికెట్ సరిగ్గా భారత్‌లోలాగే స్పందించింది. ఇప్పుడు మనోళ్లు దానిని పూర్తిగా వాడుకున్నారు. యజువేంద్ర చహల్, కుల్దీప్ యాదవ్ అద్భుత బౌలింగ్‌తో కోహ్లి సేన అతి సునాయాసంగా రెండో వన్డేను తమ ఖాతాలో వేసుకుంది. లెగ్ స్పిన్నర్ చహల్ కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్లు పడగొట్టగా... చైనామన్ కుల్దీప్ 3 వికెట్లతో అండగా నిలిచాడు. ఫలితంగా స్వదేశంలో అతి తక్కువ స్కోరుకు ఆలౌటైన చెత్త రికార్డుతో సఫారీలు మ్యాచ్‌ను సమర్పించుకున్నారు.

సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ భారత్ ఆధిపత్యం కొనసాగింది. ఆదివారం ఇక్కడి సూపర్ స్పోర్ట్ పార్క్‌లో పూర్తి ఏకపక్షంగా సాగిన రెండో వన్డేలో భారత్ 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 32.2 ఓవర్లలో 118 పరుగులకే కుప్పకూలింది. డుమిని (25), జోండో (25)లదే అత్యధిక స్కోరు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' యజువేంద్ర చహల్ (5/22), కుల్దీప్ యాదవ్ (3/20) ప్రత్యర్థి పని పట్టారు. అనంతరం భారత్ 20.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 119 పరుగులు చేసింది. ధావన్ (56 బంతుల్లో 51 నాటౌట్; 9 ఫోర్లు), కోహ్లి (50 బంతుల్లో 46 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) రెండో వికెట్‌కు అభేద్యంగా 93 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. ఈ ఫలితంతో భారత్ ఆరు వన్డేల సిరీస్‌లో 2–0తో ఆధిక్యంలో నిలిచింది. మూడో వన్డే బుధవారం కేప్‌టౌన్‌లో జరుగుతుంది.

టపటపా...

ఒక దశలో 26 బంతుల వ్యవధిలో 12 పరుగులకే 4 వికెట్లు... కొంత పోరాటం తర్వాత చివర్లో 36 బంతుల వ్యవధిలో 19 పరుగులకే 6 వికెట్లు... దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ రెండు దశల్లో ఈ రకంగా కుప్పకూలింది! ఒక్కరు కూడా ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేయలేకపోగా, ఆరుగురు ఒక అంకె స్కోరుకే పరిమితమయ్యారు. భారత బౌలర్ల అద్భుత ప్రదర్శనే అందుకు కారణం. మొదట్లో భువీ, బుమ్రా... ఆ తర్వాత చహల్, కుల్దీప్ సఫారీల పని పట్టడంతో ఆ జట్టు కోలుకోలేకపోయింది. డివిలియర్స్, డు ప్లెసిస్ లేని బ్యాటింగ్ లైనప్ ఈ మ్యాచ్‌లో మరీ పేలవంగా కనిపించింది.

ఓపెనర్లు ఆమ్లా (23; 4 ఫోర్లు), డి కాక్ (20; 2 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను అతి జాగ్రత్తగా ప్రారంభించారు. టెస్టు సిరీస్ నుంచి వరుసగా విఫలమవుతున్న డి కాక్‌ను బుమ్రా ఒక ఆటాడుకున్నాడు. అతని తొలి ఓవర్లో మొదటి బంతినే డి కాక్ దాదాపు వికెట్లపైకి ఆడుకున్నాడు. అదృష్టవశాత్తూ బెయిల్స్ పడలేదు. రెండో బంతి బౌన్సర్‌ను అతి కష్టమ్మీద తప్పించుకున్న డి కాక్, మూడో బంతికి వేలికి గాయం చేసుకున్నాడు. మరోవైపు కొన్ని చక్కటి షాట్లు ఆడిన ఆమ్లాను భువీ అవుట్ చేయడంతో సఫారీల పతనం ప్రారంభమైంది. ఆ తర్వాత డి కాక్‌ను అవుట్ చేసి చహల్ తన జోరు మొదలు పెట్టాడు. కుల్దీప్ వేసిన మరుసటి ఓవర్లోనే కెప్టెన్ మార్క్‌రమ్ (8), మిల్లర్ (0) అవుట్ కావడంతో దక్షిణాఫ్రికా కష్టాలు పెరిగాయి. 51 పరుగుల స్కోరు వద్దే ఆ జట్టు మూడు వికెట్లు కోల్పోవడం విశేషం. ఈ దశలో డుమిని, తొలి వన్డే ఆడుతున్న జోండో కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. భారత బౌలింగ్‌ను కొద్ది సేపు నిరోధించగలిగిన వీరిద్దరు 12.4 ఓవర్లలో ఐదో వికెట్‌కు 48 పరుగులు జోడించారు.

అయితే మళ్లీ చహల్ మాయ మొదలైంది. భారీ షాట్ ఆడబోయిన జోండో మిడ్ వికెట్‌లో పాండ్యాకు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత జట్టు ఇన్నింగ్స్ ముగియడానికి ఎంతో సేపు పట్టలేదు. చహల్ తన వరుస ఓవర్లలో డుమిని, మోర్కెల్ (1)ల పని పట్టగా...మధ్యలో రబడ (1)ను కుల్దీప్ వెనక్కి పంపించాడు. తాహిర్ (0)ను బుమ్రా బౌల్డ్ చేయగా...మోరిస్ (14)ను అవుట్ చేసి చహల్ ఐదో వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు.

అలవోకగా...

అతి సునాయాస లక్ష్యాన్ని భారత్ ఏమాత్రం తడబాటు లేకుండా చేరుకుంది. అయితే రోహిత్ శర్మ (17 బంతుల్లో 15; 2 ఫోర్లు, ఒక సిక్స్) మాత్రం మరోసారి తక్కువ స్కోరుకే పరిమితమయ్యాడు. మూడో బంతికి సిక్సర్ బాది దూకుడుగా ఆటను ప్రారంభించిన రోహిత్... రబడ బౌన్సర్‌ను హుక్ చేయబోయి మోర్కెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత ధావన్, కోహ్లి ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తూ చకచకా పరుగులు రాబట్టారు. ఇదే జోరులో ధావన్ 49 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. లంచ్ విరామం తర్వాత తొమ్మిదో బంతిని స్క్వేర్‌లెగ్ దిశగా ఆడి కోహ్లి రెండు పరుగులు తీయడంతో భారత్ విజయం ఖాయమైంది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: ఆమ్లా (సి) ధోని (బి) భువనేశ్వర్ 23; డి కాక్ (సి) పాండ్యా (బి) చహల్ 20; మార్క్‌రమ్ (సి) భువనేశ్వర్ (బి) కుల్దీప్ 8; డుమిని (ఎల్బీ) (బి) చహల్ 25; మిల్లర్ (సి) రహానే (బి) కుల్దీప్ 0; జోండో (సి) పాండ్యా (బి) చహల్ 25; మోరిస్ (సి) భువనేశ్వర్ (బి) చహల్ 14; రబడ (ఎల్బీ) (బి) కుల్దీప్ 1; మోర్కెల్ (ఎల్బీ) (బి) చహల్ 1; తాహిర్ (బి) బుమ్రా 0; షమ్సీ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (32.2 ఓవర్లలో ఆలౌట్) 118**

వికెట్ల పతనం: 1–39; 2–51; 3–51; 4–51; 5–99; 6–107; 7–110; 8–117; 9–118; 10–118.

బౌలింగ్: భువనేశ్వర్ 5–1–19–1; బుమ్రా 5–1–12–1; పాండ్యా 5–0–34–0; చహల్ 8.2–1–22–5; కుల్దీప్ 6–0–20–3; జాదవ్ 3–0–11–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) మోర్కెల్ (బి) రబడ 15; ధావన్ (నాటౌట్) 51; కోహ్లి (నాటౌట్) 46; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20.3 ఓవర్లలో వికెట్ నష్టానికి) 119

వికెట్ల పతనం: 1–26.

బౌలింగ్: మోర్కెల్ 4–0–30–0; రబడ 5–0–24–1; మోరిస్ 3–0–16–0; తాహిర్ 5.3–0–30–0; షమ్సీ 3–1–18–0.


కుల్దీప్


లంచ్ ప్రకటించక ముందు నిండుగా...


లంచ్ ప్రకటించాక ఖాళీగా ...

2 పరుగులు చేస్తే చాలు... ముందు లంచ్ చేసి రండి!

119 పరుగుల లక్ష్యాన్ని అందుకునే క్రమంలో భారత్ స్కోరు 19 ఓవర్లు ముగిసేసరికి 117/1... మరో 2 పరుగులు చేస్తే చాలు గెలుపు సొంతమవుతుంది. ఇరు జట్ల ఆటగాళ్లు పెవిలియన్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకోవచ్చు. ధావన్ స్టాన్స్ తీసుకునేందుకు సిద్ధమవుతున్న వేళ అంపైర్లు ఒక్కసారిగా 'లంచ్' అని ప్రకటించేశారు. దాంతో కోహ్లి, దక్షిణాఫ్రికా కెప్టెన్ మార్క్‌రమ్ ఆశ్చర్యానికి లోనయ్యారు. వారిద్దరు అంపైర్లతో ఏదో చెప్పబోయినా రూల్స్ అంటే రూల్స్ అంటూ వారు తిరస్కరించడంతో చేసేదేమీ లేక ఆటగాళ్లు మైదానం వీడారు. దీనిపై అన్ని వైపుల నుంచి విమర్శలు వచ్చాయి. రిఫరీ తన విచక్షణ మేరకు నిర్ణయం తీసుకోకుండా రాతియుగం లాంటి నిబంధనలు అమలు చేయడం ఏమిటని మాజీ క్రికెటర్లు, వ్యాఖ్యాతలు విరుచుకు పడ్డారు. అంపైర్లు లంచ్ బ్రేక్ ప్రకటించడం... దక్షిణాఫ్రికా ఓటమి ఖాయం కావడంతో మరో రెండు పరుగుల కోసం వేచి చూడకుండా ప్రేక్షకులు మైదానం వీడటం కనిపించింది. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ కేవలం 32.2 ఓవర్లకే ముగియడంతో భారత్ ఆడే సమయంలో లంచ్ విరామం ప్రకటించాల్సింది. 15 ఓవర్లు ముగిశాక మరో 26 పరుగులు చేయాల్సిన సమయంలోనే లంచ్ సమయం అయింది. నిజానికి ఈ సమయంలోనే బ్రేక్ ఇస్తే ఇంతగా విమర్శలు రాకపోయేవేమో! అయితే అంపైర్లు ఫలితాన్ని ఆశిస్తూ మరో 15 నిమిషాలు పొడిగించారు. ఆపై 4 ఓవర్లలో భారత్ 24 పరుగులు చేయగలిగింది. దాంతో మరో మాటకు తావు లేకుండా ఆటను నిలిపేశారు. 45 నిమిషాల విరామం తర్వాత వచ్చీ రాగానే భారత్ గెలవలేదు. షమ్సీ వేసిన 20వ ఓవర్‌లో ధావన్ పరుగులేమీ చేయకపోవడంతో అది 'మెయిడిన్' అయింది. ఆ తర్వాత తాహిర్ ఓవర్ మూడో బంతికి కోహ్లి రెండు పరుగులు తీసి లాంఛనం పూర్తి చేశాడు.



5/22 చహల్ కెరీర్ అత్యుత్తమ బౌలింగ్. తొలిసారి ఐదు వికెట్లు పడగొట్టిన చహల్... దక్షిణాఫ్రికాపై భారత్ తరఫున రెండో అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. 1999లో సునీల్ జోషి (5/6) ప్రదర్శన మొదటి స్థానంలో ఉంది.

118 సొంతగడ్డపై దక్షిణాఫ్రికాకు ఇదే అత్యల్ప స్కోరు. 2009లో ఆ జట్టు ఇంగ్లండ్‌పై 119 పరుగులు చేసింది.

9 తొమ్మిదేళ్ల తర్వాత తుది జట్టులో డు ప్లెసిస్, డివిలియర్స్ లేకుండా దక్షిణాఫ్రికా మ్యాచ్ ఆడింది.

తుది మెట్టుపై బోల్తా

- ఇండియా ఓపెన్ రన్నరప్ సింధు
- ఫైనల్లో బీవెన్ జాంగ్ చేతిలో ఓటమి



న్యూఢిల్లీ: స్వదేశంలో వరుసగా రెండో ఏడాది ఇండియా ఓపెన్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. ఆదివారం ముగిసిన ఈ టోర్నమెంట్‌లో ఆమె రన్నరప్‌తో సరిపెట్టుకుంది. చైనా సంతతికి చెందిన అమెరికా క్రీడాకారిణి బీవెన్ జాంగ్‌తో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ సింధు 18–21, 21–11, 20–22తో పరాజయం పాలైంది. 69 నిమిషాలపాటు సాగిన ఈ తుది పోరులో సింధు నిర్ణాయక మూడో గేమ్‌లో మ్యాచ్ పాయింట్‌ను చేజార్చుకోవడం గమనార్హం. తన కెరీర్‌లో సింధుపై జాంగ్‌కిది వరుసగా రెండో విజయం. గతేడాది ఇండోనేసియా ఓపెన్‌లోనూ సింధును జాంగ్ ఓడించింది. వీరిద్దరు ముఖాముఖిగా ఐదుసార్లు తలపడగా... సింధు మూడుసార్లు, జాంగ్ రెండుసార్లు గెలిచారు. ఐదు మ్యాచ్‌లు కూడా మూడు గేమ్‌లపాటు జరగడం విశేషం. విజేతగా నిలిచిన జాంగ్‌కు 26,250 డాలర్లు (రూ. 16 లక్షల 83 వేలు), 9200 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ సింధుకు 13,300 డాలర్లు (రూ. 8 లక్షల 53 వేలు), 7800 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. చైనాలో జన్మించిన 27 ఏళ్ల బీవెన్ జాంగ్ 2007 నుంచి 2013 వరకు సింగపూర్‌కు ప్రాతినిధ్యం వహించింది. 2013 నుంచి అమెరికా తరఫున ఆడుతోంది.

క్వార్టర్ ఫైనల్ మినహా మిగతా మ్యాచ్‌ల్లో అలవోక విజయాలు సాధించిన సింధుకు ఫైనల్లో గట్టిపోటీనే ఎదురైంది. క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ సైనా నెహ్వాల్‌ను... సెమీస్‌లో ఆరో సీడ్ చెయుంగ్ ఎన్గాన్ (హాంకాంగ్)ను ఓడించిన బీవెన్ జాంగ్ అదే జోరును ఫైనల్లోనూ కొనసాగించింది. తొలి గేమ్‌లో కీలక దశలో పైచేయి సాధించిన జాంగ్ రెండో గేమ్‌లో మాత్రం సింధు ధాటికి తడబడింది. రెండుసార్లు వరుసగా ఆరు పాయింట్లు చొప్పున కోల్పోయింది. నిర్ణాయక మూడో గేమ్‌లో ఇద్దరూ ప్రతి పాయింట్ కోసం పోరాడారు. చివర్లో సింధు 20–19తో మ్యాచ్ పాయింట్‌ను సంపాదించింది. కానీ ఒత్తిడికి లోనుకాకుండా ఆడిన జాంగ్ వరుసగా మూడు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మరోవైపు పురుషుల సింగిల్స్ ఫైనల్లో నాలుగో సీడ్ షి యుకి (చైనా) 21–18, 21–14తో చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)పై గెలిచి విజేతగా నిలిచాడు.

మళ్లీ 'శత'క్కొట్టిన మోమినుల్

శ్రీలంక, బంగ్లాదేశ్ తొలి టెస్టు డ్రా



చిట్టగాంగ్: మోమినుల్ హక్ (105; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అద్భుత సెంచరీ సాయంతో... శ్రీలంకతో జరిగిన తొలి టెస్టును బంగ్లాదేశ్ 'డ్రా'గా ముగించింది. ఓవర్‌నైట్ స్కోరు 81/3తో చివరి రోజు ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 307 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ శతకం బాదిన మోమినుల్ హక్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీతో చెలరేగడంతో శ్రీలంక విజయంపై ఆశలు వదులుకుంది. మోమినుల్‌తోపాటు లిటన్ దాస్ (94; 11 ఫోర్లు) కూడా బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 180 పరుగులు జోడించారు. మోమినుల్ హక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. బంగ్లా తరఫున ఓ టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు నమోదు చేసిన తొలి ఆటగాడిగా మోమినుల్ హక్ రికార్డు సృష్టించాడు.

మనోళ్లు ఐదుగురు

దుబాయ్: ఐసీసీ అండర్–19 ప్రపంచకప్ జట్టులో ఐదుగురు భారత ఆటగాళ్లకు చోటుదక్కింది. కెప్టెన్ పృథ్వీ షాతో పాటు మన్‌జోత్ కల్రా, శుభ్‌మన్ గిల్, కమలేశ్ నాగర్‌కోటి, అనుకూల్ రాయ్‌లు ఈ టీమ్‌లో ఉన్నారు. మొత్తం ఆరు దేశాలకు చెందిన ఆటగాళ్లకే బెర్తు దక్కగా... నాలుగోసారి చాంపియన్ అయిన భారత ఆటగాళ్లే ఐదుగురు ఉండటం విశేషం.

ఐసీసీ జట్టు: రేనార్డ్ వాన్ (కెప్టెన్, దక్షిణాఫ్రికా), పృథ్వీ షా, మన్‌జోత్ కల్రా, శుభ్‌మన్ గిల్, నాగర్‌కోటి, అనుకుల్ రాయ్ (భారత్), ఫిన్ అలెన్ (న్యూజిలాండ్), మక్వెటు (వికెట్ కీపర్), కొయెట్జీ (దక్షిణాఫ్రికా), కై యిస్ అహ్మద్ (అఫ్గానిస్తాన్), షహీన్ అఫ్రిది (పాకిస్తాన్), 12వ ఆటగాడుగా అలిక్ అథనాజ్ (వెస్టిండీస్).

అమ్మకానికి బీసీసీఐ వెబ్‌సైట్!

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన క్రికెట్ బోర్డుగా పేరున్న బీసీసీఐ వెబ్‌సైట్‌ను అమ్మకానికి పెట్టారు. బీసీసీఐ.టీవీ వెబ్‌సైట్‌కు సంబంధించిన లైసెన్స్‌ను పునరుద్ధరించుకోక పోవడంతో వెబ్‌సైట్స్ రిజిస్ట్రార్స్ సంస్థ ఆ డొమైన్‌ను అమ్మకానికి పెట్టింది. దీనికోసం బిడ్డింగ్‌ను ఆహ్వానించగా ఏడు బిడ్లు వచ్చాయి. బోర్డు డొమైన్ కాలవ్యవధి 2–2–2006 నుంచి 2–2–2019 వరకైతే... ఏడాది ముందే అంటే తేదీ 3–2–2018లోపు రెన్యూవల్ (పునరుద్ధరణ) చేసుకోవాలి. కానీ క్రికెట్ బోర్డు ఆ పని చేయక పోవడంతో వెబ్‌సైట్స్ రిజిస్ట్రార్స్ రిజిస్టర్.కామ్ ఆ డొమైన్‌ను అమ్మకానికి పెట్టింది.

ఏడు నెలల తర్వాత బరిలోకి...

దక్షిణాఫ్రికాతో నేడు భారత మహిళల జట్టు తొలి వన్డే

కింబర్లీ: గతేడాది ఇంగ్లండ్‌లో జరిగిన ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత మహిళల జట్టు ఏడు నెలల తర్వాత మళ్లీ అంతర్జాతీయ మ్యాచ్ బరిలోకి దిగుతోంది. సఫారీ పర్యటనలో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి వన్డే సోమవారం ఇక్కడ జరగనుంది. 2021లో జరిగే ఐసీసీ ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సంపాదించేందుకు భారత్, దక్షిణాఫ్రికా జట్లకు ఇది చక్కని అవకాశం. ఏడు నెలల క్రితం వీరోచిత ప్రదర్శనతో ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన మిథాలీ రాజ్ సేనకు కావాల్సినంత విశ్రాంతి దొరికింది. ఇప్పుడు తాజాగా బరిలోకి దిగేందుకు ఈ విరామం దోహదం చేస్తుంది. ఇక ఇప్పటి నుంచి తమకు ప్రతీ మ్యాచ్ పరీక్షలాంటిదేనని భారత సారథి మిథాలీ తెలిపింది. క్రికెట్ ప్రేమికులు ఇప్పుడు మహిళల ఆటపై కూడా ఆసక్తి పెంచుకున్నారని చెప్పింది. సఫారీ గడ్డపై కఠిన సవాళ్లను ఎదుర్కొనేందుకు తమ సహచర క్రీడాకారిణిలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పింది. ఈ జట్టులో 17 ఏళ్ల ముంబై విద్యార్థిని జెమీమా రోడ్రిగ్స్ ప్రధానాకర్షణ కానుంది. దేశవాళీ క్రికెట్లో అమె అసాధారణ ఫామ్‌తో ఏకంగా సీనియర్ జట్టులోకి ఎంపికైంది. ఇప్పుడు సఫారీ పిచ్‌లపై ఆమె ఏమేరకు రాణిస్తుందోనన్న ఆసక్తి నెలకొంది.


మిథాలీ బృందం



జీవన్ జంటకు డబుల్స్ టైటిల్

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ ప్లేయర్ జీవన్ నెదున్‌చెజియాన్ తన కెరీర్‌లో ఐదో ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను గెల్చుకున్నాడు. అమెరికాలో జరిగిన డాలస్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలో క్రిస్టోఫర్ రుంగ్‌కాట్ (ఇండోనేసియా)తో కలిసి జీవన్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో జీవన్–రుంగ్‌కాట్ జంట 6–4, 3–6, 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో లియాండర్ పేస్ (భారత్)–జో సాలిస్‌బరీ (బ్రిటన్) జోడీపై గెలిచింది. టైటిల్ నెగ్గిన జీవన్ జంటకు 4,650 డాలర్ల (రూ. 3 లక్షలు) ప్రైజ్‌మనీ, 80 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

విభజన హామీలు అమలు చేసేవరకు పోరాటం

రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కురియన్‌కు లేఖ రాసిన కేవీపీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట ప్రకారం రాష్ట్రానికి అమలు చేయాల్సిన హామీలు సాధించేవరకు తన పోరాటాన్ని కొనసాగిస్తానని రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రారావు స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి విభజన హామీలు అమలు చేయకపోవడంతో శుక్రవారం రాజ్యసభ వెల్‌లో నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేసిన కేవీపీని ఉద్దేశించి డిప్యూటీ చైర్మన్ కురియన్ తీవ్ర పదజాలాన్ని ఉపయోగించిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్రంగా స్పందించిన కేవీపీ.. కురియన్‌కు లేఖ రాశారు. రాష్ట్ర హక్కుల సాధనకు కృషి చేస్తున్న తనకు ఎన్ని అవమానాలు ఎదురైనా వెనకడుగువేయనన్నారు.







Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.